ఆర్షవిద్యాతరంగిణి
Inspired by the teachings of
**SWAMI PARAMARTHANANDAJI**

# BRIHADARANYAKOPANISHAD

# బృహదారణ్యకోపనిషత్



అహం బ్రహ్మాస్మి

## స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో
## వారి ఆశీస్సులతో

### తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

Title – **BRIHADARANYAKOPANISHAD**
First edition – Year 2021   1000 copies

Sanskrit Support – Sri Desu Chaitanya Krishna

DTP – Sri S Rajendra Kumar 98661 15622

For Copies
Arsha Vidya Tarangini Trust
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 98490 92368
Email: raghavkasturi@gmail.com
for softcopy: www.telugubhakti.com

Printed at
Sai Sri Printers
8-3-945, # 21 Pancom Business Centre
Ameerpet, Hyderabad - 500073
e-mail: saisriprinters@yahoo.com
Ph.No.040-23730222, Cell:9985530222
Price   Rs.700

# బ్రహ్మయజ్ఞం

**శ్రీప్రాతూరి రామకృష్ణశర్మ గారు** సద్వంశంలో, సదాచార కుటుంబంలో 30 ఏప్రిల్ 1937న జన్మించారు. జీవిత భీమా సంస్థలో ఉన్నతోద్యోగిగా పదవీ విరమణ చేశారు. **శ్రీప్రాతూరి రామకృష్ణశర్మ గారు** దైవభక్తి పరాయణులు. ఉన్నత విలువలు, ఆదర్శాలు కలిగిన వదాన్యులు. వీరి సహధర్మచారిణి **శ్రీమతి సత్యవాణిగారు,** భర్తకు తగిన ఇల్లాలు, వీరి దాంపత్యం ఎంతమందికో ఆదర్శం అయింది.

వీరి సంతానం – కుమారులు **శ్రీ చంద్రశేఖర్ గారు, శ్రీ సాయిశివరాం గారు,** కుమార్తెలు **శ్రీమతి సుబ్బలక్ష్మి గారు, శ్రీమతి హేమమాలిని గారు.** వీరంతా ఉన్నత విద్యనభ్యసించి దేశ, విదేశాల్లో ఉన్నత పదవుల్లో స్థిరపడ్డారు. తల్లిదండ్రుల ఆదర్శాలకు, విలువలకు ఈరోజు వీరు ప్రతీకలుగా నిలిచారు.

పూపొదరిల్లులాంటి చక్కని, చల్లని సంసారం శ్రీశర్మగారిది. భర్తగారి వదాన్యతకు, దైవభక్తికి ఆదర్శానికి తార్కాణంగా నిలచిన **శ్రీమతి సత్యవాణి గారు** ఎంతగానో అభినందనీయురాలు. వీరికి వేదమన్నా, వేదపాఠశాలలన్నా, వేదపండితులన్నా, ఆచార్యులన్నా మక్కువ ఎక్కువ, ఇంకా ఎంతో గౌరవాభిమానాలు. వీరు అత్యంత శ్రద్ధాభక్తులతో వేదాంతవిద్యను అభ్యసిస్తున్నారు.

**బృహదారణ్యకోపనిషత్** గ్రంథ ప్రచురణ అనే ఈ బ్రహ్మయజ్ఞానికి బృహత్తరంగా సహకరించారు **శ్రీమతి ప్రాతూరి సత్యవాణిగారు, వారి కుటుంబ సభ్యులు.**

**శ్రీమతి ప్రాతూరి సత్యవాణిగారు**, వారి కుటుంబ సభ్యులు సదా బ్రహ్మనిష్ఠలో నిలవాలని, వారి పిల్లలకూ, మనవళ్ళకూ, మనవరాళ్ళకూ ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఆధ్యాత్మిక చింతనను వైదికజీవనాన్ని మరింత సమృద్ధిగా ఇవ్వమని ఆ భగవంతుని వేడుకుంటున్నాము.

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

# ఎందరో మహానుభావులు

ఈ బ్రహ్మయజ్ఞానికి ఎందరో సహాయసహకారాలందించారు. స్వామీజీల, స్వామినీల ప్రోత్సాహం, పాఠకుల నిరంతర ఆదరణ చెప్పనలవికాదు.

**చిన్మయమిషన్, ఒంగోలు; స్వామి సత్యాత్మానంద గారు మమ్మ్ము ప్రోత్సహించి సాంకేతికసలహాలనిచ్చినందులకు ధన్యవాదములు.**

**మా కోరికను మన్నించి, స్వామినీ ఆత్మలీనానందజీ ఎంతో పెద్ద మనసుతో ముందుమాట వ్రాసి యిచ్చారు. స్వామినీజీకి మా ధన్యవాదములు.**

ఈ పుస్తకంలో అక్షర, భావదోషాలు లేకుండా దిద్దిపెట్టిన వారు –

1. **శ్రీ దేసు కృష్ణచైతన్య గారు**
2. **శ్రీ మూల్పూరి విష్ణుప్రసాదు గారు**
3. **శ్రీమతి దేవరకొండ అరుణా యశోద గారు**
4. **డా. గరికపాటి సత్యనారాయణ మూర్తి గారు**
5. **శ్రీ తిరుమలశెట్టి వెంకట రామమోహన రావు గారు**
6. **శ్రీ పిరాట్ల వెంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ శాస్త్రి గారు**
7. **డా. బోయినేపల్లి యాదగిరి రావు గారు**

ఆర్థికంగా బృహత్తర సహాయాన్ని అందించిన వారు –

**శ్రీమతి ప్రాతూరి సత్యవాణిగారు**

**వారి కుమారులు, కుమార్తెలు –**

**శ్రీ చంద్రశేఖర్ గారు**

**శ్రీ సాయిశివరాం గారు**

**శ్రీమతి సుబ్బలక్ష్మి గారు**

**శ్రీమతి హేమమాలిని గారు**

ప్రింటింగ్‌కు సహాయపడుతున్న **శ్రీవీరమాచనేని వెంకట కృష్ణారావు గారు**, తప్పులు లేకుండా డీటీపి చేస్తున్న **సిరిపురపు రాజేంద్ర కుమార్ గారు. వీరందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు, శతకోటివందనాలు.**

**రాఘవరావు – రాజ్యశ్రీ**

# బృహదారణ్యకోపనిషత్   విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | శుభాశయాః | 8 |
| 2. | స్వామీజీ బృహత్తమమైన బోధ | 10 |
| 3. | అహం బ్రహ్మాస్మి | 12 |
| 4. | నా ఆరాధ్యదైవం | 14 |
| 5. | ఆర్ష ఆనంద కుటీర్ సభ్యుల స్పందన | 16 |
| 6. | ఉపోద్ఘాతము | 19 |
| మధు కాండము | అధ్యాయము – 1 | 37 |
| 1.1 | – అశ్వమేధ బ్రాహ్మణము | 38 |
| 1.2 | – అగ్ని బ్రాహ్మణము | 42 |
| 1.3 | – ఉద్గీథ బ్రాహ్మణము | 59 |
| 1.4 | – బ్రహ్మవిద్యా బ్రాహ్మణము | 72 |
| 1.5 | – సప్తాన్న బ్రాహ్మణము | 130 |
| 1.6 | – ఉక్థ బ్రాహ్మణము | 151 |
| అధ్యాయము 1 | – సారాంశము | 156 |
| మధు కాండము | అధ్యాయము – 2 | 159 |
| 2.1 | – అజాతశత్రు బ్రాహ్మణము | 160 |
| 2.2 | – శిశు బ్రాహ్మణము | 192 |
| 2.3 | – మూర్తామూర్త బ్రాహ్మణము | 199 |
| 2.4 | – మైత్రేయీ బ్రాహ్మణము | 214 |
| 2.5 | – మధు బ్రాహ్మణము | 266 |
| 2.6 | – వంశ బ్రాహ్మణము | 288 |
| అధ్యాయము 2 | – సారాంశము | 291 |

| | | |
|---|---|---|
| **ముని కాండము అధ్యాయము - 3** | | **293** |
| **3.1** | - అశ్వల బ్రాహ్మణము | **296** |
| **3.2** | - ఆర్తభాగ బ్రాహ్మణము | **307** |
| **3.3** | - భుజ్యు బ్రాహ్మణము | **317** |
| **3.4** | - ఉషస్త బ్రాహ్మణము | **328** |
| **3.5** | - కహోల బ్రాహ్మణము | **338** |
| **3.6** | - గార్గీ బ్రాహ్మణము | **353** |
| **3.7** | - అంతర్యామి బ్రాహ్మణము | **359** |
| **3.8** | - అక్షర బ్రాహ్మణము | **374** |
| **3.9** | - శాకల్య బ్రాహ్మణము | **397** |
| **అధ్యాయం 3** | - సారాంశము | **425** |
| **ముని కాండము అధ్యాయము - 4** | | **427** |
| **4.1** | - షడాచార్య బ్రాహ్మణము | **428** |
| **4.2** | - కూర్చ బ్రాహ్మణము | **439** |
| **4.3** | - స్వయంజ్యోతిర్బ్రాహ్మణము | **448** |
| **4.4** | - శారీరక బ్రాహ్మణము | **525** |
| **4.5** | - మైత్రేయీ బ్రాహ్మణము | **604** |
| **4.6** | - వంశ బ్రాహ్మణము | **626** |
| **అధ్యాయం 4** | - సారాంశము | **629** |
| **ఖిల కాండము అధ్యాయము - 5** | | **631** |
| **5.1** | - ఓం ఖం బ్రహ్మ బ్రాహ్మణము | **645** |
| **5.2** | - ప్రాజాపత్య బ్రాహ్మణము | **649** |

| | | |
|---|---|---|
| **5.3** | – హృదయ బ్రాహ్మణము | **654** |
| **5.4** | – సత్య బ్రాహ్మణము | **656** |
| **5.5** | – సత్య బ్రహ్మ సంస్థాన బ్రాహ్మణము | **657** |
| **5.6** | – మనో(మయ) బ్రాహ్మణము | **662** |
| **5.7** | – విద్యుద్బ్రాహ్మణము | **663** |
| **5.8** | – వాగ్ధేను బ్రాహ్మణము | **664** |
| **5.9** | – వైశ్వానరాగ్ని బ్రాహ్మణము | **665** |
| **5.10** | – గతి బ్రాహ్మణము | **666** |
| **5.11** | – తపో బ్రాహ్మణము | **668** |
| **5.12** | – అన్న ప్రాణ బ్రాహ్మణము | **671** |
| **5.13** | – ఉక్థ బ్రాహ్మణము | **673** |
| **5.14** | – గాయత్రీ బ్రాహ్మణము | **676** |
| **5.15** | – సూర్యాగ్ని ప్రార్థనా బ్రాహ్మణము | **687** |
| అధ్యాయము **5** | – సారాంశము | **693** |
| ఖిల కాండము | అధ్యాయము – **6** | **695** |
| **6.1** | – ప్రాణ సంవాద బ్రాహ్మణము | **695** |
| **6.2** | – కర్మవిభాగ బ్రాహ్మణము | **707** |
| **6.3** | – శ్రీమంథ బ్రాహ్మణము | **723** |
| **6.4** | – పుత్రమంథ బ్రాహ్మణము | **734** |
| **6.5** | – వంశ బ్రాహ్మణము | **747** |
| అధ్యాయము **6** | – సారాంశము | **750** |

ఓమ్

# శుభాశయాః

**సదాశివసమారమ్భామ్। శఙ్కరాచార్యమధ్యమామ్।**

**అస్మదాచార్యపర్యన్తామ్। వన్దే గురుపరమ్పరామ్॥**

ప్రాతఃస్మరణీయులు, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు పూజ్యశ్రీ స్వామి దయానందసరస్వతీ పూజ్యపాదులు నా గురుదేవులు.

**సద్గురుచరణారవిందాభ్యాం నమః**

మాగురువుగారు పూజ్యశ్రీ స్వామీజీ దేశవిదేశాలలో ఆర్షవిద్యాగురుకులాల సంస్థాపకులు. ఈ సంస్థద్వారా వారు స్వయంగా సంప్రదాయబద్ధమైనటువంటి వేదాంతబోధని అంతేవాసి శిష్యులకు, ఆంగ్ల ప్రసంగాలద్వారా గృహస్థ భక్తలోకానికీ కూడా ఆజీవనం జ్ఞానప్రదానం చేశారు. పూజ్యస్వామీజీ స్థాపించిన అన్యసంస్థలు – ఎయిమ్ ఫర్ సేవ, హిందూ ధర్మ ఆచార్యసభ, ధర్మరక్షణ సమితి, చెన్నై పట్నంలో 'సేవా కృప హోమ్,' మంజక్కుడులో 'స్వామి దయానంద స్కూల్,' 'స్వామి దయానంద కాలేజి అఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్,' ద్వారా స్వయం భారతదేశహితము ఉద్దేశించి సనాతనధర్మరక్షణపరులై విద్యా, వైద్య, సామాజిక, ధార్మిక, సాంస్కృతిక రంగాలలో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన సేవలు అందించిన యుగపురుషులు పూజ్యస్వామీజీ.

పూజ్యస్వామీజీ వద్ద శాస్త్రశ్రవణం చేసిన అనేక సన్న్యాసశిష్యులు, ప్రశిష్యులు, గృహస్థశిష్యులు అందరూ వర్తమానంలో వారి అడుగుజాడల్లో నడుస్తూ, ఈ సేవలు నిర్విరామంగా కొనసాగిస్తూ ఉన్నారు. వారివంతు గురుసేవగా చెన్నై స్థిత ఆర్షవిద్యా రిసెర్చ్ అండ్ పబ్లికేషన్ ట్రస్ట్ వారు పూజ్యస్వామీజీ ఆంగ్ల ప్రవచనాలన్నింటినీ గ్రంథరూపంలో ఆవిష్కరించి అందరికీ అందుబాటులో ఉంచుతున్నారు.

ఆర్షవిద్యా ఆచార్యపరంపరలో శ్రీస్వామి పరమార్థానంద సరస్వతీ శ్రేష్ఠులు, జగద్విఖ్యాతులు. స్వామీజీ ప్రధానంగా చెన్నై పట్టణంలో, గత నలభై అయిదు సంవత్సరాలుగా అవిరామంగా వేదాంతశాస్త్ర విద్యాదానం లక్షలాది జిజ్ఞాసువులకు ప్రత్యక్షంగా, డిజిటల్ మాధ్యమంద్వారా పరోక్షంగా ప్రసాదిస్తున్న మహనీయులు. స్వామీజీ ప్రవచనాలన్నీ ఆంగ్లభాషలో ఉంటాయి.

స్వామీజీయొక్క వస్తునిష్ఠ, సమన్వయ దృష్టి, విద్వత్తు వారి ప్రస్థానత్రయమూలం, భాష్యం, ప్రకరణ, సిద్ధి, పురాణ, ఇతిహాస గ్రంథాల వ్యాఖ్యానాలలో ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. శాస్త్రంలో

ఏ విషయమైనా, నిదానంగా, సూటిగా, సరళపదప్రయోగంతో, హృద్యమైన విశ్లేషణ, వివరణలు తమదైన శైలిలో అందించటం స్వామీజీ ప్రత్యేకత.

అంతేవాసిగా ఉన్న రోజులనుంచి ఈ రోజువరకూ, శ్రీస్వామి పరమార్థానందజీ వద్ద శాస్త్రశ్రవణం నాకు వరతుల్యం. ఆర్షవిద్యాగురుకులం కోయంబత్తూరులో, నేను చదువుకుంటున్న రోజులలో స్వామీజీ మాకు అతిథి ఆచార్యులుగా విచ్చేసేవారు. అప్పుడు స్వామీజీ ప్రత్యక్షసన్నిధిలో శ్రీవిద్యారణ్య విరచిత వేదాంత పంచదశీ ఆంగ్లంలో, ఈశావాస్యోపనిషత్తు మూలప్రవచనం ప్రప్రథమంగా సంస్కృత భాషలో వినే అవకాశం లభించింది. నా స్మృతిపథంలో ఇది ఒక మరపురాని ఘట్టం.

నా నిజఅధ్యయనఅధ్యాపన జీవితంలో, ఈ మహాత్ముల ప్రగాఢప్రభావం ఉన్నది. ఆప్తులు, శిష్యులు అయినటువంటి స్వామి పరమార్థానందజీ సలహాలు, సూచనలు, మార్గదర్శకంగా నాకు రామరక్షగా ఎప్పటికీ ఉంటాయి. ఈ సందర్భంగా స్వామీజీ శ్రీచరణాలకు శ్రద్ధాభక్తిపురస్సర, కృతజ్ఞతాపూర్వకమైన ప్రణామములు అర్పిస్తున్నాను.

నాకు చిరపరిచితులు శ్రీమతి రాజ్యశ్రీ, శ్రీ రాఘవరావు గార్లు స్వామి పరమార్థానందజీ శిష్యులు. పూజ్యశ్రీ స్వామీజీ మా గురుదేవులు, **'శ్రుతిసేవయే గురుసేవ,'** అని ఉపదేశించేవారు. పూజ్యశ్రీస్వామీజీ ఆజ్ఞను శిరోధార్యంగా భావించి వీరిరువురూ కూడా తమ బ్రహ్మాభ్యాస నిదిధ్యాసన జీవనంలో, జిజ్ఞాసువులకు శాస్త్రాన్ని బోధించటమేగాక, స్వామి పరమార్థానందజీ అమూల్యమైన ఆంగ్ల ప్రవచనాలను కూడా తెలుగులోకి అనువదించి, పుస్తకరూపంలో తెలుగువారందరికీ అందించేటటువంటి బృహత్ గురుసేవలో, తత్పరులై తరిస్తూ ఉన్నారు. ఆ ప్రణాళికలో వెలువడిన బృహదారణ్యకోపనిషత్తు ఉపహారరూపేణ ఇప్పుడు మీ చేతులలో ఉన్నది. రాఘవరావు దంపతులకు శ్రీవిశ్వనాథుని అనుగ్రహాన్ని ప్రార్థిస్తూ –

**నారాయణ స్మృతులతో –**

**స్వామినీ ఆత్మలీనానంద సరస్వతీ**

శార్వరినామ సంవత్సరం, ఫాల్గుణమాసం

హెూళికా పౌర్ణమి, వారాణసి.

# స్వామీజీ బృహత్తమమైన బోధ

**అహోశాస్త్రమహోశాస్త్రమహో గురురహో గురుః**
**అహో జ్ఞానమహో జ్ఞానమహో సుఖమహోసుఖం-పంచదశీ 7-279**

ఉపనిషత్తులన్నిటిలోకి మకుటం బృహదారణ్యకోపనిషత్తు; అందువల్ల శంకరులవారికి ఈ ఉపనిషత్తు అంటే ప్రత్యేకమైన అభిమానం. అందువల్ల తక్కిన ఉపనిషత్తులకన్నా శంకరులవారు ఈ ఉపనిషత్తుకు చేసిన భాష్యం అరణ్యమంత విశాలమైనది. ఎక్కడికక్కడ శంకరులవారు ఒక్కో వాక్యానికి పూర్వపక్షులతో వాదోపవాదాలు చేసుకుంటూ, సత్యాన్ని నిలబెట్టుకుంటూవస్తారు. ఇది ఉపనిషత్తు భాష్యంలో చాలా వివరంగా ఉంటుంది.

ఇప్పుడు మనం నేర్చుకుంటున్నది బృహదారణ్యకోపనిషత్తుయొక్క మూలంనుంచి బోధ. కాని స్వామి పరమార్థానంద, ఇది మూలంమీద బోధే అయినా కూడా, ముఖ్యమైన ప్రతి అంశంలోనూ శంకరులవారి హృదయానికి అద్దం పడుతూనే వస్తున్నారు. శంకరులవారి భాష్యంలోని రత్నాలను, మణులను, వజ్రవైఢూర్యాలను మనకు స్వయంగా ఏరిపెట్టి వాటి విలువలను మనకు వివరించి చెబుతున్నారు.

మొదటి అధ్యాయంలో ఎక్కువగా ఆత్మబోధ లేదు. కాని అందులో శంకరులవారు వ్రాసిన ఎన్నో భాష్యాలను మనకు అర్థమయ్యేభాషలో చిన్నచిన్న వాక్యాలుగా విడదీసి, సుస్పష్టం చేశారు. ఆ భాష్యాల విశ్లేషణలు ఒక్కొక్కటీ ఒక్కొక్క ఆణిముత్యం. ఉదాహరణకు ఘటభాష్యం, అనుప్రవేశశ్రుతి, అహం బ్రహ్మాస్మి మహావాక్య విశ్లేషణ, విద్యాసూత్ర వివరణ పేర్కొనవచ్చు.

ఇవికాక సందర్భం వచ్చినప్పుడల్లా శంకరులవారు విశ్లేషించిన ఎన్నో విషయాలను మనకు హృదయానికి హత్తుకుపోయేలా చిన్నచిన్న భాగాలుగా విడగొట్టి వివరించుకువచ్చారు. తవ్యకారంమీద విశ్లేషణ, శ్రవణ, మనన, నిదిధ్యాసనలమీద విశ్లేషణ, సత్యస్య సత్యం భాష్యం విశ్లేషణ వాటిలో మచ్చుకి కొన్ని. ఉపనిషత్తుకు ఆత్మ విషయం చాలా ఇష్టం అంటారు స్వామీజీ.

మిగతా ఉపనిషత్తులు ఒక ఎత్తు, బృహదారణ్యకోపనిషత్తు ఒక ఎత్తు అని చూశాము. అందులోనూ 3, 4 అధ్యాయాలు ఇంకా ప్రత్యేకమైనవి. ఎందుకంటే మిగతా ఉపనిషత్తుల్లో శిష్యునికి ఏమీ తెలియదు. ఒకవేళ కొంత తెలిసినా, గురువు చెప్పే విషయం తెలియదు. అందువల్ల బోధ కూడా వివరంగా ఉంటుంది. ఇక్కడ మూడవ అధ్యాయాన్ని జల్పం అంటారు. ఇద్దరు సమఉజ్జీల మధ్య వాదం ఇది అని చెపుతారు స్వామీజీ. అందువల్ల ప్రశ్న సూక్ష్మంగా, తెలివిగా ఉంటుంది; వారి స్థాయికి తగ్గట్టు జవాబిస్తాడు యాజ్ఞవల్క్యుడు. అటువంటి సందర్భాన్ని మన స్వామీజీ విశ్లేషిస్తారు.

శంకరాచార్యులవారి భాష్యానికి సురేశ్వరాచార్యులు వార్తికలు రాశారు. అక్కడక్కడా స్వామీజీ ఆ వార్తికల్లో విశ్లేషణ ఎలా ఉంటుందో రుచి చూపిస్తారు ఈ ఉపనిషత్తులో. ఉదాహరణకు స్వయంజ్యోతి బ్రాహ్మణంలో జనకమహారాజు దగ్గరికి యాజ్ఞవల్క్యుడు వెళ్ళినప్పుడు ఇవాళ నేను ఏమీ మాట్లాడను అనుకుని వెళ్ళాడు; కాని ఆయన ప్రశ్నలు అడిగేసరికి, తన నిర్ణయాన్ని పక్కకుపెట్టి బోధించాడు. ఎందుకంటే అంతకుముందు జనకుడు ఎప్పుడు ఏ ప్రశ్న అడిగినా బోధిస్తానని మాట ఇచ్చాడు, కాబట్టి మాట నిలబెట్టుకున్నాడు అని శంకరులవారు విశ్లేషించారు. అక్కడ సురేశ్వరాచార్యుల వారు ఆ వాక్యాన్ని కొంచెం మారిస్తే నేను ఇవాళ జనకుడు ఏం అడిగినా చెబుతాను అని నిర్ణయం చేసుకుని వచ్చాడని అర్థం చెప్పవచ్చు అంటారు. పరమార్థానంద స్వామీజీ ఈ సూక్ష్మభేదాన్ని మనకు బాగా వివరిస్తారు.

ఇక్కడ మూడు విషయాలు గమనించమని ప్రార్థన. ఇది మూలం కాబట్టి, శంకరులవారి భాష్యాన్ని సందర్భానుసారంగా క్లుప్తంగా, అందరికీ అర్థమయ్యేలా స్వామీజీ చెప్పటం జరిగింది. తెలుగులోనూ అలాగే రాయటం జరిగింది. ఇంకొక విషయం – కర్మ, ఉపాసనల భాగం ఉన్నచోటల్లా ప్రతిపదార్థం ఇవ్వకుండా, దాని సారాంశాన్ని చెబుతారు స్వామీజీ. ఎందుకంటే ఇది జ్ఞానకాండ. జ్ఞానకాండలో వీటికి అంతగా ప్రాముఖ్యత ఉండదు. అదే విధంగా తెలుగులో కూడా వస్తుంది. మూడవ అంశం ఆత్మబోధ చాలా క్లిష్టమైనది కాబట్టి, తేటతెలుగులో రాయటం జరిగింది.

బృహదారణ్యకోపనిషత్తుకు స్వామీజీ చేసిన బోధను విన్నకొద్దీ ఆయనమీద ఆరాధనాభావన అంతకంతకూ పెరుగుతూ వస్తుంది. అంతటి మహోన్నతమైన ఆయన బోధను తెలుగులో ప్రచురించగలిగే ఈ సదవకాశం మా ఆర్ష విద్యా తరంగిణి టస్టుకు లభించినందుకు స్వామీజీకి మనమంతా సదా కృతజ్ఞులమై ఉంటాము.

**షడంగాదివేదో ముఖే శాస్త్రవిద్యా**
**కవిత్వాది గద్యం సపద్యం కరోతి।**
**మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రిపద్మే**
**తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥**

**– మద్దూరి రాజ్యశ్రీ**

# అహం బ్రహ్మాస్మి

బృహదారణ్యకోపనిషత్తు గురించి పూజ్యస్వామీజీ చెబుతుండేవారు. 'మనం ఉటంకించిన మంత్రం ఎందులోంచి అని ఎవరైనా అడిగితే, బృహదారణ్యకోపనిషత్తులోనిది అని చెప్పేయవచ్చు. ఎందుకంటే అది ఒక అరణ్యమంత పెద్దది కాబట్టి. ఆ మంత్రం ఎక్కడుందో ఎదుటివారు వెతకటం చాలా కష్టం. ఒకవేళ కష్టపడి వెతికినా చాలామటుకు ఆ మంత్రం అందులో ఉండి తీరుతుంది కూడా.'

బృహదారణ్యకోపనిషత్తులో తక్కిన ఉపనిషత్తుల్లో ఉన్న అంశాలన్నీ ఉన్నాయి; వాటిల్లో లేనివి కూడా ఉన్నాయి. అదీ ఈ ఉపనిషత్తు ప్రత్యేకత.

- బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా, జీవో బ్రహ్మైవ నాஉ పరః
- వేదాంతాన్ని అధ్యారోప, అపవాద విశ్లేషణ ద్వారా నేర్చుకోవాలి
- వాచాஉ உ రంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్
- అవస్థాత్రయ సాక్షిచైతన్యం
- తదేతత్ సృష్ట్వా తదేవానుప్రవిశ్యతి
- బ్రహ్మజ్ఞానానికి వేదమొక్కటే ప్రమాణం
- బ్రహ్మజ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారానే పొందాలి
- జ్ఞాన, కర్మ సముచ్చయం కుదరదు. కర్మ, ఉపాసనల వల్ల మోక్షం రాదు
- ఆత్మజ్ఞానం వల్లనే మోక్షం వస్తుంది
- ఆత్మ నిర్వచనం నేతినేతి పద్ధతి ద్వారా చెయ్యాలి
- అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి వంటి మహావాక్యాలు ఐక్యాన్ని బోధిస్తాయి.

పైన ఉదహరించిన సూత్రాలన్నీ తక్కిన ప్రధాన ఉపనిషత్తుల్లో చెదురుమదురుగా వచ్చిన సత్యాలు. కాని తమాషా ఏమిటంటే వీటన్నిటినీ కూడా బృహదారణ్యకోపనిషత్తులో చాలా వివరంగా చూడవచ్చు.

ఉదాహరణకు మొట్టమొదటి వాక్యం వేదాంతసారం– బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాஉ పరః. కాని జగత్తు మిథ్యాత్వాన్ని శంకరులవారు ప్రతిపాదించారు, అది శాస్త్రం చెప్పలేదు అనేవారు లేకపోలేదు. ఈ ఉపనిషత్తులో ఎలా బ్రహ్మ సత్యం, జగన్మిథ్యో అడుగడుక్కీ చూస్తాము. ముఖ్యంగా మధుబ్రాహ్మణంలో ఈ జగత్తులో ఎలా ప్రతిదీ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయో, అలా ఇంకొకదాని మీద ఆధారపడినవి ఎలా సత్యం కాదో, వాటికి అధిష్ఠానంగా ఇంకొకటి ఎలా ఉంటుందో చాలా వివరంగా వస్తుంది.

**అతోஉ న్యదార్తం** అంటే బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా. ఈ వాక్యం మూడవ అధ్యాయములో అనేక బ్రాహ్మణములలో అనేక కోణములలో వస్తుంది.

మొదటి రెండు అధ్యాయాలు అధ్యారోప, అపవాద విశ్లేషణకు ప్రతీకలు. అహం బ్రహ్మాస్మి మహావాక్యం ఈ ఉపనిషత్తులో వస్తుంది. ఈ **అహం బ్రహ్మాస్మి మహావాక్య భాష్యం** కూడా స్వామీజీ వివరంగా వర్ణించుకొస్తారు.

నేతి నేతి ద్వారా ఆత్మ నిర్వచనం చెప్పాలనీ, ఆత్మ గురించి ప్రత్యక్షంగా చెప్పలేమనీ తక్కిన ఉపనిషత్తుల్లో నేర్చుకుంటాము కాని ఇక్కడ చూసినంత వివరంగా వేరే ఎక్కడా చూడము. ఆ పద్ధతిని సర్వనిషేధ అవధిః అంటారు. అక్షర బ్రాహ్మణములో 25 నిర్వచనాలు ఇస్తాడు యాజ్ఞవల్క్యుడు.

**అస్థూలమనణ్వహ్రస్వమదీర్ఘమలోహితమస్నేహమచ్ఛాయమ్...**

అలా పైన చెప్పిన సూత్రాలన్నీ ఇందులో చాలా వివరంగా చూడవచ్చు. ఇవికాక బృహదారణ్యకోపనిషత్తులోనే ప్రత్యేకంగా వచ్చిన అంశాలు ఎన్నో ఉన్నాయి.

- మామూలుగా గురుశిష్యుల సంవాదం ఉంటే, ఇక్కడ జల్పం కూడా వస్తుంది.
- ప్రతిదానికీ నామరూపాలతో బాటు కర్మ కూడా ఉంటుంది.
- ఆత్మజ్ఞానంలో మన ప్రయాణం పృథివితో మొదలై, అక్షరం బ్రహ్మ దాకా సాగుతుంది. ఈశ్వరునికి ప్రమాణం అంతర్యామి బ్రాహ్మణము.
- సగుణ ఈశ్వరుడు, నిర్గుణబ్రహ్మల మధ్య భేదం స్పష్టంగా తెలుస్తుంది.
- వేదపూర్వభాగం, అంతభాగం కూడా ఇందులో చాలా వివరంగా వస్తుంది.
- ఘటభాష్యం, అనుప్రవేశశ్రుతి భాష్యం, విద్యాసూత్రం వివరణ, తవ్యకార విశ్లేషణ మొదలైన ఎన్నో భాష్యాలు, విశ్లేషణలు **సూక్ష్మంగా ఉన్నాయి**.
- సుషుప్తిని మోక్షంతో పోలుస్తుంది.

అంతేకాదు, శంకరులవారు తక్కిన ఉపనిషత్తులకు చేసిన భాష్యం ఒక ఎత్తు; ఈ ఉపనిషత్తుకు చేసిన భాష్యం ఇంకో ఎత్తు. ఇందులో శంకరాచార్యుల వారికిష్టమైనవి, మనం గుర్తుంచుకోవాల్సినవి అనేక ముఖ్యమైన మంత్రాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని చూద్దాము.

**ద్వితీయాద్వై భయం భవతి –** రెండవది ఉంటే భయం వేస్తుంది.

**అసంగోహ్యయం పురుషః –** ఆత్మ అసంగం.

**పశ్యన్ వై తన్న పశ్యతి** – ఆత్మ చూస్తున్నది కాని చూడటం లేదు.

**ఔపనిషదం పురుషం** – ఉపనిషత్తు వల్లనే బ్రహ్మ గురించి తెలుసుకోవచ్చు.

**ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి** – ఎవరైనా ఎవరినైనా ఇష్టపడేది వారి మీద ప్రేమకొద్దీ కాదు, తన కోసమే.

**ఆత్మాత్యేవోపాసీత** – విద్యాసూత్రం.

**సః దేవానాం పశుః** – అతను దేవతలకు పశువు – అవిద్యాసూత్రం.

**యత్ర హి ద్వైతమివ భవతి** – ద్వైతం ఉన్నట్టుగా కనిపిస్తుంది.

అలా తరచిచూసిన కొద్దీ ఈ బృహదారణ్యకంలో ఎన్నో మణులు, రత్నాలు, వైఢూర్యాలు ఉన్నాయి. వాటిని మీరే స్వయంగా ఏరుకుని, మీ స్వంతం చేసుకోండి.

**– మద్దూరి రాజ్యశ్రీ**

# నా ఆరాధ్యదైవం

దిట్టలుగా చేశారు గణితశాస్త్రంలో ఎందరో విద్యార్థులను, లెక్చరర్‌గా
పొందుపరిచారు ప్రవాసాంధ్రులకు తెలుగుభక్తి పేజెస్‌ను  వన్‌స్టాప్ సైట్‌గా
జీర్ణించుకున్నారు న సౌఖ్యం న దుఃఖం పితానైవ మే నైవ పతీ న పుత్రః సారాన్ని
ఏకోన్ముఖులైనారు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ గురువులైన స్వామి పరమార్థానంద బోధలతో
ఔపోసన పట్టారు. భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలను బాగుగా
బోధిస్తున్నారు వాటిలోని కాన్సెప్టులను శిష్యుల మనస్సులో నిలిచిపోయేలా
నిలిచారు శాంతం, పరిపూర్ణత్వం, స్థితప్రజ్ఞత లక్షణాలకు ప్రతీకగా
పేరుపొందారు తండ్రిగా, భర్తగా, గురువుగా, ఆదర్శమూర్తిగా
**మలిచారు నన్ను శిల్పంగా నా పతిదేవులు శ్రీ రాఘవరావు గారు.**

చిన్నప్పటినుంచీ జ్ఞానతృష్ణ మెండుగా ఉండేది. ఇంగ్లీషు డిక్షనరీని పిన్నవయస్సులోనే కంఠతా పట్టారు; భగవద్గీతలో, ఫోటోగ్రఫీలో, నెయిల్ డ్రాయింగ్‌లో బహుమతులు పొందారు. అవికాక, కొన్ని డిప్లొమా కోర్సులు చేశారు, కంప్యూటర్ కోర్సులో పరీక్షలు రాశారు; ఇక్ఫైలో కోర్సులు చేశారు. ఇవన్నీ జ్ఞానతృష్ణవల్ల చేశారే కాని వీటిలో ఎందులోనైనా రాణించి లక్షలు సంపాదించాలనీ, కోట్లకు పడగలెత్తాలనే ధనాగమతృష్ణ ఎన్నడూ లేదు. ఇంకా ఎవరైనా ఈ అర్థంకాని పరుగుపందెంలో పరుగెడబోతుంటే ఆపి జీవితం విలువలు నేర్పించేవారు.

వయస్సు పెరుగుతున్న కొద్దీ ఈ జ్ఞానతృష్ణ ఆధ్యాత్మికత వైపు మొగ్గు చూపించింది. ఎందరో స్వామీజీలు చెప్పిన గీతాబోధలను విన్నారు; చిన్మయి మిషన్‌లో ఉపనిషత్తుల బోధకు వెళ్ళారు; హృషీకేశ్‌లో దయానంద స్వామీజీ వేదాంత శిబిరాలకు వెళ్ళారు; శివానంద ఆశ్రమంలో ప్రచురించిన బ్రహ్మసూత్రాలు అధ్యయనం చేశారు. ఇంకా తపనతీరక బ్రహ్మసూత్రాలకోసం నెట్‌లో వెతికితే ముండకోపనిషత్తు మీద, బ్రహ్మసూత్రాల మీద స్వామీ పరమార్థానందవారి బోధ ఆడియోలు దొరికాయి. ఒక విజ్ఞాననిధి దొరికినంతగా మురిసిపోయారు. ఇంక తనకు స్వామీజీయే దిశానిర్దేశం చేసినట్టుగా భావించి, ఏకోన్ముఖులైనారు. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన స్వామీజీ బోధనలను ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు అన్నీ వరుసగా  వింటూ వచ్చారు. ఒకసారి కాదు, రెండు మూడుసార్లు. వీలున్నప్పుడల్లా వెళ్ళి స్వామీజీ బోధ ప్రత్యక్షంగా విని ఆయనను కలిసి వచ్చేవారు.

మా ఇంట్లో అణువణువులోనూ స్వామీజీ బోధ ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. ఎప్పుడు చూసినా మంద్రస్థాయిలో మృదుగంభీరమైన గొంతు ఇంట్లో మారుమ్రోగుతూ ఉండేది. అదేమిటో తెలుసుకోవాలనే కుతూహలం కొద్దీ అడిగితే, వినమని ముండకోపనిషత్తు నా సెల్‌లో వేసియిచ్చారు. అది వినేనాటికి నాకు అసలు అద్వైతం అంటే ఏమిటో తెలియదు. ఉపనిషత్తు, ఆత్మ, అనాత్మ, శరీరత్రయం, పంచకోశాలు, కర్మసిద్ధాంతం – ఇలాంటి పదాలతో బొత్తిగా పరిచయం లేదు. కాని స్వామి పరమార్థానంద వారు అసలేమీ తెలియని ప్రపంచంలోకి, స్వయంగా

నా చెయ్యి పట్టుకుని, ఒక్కొక్క మెట్టూ పైకి ఎక్కించి, ఎక్కడ జారిపోతానోనని మధ్యమధ్యలో జాగ్రత్తగా చూసుకుంటూ, పైకి తీసుకువెళ్ళి ఒక అద్భుత ప్రపంచం చూపించారు. నేను కూడా ఇంక రోజూ వినటం మొదలుపెట్టాను.

తమాషా ఏమిటంటే ఆయన మాథ్స్ లెక్చరర్ కాబట్టి స్వామీజీ కాన్సెప్టులు బాగా చెబుతారు అనేవారు ఆయన; నేను ఇంగ్లీషు లెక్చరర్‌ని కాబట్టి ఒక పోయమ్ ఎలా వివరించాలో అలా స్వామీజీ ముందు దాన్ని పరిచయం చేసి, ప్రతిపదాన్నీ వివరించి, అందులోని ప్రత్యేకతలను విశ్లేషించి చెపుతారు అనేదాన్ని నేను.

తను అప్పటికే తెలుగుభక్తి పేజెస్ అనే వెబ్‌సైట్ పెట్టి, ముఖ్యంగా ప్రవాసాంధ్రులకు తెలుగు స్తోత్రాలు, శ్లోకాలు, ఉపనిషత్తులు, భారత భాగవతాలు అందిస్తున్నారు. అదేవిధంగా తెలుగు ప్రజలతో మీ జ్ఞానాన్ని కూడా పంచుకోవాలని నేను ప్రోత్సహించటంతో **అద్వైత వేదాంతం – ఒక విహంగ వీక్షణం** అని ఒక ప్రసంగం ఇచ్చారు. దానికి కుండ, గులాబిపువ్వు, స్ఫటికం వంటి వస్తువులను చూపించి మరీ చెప్పారు. వెంటనే ఒక సత్సంగం కార్యదర్శి నిర్మలగారు ఉత్సాహంగా వచ్చి వారి సత్సంగంలో ఉపనిషత్తులను బోధించమని కోరారు. స్వామీజీని సంప్రదిస్తే, 'మీరు బోధిస్తున్నారని ఎవరన్నారు? మీ జ్ఞానాన్ని పంచుతున్నారు. అంతే.' అన్నారు. దాంతో మొదలుపెట్టారు. తను చెప్పటమే కాక, నన్ను చెప్పమని ఆయన నన్ను ప్రోత్సహించారు. అలా ఇద్దరం చెప్పటం మొదలుపెట్టాము.

అప్పటికే భావం నాది, భాష నీది అని ఆయన నాచేత లౌకికమైన కథలు రాయించటం వల్ల, ఈ రంగంలో అద్వైత వేదాంత పరిచయం తెలుగులో వ్రాయి, జనబాహుళ్యానికి తోడ్పడుతుందని రాయించారు. అది బాగా ఆదరింపు పొందటంతో, స్వామీజీ దీవెనలు మెండుగా ఉండటంతో, ప్రస్థానత్రయం మొత్తం స్వామీజీ బోధల ఆధారంగా తెలుగులోకి అనువదించి, ప్రచురించటానికి పూనుకున్నాము. రాఘవరావుగారు తేలికగా తైత్తిరీయం, భజగోవిందం రాశారు.

'మా అనంత మామయ్యలా పిహెచ్.డి. చేద్దామనుకున్నాను, కాని అంతకు మించిన అనంతం బ్రహ్మ గురించి నేర్చుకున్నాను.' అన్నారు ఒక ప్రసంగంలో.

లౌకిక జీవితంలోనూ, ఆధ్యాత్మిక జీవనంలోనూ మావారు నాకు ప్రత్యక్షగురువు. 'నువ్వు ఎప్పుడూ నవ్వుతూ ఎలా ఉంటావు? నీకు సమస్యలు లేవా?' అనేవారు నన్ను అందరూ. 'మావారు నన్ను బెంగపడవద్దు అంటారు,' అనేదాన్ని. అలాంటి నిశ్చింతను కలుగజేస్తారు. మా అమ్మాయి శ్రీస్నిగ్ధను కూడా ఆడింది ఆటగా, పాడింది పాటగా పెంచినా, ఏమూలా పెంకితనం, మంకుపట్టు తొంగిచూడకుండా తీర్చిదిద్దారు. నేను చెప్పే బోధకూ, రాసే గ్రంథాలకూ తొలి విమర్శకులు ఆయనే. వాటిలోని లోటుపాట్లను ఎత్తిచూపి, నన్ను సరిదిద్దుతారు. నేను రాయటానికి అనువైన వాతావరణాన్ని ఏర్పరిచి, నాకు మధ్యలో చిరుతిండి అమరుస్తూ, యజ్ఞంలా చేస్తోంది అని పదిమందికి మురిపెంగా చెబుతారు.ఆ పుస్తకాలకు చాలా స్పేడ్‌వర్క్ ఉంటుంది. అదంతా ఓపిగ్గా చేస్తారు.

ప్రతి పురుషుని విజయానికీ వెనక స్త్రీ ఉంటుందో లేదో నాకు తెలియదు కాని, ప్రతి స్త్రీ విజయానికీ వెనక పురుషుడు ఉంటాడు. నా విజయానికి వెనక నా పతిదేవులు శ్రీ రాఘవరావు గారు ఉన్నారు.

**– మద్దూరి రాజ్యశ్రీ**

# ఆర్ష ఆనంద కుటీర్ సభ్యుల స్పందన

**సదాశివసమారంభామ్। శంకరాచార్య మధ్యమామ్।**
**అస్మదాచార్య పర్యంతామ్।వందే గురుపరంపరామ్॥**
**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।**
**గురుసాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురువేనమః ॥**

ఆధ్యాత్మిక జగతిలో ఉపనిషత్తుల మహత్యం వర్ణనాతీతం. మోక్షసాధన హేతుభూతములు ఉపనిషత్తులు. వేదముల అంతిమభాగమే ఉపనిషత్తులుగా చెప్పబడుతున్నాయి. ఉపనిషత్తు అనగా బ్రహ్మవిద్య.ఉపనిషత్తులయొక్క ప్రధాన విషయం జీవ–ఈశ్వర ఐక్యం. అత్యంత భయంకర మృత్యురూప సంసారం నుండి బయటపడదలచిన ప్రతి ముముక్షువు ఉపనిషత్‌వేద్య పరమాత్మను తెలుసుకోవాలి. ఉపనిషత్‌వేద్య పరమాత్మ నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్తస్వభావుడు. ఆనందస్వరూపుడు. ఓంకార శబ్దవాచ్యుడు. గుణాతీతుడు. సర్వవ్యాపి.అంతేకాదు చైతన్యపరంగా ఆ బ్రహ్మను నేనే అనే ఉపనిషత్‌ల జ్ఞానంవల్ల అనిర్వచనీయమైన, అనాది అవిద్య నశిస్తుంది.

సూర్యకుమారి గారి స్ఫూర్తితో మా ఆర్షఆనంద్ కుటీర్ సత్సంగం ఏప్రిల్ 2, 2016 సం॥లో ఏర్పడినది. ఇప్పటికి ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్నందుకు మాకు అందరికీ ఎంతో ఆనందంగా ఉన్నది. ఈ కాలంలో...

**ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండ, మాండూక్య, తిత్తిరిః ।**
**ఐతరేయం చ, ఛాందోగ్యం, బృహదారణ్యకం తథా ॥**

ఈ పది ఉపనిషత్తులనూ ఒక వరుసక్రమంలో మా గురువులు, గౌరవనీయులు, శ్రీ కస్తూరి వీర రాఘవరావు గారు, మేడమ్ రాజ్యశ్రీ గారు చేసిన బోధనలద్వారా చక్కగా, సులభంగా నేర్చుకున్నాము. వారు మాకు గురువులుగా లభించటం మా పూర్వజన్మ సుకృతంగా మేము ఎప్పుడూ భావిస్తాము. వారు నిస్వార్థపరులు. వారు ప్రతి విషయం మాకు పదేపదే బోధిస్తూ, అందరికీ అర్థమయ్యేలా, సులభశైలిలో, అనేక కథా, కథనాలతో విపులంగా వివరిస్తూ ఉంటారు. విషయ పరిజ్ఞానం ఆర్జించి, అనేక ఉదాహరణలతో మా హృదయాలకు విషయం బాగా హత్తుకుపోయేటట్టు వివరిస్తారు.

ఆత్మజ్ఞానం అంటే ఏమిటో తెలియని మేము, మోక్షం గురించి పూర్తిగా అవగాహన లేని మేము, ఆత్మజ్ఞానానికి సంబంధించిన ఎన్నో అంశాలను గురువులద్వారా శ్రవణం చేశాము, నేర్చుకున్నాము. బ్రహ్మ బాహ్యంగా చూసే వస్తువుకాదు; అనుభవంపొందే వస్తువు అంతకన్నా కాదు; ఆ బ్రహ్మ నేనే అని గ్రహించగలగాలి. బ్రహ్మను ఇంకెలా తెలుసుకున్నా అది జ్ఞానం అవదు.తనను తాను తెలుసుకోవటమే నిజమైన జ్ఞానం పొందటము. అదే ఆత్మబోధ అని తెలుసుకోగలిగాము. ఈ ఆత్మజ్ఞానం పట్టుబడటం అనేది అంత తేలికైన విషయం ఏమీ కాదు. కానీ గురుదంపతుల బోధనలవలన మాకు చాలా సులభతరమైనది. "దేనిని తెలుసుకుంటే ఇక తెలుసుకోవలసినది లేదో" ఆ బ్రహ్మతత్వాన్ని 10 ఉపనిషత్తులద్వారా చక్కగా, ఓపికగా బోధించుటవలన,**మన్యేవిదితమ్** అని కేనోపనిషత్తులో శిష్యుడు చెప్పినట్టుగా మేము కూడా చెప్పగలుగుతున్నాము. బ్రహ్మసత్యం, **జగత్ మిథ్యా; జీవో బ్రహ్మైవ నాఽ పరః** అనే వేదాంతసారాన్ని అనేక కోణాలలోనుంచి మాకు అర్థమయ్యేవరకూ ఓర్పుతో, ఓపికగా బోధించారు. అందుకు గురువులకు అనేకానేక నమస్కారములు తెలియజేస్తున్నాము.

శాశ్వతమైనది బ్రహ్మ ఒక్కటే! సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ అని ఆ బ్రహ్మతత్త్వాన్ని అనేక విధాలుగా మేము గ్రహించే విధంగా బోధించి,అదే మా స్వస్వరూపమని తెలియజేసి దాన్ని మేము బాగుగా జీర్ణించుకుని, సుప్తచేతనావస్థలో కూడా "అహం బ్రహ్మాస్మి" అనే నిష్ఠలో నిలబడేటట్టుగా బోధించారు.

స్వామి పరమార్థానంద గారి బోధనల స్ఫూర్తితో, వారి ఆశీస్సులతో మేడమ్ మద్దూరి రాజ్యశ్రీ గారు ఉపనిషత్తులను, అనేక ప్రకరణ గ్రంథములను, భగవద్గీతను తెలుగులో సులభశైలిలో అనువదించారు.అవి సరళమైన పదాలతో, అందరికీ తేలికగా అర్థమయ్యేలా ఉంటాయి. మా మేడమ్ గారి గురించి ఎంత చెప్పినా తక్కువే! వారి కలంనుండి జాలువారిన ప్రతిపదం వెనక వారి శ్రమ, జ్ఞానాన్ని అందించాలనే ఆకాంక్ష కనబడతాయి. అంత సరళశైలిలో ఉంటాయి కనుకనే మా అందరిని ఆత్మజ్ఞానంపట్ల ఆకర్షితులను గావించాయి.

మేడమ్ గారు వ్రాసిన భగవద్గీత మొదటిషట్కం అయితే – అద్భుతం. చదివినవారందరూ ఎంతో ఆనందిస్తున్నారు, ప్రశంసిస్తున్నారు. వారికి మా అందరి తరుపునా అనేకానేక నమస్కారములు తెలియజేస్తున్నాము.

బృహదారణ్యకోపనిషత్తు చూడటానికి సరళమనిపించినా, నిజానికి క్లిష్టమైనది. చాలా గంభీరమైనది. ఇది చాలా పెద్ద ఉపనిషత్తు. దీనిలో అన్ని ఉపనిషత్తులలో ఉన్నవీ ఉంటాయి. వేటిలోనూ లేని విషయాలు కూడా ఉంటాయి. ఇది చాలా పెద్ద ఉపనిషత్తు అని చెప్పుటకు తార్కాణము మొత్తం 6 అధ్యాయములు, 47 బ్రాహ్మణములు, 418 మంత్రాలు ఉన్నాయి. దీన్ని మూడు కాండములుగా విభజన చెయ్యవచ్చును. (1) మధు కాండము, (2) ముని కాండము, (3) ఖిల కాండము. వేదాంతసారాన్ని అనేకవిధాలుగా, అనేక కోణాలలోంచి అనేక వాదనలద్వారా చూస్తాము. ఇందులో ప్రత్యేకతలు – అనేక భాష్యాలు, అనేక విశ్లేషణలు.

ద్వితీయాధ్యాయములో మైత్రేయీ బ్రాహ్మణమునందు మైత్రేయి ఈ భూమంతయూ ధనముతో నిండి, నాకు లభిస్తే నేను అమరత్వము పొందెదనా? అని ప్రశ్నించెను. ధనము అమరత్వమునీయదు. సంపన్నులవలె భోగములను అనుభవించవచ్చును అని యాజ్ఞవల్క్యుడు చెప్పగా – అమరత్వమును ఇవ్వని అట్టి సంపదను మైత్రేయి నిరాకరిస్తుంది. యాజ్ఞవల్క్యుడు అప్పుడు మైత్రేయికి ఆత్మస్వరూపమును తెలియజేస్తాడు. శ్రవణ, మనన, నిదిధ్యాసనములు, ఆత్మ సాక్షాత్కారానికి సోపానాలు. కర్మలు, ఉపాసనల ఫలం మోక్షం కాదని తెలియజేస్తాడు.

ఇంత పెద్ద బృహత్కరమైన, విశాలమైన, గంభీరమైన, క్లిష్టమైన బృహదారణ్యకోపనిషత్తును స్వామి పరమార్థానందగారి బోధనల స్ఫూర్తితో మన గురువుగారైన శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ గారు సరళమైన భాషలో వివరణాత్మకంగా, తెలుగులో చక్కగా అనువదించి అందిస్తున్నందుకు కృతజ్ఞతాభివందనములు తెలుపుకుంటున్నాము.

ఈ గ్రంథరాజము వేదాంత జిజ్ఞాసువులకు ఒక గొప్ప కానుక కాగలదని ఆశిస్తూ, ముందుమాట వ్రాయుటకు నాకు ఈ అవకాశమిచ్చిన గురుదేవులకు, గురుదంపతులకు నా నమస్సుమాంజలులు సమర్పిస్తూ...

భక్తితో మీ శిష్యురాలు

**సాయిలక్ష్మి**

ఆర్షఆనంద్ కుటీర్ సత్సంగ సభ్యుల తరపున

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ।
ధీనామవిత్ర్యవతు । గణేశాయనమః ।
సరస్వత్యైనమః । శ్రీ గురుభ్యోనమః ।
హరిః ఓమ్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

# బృహదారణ్యకోపనిషత్

## ఉపోద్ఘాతము

బృహదారణ్యకోపనిషత్తులో మూడు చిన్న పదాలు ఉన్నాయి. 'బృహత్', 'ఆరణ్యకమ్', ఉపనిషత్తు'.

ఉపనిషత్తు ప్రాథమిక అర్థం బ్రహ్మవిద్య అంటే బ్రహ్మగురించిన జ్ఞానము. ఉపనిషత్తు పదంలో మళ్ళీ మూడు భాగాలు ఉన్నాయి. 'ఉప', 'ని', 'సద్'. అవి బ్రహ్మవిద్య పొందటంవల్ల కలిగే ఫలాన్ని, ఆ ఫలం పొందటానికి కావాల్సిన నియమాలను, ఆ జ్ఞానం పొందే పద్ధతిని సూచిస్తాయి. ఒక్కొక్క భాగాన్ని విడిగా చూద్దాము. ముందు చివరి భాగాన్ని చూద్దాము.

**సద్:–** సంధి విడదీసినప్పుడు షత్తు కాస్తా సద్ అవుతుంది. సద్ అంటే 'నాశనం చేసేది'. దేన్ని నాశనం చేస్తుంది? అది చెప్పలేదు కాని, మనం కలుపుకోవాలి. ఏ జ్ఞానమైనా, అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. అజ్ఞానాన్ని వేదపరిభాషలో **అవిద్య** అంటారు. అందువల్ల బ్రహ్మవిద్య అంటే అజ్ఞానాన్ని నాశనం చేసేది. బ్రహ్మవిద్య పొందితే, బ్రహ్మ అవిద్య నాశనం అవుతుంది.

శాస్త్రం ప్రకారం, సంసారానికి కారణం బ్రహ్మ అవిద్యే. అందువల్ల బ్రహ్మవిద్య సంసారానికి కారణాన్ని నాశనం చేస్తే, సంసారం అనే కార్యం దానంతట అదే నాశనమవుతుంది.

> **బ్రహ్మ అవిద్యా నాశే సంసార కార్యనాశః. సంసారకారణ అవిద్యా నాశే అవిద్యాకార్యభూత సంసారః నాస్తి కారణనాశః కార్యనాశః. హేతునాశః ఫలనాశః. నిమిత్తనాశః నైమిత్తికనాశః.**

అందువల్ల బ్రహ్మవిద్య అజ్ఞానాన్నే కాదు, అజ్ఞానజనిత సంసారాన్ని కూడా నాశనం చేస్తుంది. అజ్ఞానం పోతే జ్ఞానం కలుగుతుంది. సంసారం అంటే దుఃఖంవల్ల కలిగే సమస్యలు. సంసారవిముక్తి కలుగుతుంది అంటే దుఃఖనివృత్తి చేస్తుంది. బ్రహ్మవిద్య రెండు ఫలాలను ఇస్తుంది.

**ప్రత్యక్షఫలమ్:** అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది.

**పరోక్షఫలమ్ :** అజ్ఞానంవల్ల ఏర్పడిన సంసారబంధంనుండి విముక్తి కలిగిస్తుంది.

సద్‌కు ఇంకో అర్థం కూడా ఉంది. అది 'ఒక లక్ష్యానికి తీసుకువెళ్ళటం.' బ్రహ్మవిద్య ఎక్కడికి తీసుకువెళుతుంది?

ఎవరైతే బ్రహ్మ గురించి తెలుసుకుంటారో, వారు జ్ఞానమాత్రంచేతనే బ్రహ్మలో ఐక్యం పొందుతారు. అందువల్ల 'తెలుసుకోవటం' అంటే 'చేరటం'. చేరటం అంటే అక్షరాలా ప్రయాణం చేసి వెళ్ళటంగా తీసుకోకూడదు. బ్రహ్మ ఎక్కడో కైలాసంలోనో, వైకుంఠంలోనో ఉన్నాడు, అక్కడికి వెళ్ళాలి అనుకోకూడదు. బ్రహ్మవిద్య, జీవునికి, పరమాత్మకు మధ్య ఉన్న దూరాన్ని తొలగిస్తుంది. **బ్రహ్మవిత్ ఆప్నోతి పరమ్**

అంతకుముందు అర్థం, అజ్ఞానాన్ని తొలగించటం అయితే, ఈ అర్థం జీవుణ్ణి బ్రహ్మదగ్గరకు తీసుకువెళ్ళటం. బ్రహ్మస్వరూపం ఆనందం. అందువల్ల జీవుణ్ణి బ్రహ్మ దగ్గరకు తీసుకువెళుతుంది అంటే, జీవుణ్ణి ఆనందానికి తీసుకువెళుతుంది. అందువల్ల బ్రహ్మప్రాప్తిని, ఆనందప్రాప్తి అనవచ్చు.

ఇప్పుడు **'సద్'** అంటే రెండు అర్థాలు చూశాము. దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి. ఇప్పుడు రెండూ కలిపితే **'సద్' అంటే దుఃఖాన్ని పారద్రోలి, ఆనందాన్ని తెచ్చే బ్రహ్మవిద్య.**

**'ని' –** జ్ఞానం పొందటానికి అవసరమైన నియమాలు చెబుతుంది. మనం పొందే జ్ఞానం నిశ్చయాత్మక జ్ఞానం. అంటే ఈ జ్ఞానంలో ఇంక సందేహాలు ఉండవు.

మన మనస్సు, బుద్ధి ఒక దానితో ఒకటి పెనవేసుకుని ఉండి, ఒకదాన్నొకటి ప్రభావితం చేస్తాయి. అందుకని, ఒక్కోసారి మన బుద్ధి పదునుగా ఉన్నా, మనస్సులో రాగద్వేషాలు పేరుకునిపోయి, బ్రహ్మజ్ఞానం పొందకుండా అడ్డుపడతాయి. మనస్సులో ఉండే రాగద్వేషాలను, కామక్రోధాలను **విపర్యయ ప్రతిబంధకాలు** అంటారు. అంటే మనలో స్వతహాగా ఉన్న భావాలు, మనం కోరి ఏర్పరచుకున్న మరికొన్ని భావాలు.

కొన్ని వాసనలు పూర్వజన్మనుండి వస్తాయి. అవి చాలవనట్టు మనం మరికొన్ని రాగద్వేషాలను ప్రోగేసుకుంటూ వస్తాము. ఇవన్నీ కలిసి మనస్సును ప్రభావితం చేస్తాయి. వేదాంతజ్ఞానం కలిగేది బుద్ధిలో. సందేహాలు కలిగేది బుద్ధిలో. నిశ్చయాత్మక జ్ఞానం కలిగినా, మనస్సు ప్రశాంతంగా లేకపోతే అది నిలవదు. అందుకే వేదాంతం అర్థమయినా, జీవితంలో కలిగే ఒడిదుడుకులను ఎదుర్కోలేకపోతున్నాము.

జీవులందరూ ఎదుర్కొనే సమస్య ఒక్కటే. వారికి జ్ఞానం లేకపోలేదు. కాని వారిలో మానసిక పరిపక్వత లేదు. కాని వేదాంతం, మానసిక పరిపక్వత గురించి మాట్లాడదు. ఆ పని ధర్మశాస్త్రానిది. ధర్మశాస్త్రం మానవవిలువలు, నైతికసూత్రాలు మొదలైనవి వివరంగా చర్చిస్తుంది. అదే మానసిక ప్రశాంతతను, మానసిక పరిపక్వతను చేకూరుస్తుంది. ఈ విపర్యయప్రతిబంధకం లేకపోతేనే మనస్సు సిద్ధంగా ఉంటుంది.

సందేహాలు కలగని బుద్ధిలో, విపర్యయప్రతిబంధకం లేని మనస్సులో ఏర్పడే జ్ఞానాన్ని 'అప్రతిబంధక జ్ఞానం' అంటారు. విపర్యయభావన పోవాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. అప్పుడు నిశ్చయజ్ఞానం కలుగుతుంది. అందువల్ల **'ని' అంటే నిశ్చయజ్ఞానం.**

**ఉప** – ఉప అంటే ఆత్మజ్ఞానం (బ్రహ్మజ్ఞానం) పొందే పద్ధతి. దానికి ఒకటే మార్గం ఉంది. అది గురువు దగ్గరకు వెళ్ళటం. 'ఉప'సదనం అంటారు దాన్ని. గురువు సమీపానికి వినయంగా, భక్తి ప్రపత్తులతో, శ్రద్ధతో వెళ్ళటాన్ని 'ఉప' సదనం అంటారు. దీన్ని బట్టి బ్రహ్మవిద్య నేర్చుకోవటానికి ఒకటే మార్గం ఉందని, అది సమర్థుడైన గురువు దగ్గరకు వెళ్ళటమే అని తెలుస్తోంది. ఎంతో గొప్ప ఋషులు కూడా, వారి అహంకారాన్ని పక్కకు పెట్టి గురువు దగ్గర శుశ్రూష చేసి, బ్రహ్మవిద్య పొందారని శాస్త్రంలో అనేక సందర్భాలలో వస్తుంది.

నిజానికి నారదుడు ఎంతో ప్రసిద్ధికెక్కిన ఋషి. ఎన్నో నేర్చుకున్న మేధావి. అయన కూడా బ్రహ్మవిద్యకోసం గురువు దగ్గరకు వెళ్ళాడు. గురువు దగ్గరకు వినమ్రంగా వెళ్ళటమే కాదు, బ్రహ్మవిద్యనివ్వమని ప్రత్యేకించి అడగాలి కూడా. **అందుకని 'ఉప' అంటే గురుసమీపం.**

'ఉప' అంటే గురువు, శాస్త్రప్రమాణంద్వారా ప్రాప్తి. 'ని' అంటే నిశ్చయజ్ఞానం. సద్ అంటే ప్రయోజనం. అందువల్ల ఉపనిషత్తు పూర్తి అర్థం సమర్థుడైన ఆచార్యుని దగ్గర శాస్త్రాన్ని నేర్చుకుంటే ఆ బోధ దుఃఖాన్ని పారద్రోలి, ఆనందానిచ్చే నిశ్చయజ్ఞానాన్ని యిస్తుంది. అన్నీ కలిపి ఒక్కముక్కలో చెప్పాలంటే **బ్రహ్మవిద్య.** ఇది ప్రాథమిక అర్థం.

మామూలుగా మనకు ఉన్న తక్కిన ప్రమాణాలకు అందని విద్య ఇది. ఇది శబ్దప్రమాణంవల్లనే లభ్యమవుతుంది. ఆ శబ్దప్రమాణం **శాస్త్రం.** దానిద్వారా లభ్యమయ్యే బ్రహ్మవిద్య **ప్రమా.**

ఉపనిషత్తు పదాలను కూడా ఉపనిషత్తు అనే అంటారు. ఉపనిషత్తుకు రెండు అర్థాలు ఉన్నాయి. ప్రాథమిక అర్థం బుద్ధిలో కలిగే నిశ్చయజ్ఞానం. రెండో అర్థం శబ్దప్రమాణం. అంటే ఉపనిషత్తుకు ప్రమా ప్రాథమిక అర్థం, ప్రమాణం రెండో అర్థం. ఇంకో మాటలో చెప్పాలంటే జ్ఞానం ప్రాథమిక అర్థం,పుస్తకం ద్వితీయ అర్థం.

పుస్తకాన్నే ప్రాథమిక అర్థంగా ఎందుకు తీసుకోకూడదు? దానికి తిరిగి ప్రశ్నించాలి. సంసారాన్ని ఏది నాశనం చేస్తుంది? పుస్తకమా, పుస్తకంనుంచి పొందిన జ్ఞానమా? పుస్తకాలు లేదా మంత్రాలు నాశనం చేయలేవని మనకు తెలుసు. అలా మంత్రాలే నాశనం చేసేటట్టయితే, అర్థం నేర్చుకోవాల్సిన పనిలేదు. కేవలం పారాయణం చేసి మోక్షం పొందవచ్చు.కాని అలా జరుగదు.

అందువల్ల ఒక విషయం స్పష్టమవుతోంది. ఉపనిషత్తు మంత్రాలు రెండో అర్థం, ఉపనిషత్తుద్వారా పొందే జ్ఞానం ప్రాథమిక అర్థం. వృత్తిజ్ఞానం ముఖ్య అర్థం.

## బృహదారణ్యక ఉపనిషత్తు- ఒక విహంగ వీక్షణం

బృహదారణ్యక ఉపనిషత్తు శుక్లయజుర్వేదానికి చెందినది. యజుర్వేదానికి రెండు విభాగాలు ఉన్నాయి. కృష్ణయజుర్వేదం, శుక్లయజుర్వేదం. ప్రతివేదంలోనూ అనేక శాఖలు ఉన్నాయి.

కృష్ణయజుర్వేదం – తైత్తిరీయశాఖ, కఠశాఖ.

శుక్లయజుర్వేదం – కాణ్వశాఖ, మాధ్యందినశాఖ

మామూలుగా భిన్నశాఖల్లో, భిన్నమంత్రాలు ఉంటాయి. ఉదాహరణకు తైత్తిరీయ ఉపనిషత్తు తైత్తిరీయ శాఖకు చెందింది. కాని ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే బృహదారణ్యక ఉపనిషత్తు అటు కాణ్వశాఖలోను, ఇటు మాధ్యందిన శాఖలో కూడా వస్తుంది. రెండు శాఖల్లోనూ, అక్కడక్కడ కొన్ని భేదాలు మినహా, ఇంచుమించుగా రెండూ ఒకటే. మనం చూసే బృహదారణ్యక ఉపనిత్తు శుక్లయజుర్వేదానికి చెందిన కాణ్వశాఖ లోనిది.

బృహదారణ్యక ఉపనిషత్తులో మూడు భాగాలు ఉన్నాయి. వాటిని కాండములు అంటారు. మధుకాండము, మునికాండము లేదా యాజ్ఞవల్క్యకాండము, ఖిలకాండము.

**మధుకాండము:–** మధుకాండములో ప్రాథమిక బోధ ఉపదేశం లేదా బ్రహ్మజ్ఞానం. అందుకని ఉపదేశకాండము అని కూడా అంటారు.

ఈ జగత్తులో ప్రతిదానికీ, ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటుంది. ఈ జగత్తులోని పంచభూతాలు, సూర్యచంద్రులు, మనుష్యులు మొదలైనవి ఒకరిమీద ఒకరు ఆధారపడి ఉన్నారు. ఉపనిషత్తు ఈ ఆధార ఆధేయ సంబంధాన్ని వివరంగా విశ్లేషించింది. దీన్ని **ఉపకార్య ఉపకారక భావం** అంటారు. ఈ భావానికి మధువు అనే సాంకేతి పదం వాడటం జరిగింది. ఒకచోట ఈ సంబంధాన్ని మధువు పదంతో వాడి, దానిద్వారా ఈ ఉపకార్య ఉపకారక జగత్తుకు అధిష్ఠానం బ్రహ్మ అని చూపిస్తుంది. అందుకని దీన్ని మధుకాండం అని అంటారు.

**మునికాండము:** ఈ కాండములో, అంతకుముందు కాండములో చేసిన బోధలను తార్కికంగా బలపరచటం జరుగుతుంది. ఈ తార్కికవాదనను ఉపపత్తి అంటారు. మొదటి కాండమును శ్రవణంతో పోలిస్తే, రెండో కాండమును మననంతో పోల్చవచ్చు.

దాన్ని యాజ్ఞవల్క్యకాండము అని కూడా అంటారు. ఎందుకంటే ఈ కాండము అంతటా యాజ్ఞవల్క్య గురువు, అనేకమంది శిష్యులు వస్తూ పోతూ ఉంటారు కాని, గురువు మాత్రం యాజ్ఞవల్క్యుడే. యాజ్ఞవల్క్యకు ఈ ఒక్క కాండాన్నే కాదు, మొత్తం శుక్లయజుర్వేదాన్ని ఆపాదిస్తారు.

యాజ్ఞవల్క్య మహర్షికి ఇంకో పేరు వాజసనేయుడు. యాజ్ఞవల్క్యుడు చేసిన బోధను వాజసనేయి అంటారు. ఈ పేరు ఎందుకు వచ్చిందంటే, ఆయన గురువు సూర్యభగవానుడు. సూర్యునికి ఇంకోపేరు వాజసని. వాజం అంటే అన్నం. సనిః అంటే ఇచ్చేవాడు. సూర్యుడే మనకు అన్నం, శక్తిని ఇస్తాడు కాబట్టి వాజసని అయ్యాడు. అందువల్ల వాజసని శిష్యుడు వాజసనేయః, వాజసనేయ చేసిన బోధ వాజసనేయి. అందువల్ల మొత్తం శుక్లయజుర్వేదాన్ని తరచు వాజసనేయసంహిత అంటారు. అంత ముఖ్యమైన వాజసనేయః యాజ్ఞవల్క్యుడు రెండవ కాండంలో ముఖ్యగురువు కాబట్టి దీన్ని యాజ్ఞవల్క్యకాండము లేదా మునికాండము అని అంటారు.

**ఖిలకాండము:** ఈ భాగంలో అనేక రకాలైన ఉపాసనలు, కర్మలు వస్తాయి. దీన్ని ఖిలకాండము అని ఎందుకంటారంటే, ఖిలము అంటే అనేక అంశాల కూర్పు. అనేక ఉపాసనలను ఇక్కడ ఏర్చి కూర్చారు. అవి కలగూర గంపలా ఉంటాయి. ఒక క్రమపద్ధతిలో పేర్చుకురావటం ఉండదు. వేదాల్లో ఇలాంటి ఖిలకాండాలు కనిపిస్తూ ఉంటాయి. దీన్ని **అనుబంధం** అని కూడా అంటారు.

ఒక్కో కాండంలో మళ్ళీ రెండేసి అధ్యాయాలు ఉన్నాయి. అలా బృహదారణ్యక ఉపనిషత్తులో మొత్తం ఆరు అధ్యాయాలు ఉన్నాయి. ప్రతి అధ్యాయములో కొన్ని ఖండాలున్నాయి. వాటిని బ్రాహ్మణములు అంటారు.

బృహదారణ్యక ఉపనిషత్తులో అనేక ఉపాసనలు ఉన్నా కూడా, వేదాంతబోధ కూడా అధికంగానే ఉంది. తక్కిన ఉపనిషత్తుల్లాంటి ముండక, కేన, కఠ, తైత్తిరీయంవంటి వాటిలో చెప్పబడిన ముఖ్యమైన అంశాలూ, ముఖ్యమైన భావాలూ అన్నీ ఈ బృహదారణ్యక ఉపనిషత్తులో వస్తాయి. వాటిల్లో వచ్చిన బోధ అంతా ఇందులో రావటమే కాదు, వాటిల్లో వేటిల్లోనూ కనపడని అనేక బోధలు కూడా ఇందులో చూస్తాము. ఇది ఒక సంపూర్ణ, సమగ్రగ్రంథము. ఈ భావాలు ఎక్కడివి అని ఎవరైనా అడిగితే, మీరు నిశ్చింతగా బృహదారణ్యక ఉపనిషత్తులోనివి అని చెప్పవచ్చు.

ఈ ఉపనిషత్తు పేరు బృహదారణ్యకమ్. ఇందులో రెండు పదాలు ఉన్నాయి. బృహత్, ఆరణ్యకమ్. బృహత్ అంటే చాలా పెద్దది. ఇది రెండు రకాలుగా పెద్దది. పరిమాణంలో పెద్దది. నాణ్యతలో కూడా పెద్దది. ఏ ఉపనిషత్తులోనూ దొరకనివి కూడా ఇక్కడ దొరుకుతాయని చూశాము కదా. అందుకని ఇది ఒక బృహత్‌కార్యం అయింది. వేదాంతాన్ని పూర్తిగా కాచి వడబోసింది ఈ ఉపనిషత్తు.

ఆరణ్యకం అంటే సాధారణంగా దీన్ని అరణ్యంలో చదువుతారు. అంటే అన్నీ సన్యసించి, సన్యాసాశ్రమం స్వీకరించాక చదువుతారు కాబట్టి ఆరణ్యకం అని పేరు వచ్చింది. దీన్ని వానప్రస్థాశ్రమంలో కూడా చదువుతారు.

మామూలుగా వేదాలలోని కర్మకాండభాగాలు గృహస్థాశ్రమానికి చెందినవి. ఆరణ్యకభాగం వానప్రస్థ ఆశ్రమానికి చెందినది; ఆరణ్యక భాగం తర్వాత వచ్చే ఉపనిషత్తు భాగం సన్యాసాశ్రమానికి చెందినది. ఆ విధంగా కర్మ, ఉపాసన, జ్ఞానాలను వరుసగా గృహస్థాశ్రమం, వానప్రస్థం, సన్యాసాశ్రమాలలో పాటిస్తారు. దీని ఉద్దేశం ఏమిటంటే, కర్మకాండలోని ఉపాసనకాండకు వచ్చేసరికి, ఒక గృహస్థు తన ప్రాపంచిక లక్ష్యమైన అర్థ కామాలను తీర్చుకుని, తనకు విధించబడిన యజ్ఞయాగాదులను సక్రమంగా నిర్వర్తించి, చిత్తశుద్ధి పొందుతాడని. ఉపాసన కాండలో కొన్ని ఉపాసనలు చేసి చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యం పొందుతాడు. అప్పుడు జ్ఞానకాండకు రావటానికి అధికారి అవుతాడు.

సుమారు 50 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి కావలసిన మానసిక పరిపక్వత, సూక్ష్మబుద్ధి వస్తాయని, అది వేదాంతబోధకు అనువైన సమయమనీ లెక్క. మానసిక పరిపక్వత అంటే వైరాగ్యం పెంపొందించుకోవటం.

అందువల్ల సన్యాసాశ్రమం అంటే నిజంగా సన్యాసం స్వీకరించనవసరం లేదు. గృహస్థుగా ఉంటూనే ఆంతర సన్యాసం స్వీకరించవచ్చు. గృహస్థుగానే ఉండి మానసిక పరిపక్వత పొంది, ప్రాపంచిక చింతలు, అనుబంధాలమీద వివేకవైరాగ్యాలను పెంచుకుంటే చాలు. అందుకని సన్యాసాశ్రమాన్ని ఆరణ్యక స్థితితో పోల్చారు. వారు సమాజంతో అనుబంధం తగ్గించుకుంటారు. అప్పుడే వేదాంతజ్ఞానాన్ని పొందగలరు.

అందువల్ల సన్యాసి అంటే గృహస్థసన్యాసి కూడా కావచ్చు. అరణ్యంలో ఉండవచ్చు లేదా గృహంలోనే ఉండవచ్చు. ఒకపక్క ప్రాపంచిక వ్యవహారాలమీద వైరాగ్యం పెంచుకుని, రాగద్వేషాలకు అతీతంగా ఉండటం, ఇంకోపక్క పూర్ణత్వం లేదా ఆనందం అనుభవించటం సన్యాసియొక్క నిర్వచనం అంటుంది ఉపనిషత్తు.

**శంకరభాష్యం** – మనం ఉపనిషత్తులోకి వెళ్ళేముందు శంకరభాష్యం గురించి కూడా తెలుసుకోవాలి. ఈ ఉపనిషత్తుకు ఎన్నో భాష్యాలు ఉన్నా కూడా, అన్నిటికన్నా ప్రఖ్యాతి చెందింది శంకరభాష్యం. శంకరాచార్యులవారు రాసిన తక్కిన భాష్యాలలో కూడా బృహదారణ్యక భాష్యం మరీ గొప్పది. తక్కిన ఉపనిషత్తుల్లోనూ, ఈ ఉపనిషత్తులో కూడా అనేక భావాలు వచ్చాయని ఇంతకు ముందు చూశాము. ఆ భావాలకు తక్కిన ఉపనిషత్తుల్లోని విశ్లేషణకన్నా బృహదారణ్యక ఉపనిషత్తులో ఇచ్చిన విశ్లేషణ మరింత వివరంగా ఉంది. అందువల్ల ఇది గొప్పది. అందువల్ల ఇది శంకరాచార్యులవారికి కూడా చాలా ఇష్టమైన ఉపనిషత్తు అని చెప్పవచ్చు.

చూడటానికి ఛాందోగ్య ఉపనిషత్తు, బృహదారణ్యక ఉపనిషత్తు పరిమాణంలో ఒక్కటే అయినా, ఛాందోగ్య ఉపనిషత్తు కన్నా, బృహదారణ్యక ఉపనిషత్తు భాష్యం ఇంకా పెద్దది.

**బృహద్ వార్తికం** – ఆదిశంకరాచార్యుల భాష్యంమీద అనేక ఉపభాష్యాలు వచ్చాయి. వాటిల్లో పేరున్నది సురేశ్వరాచార్యులది. దాన్ని బృహదారణ్యక ఉపనిషద్ భాష్యవార్తికం అంటారు. దీన్నే టూకీగా **'బృహద్ వార్తికం'** అని కూడా అంటారు. వార్తికం, భాష్యం వీటి మధ్య చిన్న భేదం ఉంది.

ఉపనిషత్తు సూత్రం రూపంలో ఉంటుంది. అంటే చిన్న వాక్యాలుగా ఉండి, ఎంతో గూడార్థంతో ఉంటాయి. ఈ సూత్రాలను భాష్యకారుడు, ఉపనిషత్తు ఉన్న వరుసక్రమంలో విశ్లేషిస్తూ వస్తాడు. భాష్యకారుడు తన వివరణలో తను కొన్ని పదాలను, వాక్యాలను ప్రవేశపెట్టవచ్చు. అవి సగటు మనిషికి అర్థం కాకపోవచ్చు. అందుకని భాష్యకారుడే తను వాడిన వాక్యాలకు విశ్లేషణ ఇవ్వాలి. ఉపనిషత్తుమీద ఆదిశంకరాచార్యులవారు చేసిన విశ్లేషణను శంకరభాష్యం అంటారు. అందులో ఉపనిషత్తుమీద చాలా వివరంగా విశ్లేషణ ఉంటుంది.

ఈ శంకరభాష్యంమీద సురేశ్వరాచార్యులు విశ్లేషణ చేశారు. దాన్ని వార్తికం అంటారు. వార్తికం సాధారణంగా పద్యరూపంలో ఉంటుంది. వార్తికంలో పద్యరూపంలో భాష్యాన్ని కాని, ఉపనిషత్తుని కాని లోతుగా విశ్లేషిస్తారు.

సురేశ్వరాచార్యులవారి వార్తికంలో మూడు భాగాలు ఉంటాయి.

1. భాష్యం చెప్పినవన్నీ ఇది చర్చిస్తుంది.
2. భాష్యంలో ఉపనిషత్తులోని విషయాలు ఏమైనా చర్చించకుండా వదిలేస్తే వాటిని కూడా విశ్లేషిస్తుంది.
3. విశ్లేషించేటప్పుడు విమర్శనాత్మకంగా ఉండాలి. భాష్యంలో ఎక్కడన్నా గురువు చెప్పిన దానిలో వేరే అర్థం స్ఫురిస్తోంది అనుకుంటే, ఆ విషయం చెప్పి, విశ్లేషణను విపులీకరించి, సంస్కరించి, సమర్థించుకుంటూ కారణాలను చెప్పాలి. అలా సురేశ్వరాచార్యులు కొన్నిచోట్ల ఆదిశంకరాచార్యులవారి భాష్యంతో ఏకీభవించలేదు కాని, గురువును ప్రత్యక్షంగా విమర్శించలేదు. కొన్నిచోట్ల ఈ అర్థం బాగుంటుంది అని చెప్పారు.

సురేశ్వరాచార్యులు దీనికే కాక మరికొన్ని వార్తికాలు వ్రాశారు – తైత్తిరీయ ఉపనిషద్ భాష్యవార్తికం, దక్షిణామూర్తి శ్లోకవార్తికం. అందుకని ఈయనను **వార్తికకారుడు** అని కూడా అంటారు.

**వార్తిక సంగ్రహసారం** – సురేశ్వరాచార్యుని వార్తికంమీద అనేకమంది వ్యాఖ్యానాలు రాశారు. అందులో ప్రముఖులు విద్యారణ్యులవారు.

బృహదారణ్యక ఉపనిషత్తే భగవానుని బృహత్కార్యం. దానిమీద శంకరులవారి భాష్యం ఇంకా పెద్దది. దానిమీద సురేశ్వరాచార్యుల వార్తికం మరింత పెద్దది. దానిమీద వార్తిక సంగ్రహ సారాలు మరీ మరీ పెద్దవి. అంత అరణ్యంలాంటి బృహద్ ఉపనిషత్తు బృహదారణ్యకం.

# సంబంధ భాష్యం

ఆదిశంకరాచార్యులు బృహదారణ్యక ఉపనిషత్తుకు ఉపోద్ఘాతం వ్రాశారు. దాన్ని **సంబంధ భాష్యం** అంటారు. ఈ సంబంధ భాష్యంలో విషయం వేదాల్లోని కర్మకాండకూ, జ్ఞానకాండకూ మధ్య ఉన్న అనుబంధం. కర్మకాండ, జ్ఞానకాండల మధ్యన ఉన్న అనుబంధంమీద చాలా వాదోపవాదాలు ఉన్నాయి. అందుకని, ఈ విషయాన్ని ఆదిశంకరాచార్యులవారు వివరంగా చర్చించారు. ఇందులో మూడు ముఖ్య అంశాలను చర్చించారు.

**1. కర్మకాండ కూడా ప్రమాణమే–** ఉపనిషత్తులోని జ్ఞానకాండ ఎంత ప్రమాణమో, వేదాల్లోని కర్మకాండ కూడా అంత ప్రమాణం. అంటే, ఉపనిషత్తు మాత్రమే ప్రమాణం, దాన్ని స్వీకరించి, కర్మకాండలో యజ్ఞాలు మాత్రమే ఉన్నాయని దాన్ని తిరస్కరించకూడదు. వేదం మొత్తాన్ని ప్రమాణంగా తీసుకోవాలి. అంతేకాని వేదంలోని ఒక భాగాన్ని ప్రమాణంగా, మరో భాగాన్ని అప్రమాణంగా భావించకూడదు.

వేదాల్లో రెండు రకాల వాక్యాలు ఉంటాయి. కార్యబోధక వాక్యాలు, సిద్ధబోధక వాక్యాలు.

**కార్యబోధక వాక్యాలు** – యజ్ఞాలు చేయమని నిర్దేశించే వాక్యాలు. ఆ యజ్ఞాలు చేస్తే వచ్చే ఫలితాలను కూడా చెబుతుంది.

**సిద్ధబోధక వాక్యాలు** – అవి కార్యాన్ని సూచించవు. కొన్ని నిజాలను చెప్తాయి. ఉదాహరణకు 'తత్ త్వమ్ అసి' ఒక సిద్ధబోధక వాక్యం.

ఇప్పుడు వీటిమీద ముందు పూర్వమీమాంసకుల వాదన చూద్దాము. పూర్వమీమాంసకులు అంటే వేదపూర్వభాగాన్ని(కర్మకాండాన్ని) ఆధారం చేసుకుని, చర్చించేవారు. ఆదిశంకరాచార్యులవారూ, మనమూ ఉత్తరమీమాంసకుల క్రిందకు వస్తాము. వేద అంతభాగాన్ని (జ్ఞానకాండాన్ని) ఆధారం చేసుకుని చర్చిస్తాము.

**పూర్వమీమాంస వాదన** – పూర్వమీమాంసకులు వేదం ప్రాథమికంగా కర్మను బోధిస్తుందంటారు. అది కర్మను చేయండి, ఈ ఫలాలను పొందండి అంటుంది. అందువల్ల వారి వాదన వేదం **కార్య ప్రధానం. విధి ప్రమాణం.** అందువల్ల వేదం ఎక్కడికక్కడ ఏదో ఒక కర్మను సూచిస్తుంది. అది చేయకపోతే వచ్చే పాపాన్ని సూచిస్తుంది అంటారు.

అలా కర్మను సూచించకుండా, జ్ఞానసిద్ధాంతాలను చెప్పే వాక్యాలు – వారి ఉద్దేశంలో అనవసరం. అవి **అప్రమాణం, అర్థవాదం.** అందువల్ల కర్మను చేయమని ప్రబోధించే వాక్యాలే ముఖ్యం. నిజానికి వారి పూర్వమీమాంసలో దీనిమీద ఒక సూత్రం కూడా ఉంది. వేదం మొత్తం జీవులందరినీ కర్మ చేయమని నిర్దేశిస్తుంది. ఎక్కడైనా అలా నిర్దేశించకపోతే, దాన్ని పట్టించుకోవద్దు.

అందువల్ల, వారి ఉద్దేశంలో 'తత్ త్వమ్ అసి' ముఖ్యమైన వాక్యం కాదు. ఎందుకు? అది ఏమీ కర్మ చేయమని నిర్దేశించదు కదా! కర్మ చేయకపోతే, ఆ వాక్యానికి ఏమీ ప్రాముఖ్యత లేదు.

**ఉత్తర మీమాంస** – శంకరాచార్యులు తన ఉపోద్ఘాతంలో ఈ వాదనను ఖండిస్తారు. వేదాలు చెప్పిన వాక్యాలను కార్య ప్రధానం కాదు అని తీసివేయలేము. వేదాలు చెప్పే నిజాలు చాలా ముఖ్యమైనవి. అందువల్ల వేదవాక్యం **కార్యప్రధానమే.**

ఉదాహరణకు, ఈ వంటకం బాగుంది అంటే దాని అర్థం, నాకింకొంచెం కావాలి అని. అలాగే కార్యక్రమం బాగుంది అంటే దాని అర్థం మీరు నాతో ఈ కార్యక్రమానికి రండి అని చెప్పడం. ఇటువంటి వాక్యాలను సిద్ధబోధక వాక్యాలు అంటారని చూశాము. ఇవి కూడా ప్రమాణమే అంటారు ఆదిశంకరాచార్యులు. ఎలా? దీనికి ఆయన ఒక ఉదాహరణ ఇస్తారు.

మరణం తర్వాత జీవాత్మ ఉంటుంది అనేది ఒక సత్యం. అది వేదాల్లోని కర్మకాండలోనే తెలుస్తుంది. కర్మకాండలో మరణం తర్వాత జీవాత్మ స్వర్గలోకానికి వెళ్ళటానికి కొన్ని యజ్ఞాలను నిర్దేశిస్తుంది. అంటే దీని అర్థం ఏమిటి? నేను కొన్ని యజ్ఞాలు చేస్తే మరణం తర్వాత స్వర్గలోకానికి వెళ్తాను అని. మరణం తర్వాత స్వర్గలోకానికి వెళతాను అంటే మరణం తర్వాత నేను బ్రతికే ఉంటాననే కదా అర్థం? అంటే జీవాత్మకు మరణంతో ముగింపు లేదు.

**దేహవ్యతిరిక్తజీవః అస్తి**

ఇది ఒక సిద్ధ బోధకవాక్యం. దీన్ని మీరు అంగీకరిస్తారా లేదా అంటారు ఆదిశంకరాచార్య పూర్వమీమాంసకులను. ఎటు చెప్పినా అవస్థే. అవును, అంగీకరిస్తాను అని వారు చెప్పారనుకోండి, అప్పుడేమవుతుంది? అప్పుడు వేదం కార్యబోధక వాక్యాలు మాత్రమే కాదు, సిద్ధబోధక వాక్యాలను కూడా చెబుతుందని అంగీకరించక తప్పదు. సిద్ధబోధక వాక్యాలు కార్యాన్ని సూచించవు. అయినా ఇలాంటి వాక్యాలకు కూడా వేదం ప్రమాణం అని ఒప్పుకోక తప్పదు.

లేదు, మేము ఈ సిద్ధబోధక వాక్యాలను ఒప్పుకోము అని గనుక వారు అంటే అప్పుడూ కష్టమే. మరణం తర్వాత జీవి లేకపోతే, మరణం తర్వాత స్వర్గలోకానికి వెళ్ళటానికి చేసే యజ్ఞాలు అవస్థపడి చేయటం ఎందుకు? ఆ విధంగా వారి వాదనలోని లోపాన్ని ఎత్తిచూపి, కర్మకాండ కూడా సిద్ధబోధక వాక్యాలను చెబుతుందని నిరూపించారు.

కాని ఇక్కడ ఒక చిన్న పక్కదారి పట్టింది వాదన. పూర్వమీమాంసకులు మళ్ళీ చిన్న వాదన లేవదీస్తారు. నిజమే, మరణం తర్వాత జీవుడు ఉన్నాడు. కాని అది వేదం చెప్పదు. ఈ సమాచారాన్ని తార్కికంగా తెలుసుకోవచ్చు. మరణం తర్వాత జీవాత్మ ఉంటుందని తార్కికంగా తెలిసినప్పుడు, వేదప్రమాణం అవసరం లేదు.

ఆదిశంకరాచార్యులవారు ఈ తర్కాన్ని తర్కంతోనే పడగొడతారు. మరణం తర్వాత జీవాత్మ ఉంటుందని తార్కికంగా నిరూపించలేము. పూర్వజన్మ, వచ్చే జన్మల గురించి వైజ్ఞానపరంగా గానీ, తర్క ప్రధానంగా గానీ నిరూపించలేము అంటారు శంకరాచార్యులు. అంటే వేదప్రమాణం తార్కికమా? వేదప్రమాణం తార్కికమూ కాదు, అతార్కికమూ కాదు. ఇది తర్కానికి అందని విషయం. అందుకే వేదాలను అపౌరుషేయం అంటాము.

తర్కానికి అందని విషయమైతే, మనం శాస్త్రంలో ఎందుకు తరచు తర్కం వాడుతాము? తర్కం రెండు రకాలు. వేదంమీద ఆధారపడి చేసే తర్కం ఒకటైతే, వేదానికి సంబంధం లేకుండా చేసే తర్కం ఇంకోటి.వేదానికి సంబంధం లేకుండా చేసే తర్కం నిలవదు. వేదంమీద ఆధారపడి చేసే తర్కమే నిలుస్తుంది. దాన్ని **సంభావనయుక్తి** అంటారు. పునర్జన్మ గురించిన తర్కం ఈ సంభావనయుక్తి కిందకు వస్తుంది.

**2. కర్మకాండ మోక్ష సాధనం కాదు** – కర్మకాండ మోక్షాన్ని ఇవ్వలేదు. ఇక్కడ తర్కాన్ని ఉపయోగించటం లేదు శంకరాచార్యులవారు. బృహదారణ్యక ఉపనిషత్తులోంచే కొన్ని వాక్యాలు తీసుకుని తను చెప్పే విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నారు. ఇదీ ఆయన ప్రత్యేకత.

కర్మకాండలో పొందగలిగే అత్యున్నత స్థానం బ్రహ్మలోకం. కాని బృహదారణ్యక ఉపనిషత్తులో ఆ బ్రహ్మలోకం కూడా సంసారంలోకే వస్తుందని నిరూపించే మంత్రాలు ఉన్నాయి. అందుకని కర్మకాండ మోక్షసాధనం కాదు.

తార్కికంగా కూడా నిరూపించవచ్చు.కర్మకు పరిమితులు ఉన్నాయి. పరిమితులు ఉన్న కర్మ చేస్తే వచ్చే ఫలం కూడా పరిమితంగానే ఉంటుంది కదా! అందువల్ల అపరిమితమైన మోక్షం పరిమితమైన కర్మలతో రాదు.

**3. కర్మకాండ మోక్షానికి అధికారిని చేస్తుంది** – కర్మకాండ మోక్షాన్నివ్వదు అనగానే, కర్మకాండ లాభం లేదు, దాన్ని చేయనక్కరలేదు అని దాని అర్థం కాదు. కర్మకాండ చిత్తశుద్ధిని ఇస్తే, ఉపాసనకాండ చిత్త ఏకాగ్రతనిస్తుంది. కర్మకాండ అంటే ఉపాసన కాండను కూడా కలుపుకోవాలి. కర్మకాండ సాక్షాత్తూ జ్ఞానాన్ని ఇవ్వదు కాని జ్ఞానం పొందటానికి యోగ్యతనిస్తుంది.

అందువల్ల కర్మకాండ, జ్ఞానకాండల మధ్య ఉన్న సంబంధాన్ని **ఉపాయ ఉపేయ సంబంధం** అంటారు. ఉపాయం అంటే మార్గం; ఉపేయం అంటే గమనం. దీన్నే సాధన సాధ్యం అని కూడా అంటారు.

### జ్ఞానకాండ జ్ఞానాన్ని ఇస్తుంది, కర్మకాండ జ్ఞానయోగ్యతను ఇస్తుంది

అలాగే జ్ఞానకాండకూ, మోక్షానికీ మధ్య కూడా సాధన సాధ్య సంబంధం లేదా ఉపాయ ఉపేయ సంబంధం ఉంది. కర్మకాండ, జ్ఞానకాండలు తీసుకుంటే కర్మకాండ మార్గం, జ్ఞానకాండ గమ్యం అన్నాము. ఇప్పుడు జ్ఞానకాండ, మోక్షం తీసుకుంటే జ్ఞానకాండ మార్గం; మోక్షం గమ్యం అవుతుంది. అందువల్ల కర్మకూ, మోక్షానికీ మధ్య సాక్షాత్తూ సంబంధం లేదు. పరంపర సంబంధం ఉంది.

కర్మకాండకు ఒక మంచి లక్షణమూ ఉంది. ఒక చెడు లక్షణమూ ఉంది. కర్మకాండ జ్ఞానకాండ గుమ్మందాకా తీసుకువచ్చి వదులుతుంది. దాని తర్వాత దానికి పనిలేదు. అందువల్ల కర్మకాండకు ఎంత మేరకు విలువనివ్వాలో అంతమేరకు విలువనివ్వాలి. దాన్ని అనవసరమని పూర్తిగా తీసివేయకూడదు. అలాగని పూర్తిగా కర్మకాండ దగ్గరే ఆగిపోకూడదు.

### కర్మకాండ లేనిదే జ్ఞానకాండ అసంభవం,జ్ఞానకాండకు రానిదే కర్మకాండ అసంపూర్ణం

జ్ఞానకాండలోకి అడుగుపెట్టటానికి ద్వారందాకా తీసుకువస్తుంది కాబట్టి అది ముఖ్యమే. కాని కర్మకాండలోనే ఆగిపోకూడదు. దాని పరిమితులు దానికి ఉన్నాయి.

కర్మకాండ మనను నది ఆవలి తీరానికి చేర్చే పడవవంటిది. ఆవలితీరానికి వెళ్ళటానికి, నది దాటాలంటే, పడవ ఎక్కాలి. పడవ ఎక్కాక, గమ్యం చేరాక, పడవను వదిలేయాలి. ఉపాయాన్ని ఎంతవరకు వాడాలో అంతవరకూ వాడాలి. ఇక్కడ ఉపాయం కర్మకాండ. ఈ విషయంలో రెండు విపరీత వాదనలు ఉన్నాయి. ఆవలి తీరానికి చేరాక పడవ వదిలేసేటట్టయితే, అసలు పడవ ఎక్కటం ఎందుకు? ఇది ఒక వాదన. అంతదూరం నన్ను భద్రంగా చేర్చిన పడవను వదలేయటం ఎలా? ఇది ఇంకో వాదన. ఈ ఇద్దరూ ఎన్నటికీ గమ్యం చేరలేరు.

అందువల్ల కర్మకాండ గురించిన సరియైన అవగాహన ఉండాలి. లేకపోతే వలలో చిక్కుకుపోతారు. పడవ ఎక్కకపోతే గమ్యం చేరలేరు. పడవ ఎక్కినా పడవ వదలకపోతే, ఒడ్డుకు చేరినా, చేరకపోయినా ఒకటే. అంటే రెండు వాదనలూ తప్పే. పడవ ఎక్కటం ఎందుకు అనే వాదనలో కర్మకాండమీద ద్వేషం పెంచుకుని, కర్మకాండను విమర్శిస్తున్నారు. పడవ నన్ను ఒడ్డుకు చేర్చింది కాబట్టి దిగను అనే వాదనలో కర్మకాండమీద రాగం పెంచుకుని కర్మకాండను పట్టుకుని కూర్చుంటున్నారు.

కర్మకాండమీద రాగం ఉన్నవారు కర్మకాండ స్తుతి వచ్చినప్పుడల్లా ఆనందిస్తారు. అదే శాస్త్రంలో కర్మకాండమీద విమర్శ వస్తే తట్టుకోలేరు.

ద్వేషం ఉన్నవారి పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. కర్మకాండ పరిమితులను ఎత్తి చూపినప్పుడల్లా, ఆనందిస్తారు. అదే కర్మకాండను స్తుతిస్తూ కర్మకాండవల్ల చిత్తశుద్ధి ఏర్పడుతుందంటే ఆ భాగం వినటానికి ఇష్టపడరు. అందుకని కర్మకాండమీద రాగమూ పెంచుకోకూడదు, ద్వేషమూ పెంచుకోకూడదు.

ఈ రాగద్వేషాలు పెంచుకున్నవారు ఇక్కడితో ఆగరు. వారు తాము అనుకున్నదే సత్యం, తక్కినవారు చేసేది తప్పు, అందువల్ల తామే ఎక్కువ అనే గర్వంతో విర్రవీగుతూ ఉంటారు. కర్మకాండమీద రాగం ఉన్నవారు, యజ్ఞాలు చేయని వారిని చిన్నచూపు చూస్తారు. కర్మకాండ చిత్తశుద్ధిని ఇస్తుందని నమ్ముతారు కాబట్టి, తక్కిన వారికన్నా వీరు గొప్ప అనుకుంటారు. కర్మకాండమీద ద్వేషం ఉన్నవారు, వారు కూడా తక్కినవారిని చిన్నచూపు చూస్తారు. పూజలవీ చేసేవారికన్నా, జ్ఞానమార్గంలో ఉన్న తామే గొప్పవారము అనుకుంటారు.

అలా ఒకరినొకరు చిన్నచూపు చూసుకున్నా ఫర్వాలేదు, కాని అంతకన్నా దారుణంగా ప్రవర్తిస్తారు. ఒకరినొకరు వారి మార్గాలకు మార్చటానికి ప్రయత్నిస్తారు. పూజలు, యజ్ఞాలే చేయాలి, మీరు కూడా అవి చేయండి అని ఒకరంటే, అవి చేస్తే మోక్షం పొందరు అవి చేయకండి, దీనికి రండి అని ఇంకొకరు అంటారు.

అందువల్ల రాగద్వేషాలు (కర్మకాండమీద) ఉండకూడదు; తక్కినవారిని విమర్శించకూడదు; మీ మార్గంలోకి మళ్ళించటానికి ప్రయత్నించకూడదు. ఒక్కొక్కరికి ఒక్కొక్కటి సరిపోతుంది. ఒకరికి కర్మకాండ సరిపోతే, ఇంకొకరికి జ్ఞానకాండ సరిపోతుంది. అడగందే బలవంతపెట్టవద్దు. ఎవరైనా సలహా అడిగితేనే ఇవ్వండి. మీ మటుకు మీరు కర్మకాండ పరిమితులు తెలుసుకోండి. కర్మకాండమీద రాగద్వేషాలు మానుకోండి. చిత్తశుద్ధి ఏర్పరచుకుని జ్ఞానకాండకు రండి.

కర్మకాండ అంటే యజ్ఞాలు మాత్రమే కాదు. కర్మకాండలో యజ్ఞాలు ఒక భాగం. యజ్ఞాలే కర్మకాండ అయితే తక్కిన వర్ణాల వారి పరిస్థితి ఏమిటి? అందువల్ల కర్మకాండ అంటే **స్వధర్మ అనుష్ఠానం** అని తెలుసుకోండి. బ్రాహ్మణునికి అది ఒక యజ్ఞం. క్షత్రియునికి, వైశ్యునికి ధర్మం. ఈశ్వర ప్రసాదబుద్ధి ఉండాలి.

మనకు ఎన్నో రకాల పూజలు, యజ్ఞాలు ఉన్నాయి. కర్మ అంటే రుద్రాభిషేకం చేయటమో, గుడికి వెళ్ళటమో మాత్రమే కాదు. శంకరాచార్యులవారు కర్మకాండను పూర్తిగా వదిలేయమని కాని, అది అనవసరం అని కాని చెప్పటం లేదు. దాన్ని తెలివిగా ఎంతమేరకు ఉపయోగించాలో అంతమేరకు ఉపయోగించండి. కర్మద్వారా చిత్తశుద్ధి, ఉపాసనద్వారా చిత్త ఏకాగ్రత పెంపొందించుకుని జ్ఞానయోగ్యతాప్రాప్తి పొంది, జ్ఞానమార్గానికి వచ్చి మోక్షం పొందండి అంటున్నారు. ఇదీ జ్ఞానానికీ, కర్మకూ మధ్య ఉన్న సంబంధం.

**కర్మకాండ లేనిదే జ్ఞానకాండ అసంభవం, జ్ఞానకాండకు రానిదే కర్మకాండ అసంపూర్ణం**

# శాంతిపాఠం

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**

ప్రతి ఉపనిషత్తు ఒక శాంతిపాఠంతో మొదలవుతుంది. బ్రహ్మవిద్య అధ్యయనం పూర్తి చేయటానికి మధ్యలో ఏమీ ఆటంకాలు రాకూడదని చేస్తారు శాంతిపాఠం. ఒక విధమైన విఘ్నేశ్వర పూజ ఇది. ఒక్కొక్క వేదానికీ ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది. శుక్లయజుర్వేదానికి శాంతి పాఠం పూర్ణమదః పూర్ణమిదమ్... బృహదారణ్యక ఉపనిషత్తు శుక్లయజుర్వేదానికి చెందింది. కాబట్టి దీని శాంతిపాఠం పూర్ణమదః పూర్ణమిదమ్...

శాంతిపాఠాన్ని సరిగ్గా స్వరబద్ధంగా పలకాలి. ఈ శాంతిపాఠం తక్కిన వాటికన్నా ప్రత్యేకమైనది. తక్కిన శాంతి పాఠాల్లో శరీరపరంగా విఘ్నాలు కలుగకుండా తొలగించమనీ, మన ఇంద్రియాలు ఆరోగ్యకరంగా ఉండి, బ్రహ్మవిద్య నేర్చుకునేందుకు అనువుగా ఉండాలనీ ప్రార్థిస్తాము. కాని ఈ శాంతిపాఠంలో ఏమీ కోరము. అది ఒక సత్యాన్ని చెబుతున్నది. వేదాంతసారం అంతా ఈ ఒక్క శాంతిపాఠంలో వచ్చేస్తుంది.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

**పూర్ణమదః –** పూర్ణం అంటే అనంతం, అపరిమితం, అపరిచ్ఛిన్నం, సర్వవ్యాపకం. ఏదైతే, అంతటా వ్యాపించి ఉంటుందో, అది అపరిమితం, అనంతం. అదః అంటే 'అది'. ఈ సందర్భంలో 'అది' అంటే ఈశ్వరుడు లేదా **'తత్'** పదార్థం. పూర్ణమదః అంటే ఈశ్వరుడు పూర్ణం.

**పూర్ణమిదమ్** – ఇదం అంటే 'ఇది'. ఈ సందర్భంలో ఇది అంటే జీవుడు. 'అది' అంటే ఈశ్వరుడు, 'ఇది' అంటే జీవుడు లేదా **'త్వం'** పదార్థం.

**తత్ త్వమ్ అసి.**

ఇదొక మహావాక్యం. ఛాందోగ్య ఉపనిషత్తులో వస్తుంది. తత్ పదార్థం అంటే అది (ఈశ్వరుడు); త్వం పదార్థం అంటే నువ్వు, అసి అంటే ఉన్నావు. జీవ, ఈశ్వర ఐక్యం చూపిస్తుంది ఇది. అలాగే ఈ వాక్యం కూడా జీవ ఈశ్వర ఐక్యం చూపిస్తుంది.

**పూర్ణమదః పూర్ణమిదమ్**

ఈశ్వరుడు, జీవుడు సమానం. అదెలా సాధ్యం? ఒక పదానికి రెండు అర్థాలు ఉంటాయి. వాచ్యార్థం, లక్ష్యార్థం. వాచ్యార్థం అంటే దానికి ఉండే ప్రాథమిక అర్థం. ప్రాథమిక అర్థం సరిపోనప్పుడు లక్ష్యార్థం తీసుకోవాలి.

ఈ వాక్యానికి ముందు వాచ్యార్థం చూద్దాము. పూర్ణమదః అంటే ఈశ్వరుడు సర్వవ్యాపకం. పూర్ణమిదం అంటే జీవుడు సర్వవ్యాపకం. ఈశ్వరుడిని మనం చూడలేదు కాబట్టి కాసేపు ఆ పదాన్ని పక్కన పెట్టి జీవుడు

సర్వవ్యాపకం పదాన్ని చూద్దాము. జీవుడు అంటే నేను. నేను కనీసం నేను కూర్చున్న హాలునే పూర్తిగా ఆక్రమించలేను. అలాంటి నేను సర్వవ్యాపకం ఎలా అవుతాను? అందువల్ల దీనికి వాచ్యార్థం సరిపోదు. అంటే లక్ష్యార్థం తీసుకోవాలి.

లక్ష్యార్థం ఏమిటి? జీవుడి ప్రాథమిక అర్థం తీసుకుంటే జీవుడు= ఆత్మ+శరీరం. శరీరం అనాత్మ. లక్ష్యార్థం తీసుకుంటే శరీరం భాగాన్ని అంటే అనాత్మ శరీరాన్ని వదిలేసి, ఆత్మను మాత్రమే తీసుకోవాలి. ఇప్పుడు

జీవుడు = ఆత్మ

ఇదే సూత్రాన్ని ఈశ్వరునికి కూడా వర్తింపజేస్తాము.

ఈశ్వరుడు = ఆత్మ + సమష్టిశరీరం(జగత్తు). జగత్తు కూడా అనాత్మ. లక్ష్యార్థం తీసుకుంటే, సమష్టిశరీరాన్ని, అంటే అనాత్మ జగత్తును వదిలేసి, ఆత్మను మాత్రమే తీసుకోవాలి. ఇప్పుడు

ఈశ్వరుడు = ఆత్మ

ఆత్మ పూర్ణం. అందువల్ల జీవుడు = పూర్ణం; ఈశ్వరుడు = పూర్ణం. పూర్ణం అంటే అనంతం.

కాని జీవుడు, ఈశ్వరుడు స్వరూపంలో ఇద్దరూ పూర్ణం అంటే ఇంకో సమస్య వస్తుంది. అంటే ఇప్పుడు రెండు పూర్ణాలు ఉన్నట్టు అవుతుంది. అనంతం అంటే దేశతః, కాలతః, వస్తుతః సర్వవ్యాపకమైనది. అది ఒకటే ఉంటుంది. అందువల్ల జీవుడు, ఈశ్వరుడు ఒకటే పూర్ణవస్తువు అని అర్థం చేసుకోవాలి. ఇద్దరూ ఒకే పూర్ణస్వరూపము.

**జీవుడు = పూర్ణం; ఈశ్వరుడు = పూర్ణం**

**అందువల్ల జీవుడు = ఈశ్వరుడు**

**పూర్ణమదః పూర్ణమిదమ్ = మహావాక్యం.**

**పూర్ణాత్ పూర్ణముదచ్యతే** – ముందుభాగంలో లక్ష్యార్థం చూశాము. ఇప్పుడు వాచ్యార్థం చూస్తాము.

పూర్ణాత్ – తత్ పదార్థ ఈశ్వరునినుంచి;

పూర్ణమ్ – త్వమ్ పదార్థజీవుడు

ఉదచ్యతే – పుట్టాడు.

దీన్ని ఉన్నదున్నట్టుగా చదివితే, పూర్ణంనుంచి పూర్ణం పుట్టింది. పూర్ణం పుట్టిందని చెప్పటమే కుదరదు. పూర్ణం అనంతం. అనంతం అంటే మూడు కాలాల్లోనూ ఉంటుంది; అంతటా ఉంటుంది. వస్తుతః అనంతం. అలాంటప్పుడు పూర్ణం పుట్టే అవకాశం ఏది? అందుకని ఇది అర్థం లేనిది. ఉపనిషత్తు అర్థం లేనిది చెప్పదు. అందువల్ల ఈ అర్థం తీసుకోవటంలో అర్థం లేదు అంటున్నాము.

రెండో అర్థం కూడా అర్థం లేదు. ఏమిటది? పూర్ణం దేనినుంచి పుట్టిందంటున్నారు? ఇంకో పూర్ణంనుంచి. ఒక పూర్ణంనుంచి ఇంకో పూర్ణం పుట్టిందని ఒప్పుకుంటే, రెండు పూర్ణాలను ఒప్పుకున్నట్టు అవుతుంది. పూర్ణం ఒకటే ఉంటుంది. రెండు ఉండవు. అందువల్ల ఈ అర్థం కూడా కుదరదు. అందువల్ల ఇప్పుడు లక్ష్యార్థం తీసుకోకుండా వాచ్యార్థం తీసుకోవాలి. ఇప్పుడు శరీరపరంగా చూడాలి. ఇంతకుముందు చూశాము.

| | | | | |
|---|---|---|---|---|
| **జీవుడు** | = | **ఆత్మ** | + | **శరీరం** |
| **ఈశ్వరుడు** | = | **ఆత్మ** | + | **సమష్టి శరీరం** |

ఇప్పుడు సోపాధిక దృష్ట్యా ఈశ్వరుణ్ణుంచి జీవుడు పుట్టాడు అని చెబుతాము. అంతకుముందు ఆత్మ దృష్ట్యా ఇద్దరూ పూర్ణం అన్నాం. ఇప్పుడు శరీరం దృష్ట్యా ఈశ్వరుడు కారణం, జీవుడు కార్యం అంటున్నాము.

జీవ, ఈశ్వరుల సంబంధం ఎటువంటిది?

| | |
|---|---|
| **ఆత్మదృష్ట్యా అభేదం;** | **నిరుపాధిక దృష్ట్యా ఏకం లేదా అద్వైతం** |
| **అనాత్మ దృష్ట్యా భేదం;** | **సోపాధిక దృష్ట్యా ద్వైతం** |

దీనికి శాస్త్రం ఇచ్చే ఉదాహరణ కుండలోని ఆకాశం. ఆకాశం సర్వవ్యాపకం. కాని కుండ తయారయ్యేసరికి, కుండలోని ఆకాశం (ఘటాకాశం) పుట్టినట్టుగా అనిపిస్తుంది. నిజానికి బయట ఉన్న ఆకాశం, కుండలో ఉన్న ఆకాశం రెండూ ఒకటే. అలాగే జీవునికి స్వరూపదృష్ట్యా పుట్టుక లేదు. కాని ఉపాధిదృష్ట్యా పుట్టుక ఉంది.

**పూర్ణాత్ పూర్ణముదచ్యతే – ఈశ్వరునినుంచి జీవుడు పుట్టాడు. జీవ, ఈశ్వరులకు కార్య, కారణ సంబంధం ఉంది.**

**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

**పూర్ణమ్** – అనంతమైన ఆత్మను;
**పూర్ణస్య** – అనంతమైన ఆత్మనుంచి;
**ఆదాయ** – విడదీస్తే;
**పూర్ణమ్ ఏవ** – అనంతమైన ఆత్మ మాత్రమే;
**అవశిష్యతే** – మిగిలి ఉంటుంది.

దీన్ని కూడా అక్షరాలా తీసుకుంటే, పూర్ణమైన ఆత్మనుంచి, పూర్ణమైన ఆత్మను విడదీస్తే, పూర్ణమైన ఆత్మే మిగిలి ఉంటుంది. చూడటానికి గందరగోళంగా ఉన్నా చాలా లోతైన అర్థం ఉంది ఇందులో.

వేదాంతంలోకి ఓం ప్రథమంగా అడుగుపెట్టేటప్పుడు ఈశావాస్య ఉపనిషత్తులోకి అడుగుపెట్టకూడదు. దానికి కూడా శాంతిపాఠం పూర్ణమదః శాంతిపాఠమే. మొదటిసారి విన్న వ్యక్తికి అయోమయంగా ఉంటుంది. అది సున్నా, ఇది సున్నా. ఆ సున్నాలోంచి ఈ సున్నా పుట్టింది. ఆ సున్నాలోంచి ఈ సున్నాని తీసివేస్తే సున్నానే మిగులుతుంది. ఏమిటిది అనుకుంటాడు. దీన్ని సరిగా అర్థం చేసుకోవాలి. సరిగా అర్థం చేసుకుంటే ఇందులో వేదాంతసారం అంతా వచ్చేసింది. ఈ వాక్యం అర్థం **బ్రహ్మసత్యం జగన్మిథ్యా.** అదెలాగో చూద్దాం!

| | | | | |
|---|---|---|---|---|
| **జీవుడు** | = | **ఆత్మ** | + | **వ్యష్టిశరీరం** |
| **ఈశ్వరుడు** | = | **ఆత్మ** | + | **సమష్టిశరీరం** |

ఇంకో విధంగా చూస్తే **శరీరి ఆత్మ + శరీరం అనాత్మ.**

అంటే రెండు అంశాలు ఉన్నాయి. శరీరి ఆత్మ, శరీరం అనాత్మ. ఒకవేళ జీవశరీరం, ఈశ్వరశరీరం ఉన్నాయని అంగీకరిస్తే, శారీరక పూర్ణత్వం ఉందని ఎలా చెప్పగలరు? దానికి ఉపనిషత్తు జవాబు అనాత్మశరీరం అసత్యం, మిథ్య. అందువల్ల అది ఆత్మయొక్క పూర్ణత్వానికి భంగం కలిగించదు. అంటే అసత్యమైన ఉపాధి, సత్యమైన ఉపహితానికి పరిమితిని విధించలేదు.

కాకపోతే ఉపనిషత్తు మిథ్య అని ప్రత్యక్షంగా చెప్పదు. అక్కడ వచ్చింది సమస్య. అది అందంగా, పరోక్షంగా చెబుతున్నది.

సోపాధిక జీవుడు అంటే **శరీరి + శరీరం** ఉన్నవాడు. పూర్ణం అంటే పూర్ణత్వ అంశం. అది 'శరీరి'కి చెందింది.

**జీవుడు = శరీరి + శరీరం**

ఇక్కడ ఉపనిషత్తు తెలివిగా చెబుతోంది. జీవుడునుంచి శరీరి తీసేస్తే ఏముంటుంది? శరీరం అనాలి.

**జీవుడు – శరీరి = శరీరం**

శరీరంనుంచి ఆత్మ అంశం తీసేస్తే, అనాత్మ శరీరం మిగలాలి. కాని ఉపనిషత్తు అలా చెప్పటం లేదు.

**జీవుడు – శరీరి = శరీరి**

అంటున్నది. అంటే శరీరం ఉండదు అంటున్నది. అదెలా? శరీరంలో ఆత్మ లేకపోతే శరీరం మృతదేహంతో సమానం కదా! అది ఉన్నా లేనట్టే. శరీరం ఆత్మమీద ఆధారపడి ఉంది. అందువల్ల శరీరానికి ఆత్మ అధిష్ఠానం. అందువల్ల శరీరాన్ని మిథ్యగా తోసివేస్తోంది. అలాంటి శరీరం ఉన్నా, లేనట్టే కదా! కుండనుంచి మట్టిని తీసేస్తే, ఏమీ ఉండదు కదా! మట్టి ఉంటేనే కుండ ఉంది; మట్టి లేకపోతే కుండ లేదు.

అలాగే **శరీరి** ఉంటేనే **శరీరం** ఉంటుంది; **శరీరిని** తీసేస్తే **శరీరం** ఉండదు. అందువల్ల **శరీరం మిథ్య.**

ఆ విధంగా జీవశరీరం మిథ్య; ఈశ్వరశరీరం కూడా మిథ్య.

ఈశ్వరశరీరం అంటే జగత్తు. అంటే ఆత్మను విడదీస్తే అనాత్మ వ్యష్టి లేదు; అనాత్మ ప్రపంచం లేదు. అలా జగత్తు మిథ్య. జగత్తు మిథ్య అంటే బ్రహ్మ సత్యం.

ఆ విధంగా, ఈ మంత్రంలో మూడు భాగాలు ఉన్నాయి. ఇప్పుడు టూకీగా మళ్ళీ చూద్దాం.

**పూర్ణమదః పూర్ణమిదమ్** – జీవుడు, ఈశ్వరుడు స్వరూపదృష్ట్యా ఒకటే.

**జీవ ఈశ్వర ఐక్యమ్**

**పూర్ణాత్ పూర్ణముదచ్యతే –** ఈశ్వరునినుంచి జీవుడు పుట్టాడు.

**జీవ ఈశ్వర భేదం – కార్యకారణ సంబంధం**

**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే –** జీవ జగత్తులనుంచి ఆత్మను విడదీస్తే, అనాత్మకు ఉనికి లేదు.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

నిజానికి ఈ శాంతిపాఠం బృహదారణ్యక ఉపనిషత్తు మొదట్లో ఉండదు. అసలు ఈ శాంతిపాఠం ఐదవ అధ్యాయం మొదట్లో వస్తుంది. శంకరాచార్యులవారు కూడా ఈ మంత్రానికి భాష్యం అక్కడ ఇచ్చారు. కాని శుక్లయజుర్వేదానికి శాంతిపాఠం ఈ మంత్రం అని చూశాము కదా! అందువల్ల అది ముందుకు తీసుకురాబడింది.

ఇక్కడితో శాంతి పాఠం అయిపోయింది.

మొదటి రెండు అధ్యాయాలను మధుకాండము లేదా ఉపదేశకాండము అంటారని చూశాము. ఉపదేశం అంటే మామూలుగా ఒక మంత్రాన్ని చెవిలో ఉపదేశించటం. కాని ఇక్కడ అర్థం అది కాదు. ఉపదేశం అంటే బోధ. బ్రహ్మ లేదా ఆత్మజ్ఞానం కలుగచేసే బోధ.

# అధ్యారోప – అపవాద విశ్లేషణ

బ్రహ్మ లేదా ఆత్మను అర్థం చేసుకోవటానికి చాలా సూక్ష్మబుద్ధి ఉండాలి. అందుకని ఉపనిషత్తు దానికి ఒక ప్రత్యేకమైన పద్ధతిని లేదా ప్రత్యేక ప్రక్రియను లేదా ప్రత్యేక సాంప్రదాయాన్ని ఉపయోగిస్తుంది. దీన్ని అన్ని ఉపనిషత్తుల్లోనూ చూస్తాము. దీన్ని **అధ్యారోప – అపవాద ప్రక్రియ** అంటారు. ఈ పద్ధతిద్వారా బ్రహ్మజ్ఞానాన్ని కలుగచేయటాన్ని **ఉపదేశం** అంటారు.

అధ్యారోప అపవాద ప్రక్రియ గురించి అర్థం చేసుకునే ముందు వేదాంతంలో తరచు వచ్చే మూడు ముఖ్యమైన పదాలను తెలుసుకోవాలి– అసత్, సత్, మిథ్య.

**అసత్ – త్రికాలేపి న తిష్ఠతి.** మూడు కాలాల్లోనూ ఉండనిది. దీన్ని తుచ్ఛం అని కూడా అంటారు. ఉదాహరణకు కుందేటి కొమ్ము, వంధ్య(గొడ్రాలి) పుత్రుడు, ఆకాశపుష్పాలు.

**సత్– త్రికాలేపి తిష్ఠతి.** మూడు కాలాల్లోనూ ఉండేది.

**మిథ్యా– సత్ అసద్భ్యామ్ అనిర్వచనీయం మిథ్యా** ఒక కాలంలో ఉండి, ఇంకో కాలంలో లేనిది. కొన్నాళ్ళు మాత్రమే ఉండేది సత్తా, అసత్తా? ఒక కాలంలో ఉంది కాబట్టి అసత్ కాదు; మూడు కాలాల్లోనూ లేదు కాబట్టి సత్ కూడా కాదు. అది శాశ్వతంగా లేదు అనీ చెప్పలేము; అది శాశ్వతంగా ఉంది అనీ చెప్పలేము. అది సత్ అసత్‌లకు విలక్షణంగా ఉంది. దీన్నే మిథ్య అంటారు.

ఇప్పుడు మిథ్యావస్తువు గురించి చూద్దాము. ఉదాహరణకు ఒక కుండని తీసుకుందాము. ఈ కుండ మట్టినుంచి పుట్టింది; మట్టివల్లే దానికి ఉనికి ఉంది; మట్టిలోనే లయమవుతుంది. అశాశ్వతమైన కుండకు మట్టివల్లే ఉనికి ఉంది. దీన్నే ఇంకో విధంగా చెప్పాలంటే, కుండకు దానికంటూ విడిగా ఉనికి లేదు. దీన్నిబట్టి, మనం ఒక సూత్రాన్ని చెప్పవచ్చు. **మిథ్యావస్తువులకు స్వతంత్రంగా ఉనికి లేదు.** అవి దేనిమీదో ఆధారపడి ఉన్నాయి.

దీన్నుంచి ఇంకో అంశంలోకి వెళదాము. ఇప్పుడు మిథ్యావస్తువులకు స్వతంత్రంగా ఉనికి లేదు. అంటే అవి దేనిమీదో ఆధారపడి ఉన్నాయి కదా! అవి దేనిమీద ఆధారపడ్డాయో, అది కూడా మిథ్యావస్తువైతే, అది వేరే దేనిమీదో ఆధారపడాలి. అందుకని మిథ్యావస్తువు సత్యవస్తువుమీద ఆధారపడాలి. దాన్నే **'సత్'** అనీ, **'సత్యం'** అనీ అంటాము.

ఇప్పుడు మనం మూడు విషయాలు తెలుసుకున్నాం. అవి–

1. సత్, అసత్, మిథ్య
2. మిథ్యకు స్వతంత్రంగా ఉనికి లేదు
3. మిథ్య, సత్యంమీద ఆధారపడి ఉంది

ఇప్పుడు ఈ మూడు అంశాలను అధ్యారోప – అపవాద ప్రక్రియకు అన్వయించి చూస్తాము.

అధ్యారోపం అంటే జగత్తు ఉంది అని ఒప్పుకుంటుంది శ్రుతి. జగత్తు ఉందని ఒప్పుకోవటంవల్ల దానిసృష్టి గురించి; జగత్తులో ఉన్న అనేక వస్తువుల గురించి, పురుషార్థాల గురించి, మార్గాల గురించి, ప్రకృతిసూత్రాల గురించి, అలా అనేక విషయాల గురించి చెబుతుంది. వీటన్నింటినీ అంగీకరించటాన్ని అధ్యారోపం అంటారు.

అధ్యారోపాన్ని అంగీకరించాక, శ్రుతి మనను ఆటపట్టిస్తుంది. ఏ జగత్తు అయితే ఉందని ఏ శ్రుతి అయితే చెప్పిందో, అదే శ్రుతి అదే జగత్తు లేదంటుంది. అలా జగత్తులో ఉన్న ప్రతిదాన్నీ, చివరికి జగత్తునూ, దాని ఉనికినీ తోసివేస్తుంది, **'నేతి–నేతి'** సిద్ధాంతంద్వారా. నేతి అంటే న ఇతి– ఇది లేదు. ఇది లేదు, యిది లేదు అంటూ అన్నింటినీ తోసేస్తుంది. అధ్యారోపం అంటే జగత్తు ఉనికిని అంగీకరించటమైతే, అపవాదం జగత్తును లేదని తోసివేయటం.

ఇప్పుడు మనం నేర్చుకున్న మూడు అంశాల్లోంచి మొదటి అంశాన్ని తీసుకుందాము. జగత్తు సత్తా, అసత్తా, మిథ్యా? జగత్తు ఉందని శ్రుతి అంటోంది కాబట్టి దాన్ని **అసత్** అనలేం, ఎందుకంటే అసత్ అనేది ఏ కాలంలోనూ ఉండదు.

పోనీ **సత్** అందామా? శ్రుతి జగత్తు ఉందని ఒప్పుకుంటూనే, సృష్టి లేదని తోసివేస్తున్నది. కాబట్టి జగత్తును **సత్ అనలేం** కూడా, ఎందుకంటే

**మొదటి సూత్రం ప్రకారం జగత్తు మిథ్య**

ఇప్పుడు రెండో సూత్రం చూద్దాము. మిథ్యావస్తువుకు స్వతంత్రంగా ఉనికి లేదు. మిథ్యావస్తువు, మిథ్యావస్తువు కావటంవల్ల దానికి ఒక అధిష్ఠానం కావాలి. ఆ అధిష్ఠానం పేరు సత్యం.

**రెండవ సూత్రం ప్రకారం జగత్తుకు విడిగా ఉనికి లేదు**

ఇప్పుడు మూడవ సూత్రం ప్రకారం జగత్తుకు అధిష్ఠానం ఏమిటో చూడాలి. అధ్యారోపం అపవాదంద్వారా శ్రుతి జగత్తును తోసివేసింది. జగత్తు మిథ్య. దానికొక సత్యం అధిష్ఠానంగా ఉంది అంది. ఏమిటా అధిష్ఠానం? అది సత్యవస్తువు కాబట్టి దేన్నిబడితే దాన్ని అధిష్ఠానంగా తీసుకోలేము.

జగత్తును తోసివేసింది కాబట్టి, జగత్తులోకి రానిది, జగత్తుకు బాహ్యంగా ఉన్నది, ఏది మిగిలిందో, ఆ మిగిలిన వస్తువు సత్యం అవుతుంది. జగత్తునంతా తోసివేస్తే ఏమిటి మిగిలింది? నేను, అంతటినీ చూస్తున్న నేను, తోసివేయబడలేని నేను మిగులుతాను. చైతన్యరూపంలో, సాక్షిరూపంలో నేను మిగులుతాను.

అందువల్ల జగత్తునంతా తోసివేశాక, నేను సత్యంగా ప్రకటితమవుతాను. వేదాంతం మొత్తం **జగత్తును మిథ్యగాను,** మిగిలిన **నన్ను సత్యం గానూ** చూస్తోంది. అంటే సత్యమైన చైతన్య ఆత్మ మాత్రమే మిగులుతుంది.

అధ్యారోప – అపవాద ప్రక్రియద్వారా రెండు విషయాలు తేలాయి.

మిథ్యా ప్రపంచం, సత్యమైన నేను.

రెండవ సూత్రం ప్రకారం మిథ్యావస్తువుకు విడిగా ఉనికి లేదు. దానికి విడిగా ఉనికి లేదు కాబట్టి అది ఉన్నా లేనట్టే. మట్టి లేకుండా కుండ ఉండలేదు కాబట్టి, మట్టి లేకపోతే కుండ కూడా లేనట్టే. అందువల్ల కుండ మిథ్య, మట్టి సత్యం – సత్యమే అధిష్ఠానం.

అలాగే జగత్తు మిథ్య, నేను సత్యం.

**మూడవ సూత్రం ప్రకారం, మిథ్యా జగత్తుకు, సత్యమైన నేను అధిష్ఠానం**

అందుకని నాకొక కొత్తపేరు వచ్చింది. అది **నిష్ప్రపంచ ఆత్మతత్త్వం.**

**ఫలం –** అధ్యారోప – అపవాదంద్వారా జగత్ మిథ్య. నేను లేదా బ్రహ్మ సత్యం అని తెలుస్తుంది. దీనివల్ల లాభమేమిటి అనుకోవచ్చు. జగత్ మిథ్య, నేను సత్యం అని తెలుసుకుంటే మిథ్యాజగత్తు నన్ను భయపెట్టలేదు. కుండ మట్టిని నాశనం చేయలేదు. ఆభరణాలు బంగారాన్ని నాశనం చేయలేవు. కుండ, ఆభరణాలు మట్టికి, బంగారానికి బానిసలుగా ఉండాలి. ఆభరణానికి ఉనికి బంగారంవల్లే ఉంది అని తెలుసుకోవాలి. ఈ జ్ఞానంవల్ల సంసారం మనను బాధించదు. దీని గురించి వివరంగా సందర్భం వచ్చినప్పుడు చూద్దాము.

ఇక్కడితో అధ్యారోప – అపవాద విశ్లేషణ అయిపోయింది

ఈ అధ్యారోప–అపవాదం బృహదారణ్యకం మొదటి రెండు అధ్యాయాల్లోని అంశం; మొదటి అధ్యాయం అధ్యారోపం గురించి మాట్లాడితే, రెండో అధ్యాయం అపవాదం గురించి చెబుతుంది. రెండింటినీ కలిపి ఉపదేశకాండము అంటారని చూశాము.

# బృహదారణ్యకోపనిషత్తు

## మధుకాండము అధ్యాయము - 1

## ఉపోద్ఘాతము

ఇందులో అధ్యారోప విశ్లేషణ వస్తుంది. మొదటి అధ్యాయం జగత్తును అంగీకరిస్తుంది. జగత్తును అంగీకరిస్తూ, మనకు అర్థం కావటానికి వీలుగా జగత్తును రెండు భాగాలుగా విభజించింది.

1. అవ్యాకృతప్రపంచం లేదా అవ్యక్తప్రపంచం.
2. వ్యాకృతప్రపంచం లేదా వ్యక్తప్రపంచం. దీన్నే తర్వాత నామరూప కర్మాత్మకం వ్యాకృతప్రపంచమ్ అంటుంది.

కుండ ఏమిటి? నామం, రూపం, కర్మ

కర్మ అంటే దానికొక ప్రయోజనం. కుండ ప్రయోజనం నీటిని ధరించటం. ఆ విధంగా వ్యక్తప్రపంచాన్ని మూడుగా విభజించవచ్చు. నామం,రూపం, కర్మ. ఈ వ్యక్తప్రపంచాన్ని ఇంకా రెండుగా విభజించవచ్చు. సాధన ప్రపంచం, సాధ్యప్రపంచం. ఈ సాధన సాధ్యరూపాల్లో – సాధన మార్గం, సాధ్యం గమ్యం.

మొదటి అధ్యాయంలో, మొదటి మూడు ఖండాలూ అనేక సాధనల గురించి చెప్తాయి. ఈ ఉపనిషత్తులో ఖండాలను బ్రాహ్మణము అంటారు. అనేక సాధ్యసాధనలు ఉన్నాయి కాని, శ్రుతి లౌకిక ప్రపంచంలోని సాధ్యసాధనల గురించి పట్టించుకోదు అది వేదాల్లో చెప్పిన సాధ్యసాధనల గురించి చెబుతున్నది.

ఈ మూడు బ్రాహ్మణాలలో, మూడు ఉపాసనలను చూస్తాము. అవి– అశ్వ ఉపాసన, అగ్ని ఉపాసన, ప్రాణ ఉపాసన. తర్వాత సాధ్యం గురించి వస్తుంది. గమ్యం హిరణ్యగర్భ పథం అంటే బ్రహ్మలోక ప్రాప్తి.

ముందు ఉపాసన గురించి కొన్ని వివరాలు చూద్దాము. ఉపాసన అంటే ధ్యానం. ఉపాసనలు రెండు రకాలు. స్వతంత్ర ఉపాసన, కర్మాంగ ఉపాసన.

**స్వతంత్ర ఉపాసన** – స్వతంత్రంగా చేసే ధ్యానం. ఏదైనా ఫలం ఆశించి చేసే ధ్యానం.

**కర్మాంగ ఉపాసన** – ఇది స్వతంత్రంగా చేసేది కాదు. ఒక యజ్ఞంలో లేదా కర్మలో భాగంగా చేసేది. యజ్ఞాన్ని అంగీ అనీ, ఉపాసనను అంగం అనీ అంటారు. యజ్ఞానికి అనేక చిన్న కర్మలు ఉంటాయి. అందులో ఒక భాగం ఉపాసన.

ఉదాహరణకు విష్ణుసహస్రనామ లక్షార్చన చేయాలనుకున్నారనుకోండి. అర్చన ముఖ్యభాగం లేదా అంగీ, దాని ముందు చేసే ఆవాహనం మొదలైనవి ధ్యానంయొక్క కర్మాంగాలు. ఇవి అంగీలో భాగాలు.

# 1.1 - అశ్వమేధ బ్రాహ్మణము

మొదటి మూడు బ్రాహ్మణాలూ ఉపాసనరూప శాస్త్రీయ సాధనల గురించి చెబుతాయి. ఇది అధ్యారోపప్రకరణం అనే విషయం మర్చిపోకూడదు. శాస్త్రీయసాధనలు అన్నప్పుడు కొన్ని యజ్ఞాలు లేదా కర్మలు అవవచ్చు, కొన్ని ఉపాసనలు లేదా ధ్యానాలు అవవచ్చు. ఈ మూడు బ్రాహ్మణాల్లోనూ ఉపాసనరూప శాస్త్రీయసాధనలను చూస్తాము. అవి వరుసగా అశ్వ, అగ్ని, ప్రాణ ఉపాసనలు.

మొదటి బ్రాహ్మణము అశ్వ ఉపాసన గురించి చెబుతుంది. ఇందులో చర్చిస్తున్న ఈ అశ్వ ఉపాసన, అసలు కర్మాంగ ఉపాసన. ఇది ఒక పెద్ద కర్మలో భాగంగా చేసే ఉపాసన. ఆ కర్మ పేరు అశ్వమేధయాగం. వేదపూర్వభాగంలో చెప్పబడిన కర్మల్లో అత్యంత గొప్పది.

ఒక వ్యక్తి అన్ని కర్మలూ చేశాడు అని చెప్పటానికి అతను అగ్నిహోత్రంనుంచి అశ్వమేధంవరకూ చేశాడని చెబుతారు. అగ్నిహోత్రం ప్రాథమిక, చిన్నయజ్ఞం అయితే, అశ్వమేధయాగం చాలా పెద్దది. అన్ని కర్మలూ అందులో వస్తాయి. అశ్వమేధయాగంలో అశ్వాన్ని (గుర్రాన్ని) ఉపయోగించాలి. మేధ అంటే యాగంతో సమానం. అశ్వాన్ని యాగంలో ఒక భాగంగా ఉపయోగించేటప్పుడు, ముందు అశ్వంమీద ఉపాసన చేయాలి. అందువల్ల అశ్వ ఉపాసన, అశ్వమేధయాగంలో ఒక భాగం.

కాని ఇక్కడొక సమస్య ఉంది. ఏమిటది? అశ్వమేధయాగాన్ని కేవలం క్షత్రియులు లేదా రాజులే చేయాలి. అందువల్ల తక్కిన వర్ణాలకు చెందిన వారికి ఈ యజ్ఞం చేయటానికి అర్హత లేదు. ఉదాహరణకు బ్రాహ్మణుడు చేయకూడదు.

కాని వేదం అలాంటివారికి ఒక మార్గం చూపించింది. క్షత్రియులు కాని వారు, కేవలం అశ్వ ఉపాసన చేస్తేనే చాలు, అశ్వమేధ ఉపాసన చేసిన ఫలం పొందుతారు. అలాగని క్షత్రియులు కేవలం ఉపాసన చేసి ఊరుకోకూడదు. వారు యాగం కూడా తప్పనిసరిగా చేయాలి. బ్రాహ్మణులు, తక్కిన వర్ణాల వారు కేవలం అశ్వ ఉపాసన చేస్తే చాలు కాబట్టి, కర్మతో ప్రమేయంలేదు కాబట్టి, ఇక్కడ **స్వతంత్ర ఉపాసన** అవుతుంది.

అశ్వ ఉపాసనలో,అశ్వాన్ని అశ్వంగా చూడము. అశ్వాన్ని అశ్వంగా చూస్తే, అది ఉపాసన కాదు. ఉపాసన అంటే ఏమిటి? గుర్రాన్ని హిరణ్యగర్భగా చూస్తే ఉపాసన అవుతుంది. ఒక వస్తువును కావాలని ఇంకో వస్తువుగా కొలిస్తే అది ఉపాసన. ఒక వస్తువును అజ్ఞానంవల్ల ఇంకో వస్తువుగా భావిస్తే అది భ్రమ. ఒక వస్తువును ఉన్నదున్నట్టుగా చూస్తే అది జ్ఞానం.

ఇప్పుడు ప్రశ్న అశ్వాన్ని దేనిగా కొలవాలి? విరాట్ స్వరూపంగా కొలవాలి. అందువల్ల ఇది విరాట్ ఉపాసన అవుతుంది. **అశ్వే విరాట్ ఉపాసన** అంటారు దీన్ని.

అశ్వే విరాట్ ఉపాసన అంటే గుర్రంలో ఒక్కొక్క భాగాన్ని విశ్వంలో ఒక్కొక్క భాగంతో పోల్చి ఉపాసన చేస్తారు. విరాట్ అంటే రాముడు, కృష్ణుడు మాదిరి ఒక దేవుడు కాదు. విరాట్ అంటే సమష్టి స్థూలప్రపంచం. గుర్రంలో భాగాలను, విరాట్‌తో పోల్చడంవల్ల, గుర్రాన్ని చూస్తే, విశ్వాన్ని చూసినట్టే లెక్క.

ఈ ఉపాసనవల్ల కలిగే ఫలం ఏమిటి? ముందుగా చిత్తవైశాల్యత ఏర్పడుతుంది. ఈ మొత్తం విశ్వాన్ని ఒకటిగా చూస్తాము. అందువల్ల ఫలానా ఉపాసన చేయాలని ప్రత్యేకంగా అనుకోనవసరం లేదు. ఇటువంటి ఉపాసనలు చిత్తవైశాల్యతను పెంచుతాయి.

ఉపనిషత్తు చెప్పే ప్రత్యక్షఫలం హిరణ్యగర్భపథప్రాప్తి. తర్వాత ఈ బ్రహ్మలోకప్రాప్తి కూడా జగత్తుయొక్క అవ్యాకృత ప్రపంచంలోకి వస్తుంది కాబట్టి అది కూడా నీకు మోక్షాన్ని ఇవ్వదు అంటుంది ఉపనిషత్తు. ఆ బ్రహ్మవు నువ్వే అని చెబుతుంది.

## మంత్రం 1.1.1

**ఓం నమో బ్రహ్మాఽఽదిభ్యో బ్రహ్మవిద్యాసంప్రదాయకర్తృభ్యో వంశఋషిభ్యో మహద్భ్యో నమో గురుభ్యః। ఓమ్ ఉషా వా అశ్వస్య మేధ్యస్య శిరః । సూర్యశ్చక్షుర్వాతః ప్రాణో వ్యాత్తమగ్నిర్వైశ్వానరస్సంవత్సర ఆత్మాఽశ్వస్య మేధ్యస్య । ద్యౌః పృష్ఠమంతరిక్షముదరం పృథివీ పాజస్యం దిశః పార్శ్వే అవాంతరదిశః పర్శవ ఋతవోఽంగాని మాసాశ్చార్ధమాసాశ్చ పర్వాణ్యహోరాత్రాణి ప్రతిష్ఠా నక్షత్రాణ్యస్థీని నభో మాగ్ంసాని। ఊవధ్యగ్ం సికతాస్సింధవో గుదా యకృచ్చ క్లోమానశ్చ పర్వతా ఓషధయశ్చ వనస్పతయశ్చ లోమాన్యుద్యన్పూర్వార్థో నిమ్లోచన్ జఘనార్థో యద్విజృంభతే తద్విద్యోతతే యద్విధూనుతే తత్ స్తనయతి యన్మే హతి తద్వర్షతి వాగేవాస్య వాక్॥**

ఈ మంత్రంలో అశ్వంలోని ఒక్కొక్క భాగాన్ని, విశ్వంలో ఒక్కొక్క భాగంతో పోల్చింది ఉపనిషత్తు.

**అశ్వస్య మేధ్యస్య – మేధ్యం** అంటే పవిత్రమైనది.

అంటే మంత్రాలతో పవిత్రం చేయబడిన అశ్వం. యాగంలో వాడేదాన్ని ముందు పవిత్రంగా చేస్తారు. అందువల్ల అశ్వం కూడా పవిత్రం చేయబడిన అశ్వం. ఇప్పుడు పోలికలు చూద్దాము. అశ్వంయొక్క తల ఉషోదయం; కన్ను సూర్యుడు; ప్రాణం గాలి; నోరు వైశ్వానర అగ్ని; శరీరం సంవత్సరం (కాలం); దాని వెనుక భాగము స్వర్గము; పొట్ట అంతరిక్షం; కాలిగిట్ట పృథివి; దాని ప్రక్క భాగాలు నాలుగు దిక్కులు; దాని పక్కటెముకలు దిక్కుల మూలలు; తక్కిన అవయవాలు ఋతువులు; కీళ్ళు నెలలు,పక్షాలు; కాళ్ళు రాత్రింబవళ్ళు; ఎముకలు నక్షత్రాలు; కండరాలు ఆకాశం; కడుపులో జీర్ణం కాని ఆహారం ఇసుక నేల; నాడులు నదులు; హృదయం పక్కన ఉండే కండరాలు పర్వతాలు; రోమాలు చెట్లు చేమలు; దేహంయొక్క ముందు భాగం ఉదయించే సూర్యుడు; వెనుక సగం అస్తమించే సూర్యుడు; శరీరాన్ని సాగదీయటం మెరుపులు మెరవటం; అది శరీరాన్ని విదిలించుకోవటం ఉరుములు ఉరమటం; అది మూత్రవిసర్జన చేయటమే వర్షించటం; దాని సకిలింపు విరాట్‌యొక్క వాక్కు.

భాగవత పురాణాల్లో కూడా ఇటువంటి ఉపాసనలు ఉంటాయి. కాకపోతే అక్కడ ఇలా గుర్రాన్నో, ఆవునో తీసుకోకుండా, కృష్ణ భగవానుడినో విష్ణుమూర్తినో తీసుకుని కాలివేళ్ళ దగ్గరనుంచి తలదాకా వర్ణిస్తారు. రెండింటి ఉద్దేశం ఒకటే. విశ్వరూపదర్శనం.

మంత్రం 1.1.2

**అహర్వా అశ్వం పురస్తాన్మహిమాఽన్వజాయత తస్య పూర్వే సముద్రే యోనీ రాత్రిరేనం పశ్చాన్మహిమాఽన్వజాయత తస్యాపరే సముద్రే యోనిరేతౌ వా అశ్వం మహిమానావభి తస్సంబభూవతుః । హయో భూత్వా దేవానవహద్వాజీ గంధర్వానర్వాఽసురానశ్వో మనుష్యాన్ సముద్ర ఏవాస్య బంధుస్సముద్రో యోనిః ॥**

ఇందులో కూడా ఉపాసన కొనసాగుతుంది. అశ్వమేధయాగంలో గుర్రం ముందు ఒక బంగారు పాత్రను ఉంచుతారుట. దానిపేరు పురస్తాద్ మహిమ. పురస్తాత్ అంటే ముందు. వెనుక ఒక పాత్రను పెడతారు. దానిపేరు పశ్చాద్ మహిమ, ఇది వెండితో చేయబడింది.

బంగారు పాత్ర ముందు, వెండిపాత్ర వెనుక పెడతారు. ఉపాసన ఎలా చేస్తారు? పగలు, రాత్రులను పురస్తాద్ మహిమగా, పశ్చాద్ మహిమగా చూడాలి. తూర్పు సముద్రంనుంచి పగలు పుట్టింది (సూర్యుడు తూర్పు సముద్రంనుంచి ఉదయిస్తాడు). పడమర సముద్రంనుంచి రాత్రి పుట్టింది. పగలును బంగారు పాత్రగానూ, రాత్రిని వెండిపాత్రగానూ భావించి ఉపాసన చేయాలి. ఇంతవరకూ ఉపాసన.

ఇక్కడ్నుంచి అశ్వస్తుతి వస్తుంది. దేనిమీద ఉపాసన చేస్తామో దాన్ని స్తుతించాలి. ఇది మీమాంస సూత్రం. ఏమిటా స్తుతి? దేవతలకూ, అసురులకూ, గంధర్వులకూ, మనుష్యులకూ అందరికీ వాహనం అశ్వం. ఆ విధంగా అశ్వం అటు దేవతలకూ ఇటు మనుష్యులకూ కూడా వాహనం.

చివరగా, అశ్వం సముద్రంనుంచి పుట్టింది అంటున్నది ఉపనిషత్తు. అశ్వానికి రెండు అర్థాలు ఉన్నాయి. అశ్వం అంటే గుర్రం. అశ్వాన్ని విరాట్‌గా చూస్తున్నాము. సముద్రానికి రెండు అర్థాలు ఉన్నాయి. ఒకటి సముద్రం, రెండోది ఈశ్వరుడు.

పురాణాల ప్రకారం అశ్వం సముద్రంనుంచి పుట్టింది. గుర్రానికి ఉన్న ఇంకోపేరు సైంధవం. సైంధవం అంటే ఉప్పు అనికూడా అంటారు. గుర్రం సముద్రంనుంచి పుట్టింది. సైంధవం కూడా సముద్రంనుంచే పుట్టింది. అందువల్ల అశ్వం, ఉప్పు రెండూ సముద్రంనుంచే పుట్టాయి. అంటే సముద్రుడు ఈశ్వరుడు లేదా మాయాసహిత బ్రహ్మనుంచి పుట్టాడు. సముద్రం అంటే ఈశ్వరుడు అని ఎలా అర్థం చెప్పగలము? శంకరాచార్యులవారు సముద్రం పదానికొక అద్భుతమైన విశ్లేషణ ఇస్తున్నారు.

**భూతాని సముపాద్య ద్రవన్తి అస్మిన్ ఇతి సముద్రః.**

దేన్నుంచైతే అన్ని జీవరాశులు పుట్టి, ఎందులోకి లయమవుతాయో, దాన్ని ఈశ్వరుడు అంటారు. ఇక్కడ సముద్రాన్ని ఈశ్వరుడు అంటున్నాము. నదులన్నీ సముద్రంలోంచి పుట్టి, సముద్రంలో లయమవుతాయి. ఆ విధంగా ఈశ్వరుడూ, సముద్రమూ ఒకటే.

అంతేకాదు **బంధుః** అది. **బంధుః** అంటే స్థితికారణం. సముద్రం సృష్టి, లయ కారణం. బంధుః అంటే స్థితి కారణం కూడా కాబట్టి ఈశ్వరుడు మాత్రమే విరాట్‌యొక్క సృష్టి, స్థితి, లయ కారణం. అందువల్ల అశ్వం గొప్పది. దీనిలో అశ్వ ఉపాసన బ్రాహ్మణము అయిపోయింది.

ఇక్కడ శంకరాచార్యులవారు ఒక విషయం చెబుతున్నారు. ఫలస్తుతి చెప్పలేదు కాబట్టి, ఇది పూర్తి ఉపాసన కాదు. దీన్ని తర్వాత వచ్చే అగ్ని ఉపాసనతో కలిపి చేయాలి అంటారు.

**గమనిక – 1 కర్మ, ఉపాసనల గురించి చెప్పే భాగాలకు ఉపనిషత్తులలో అంత ప్రాముఖ్యత ఉండదు కాబట్టి, ఈ బృహదారణ్యకోపనిషత్తు గ్రంథంలో ఆ భాగాలలో వాటి సారాంశము మాత్రమే ఇవ్వడం జరిగింది.**

**2 ఈ బృహదారణ్యకోపనిషత్తు గ్రంథంలో అనేక భాష్యాలు ఉన్నాయి. అవి కూడా ముఖ్యమైన వాదనల సారము మాత్రమే ఇవ్వడం జరిగింది.**

# 1.2 - అగ్ని బ్రాహ్మణము

అగ్ని అంటే మామూలు అగ్ని కాదు. ఇది కూడా అశ్వమేధయాగానికి చెందిన అగ్ని. మొదటి ఉపాసనకు చెప్పిన నియమమే ఇక్కడ కూడా వర్తిస్తుంది. క్షత్రియుడు ఒక్కడే అశ్వమేధయాగాన్ని చేయగలడు, తక్కినవారు యాగాన్ని చేయలేరు కాబట్టి కేవలం ఉపాసన చేస్తే చాలు, కాని క్షత్రియుడు కేవలం అగ్ని ఉపాసన చేయకూడదు, యజ్ఞంలో భాగంగా చేయాలి.

అగ్నిని కూడా విరాట్‌గా భావించి ఉపాసన చేయాలి. రెండూ విరాట్ ఉపాసనలే. ఒకదాంట్లో ప్రతీక అశ్వం అయితే, రెండో దాంట్లో ప్రతీక అగ్ని. ప్రతీక మారుతుంది కాని, ఉపాస్యవస్తువు మారదు.

మంత్రం 1.2.1

**నైవేహ కించనాగ్ర ఆసీన్మృత్యునైవేదమావృతమాసీత్ । అశనాయయాఽశనాయా హి మృత్యుస్తన్మనోఽకురుతాఽఽత్మన్వీ స్యామితి । సోఽర్చన్నచరత్తస్యార్చత ఆపోఽజాయంతార్చతే వై మే కమభూదితి తదేవార్కస్యార్కత్వం కగ్ం హ వా అస్మై భవతి య ఏవమేతదర్కస్యార్కత్వం వేద ॥**

ఉపాసన గురించి చెప్పేముందు, ఉపనిషత్తు అగ్ని స్తుతి చేస్తున్నది. అగ్ని స్తుతి చేసేముందు అగ్ని పుట్టుక గురించి చెబుతున్నది. దానికొక పవిత్రమైన పుట్టుక ఉంది. అందువల్ల అగ్నిమీద ఉపాసన చేయాలి.

ఈ సందర్భంలో టూకీగా సృష్టి గురించి చెబుతున్నది. ఇక్కడ సృష్టి గురించి చెప్పే ఉద్దేశం సృష్టి గురించి వివరించటం కాదు, అగ్నిని స్తుతించటం. ఇటువంటి విషయాలను పరిహాసం చేయకూడదు, శాస్త్రాన్ని కించపరచకూడదు.

**నైవేహ కించనాగ్ర ఆసీత్ –**

ఉపనిషత్తు సృష్టి గురించి చెబుతూ, ఒక పెద్ద వివాదాస్పద వాక్యాన్ని వదిలింది. సృష్టికి పూర్వం ఏమీ లేదు అంది. సృష్టికి పూర్వం ఏమీ లేదు అంటే అసత్ వాదాన్ని సమర్థించినట్టు అవుతోంది. అసత్‌నుంచి సృష్టి వచ్చింది, అసత్‌లోకి సృష్టి లయమవుతుంది. ఇదెలా సాధ్యం? ఇది బౌద్ధమతానికి అనుకూలంగా ఉన్నట్టు కనపడుతుంది. దాన్ని శూన్యవాదం అంటారు. తక్కినవారు దీన్ని అనువుగా తీసుకోకుండా, శంకరాచార్యులవారు దీని లోతుపాతులను విశ్లేషిస్తారు.

శంకరాచార్యులవారు ఈ వాక్యాన్ని తీసుకుని, తక్కిన వాదనలు లేవదీసి, వాటిని ఖండిస్తారు. ఒక కుండను ఉదాహరణగా తీసుకుని చెబుతారు కాబట్టి దీన్ని ఘటభాష్యం అంటారు. ఇది శంకరాచార్యులవారి భాష్యాలలో చాలా ముఖ్యమైనది. ఇది బృహదారణ్యక ఉపనిషత్తు పుస్తకంలో లేదు కాని, ముఖ్యమైన భాష్యం కాబట్టి, దీన్ని టూకీగా చూద్దాము.

# ఘటభాష్యం

ఈ **ఘట భాష్యంలో** రెండు వాదనలు ఉన్నాయి.

1. సృష్టేః పూర్వం కారణమ్ అస్తి వా న వా? సృష్టికి ముందు కారణం ఉందా, లేదా?
2. సృష్టేః పూర్వం కార్యమ్ అస్తి వా న వా? సృష్టికి ముందు కార్యం ఉందా, లేదా?

ఒక్కముక్కలో చెప్పాలంటే ఈ భాష్యం కారణసత్తా విచారణ, కార్యసత్తా విచారణ చేస్తోంది.

**1. కారణసత్తా విచారణ:** కారణం ఉందా లేదా చర్చించటానికి, శంకరాచార్యులు ప్రాథమికంగా బౌద్ధమతాన్ని తీసుకున్నారు. బౌద్ధమతంలో కూడా నాలుగు వాదనలు ఉన్నాయి. అందులో ఇప్పుడు మనం చూసే వాదన క్షణిక విజ్ఞానవాదన. దీన్ని యోగాచార బౌద్ధమతం అనికూడా అంటారు. వారి వాదనను ఖండించే ముందు వారి వాదనేమిటో చూద్దాం.

**క్షణిక విజ్ఞాన వాదన** – బౌద్ధమతం ప్రకారం, అసలు బాహ్యప్రపంచం లేదు. మనస్సుకు భిన్నంగా బాహ్యప్రపంచం లేదు. జగత్తులో ఉన్న అనేక వస్తువులు నా మనస్సులో అనేక ఆలోచనల రూపంలో ఉన్నాయి. వారి ఉద్దేశంలో కుండ ఆలోచన ఉంది కాని, నిజానికి కుండ లేదు. చెట్టు ఆలోచన ఉంది కాని చెట్టు అనే వస్తువు లేదు; మనిషి ఆలోచన ఉంది కాని మనిషి అనే వస్తువు లేదు.ఒక్కముక్కలో చెప్పాలంటే వస్తు ఆలోచనలు ఉన్నాయి కాని, వస్తువులు లేవు.

దీన్ని అర్థం చేసుకోవటానికి గొప్ప ఉదాహరణ నా స్వప్నమే. స్వప్నంలో నిజంగా బాహ్యప్రపంచం అంటూ లేదు. స్వప్నప్రపంచం అనేది నా మనస్సు చేసిన కల్పన మాత్రమే. కలలో చూసిన పులి, మనస్సులో వచ్చిన పులి ఆలోచన; కలలో చూసిన ఏనుగు; మనస్సులో వచ్చిన ఏనుగు ఆలోచన. అలాగే నా ఎదురుగుండా మీరు కనబడుతున్నారంటే, అది నా మనస్సువల్లే; నా మనస్సు మేలుకుని ఉంటే, మీరంతా ఉన్నారు. నా మనస్సు నిద్రపోతే మీరు లేరు.

అంతేకాదు, ఈ ఆలోచనలు క్షణికం అంటారు వారు. ఈ ఆలోచనలు క్షణం, క్షణం మారుతూ ఉంటాయి. అందువల్ల ఒకే వస్తువును అదే పనిగా చూడటం ఉండదు. ఇలా కాసేపే ఆలోచన ఉండటం క్షణికం అంటారు. ఈ ఆలోచనను విజ్ఞానం అంటారు. అందువల్ల దీన్ని క్షణిక విజ్ఞాన వాదన అంటారు. దీని ప్రకారం అంతా క్షణికమే. చూసే నేను క్షణికం. చూడబడే వస్తువు క్షణికం. చూసే కర్మ క్షణికం. అంటే **కర్త, కర్మ, క్రియ అన్నీ క్షణికమే.** చివరికి ఆత్మ కూడా క్షణికమే.

అందువల్ల, ఏదీ శాశ్వతంగా ఉండదు వారికి. అలాంటప్పుడు మట్టిని కారణంగా అంగీకరించలేరు వారు. ముందు నేను మట్టిని చూస్తాను, తర్వాత కుండను చూస్తాను. అంటే మట్టి ఆలోచన వస్తుంది, పోతుంది. కుండ ఆలోచన వస్తుంది, పోతుంది. కారణం కార్యాన్ని ఉత్పత్తి చేసే అవకాశమే లేదు.

**శంకరాచార్యులవారి వాదన** – మట్టే కుండగా ఏర్పడిందని మనకు తెలుసు. మట్టే ముందు కూడా ఉంది, కుండలోనూ ఉంది, కుండ పోయాకా ఉంటుంది. ఈ వాదనను **ప్రత్యభిజ్ఞ** అంటారు. ఇది చాలా ముఖ్యమైన సిద్ధాంతం. ఈ సిద్ధాంతంలో గతాన్ని వర్తమానంతో కలుపుతాము. భూత, వర్తమానకాలాలను కలిపే సిద్ధాంతం ప్రత్యభిజ్ఞ. ఎప్పుడూ '**సోఽ యం**' రూపంలో ఉంటుంది, అంటే **'అదే ఇది.'**

ఒక హాలును మీరు మొదటిసారి చూస్తే దాన్ని దేనితోనూ జత కలపలేరు. కాని అదే హాలును రెండోసారి చూస్తే, నిన్ననో అంతకుముందు వారమో చూసిన హాలే ఇది అనే గుర్తింపు కలుగుతుంది. అంటే హాలును మొదటిసారి చూడటం లేదు. మొదటిసారి చూసింది **గుర్తు తెచ్చుకుంటున్నారు.** గతంలో ఒక సమయంనుంచీ ఇప్పటిదాకా ఉంది.

ఏదైతే కారణమో అది వర్తమానంలో కూడా కొనసాగుతుంది. నిన్నటి షర్టుగుడ్డ ఇవాళ షర్టుగా మారింది. నిన్నటి కాయగూర, ఇవాళ కూరగా మారింది. నిన్నటి చెక్క ఇవాళ బల్లగా మారింది.

**క్షణిక వాదన** – నిన్నటిదే ఇవాళ ఉంది అనే వాదన ఒప్పుకోడు బౌద్ధమతస్తుడు. అది నిన్నటి మట్టి కాదు. నిన్నటి మట్టిలాగా కనబడుతోంది అంతే అంటాడు. పాతమట్టి వెళ్ళిపోయింది. కొత్త మట్టి వచ్చింది. మనం కొత్తమట్టినే పాతమట్టిగా భావిస్తున్నాము. ఎందుకంటే రెండూ చూడటానికి ఒకలాగే ఉన్నాయి. **సాదృశ్యాత్ ప్రత్యభిజ్ఞ** అంటారు దీనిని.

**శంకరాచార్యుల వాదన** – ఈ వాదన నిలబడదు అంటారు శంకరాచార్యులు. ఎందుకంటే నిన్నటి మట్టిలాగా, యివాల్టి మట్టి ఉంది అని చెప్పాలంటే, నిన్నటి మట్టిని చూసిన వ్యక్తే, ఇవాల్టి మట్టిని కూడా చూడాలి. అలాగే నిన్నటి సూర్యోదయం లాగే, నేటి సూర్యోదయం కూడా ఉందని చెప్పాలంటే, నేను నిన్నా ఉండాలి, ఇవాళా ఉండాలి. కాని క్షణిక వాదంలో అది సాధ్యం కాదు. చూడబడే వస్తువు మాత్రమే కాదు.చూసే నేను కూడా క్షణికమే. అందువల్ల కారణం లేదు అని వారు చెప్పలేరు.

ఈవాదనలద్వారా **సృష్టికి పూర్వం కారణం ఉంది** అని నిరూపించారు శంకరాచార్యులు. **సృష్టేః పూర్వే కారణం అస్తి.**

**2. కార్య సత్తా విచారణ:** కార్యం ఉందా లేదా నిరూపించటానికి శంకరాచార్యులవారు ప్రాథమికంగా నైయాయికులను తీసుకున్నారు. నైయాయికులను, తార్కికులు, 'అసత్' కార్యవాదులు అని కూడా అంటారు.

**నైయాయికుల వాదన** – సృష్టికిముందు కూడా కుండ ఉండి ఉంటే, అది ఎందుకు పుట్టాలి? అందుకని సృష్టికిముందు కుండ ఉంది అనకూడదు. వారు సృష్టికి పూర్వం కార్యం లేదు అంటారు.

**శంకరాచార్యుల వాదన** – సృష్టికిముందు కూడా కుండ ఉంది. కాకపోతే మనం 'కుండ ఉంది' అనే మాటకు చివర 'అవ్యక్తంగా' అనే పదాన్ని కలుపుకోవాలి. మట్టిలో కుండ అవ్యక్తంగా ఉంది కాబట్టే, అది పుట్టింది. ఈ విషయం నిరూపించటానికి ఐదు కారణాలు ఇస్తారు శంకరాచార్యులవారు.

**ఎ) అభివ్యక్త లింగత్వాత్** – కుండ వ్యక్తమవుతోందనటానికి అది అంతకుముందు మట్టిలో 'ఉండి' ఉండాలి. ఉదాహరణకు ఒక చీకటిగదిలో ఒక బల్ల ఉందనుకుందాము. చీకట్లో బల్ల ఉన్నట్టు తెలియదు. కాని ఆ గదిలోకి వెళ్ళి లైటు స్విచ్ వేయగానే, ఆ బల్ల అక్కడ ఉన్నట్టు తెలుస్తోంది. లైటు వెలిగితే బల్ల కనబడిందంటే, అంతకుముందే అక్కడ చీకట్లో బల్ల ఉన్నట్లు అర్థం. అలాగే కుండ వెలుగులోకి రావాలంటే, అది ముందు మట్టిలో ఉండి ఉండాలి.

**నైయాయికుల వాదన** – లైటు వేస్తే బల్ల తెలిసినట్టుగా, చీకటిగదిలో మట్టి ఉంటే, లైటు వేస్తే మట్టిలో ఉన్న కుండ బయటకు రావాలి కదా! అలా రాలేదేం?

**శంకరాచార్యుల వాదన** – ఒక వస్తువు వెలుగులోకి ఎప్పుడు వస్తుంది? దాన్ని కప్పిన ఆవరణం లేదా ఆటంకం తీసేస్తే వస్తుంది. బల్ల విషయంలో ఆటంకం ఏమిటి? చీకటి. వెలుతురు చీకటి అనే ఆటంకాన్ని లేదా ఆవరణాన్ని తొలగించింది. బల్ల కనిపించింది. కాని కుండ విషయంలో ఆవరణ వేరే ఉంది. చీకటి కాదు ఇక్కడ ఆవరణ. వేరే ఆటంకం తొలగిస్తే కుండ వెలుగులోకొస్తుంది.

మట్టి ఎన్ని నామరూపాలన్నా ధరించగలదా? మట్టి ఎన్ని నామరూపాలన్నా ధరించగలదు. కాని, వచ్చిన చిక్కేమిటంటే ఒక సమయంలో ఒక నామరూపమే ధరించగలదు. అంటే అది కుండరూపం దాలిస్తే మట్టి ముద్దగా ఉండలేదు. కుండగా ఉంటే కూజా అవలేదు. కుండను మట్టిముద్దగా చేసి, మళ్ళీ కూజాగా చేయాలి. కుండను నాశనం చేయకుండా కూజా చేయలేము.

అందువల్ల ఒక రూపం దాల్చిందంటే, అది తక్కిన రూపాలకు ఆటంకం కలుగుతోంది. అందువల్ల కుండ చేయాలంటే, కుండకాక తక్కిన రూపాలనే ఆటంకాలను తొలగించాలి. అన్ని రూపాలను తొలగించి, ఆఖరికి మట్టిముద్ద రూపం కూడా తొలగిస్తే ఈ వ్యక్తరూపం వస్తుంది.

**కుమ్మరి దానికున్న ఆవరణను తొలగించి, కుండరూపాన్ని వ్యక్తం చేయాలి.** బల్ల విషయంలో లైటు వేస్తే చాలు; కాని కుండ విషయంలో, కుమ్మరి కుండను సృష్టించటం లేదు, దాని అవ్యక్తరూపానికి ఉన్న ఆవరణను తొలగించి, వ్యక్తరూపాన్ని తెస్తున్నాడు.

**బి) విప్రతిషేధాత్** – దీన్నే విరోధః అని కూడా అంటారు. కుమ్మరి కుండ చేసే ముందు **ఘట భవిష్యతి** అంటాడు. అంటే కుండ రాబోతుంది. కుండ కర్త (సబ్జెక్ట్). ఇప్పుడు ఈ కుండ ఉన్నట్టా, లేనట్టా?

ఒకవేళ కుండ లేదు అంటే, అప్పుడు ఈ **వాక్యం సబ్జెక్ట్ లేని వాక్యం అవుతుంది.** ఒకవేళ కుండ ఉంది అంటే, ఘట అస్తి అనాలి కాని ఘట భవిష్యతి అనకూడదు. రాబోయే కుండను వర్తమాన కాలంలో వాడకూడదు. అందువల్ల ఘట భవిష్యతిలో సబ్జెక్టుగా 'అవ్యక్తకుండ' అని తీసుకోవాలి. సృష్టికి ముందే కుండ ఉండి ఉంటే, ఎందుకు మట్టి మాత్రమే ఉంది, కుండ లేదంటారు?

ఎందుకంటే, ఉనికి రెండు రకాలు. ఒకటి వ్యవహారసత్తా, ఇంకోటి స్వరూపసత్తా. కుండను తీసుకుంటే, కుండ మూడు కాలాల్లోనూ ఉంది. అంతకు ముందు, ఇప్పుడు, భవిష్యత్తులో. ఇప్పుడు వ్యక్తరూపంలో ఉంటే;

అంతకుముందు, తర్వాత అవ్యక్తరూపంలో ఉంది. దాన్ని **స్వరూపసత్తా** అంటారు. **వ్యవహారసత్తా** తాత్కాలికం. ఎందుకంటే అది కుండగా ఉన్నంతసేపే వ్యవహారాన్ని నడపగలదు. అవ్యక్తంగా ఉంటే వ్యవహారం నడపలేదు కాబట్టి, ఉన్నా లేనట్టే. అందువల్ల కుండ వ్యక్తమయితేనే వ్యవహారం నడుపుతుంది కాబట్టి, అవ్యక్తస్థితిలో లేనట్టుగా కనిపిస్తుంది.

**సి) సర్వజిజ్ఞాస అప్రామాణ్యాత్** – ఈశ్వరుడు, యోగులు, జ్ఞానులను త్రికాలజ్ఞులు అంటారు. వారు భూత, భవిష్యత్, వర్తమాన కాలాల గురించి చెప్పగలరు. వారు వర్తమానకాలంలో ఉండి, భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పగలరు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పగలరంటే, దాని అర్థం, ఇప్పుడు వారి జ్ఞానానికి చెందిన వస్తువు వర్తమానంలో అవ్యక్తరూపంలో ఉంది అని. ఒకవేళ అలా అవ్యక్తరూపంలో లేకపోతే, **వారి జ్ఞానం వస్తువు(ఆబ్జెక్ట్) లేని జ్ఞానం అవుతుంది.** అలాంటప్పుడు వారిని సర్వజ్ఞులనలేము. అందువల్ల భవిష్యత్తులో ఒక వస్తువు గురించి వారు చెప్పాలంటే అది అవ్యక్తరూపంలో ఇప్పుడు ఉండాలి. అందువల్ల కుండ వ్యక్తరూపంలోనో, అవ్యక్తరూపంలోనో మూడు కాలాల్లోనూ ఉంది అని అంగీకరించాలి.

**డి) అభావత్వాత్** – ఇది అర్థం చేసుకునే ముందు, నైయాయికుల సిద్ధాంతాలను కొన్నింటిని అర్థం చేసుకోవాలి. వారు అసత్ లేదా అభావాన్ని నాలుగు తెగల కింద విభజించారు. అవి–

1) **ప్రాగ్ అభావః –** సృష్టికి ముందు ఆ వస్తువు లేకపోవటం. ఉదా:– ఒక పాపాయి పుట్టకముందు లేకపోవటం.
2) **ప్రధ్వంస అభావః –** సృష్టి ధ్వంసమయ్యాక ఆ వస్తువు లేకపోవటం. ఉదా:– కుండ పగిలిపోయాక కుండ లేకపోవటం.
3) **ఆద్యంత అభావః–** మూడు కాలాల్లోనూ ఒక వస్తువు లేకపోవటం. ఉదా:– కుందేటి కొమ్ము, ఆకాశపుష్పాలు, వేడి ఐస్‌క్రీమ్.
4) **అన్యోన్య అభావః –** ఒకదానిలో ఇంకొకటి లేకపోవటం. ఉదా:– కుండలో బట్ట లక్షణాలు లేకపోవటం. కుండ బల్లలాగా ఉండదు; బల్ల బట్టలాగా ఉండదు. ఒకదాని లక్షణాలను ఇంకొకదానికి ఆరోపించలేము. దీన్ని భేదం అని కూడా అంటారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే **ఇందులో ఆ లక్షణం లేకపోవటం.**

**శంకరాచార్యులవారి వాదన** – శంకరాచార్యులు ఈ నాలుగవ తెగను తీసుకున్నారు. అన్యోన్య అభావంలో భేదం ఉందని చెప్పటం సానుకూల విషయం. అటువంటి భావనను వీరు అన్యోన్య అభావః అంటున్నారు. భేదం భావం అవుతుంది కాని అభావం అవదు. అందువల్ల **అన్యోన్య అభావాన్ని భావరూపంగా తీసుకోవాలి.**

అన్యోన్య అభావం సానుకూల సిద్ధాంతం అవుతుంది కాని ప్రతికూల అసత్ అవదు. అన్యోన్య అభావం సానుకూల సిద్ధాంతం అయితే, తక్కిన అభావాలుకూడా సానుకూలమే అయి తీరాలి. సృష్టికి ముందు ఏం ఉంది? కార్య ప్రాగ్ అభావ అని చెపితే దాని అర్థం ఏమిటి? కార్యం లేదు అని తెలుసుకోవటం సానుకూలజ్ఞానం. ఇది కూడా భేదజ్ఞానం లాంటిది. అంటే అన్యోన్య అభావం లాంటిది.

శంకరాచార్యులవారు అసలు అభావమనే సిద్ధాంతమే లేదంటున్నారు. అద్వైతం అభావాన్ని ఒప్పుకోదు. అద్వైతంలో జగత్ అభావాన్ని బ్రహ్మ లేదా ప్రళయం అంటారు. అసత్ వాదాన్ని ఒప్పుకోదు.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ - ఛాందోగ్యం**

జగత్ అభావం అంటే జగత్ అధిష్ఠానమైన బ్రహ్మచైతన్యం ఉంది. అలాగే ఘటసృష్టికి ముందు మట్టి ఉంది.

**ఇ) అసత్ సంబంధ అభావాత్** – ఇది నైయాయికుల అసత్‌కార్యవాదాన్ని ఖండిస్తుంది.

**నైయాయికుల వాదన** – వారు అసత్‌కార్యవాదులు. సృష్టికి పూర్వం సత్ మాత్రమే ఉంది. అంటే కారణమే ఉంది కాని కార్యం లేదు అంటారు. మరి కార్యం ఎలా వచ్చింది? కుమ్మరి మట్టితో పని చేయటం మొదలుపెడితే, మట్టితో సమవాయ సంబంధం ఏర్పడి, కుండగా రూపుదిద్దుకుంటుంది. అంటే ఉనికి ఉన్న మట్టితో అత్యంత సన్నిహిత సంబంధం ఏర్పడినప్పుడు, ఉనికిలేని కుండ దానినుంచి ఉనికిని అరువు తెచ్చుకుంటుంది. నైయాయికుల ప్రకారం కుండ సృష్టి లేదా కార్యసృష్టి ఈ విధంగా జరిగింది. **కారణసత్తా సంబంధాత్ కార్యసృష్టిః**

కారణంనుంచి ఉనికిని అరువు తెచ్చుకుంటే, కార్యం పుట్టింది. ఇదీ వారి సృష్టిప్రకరణం.

**శంకరాచార్యులవారి వాదన** – శంకరాచార్యులవారు దీన్ని మూలంలోనే కొట్టివేస్తారు. ఉనికి ఉన్న మట్టికి, ఉనికిలేని కుండకు మధ్య సంబంధం ఎలా ఉంటుంది? **అసత్ కార్యంకూ, సత్ కారణంకూ ఎలా కుదురుతుంది?** సంబంధం రెండు సత్ వస్తువుల మధ్య మాత్రమే కుదురుతుంది. ఉనికి ఉన్న అబ్బాయి, ఉనికి లేని అమ్మాయిని పెళ్ళి చేసుకోగలడా? ఇద్దరు మనుష్యులు పెళ్ళి చేసుకోవాలంటే, అబ్బాయి, అమ్మాయి కళ్ళముందు కనబడాలి. అప్పుడే వారి మధ్య సంబంధం ఏర్పడుతుంది. అలాగే రెండు అసత్ వస్తువుల మధ్యకూడా సంబంధం ఏర్పడలేదు. రెండూ లేనప్పుడు ఒకదానితో ఒకటి ఎలా ముడిపెడతాము?

**అందువల్ల కార్యమ్ అస్తి**
**సృష్టేః పూర్వం కార్యమ్ అస్తి**
**సృష్టేః పూర్వం కారణమ్ అపి అస్తి**

ఇక్కడితో శంకరాచార్యులవారి వాదన ముగిసింది.

మళ్ళీ మంత్రంలోకి వస్తే –
**నైవేహ కించనాగ్ర ఆసీత్**

దీనికి **సత్తా లేనిది కాదు** అని శంకరాచార్యులవారు అర్థం చెప్పారు. అప్పుడు ఎవరైనా, 'మాకు తర్కం వద్దు, మీ వాదనలు వద్దు, మేము శ్రుతి ప్రమాణమే తీసుకుంటాము, శ్రుతే సృష్టికి పూర్వం ఏమీ లేదు అంటోంది, దీనికి మీ జవాబు ఏమిటి?' అని అడగవచ్చు.

**శంకరాచార్యులవారి వాదన** – మీరు వాక్యాన్ని పూర్తిగా చదవలేదు, మొదటి భాగం మాత్రమే చదివారు, పూర్తిగా చదవండి అంటారు శంకరాచార్యులవారు. తర్వాత ఇలా ఉంది.

**మృత్యునైవేదమావృతమాసీత్**

మృత్యువు అసలు అర్థం తర్వాత చూద్దాము. మృత్యువు అంటే కారణం. ఇదం అంటే కార్యం. మృత్యునైవేదమావృతమాసీత్ అంటే, కార్యం కారణంలో ఆవరించబడి ఉంది.

పూర్వపక్షి వాదించినట్టుగా ఒకవేళ కార్యమూ లేక, కారణమూ లేకపోతే, ఈ వాక్యానికి అర్థం ఏమిటి? సత్తాలేని కార్యం, సత్తాలేని కారణంలో ఆవరించబడి ఉంది. అదెలా సాధ్యం? ఒక ఉనికిలేని వస్తువు ఇంకో ఉనికిలేని వస్తువును కప్పగలుగుతుందా?

అదుగో ఆ బల్లమీద, కుందేటి కొమ్ము ఉంది, దాన్ని ఆకాశపుష్పాలతో కప్పారు అని ఎవరైనా అంటే, అది సాధ్యమా? కప్పబడే వస్తువుకూ ఉనికి ఉండాలి, కప్పే వస్తువుకూ ఉనికి ఉండాలి. దుస్తులు మన శరీరాన్ని కప్పుతాయి. దుస్తులకు ఉనికి ఉంది. శరీరానికి కూడా ఉనికి ఉంది. **మృత్యునైవేదమావృతమాసీత్**

**దీనితో ఘటభాష్యం ముగిసింది. దీని సారాంశం సృష్టికి పూర్వం కారణం ఉంది. సృష్టికి పూర్వం కార్యం కూడా ఉంది.**

## మంత్రం 1.2.2

**ఆపో వా అర్కస్తద్యదపాగ్ం శర ఆసీత్తత్సమహన్యత । సా పృథివ్యభవత్తస్యామశ్రామ్యత్తస్య శ్రాంతస్య తప్తస్య తేజోరసో నిరవర్తతాగ్నిః ॥**

## మంత్రం 1.2.3

**స త్రేధాఽఽత్మానం వ్యకురుతాఽఽదిత్యం తృతీయం వాయుం తృతీయగ్ం స ఏష ప్రాణస్త్రేధా విహితః । తస్య ప్రాచీ దిక్శిరోఽసౌ చాసౌ చేర్మౌ । అథాస్య ప్రతీచీ దిక్పుచ్ఛమసౌ చాసౌ చ సక్థ్యౌ దక్షిణా చోదీచీ చ పార్శ్వే ద్యౌః పృష్ఠమన్తరిక్షముదరమియమురస్స ఏషోఽప్సు ప్రతిష్ఠితో యత్ర క్వ చైతి తదేవ ప్రతిష్ఠిత్యేవం విద్వాన్ ॥**

## మంత్రం 1.2.4

**సోఽకామయత ద్వితీయో మ ఆత్మా జాయేతేతి స మనసా వాచం మిథునగ్ం సమభవదశనాయా మృత్యుస్తద్యద్రేత ఆసీత్స సంవత్సరోఽభవత్ । న హ పురా తతస్సంవత్సర ఆస తమేతావన్తం కాలమబిభః। యావాన్ సంవత్సరస్తమేతావతః కాలస్య పరస్తాదసృజత । తం జాతమభివ్యాదదాత్స భాణకరోత్సైవ వాగభవత్ ॥**

## మంత్రం 1.2.5

**స ఐక్షత యది వా ఇమమభిమగ్గ్ంస్యే కనీయోఽన్నం కరిష్య ఇతి స తయా వాచా తేనాఽఽత్మనేదగ్ం సర్వమసృజత యదిదం కిఞ్చర్చో యజూగ్ంషి సామాని ఛన్దాగ్ంసి యజ్ఞాన్ప్రజాః పశూన్। స యద్యదేవాసృజత తత్తదత్తుమధ్రియత సర్వం వా అత్తీతి తదదితేరదితిత్వగ్ం సర్వస్యైతస్యాత్తా భవతి సర్వమస్యాన్నం భవతి య ఏవమేతదదితేరదితిత్వం వేద ॥**

ఇక్కడ్నుంచి సృష్టి వస్తుంది. ఐదు మంత్రాల్లో సృష్టి గురించి చూస్తాము. వీటిలో మూడవ మంత్రం ముఖ్యమైనది. అది అగ్ని ఉపాసన గురించి చెబుతుంది. అందువల్ల ఈ ఉపాసన గురించి చూసేముందు సృష్టి గురించి చూద్దాము.

ఇక్కడ సృష్టి ఈశ్వరుణ్ణుంచి రాలేదు. ఈశ్వరుడు అంటే బ్రహ్మ + మాయ అంటే సమష్టికారణప్రపంచం. ఈశ్వరునినుంచి హిరణ్యగర్భ వచ్చాడు. అంటే బ్రహ్మ+సమష్టి సూక్ష్మప్రపంచం. ఇక్కడ హిరణ్యగర్భునుంచి సృష్టి ప్రకరణం వస్తోంది. ఈశ్వరుణ్ణుంచి హిరణ్యగర్భ వచ్చాడన్నది మనం కలుపుకోవాలి.

ఇక్కడ ఉపనిషత్తు హిరణ్యగర్భను **మృత్యువు** అంటోంది. హిరణ్యగర్భునుంచి పుట్టిన వాటి పట్టిక చూద్దాము.

| | |
|---|---|
| 1. సమష్టి మనస్సు | 6. శబ్దం |
| 2. స్థూలజలం | 7. వేదాలు |
| 3. స్థూలపృథివి | 8. యజ్ఞాలు |
| 4. విరాట్ | 9. మనుష్యులు |
| 5. ఆదిత్యుడు | 10. పశువులు |

ఇవన్నీ మృత్యువు హిరణ్యగర్భునుంచి పుట్టాయి. మూడవ మంత్రం కాక తక్కిన మంత్రాల సారాంశం ఇది. మూడవ మంత్రంలో అగ్ని గురించి వస్తుంది. హిరణ్యగర్భ తనను తాను మూడుగా విభజించుకున్నాడు. అవి– అగ్ని, వాయువు, ఆదిత్యుడు. అంటే అగ్నితత్త్వం, వాయుతత్త్వం, సూర్యతత్త్వం. ఇది సృష్టి.

వీటిలో అగ్ని గురించి చూద్దాము. అగ్నికి రెండు పేర్లు ఉన్నాయి. అర్కః, అప్రతిష్ఠితః. ఈ పేర్లు ఎలా వచ్చాయో చూద్దాము.

**అర్కః** – హిరణ్యగర్భ ప్రపంచాన్ని సృష్టించటానికి ఏమీ శ్రమపడలేదు. హిరణ్యగర్భ తన సృజనాత్మక శక్తి గురించి ఆలోచిస్తుంటే, ఇంకా నిజం చెప్పాలంటే, తన సృజనాత్మక శక్తిని తలచుకుని మురిసిపోతుంటే, సృష్టి జరిగింది.

హిరణ్యగర్భ చేసిన మొదటి సృష్టి ఏమిటి? మనస్సు, జలం(ఆపః) అని చూశాము. ఆపఃను 'కమ్' అని కూడా అంటారు. అది 'ఉత్కమ్'కి చిన్న పేరు. హిరణ్యగర్భ తనను తాను తలచుకుని మురిసిపోతున్నప్పుడు కమ్ అనబడే జలతత్త్వం వచ్చింది. అర్చన చేస్తుండగా జలం వచ్చింది కాబట్టి హిరణ్యగర్భను అర్కుడు అంటారు.

హిరణ్యగర్భను అర్కుడు అంటారు కాబట్టి హిరణ్యగర్భతో అనుబంధం ఉన్న జలాన్ని అర్క అని, జలంతో సంబంధం ఉన్న అగ్నిని కూడా అర్కుడు అనీ అంటారు. అందువల్ల ఎవరైతే అగ్నిమీద (అర్కము) ఉపాసన చేస్తారో వారికి చాలా అర్కము, నీరు దొరుకుతుంది. సంస్కృతంలో కమ్ అంటే సఖ్యం లేదా ఆనందం.

**ప్రతిష్ఠితః** – అగ్ని నీరుమీద అధారపడింది. ఎందుకంటే ఈ బృహదారణ్యక ఉపనిషత్తులో ముందు నీటి సృష్టి వచ్చింది. నీటి తర్వాతే అగ్ని వచ్చింది. అగ్ని తర్వాత పుట్టింది కాబట్టి, అగ్ని జలంమీద ఆధారపడింది కాబట్టి

అగ్ని ప్రతిష్ఠితః అయింది. ఎవరైతే ఈ ప్రతిష్ఠితః మీద ఉపాసన చేస్తారో, వారికి ప్రతిష్ఠ లేదా అండదండలకు లోటు ఉండదు.

ఈ విధంగా అగ్నికి రెండు బిరుదులు వచ్చాయి. అర్కః, ప్రతిష్ఠితః అందుకని ఈ ఉపాసన పేరు – **అర్కత్వ విశిష్ట ప్రతిష్ఠిత విశిష్ట అగ్ని ఉపాసన.**

అంతకుముందు అశ్వంమీద ఉపాసన చేసినట్టుగా, ఇందులో అగ్ని అనే ప్రతీకమీద విరాట్ ఉపాసన చేస్తాము. అందుకని దీన్ని అగ్నే విరాట్ ఉపాసన అని లేదా విరాట్ ఉపాసన అని లేదా అగ్ని ఉపాసన అని కూడా అంటారు.

విరాట్‌ను అగ్నిమీద ఎలా చూస్తాము?

మూడవ మంత్రంలో వివరాలు వస్తాయి. అవి ఏమిటో చూద్దాము– అగ్ని తూర్పు దిక్కు విరాట్ తల; పడమర దిక్కు – విరాట్ క్రింది భాగము; ఉత్తర, దక్షిణ దిక్కులు – విరాట్ పక్కభాగాలు (పార్శ్వములు) అటు ఇటు ఉండే ఆగ్నేయ – ఈశాన్యాలు అనే విదుక్కులు బాహువులు. వాయవ్యము, నైఋతి అనే విదిక్కులు తొడలు; వెనుక భాగము ద్యులోకము; ఉదరం– అంతరిక్షము; పృథివి వక్షస్థలము, అగ్ని మొత్తాన్ని విరాట్ వ్యక్తరూపంగా భావించాలి. విరాట్‌లో మూడు లోకాలూ వస్తాయి. అలాగే అగ్నే విరాట్ ఉపాసనలో అర్కత్వం, అప్రతిష్ఠిత్వం కూడా చూడాలి.

## మంత్రం 1.2.6

**సోఽకామయత భూయసా యజ్ఞేన భూయో యజేయేతి । సోఽశ్రామ్యత్స తపోఽతప్యత తస్య శ్రాంతస్య తప్తస్య యశో వీర్యముదక్రామత్ । ప్రాణా వై యశో వీర్యం తత్ప్రాణేషూత్క్రాన్తేషు శరీరగ్ం శ్వయితుమధ్రియత తస్య శరీర ఏవ మన ఆసీత్ ॥**

## మంత్రం 1.2.7

**సోఽకామయత మేధ్యం మ ఇదగ్గ్ం స్యాదాత్మన్వ్యనేన స్యామితి । తతోఽశ్వస్సమభవద్యదశ్వత్తన్మేధ్యమభూదితి తదేవాశ్వమేధస్యాశ్వమేధత్వమ్ ॥**

**ఏష హ వా అశ్వమేధం వేద య ఏనమేవం వేద । తమనవరుధ్యైవామన్యత । తగ్ం సంవత్సరస్య పరస్తాదాత్మన ఆలభత । పశూన్ దేవతాభ్యః ప్రత్యౌహత్ । తస్మాత్సర్వదేవత్యం ప్రోక్షితం ప్రాజాపత్యమాలభన్తే ॥**

**ఏష హ వా అశ్వమేధో య ఏష తపతి తస్య సంవత్సర ఆత్మాఽయమగ్నిరర్కస్తస్యేమే లోకా ఆత్మానస్తావేతావర్కాశ్వమేధౌ ॥**

**సో పునరేకైవ దేవతా భవతి మృత్యురేవాప పునర్మృత్యుం జయతి నైనం మృత్యురాప్నోతి మృత్యురస్యాఽఽత్మా భవత్యేతాసాం దేవతానామేకో భవతి ॥**

ఈ బ్రాహ్మణము ముగింపులో ఉపనిషత్తు ఇంకో ఉపాసన గురించి చెబుతున్నది. మొదటి భాగంలో అశ్వ ఉపాసన, తర్వాత అగ్ని ఉపాసన చూశాము. ఇప్పుడు ఈ ఉపాసన పై రెండింటిని కలిపి చేసే ఉపాసన. అందుకని ఈ ఉపాసనను **సమన్య ఉపాసన** అంటారు సమన్యం అంటే రెండు కలిపి చేసే ఉపాసన.

ఇది ముఖ్య ఉపాసన. తక్కిన రెండూ అంగ ఉపాసనలు. ఈ ఉపాసనలో మనం అశ్వం, అగ్నిల (అర్క)మీద ఆవాహన చేయబోతున్నాము. అందువల్ల దీన్ని **అశ్వ అర్క సమన్య ఉపాసన** అని కూడా అంటారు. కాని మధ్యలో, ఉపనిషత్తు ఒక చిన్న అల్లరి చేసి, పక్కదారి పట్టిస్తోంది.

మొదటి భాగంలో అశ్వం అంటే అశ్వమేధయాగంలో వాడే అశ్వం అని చూశాము. అంటే అశ్వం అంటే గుర్రం. అవునా? కాని, ఈ భాగంలో, అశ్వం విరాట్‌కు ఉన్న ఇంకోపేరు అంటోంది ఉపనిషత్తు. అందువల్ల ఈ భాగం మేరకు అశ్వం అంటే గుర్రం అనే విషయం తాత్కాలికంగా మర్చిపోవాలి. అశ్వం అంటే విరాట్ (సమష్టి స్థూలప్రపంచం) అని గుర్తు తెచ్చుకోవాలి.

విరాట్ అశ్వమెలా అయ్యాడు? దానికి ఉపనిషత్తు ఒక చిన్న కథను చెబుతున్నది. విరాట్‌ను, హిరణ్యగర్భను కూడా ప్రజాపతిగానే వ్యవహరిస్తారు. విరాట్ లేదా హిరణ్యగర్భ తనకు యాగాలంటే ఇష్టం కాబట్టి అనేక యాగాలు చేశాడు. ప్రజాపతి కూడా ఒక పదవి అనీ, మనుష్యజన్మలో అనేక యజ్ఞాలు చేయటంవల్ల ఆ పదవిని పొందుతాడనీ గుర్తుంచుకోవాలి.

గతజన్మలో యాగాలు చేయటమంటే ఇష్టమవటంవల్ల విరాట్ అనేక యాగాలు చేసి, అలసిపోయాడు. అలసినా యాగాలు వదలకుండా, మరణించేవరకూ చేస్తూనే ఉన్నాడు. ఉపనిషత్తు మరణించేవరకూ పదం వాడలేదు – అతని సూక్ష్మశరీరం స్థూలశరీరాన్ని వదలి వెళ్ళేవరకు అంది. మరణం నిర్వచనం అది.

అందువల్ల విరాట్ సూక్ష్మశరీరం, విరాట్ స్థూలశరీరాన్ని వదలి వెళ్ళింది అంటే విరాట్ సమష్టిశరీరాన్ని వదిలింది. సూక్ష్మప్రపంచం లేకపోయేసరికి, స్థూలప్రపంచం బాగా ఉబ్బి వైశాల్యం పెరిగింది. ఉబ్బటమే కాదు, అపవిత్రం(అమేధ్యం)గా కూడా అయింది. అపవిత్రం అంటే ఏ యజ్ఞాలకు, పూజలకూ అర్హత లేనిది అయింది. ఇటు శరీరం ఉబ్బి పోయింది, అపవిత్రం అయింది, అటు విరాట్‌కు శరీరం లేకపోయేసరికి, అతను యజ్ఞాలు చేయలేనందుకు బాధపడ్డాడు.

అందువల్ల, విరాట్ మళ్ళీ తన శరీరంలో తిరిగి రావాలని సంకల్పించుకుని, అలాగే తిరిగివచ్చాడు. అప్పుడు, అదే సమష్టిశరీరం మళ్ళీ పవిత్రంగా మారింది. శరీరం ఉబ్బింది కాని, పవిత్రంగా అయింది. దీన్ని **శ్వయత్** అంటారు. దీనికి భూతకాలం **అశ్వయత్.** అశ్వయత్ అంటే ఉబ్బింది పైపెచ్చు అమేధ్య శరీరం; ఇప్పుడు మేధ్యంగా, పవిత్రమైన శరీరంగా, మారింది.

ఇప్పుడు విరాట్ శరీరం అశ్వః చ మేధ్యః చ అంటే అశ్వమేధ్యః పదమే వాడుకలో మారి అశ్వమేధంగా అయింది. అశ్వ లేదా అశ్వమేధః చివరి అర్థం 'పవిత్రమైన, ఉబ్బిన విరాట్'. అందువల్ల అశ్వమేధ అర్క ఉపాసనను **విరాట్ అర్క ఉపాసన** లేదా **విరాట్ అగ్ని ఉపాసన** అని కూడా అంటారు. మనం గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే రెండు ఉపాసనలు కలిసి చేసేటప్పుడు, అశ్వ అంటే విరాట్ అనీ, అశ్వ అగ్ని ఉపాసన అంటే విరాట్

అగ్ని ఉపాసన అనీను. కాని ఈ ఉపాసన కూడా చేయటం కష్టమని భావిస్తోంది ఉపనిషత్తు. ఎందుకంటే సమష్టివిరాట్‌ను ఊహించుకోవటం కష్టం.

ఒక హాలునే ఒక్కసారిగా పూర్తిగా చూడలేము. ఈ పరిమితివల్ల, విరాట్‌కు ఆదిత్యుడు అంటే సూర్యుణ్ణి ప్రతీకగా తీసుకుంటారు. అందువల్ల అశ్వ అగ్ని ఉపాసన = విరాట్ అగ్ని ఉపాసన = ఆదిత్య అగ్ని ఉపాసన. ఒకటి సువర్లోక అగ్ని . ఇంకోటి భూలోక అగ్ని; ఒకటి సాధ్య అగ్ని, ఇంకోటి సాధన అగ్ని. అందువల్ల ఈ ఉపాసన అగ్ని, సూర్యునిమీద చేసే ఉపాసన. ముక్తాయింపుగా ఈ ఉపాసనను హిరణ్యగర్భ ఉపాసన అంటోంది. చివర్లో ఫలం వస్తుంది.

**యథా యథా ఉపాస్తే, తదేవ ఫలం భవతి.** ఎలా ఉపాసన చేస్తే, అలా ఫలం ఉంటుంది. ఈ బ్రాహ్మణములో హిరణ్యగర్భను మృత్యువు అనే ప్రత్యేకమైన పేరుతో పిలిచింది. ఇది మృత్యురూప హిరణ్యగర్భ ఉపాసన కాబట్టి, అపమృత్యు దోషాన్ని తొలగించుకోగలుగుతాడు ఉపాసకుడు. మరణాన్ని ఎవరూ తప్పించుకోలేరు కాని అసహజ మరణాన్ని తప్పించుకోగలరు. అసహజ మరణాన్ని అపమృత్యువు అంటారు. ఏ రోడ్డు ప్రమాదంలోనో పోవటం, శరీరం నుజ్జు నుజ్జు అయిపోవటంవంటి మరణం సంభవించదు.

ఈ రెండు బ్రాహ్మణాలలో, వచ్చిన ఉపాసనలు వరుసగా – అశ్వ ఉపాసన, అగ్ని ఉపాసన,ఆదిత్య అగ్ని ఉపాసన.

## వేదప్రమాణ భాష్యం

వచ్చే బ్రాహ్మణములో ప్రాణ ఉపాసన గురించి వస్తుంది. దానికి వెళ్ళేముందు వేదప్రమాణభాష్యం చూద్దాము. ఇందులో శంకరులవారు పూర్వమీమాంసకులతో చర్చను జరుపుతారు. వీరినే పూర్వపక్షి అని కూడా అంటారు. ఈ పూర్వమీమాంసకులు, వేదపూర్వభాగాన్ని నమ్ముతారు. వారు కర్మకాండకు పెద్దపీట వేస్తారు.

శంకరాచార్యులవారి వాదన చూసేముందు, పూర్వమీమాంసకుల వాదన గురించి తెలియాలి.

పూర్వమీమాంసకులు, వేదం కేవలం యజ్ఞాలనే బోధిస్తుందనీ, యజ్ఞాల గురించి చెప్పని భాగాలు అనవసరమనీ అంటారు. ఈ వాదనను బలపరచుకోవటానికి వారు రెండు సాంకేతిక పదాలను వాడుతారు అంటే వేదం చెప్పిన వాక్యాలను, వారు రెండుగా విభజించారు. విధివాక్యాలు, అర్థవాదవాక్యాలు.

**విధివాక్యాలు** – విధివాక్యాలు అంటే వేదం నిర్దేశించిన కర్మలు. కర్మలు చేయమని చెప్పే వాక్యాలే ముఖ్యమైనవి. వాటినే **ప్రమాణం** అంటారు.

**అర్థవాదవాక్యాలు** – కర్మలు చేయమని చెప్పని వాక్యాలు అనవసరమైనవి. ఏదైనా దేవతను వర్ణించేవి, కథలు ఉన్న భాగాలు – యిలాంటివి సత్యాలు కావు. అందుకని వాటిని **అప్రమాణం** అంటారు. పూర్వమీమాంసకుల దృష్టిలో ఇంద్రుడు, వరుణుడువంటి దేవతలు లేరు. ఆ మాటకొస్తే వారి దృష్టిలో ఈశ్వరుడే లేడు. ఇంద్రాయ స్వాహా, వరుణాయ స్వాహా పదాలు యజ్ఞాలు చేసినప్పుడే ఉపయోగం, ఎందుకంటే అవి యజ్ఞఫలాలను ఇస్తాయి.

ఆ విధంగా పూర్వమీమాంసకులు వేదాలను నమ్ముతారు కాని, దేవుణ్ణి నమ్మరు. దేవుణ్ణి నమ్మని వారిని నాస్తికులనుకుంటాము. కాని శాస్త్రప్రకారం నాస్తికులు వేరు. దేవుణ్ణి నమ్మనివారు కాదు. శాస్త్రాన్ని నమ్మనివారిని నాస్తికులు అంటున్నది శాస్త్రం. అందువల్ల పూర్వమీమాంసకులు ఆస్తికులలోకే వస్తారు.

మరి దేవుణ్ణి నమ్మకపోతే, కర్మ ఫలదాత ఎవరు? వారి దృష్టిలో – **కర్మ ఏవ కర్మ ఫలదాత.** కర్మ చేస్తేనే కర్మఫలం వస్తుంది. అగ్నిమీద నీరు పెడితే నీరు వేడెక్కుతుంది. ఇందులో భగవంతుని ప్రమేయం ఏం ఉంది? ఒక రాయిని విసిరితే, అది క్రిందికి పడుతుంది. ఇందులో భగవంతుని పాత్ర ఏం ఉంది? ఈశ్వరుని గురించి వేదం ఎందుకు చెబుతుంది? అందువల్ల ఇది అర్థవాద భాగం. అలాగే, రాబోయే కథలో ప్రాణానికి అనేక గుణాలు ఉన్నాయని చెబుతుంది. అవి సత్యం కాదు కాబట్టి అది కూడా **అర్థవాద భాగమే.** అందువల్ల వీటిని ప్రమాణంగా తీసుకోకూడదు అంటారు వారు. ఇది పూర్వమీమాంసవాదం.

ఇది నిరూపించటానికి పూర్వమీమాంసకులు ఒక వాదన చెబుతారు. ప్రమాణం అంటే జ్ఞానాన్ని ఇచ్చేది. వేదం ఒక ప్రమాణం అంటాము. వారి ప్రశ్న ఇది. వేదం ఒక ప్రమాణం అంటే మీరు వేదపదాలను ప్రమాణం అంటున్నారా, వేదవాక్యాలను ప్రమాణం అంటున్నారా? వారి జవాబు ఇది. పదం ఎన్నటికీ ప్రమాణం కాలేదు. వాక్యం మాత్రమే ప్రమాణం. ఇది వారి వాదన. నేను కొన్ని పదాలను వాడితే, ఆ పదాలు మీకు తెలిసినవైనా అయి ఉండవచ్చు. లేదా తెలియనివి అయినా అయి ఉండవచ్చు.

నేనొక పదం వాడితే దానిద్వారా నేనేమీ కొత్త జ్ఞానాన్నివ్వటం లేదు. ప్రత్యక్ష ప్రమాణంద్వారా మీకా పదం ముందే తెలుసు. వ్యవహారాన్ని ప్రత్యక్షం అంటారు. వ్యవహారంలో ఒక వస్తువుకూ, దాని నామానికి మధ్య సంబంధం తెలుస్తుంది మీకు. ఒక గడియారాన్ని చూస్తే, అది **గడియారం** అని మీకు తెలుస్తుంది. నేను నా చేతిలో గడియారం లేకపోయినా, గడియారం అనే పదం వాడితే, అది మీకు కొత్తగా జ్ఞానాన్ని ఇచ్చినట్టా, ముందే తెలిసిన దాన్ని గుర్తు చేసినట్టా? నేనేమీ మీకు కొత్తగా జ్ఞానాన్ని ఇవ్వటం లేదు. అందువల్ల **పదం ప్రమాణం కాదు.**

**సందేహం –** పదాలు ప్రమాణం కాకపోతే, వేదం ఒక ప్రమాణం ఎలా అవుతుంది? ఎలా అవుతుందంటే, వేదం పదంగా ప్రమాణం కాదు. వాక్యంగా ప్రమాణం. అంటే **వేదవాక్యాలు ప్రమాణాలు.** పదాలు ప్రమాణం కాకపోతే, వాక్యాలు ఎలా ప్రమాణం అయ్యాయి? వాక్యం అంటే ఏమిటి? కొన్ని పదాలను అర్థవంతంగా ఒకచోట ఏర్చి కూర్చటమే. అలాంటప్పుడు పదాలు కొత్తగా జ్ఞానం ఇవ్వనప్పుడు, అవే పదాలను ఒక వాక్యంలో పేరిస్తే మాత్రం ఎలా అది ప్రమాణం అవుతుంది?

**పూర్వ మీమాంసకుల జవాబు –** అవే పదాలు పేరిస్తే వాక్యం అవుతుంది. పదాల అర్థం కొత్తగా తెలియదు నిజమే కాని, ఆ పదాల మధ్య ఉన్న అనుబంధం తెలుస్తుంది. ఆ అనుబంధమే కొత్త జ్ఞానం అవుతుంది. ఒక వాక్యంలో వాటి స్థానాన్నిబట్టి ఇది కర్త అని, ఇది కర్మ అనీ, ఇది క్రియ అనీ నిర్ణయిస్తారు. వీటిని కారకాలు అంటారు. ఈ సంబంధాన్ని కారక సంబంధం అంటారు. ఇలా నిర్ణయించటాన్ని **సంసర్గ అర్థం** అంటారు.

ఉదా: రాముడు కప్పుతో నీరు త్రాగాడు.

రాముడు, కప్పు, నీరు పదాలు మీకు తెలిసినవే. కాకపోతే కొత్తగా తెలిసేది ఏమిటంటే రాముడు కర్త, నీరు కర్మ, త్రాగాడు క్రియ.

రాముడు నీటిలో మునిగిపోయాడు.

అదే నీరు రాముడు మునగటానికి కారణం అయింది. అందువల్ల పదాలు అవే అయినా, కారకాల మధ్య అనుబంధం మారుతుంది. వాక్యంలోని పదాలన్నీ క్రియమీద ఆధారపడి ఉంటాయి. క్రియ తీసేస్తే వాక్యానికి అర్థం లేదు. అందువల్ల వాక్యం ప్రమాణం, వాక్యం ఒక **అర్థవంతమైన అనుబంధం** గురించి చెబుతుంది.

ఇక్కడితో అవలేదు వాదన. వాక్యం ప్రమాణం అయితే, ఆ వాక్యంలో పనిని తెలిపే క్రియ ఒకటి ఉంటుంది. అందువల్ల వాక్యం ప్రమాణం, వాక్యానికి పనిని తెలిపే క్రియ ఉండి తీరాలి. అందువల్ల పనిచేయటం (కర్మ చేయటం) వేదంలో చాలా ముఖ్యమైన అంశం. పని చేయటం లేకపోతే క్రియ లేదు; క్రియ లేకపోతే వాక్యం లేదు. వాక్యం లేకపోతే ప్రమాణం లేదు. అందువల్ల వేదం కర్మప్రధానం అంటారు పూర్వమీమాంసకులు.

**శంకరాచార్యులవారి వాదన** – వేదపూర్వభాగం గురించి మాట్లాడేవారిని పూర్వమీమాంసకులు అంటారని చూశాము. శంకరాచార్యులవారి వాదన వేద అంతభాగం (వేదాంతం)మీద ఆధారపడి ఉంటుంది కాబట్టి దాన్ని ఉత్తరమీమాంస అంటారు. ఇందులో అద్వైతవాదన ఉంటుంది కాబట్టి అద్వైతం అని కూడా అంటారు. మనం శంకరాచార్యులవారి కోవలోకి వస్తాము కాబట్టి మనది అద్వైతసిద్ధాంతం.

పూర్వమీమాంసకులను ఖండించటానికి శంకరాచార్యులవారు మూడు అంశాలను తీసుకున్నారు.

**ఎ) అర్థవాద ప్రామాణ్యం** – ముందుగా శంకరులు పూర్వమీమాంసకుల వాదనను కొంతమేరకు ఒప్పుకుంటారు.

i) పదం ప్రమాణం కాదు, వాక్యమే ప్రమాణం.
ii) వాక్యానికి క్రియాపదం ఉండి తీరాలి. అది లేకపోతే అది వాక్యమే కాదు.

కాని అన్ని క్రియా పదాలు క్రియని సూచిస్తాయని ఎలా చెప్పగలరు అంటారు శంకరులు.

ఉదా. – గుడి తూర్పువైపున ఫర్లాంగు దూరంలో ఉంది.

శాస్త్రం చెప్పే ఉదాహరణ – పృథివిలో ఏడు ఖండాలు ఉన్నాయి. ఇవి వాక్యాలు. వీటిద్వారా నేను కొంత సమాచారం ఇస్తున్నాను, మీరు దాన్ని పొందుతున్నారు. కాని దీనిలో ఏ పని చేయమని ఉందో చెప్పండి? ఏమీ లేదు. 'అస్తి' అంటే 'ఉంది' అనే క్రియ ఒక సత్యాన్ని సూచిస్తుంది. అంటే సత్యాన్ని సూచించే వాక్యాల్లో క్రియాపదం ఉంటుంది. కాని క్రియను చేయమనదు. అలాటి వాక్యాలను **అస్తి గతిత్య క్రియారహిత వాక్యాని** అంటారు. అయినా అది వేదవాక్యం, ఒక ప్రమాణం. ఇది మీ నియమాన్ని ఉల్లంఘించటం లేదు.

ఏమిటా నియమం? ఒక వాక్యం ప్రమాణం అవాలంటే దానికొక క్రియాపదం ఉండాలి. ఏమిటా సడలింపు? వాక్యంలో క్రియాపదం ఉంది కాని, అది క్రియను చేయమని చెప్పదు. అది ఏ విధిని కాని, కర్మను కాని సూచించదు. అయినా విధిభిన్నవాక్యం కూడా ప్రమాణమే. ఇంద్రదేవత, వరుణదేవతలు సత్యాలే. ఊహాగానాలు కాదు.

**అర్థవాదం కూడా ప్రమాణమే.** ఇది మొదటి అంశం.

తర్వాత అర్థవాదాన్ని ప్రమాణం అనటానికి రెండు నియమాలు ఉండాలని శంకరాచార్యులవారు అన్నారు.

i) **ప్రమాణాంతర సంవాదం** – వేరే ప్రమాణాలద్వారా తెలిసిన విషయాన్ని అర్థవాదం మళ్ళీ నిరూపించకూడదు. మళ్ళీ అలా చెపితే దాన్ని అనువాదం అంటారు. ముందే తెలిసింది చెపితే, కొత్తగా నేర్చుకునేది ఏముంది? ఈ నియమాన్ని ప్రమాణాంతర సంవాదం అంటారు. అందువల్ల అర్థవాదం ముందే తెలిసినది చెప్పకూడదు.

ii) **ప్రమాణాంతర విసంవాదం** – వేరే ప్రమాణాలద్వారా తెలిసిన విషయాన్ని అర్థవాదం ఖండించకూడదు. అలా చేస్తే దాన్ని గుణవాదం అంటారు. అగ్ని చల్లగా ఉంది అనకూడదు. ఎందుకంటే అది మన అనుభవానికి భిన్నంగా ఉంటుంది. ఈ నియమాన్ని ప్రమాణాంతర విసంవాదం అంటారు. అందువల్ల అర్థవాదం ముందే తెలిసినదాన్ని ఖండించకూడదు.

**బోధార్థవాదం** – ఇటు అనువాదం గానీ, అటు గుణవాదం కానీ కాని వాక్యాలనే అర్థవాదం అంటారు. అటువంటి వాక్యాలను ప్రమాణంగా తీసుకుంటారు. ఇటువంటి వాక్యాలను **బోధార్థవాదం** అంటారు. అవి మనకు ప్రయోజనకరంగా ఉండకపోవచ్చు. ఇంద్రుడిని వజ్రహస్తుడిగా వర్ణిస్తారు. ఆ విషయం మనకు ప్రయోజనంగా ఉండకపోవచ్చు. కాని ఇది వాక్యం, ఇది ప్రమాణం. ఒక వాక్యంయొక్క ప్రామాణత్వం దాని ప్రయోజనత్వంమీద ఆధారపడి లేదు.

అందువల్ల **అర్థవాదాలు కూడా ప్రమాణమే.** అది బోధార్థవాదం అయితే, బోధార్థవాదం దానంతట అది ప్రయోజనాన్ని ఇవ్వకపోయినా, దాన్ని విధివాక్యాలతో కలిపితే ప్రయోజనం వస్తుంది. అందువల్ల ఈ బోధార్థవాదాన్ని **విధిశేషాలు** అంటారు. అలా పరోక్షంగా అర్థవాదాలు కూడా ప్రమాణమే.

**బి) వేదాంతవాక్య సామాన్యం – 'తత్త్వమసి', 'అహం బ్రహ్మాస్మి'** వంటి వేదాంతవాక్యాలు ప్రమాణమా కాదా?

**పూర్వమీమాంస వాదన** – పూర్వమీమాంసకుల ప్రకారం అది ప్రమాణం కాదు. ఎందుకంటే అవి దాని తరువాత ఏ కర్మనూ సూచించటం లేదు.

**శంకరాచార్యులవారి వాదన** – వేదాంతంలో కర్మ చేయమని చెప్పకపోయినా, అది సత్యం చెప్పే వాక్యం. సత్యం చెప్పే వాక్యంగా అది ప్రమాణమే. సత్యం చెప్పే వాక్యం రెండు నియమాలను ఉల్లంఘించకూడదు. అది ముందే తెలిసింది చెప్పకూడదు. (ప్రమాణాంతర సంవాదం); తెలిసిన దానికి భిన్నంగా ఉండకూడదు. (ప్రమాణాంతర విసంవాదం). ఇది రెండు నియమాలకూ సరిపోతుంది.

1) **ప్రమాణాంతర సంవాదం** – వేదాంతం నువ్వు అనంతం అంటుంది. అది మనకు తెలియదు. అంటే ముందే తెలిసినదాన్ని తిరిగి చెప్పటం లేదు. మనకు తెలిసిందల్లా అనాత్మ గురించి; వేదాంతం ఆత్మ గురించి చెబుతోంది.

2) **ప్రమాణాంతర విసంవాదం** – మనకు తెలిసింది జగత్తు గురించి, అది అనాత్మ. మనకు తెలిసింది శరీరం గురించి. అది అనాత్మ; మనకు తెలిసింది మనసు గురించి, అది అనాత్మ. అలా మన జ్ఞానమంతా అనాత్మకు చెందినది. వేదాంతం చెప్పేది ఆత్మ గురించి. అందువల్ల ఆత్మజ్ఞానానికి, అనాత్మజ్ఞానానికి మధ్య భేదం ఎలా వస్తుంది? మీరు రాముడు నాలుగు అడుగుల ఎత్తు ఉన్నాడని చెపితే, నేను రాముడు ఐదు అడుగుల ఎత్తు

ఉన్నాడని చెపితే, భేదం వస్తుంది. అందువల్ల వేదాంతం అనువాదమూ కాదు, గుణవాదమూ కాదు.అందువల్ల **వేదాంతం ప్రమాణం.**

**పూర్వమీమాంస వాదన –** వేదాంతం అనువాదము కాదు, గుణవాదమూ కాదు అంటే అది బోధార్థవాదం అవాలి. అంటే దాన్ని విధివాక్యంతో కలపాలి. కాని ఇక్కడ విధివాక్యం కనబడటం లేదు.

**శంకరాచార్యులవారి వాదన –** వేదాంతం బోధార్థవాదన కూడా కాదు. ఎందుకు? ఇంద్రుడు వజ్రాయుధం ధరించాడనేది బోధార్థవాదన.దానివల్ల మనకు ప్రత్యక్షంగా ఏమీ ప్రయోజనం లేదు. దాన్ని ఏదో కర్మతోనో, ఉపాసనతోనో కలపాలి. అప్పుడే దానికి ప్రయోజనం.

కాని వేదాంతవాక్యాల విషయంలో అలాకాదు. వేదాంతవాక్యాల్లోని జ్ఞానం విలువైనదే కాక, ఆ జ్ఞానమే ఫలాన్ని ఇస్తుంది. జ్ఞానమే ఫలాన్ని ఇస్తుంది కాబట్టి దాన్ని మళ్ళీ తీసుకువెళ్ళి వేరే విధివాక్యంతో కలపనవసరం లేదు.

అందువల్ల వేదాంతవాక్యం విధిశేషం కాదు, వేదాంతవాక్యం స్వతంత్రం. బోధార్థవాక్యాలు వేదపూర్వభాగంలోనే ఉంటాయి, పైగా అవి ఎక్కడ ఉంటే, వాటి వెంటే విధివాక్యాలు ఉంటాయి. కాని వేదాంతంలో, అసలు విధివాక్యాలు లేనేలేవు. ఎక్కడా 'అహం బ్రహ్మ అస్మి,' అని చెప్పాక, అందువల్ల హోమం చెయ్యి అని కాని, అందువల్ల 'అహం బ్రహ్మ అస్మి నామ జపం చెయ్యి,' అని కాని రాదు అంటే ఈ జ్ఞానం పొందాక, నువ్వు ఈ జ్ఞానాన్ని ప్రయోగించి ఏదైనా కర్మగానీ, ఉపాసన గానీ చేయాల్సిన పని లేదు.

అందువల్ల వేదాంతవాక్యం బోధార్థవాదం కాదు. వేదాంతవాక్యం **స్వతంత్ర ప్రమాణం.** వేదాంతవాక్యం ప్రమాణం, పైగా దాని ఫలంకోసం దేనిమీదా ఆధారపడనవసరం లేదు. దీన్ని **వేదాంత వాక్యసామాన్యం** అంటారు.

**సి) నిషేధవాక్య ప్రామాణ్యం –** ఇంతవరకూ పూర్వమీమాంసకులు చెప్పిన దాన్ని ఖండిస్తూ వచ్చారు శంకరాచార్యులవారు. ఇప్పుడు ఆయనే ఎదురుప్రశ్న వేస్తారు. పూర్వమీమాంసకుల వాదనే తీసుకుని, వారినే ప్రశ్నిస్తారు.

పూర్వమీమాంసకుల వాదన ఏమిటి? వేదవాక్యం ఏదైనా కర్మను సూచిస్తేనే అది ప్రమాణం అన్నారు. **అలా అయితే నిషేధవాక్యం ప్రమాణమా కాదా?** ఇది పూర్వమీమాంసకులకు శంకరాచార్యులవారు వేసిన ప్రశ్న. నిషేధవాక్యాలు అంటే అసత్యం చెప్పవద్దు; ఇతరులను హింసించవద్దు; ఇతరులను చంపవద్దు మొదలైనవి. ఇందులో కొత్తగా చేయమని చెప్పే కర్మ ఏముంది? నిజానికి కర్మ చేయవద్దని చెప్తోంది.

నిషేధవాక్యాన్ని ప్రమాణంగా స్వీకరిస్తే అందులో కర్మ ఏముంది? 'అసత్యం చెప్పవద్దు' అంటే ఒక పనిని చేయవద్దు అంటోంది. చేయవద్దు అనేది చేయటం కాదు కదా! ఇప్పుడు నిషేధవాక్యం ఇష్టవిషయమా లేక అనిష్టవిషయమా?

1. **అనిష్టవిషయం** – అది ఒకవేళ అనిష్టవిషయం అయితే, ఎవరూ దాన్ని చేయాలనుకోరు. అప్పుడు దాని గురించి నిషేధవాక్యం అనవసరం.

2. **ఇష్టవిషయం** – అది ఒకవేళ ఇష్టవిషయం అయితే, అందరూ దాన్ని చేయాలనుకుంటారు. అందరూ చేయాలనుకునే దానికి నిషేధవాక్యం ఉండకూడదు.

అలా అయితే నిషేధవాక్యం ఎప్పుడు ఉండాలి? నిషేధవాక్యం ఒక ప్రత్యేక పరిస్థితిలో ఉండాలి. చేయకూడని పనిని చేయాల్సిన పనిగా భావించి, ఒక వ్యక్తి దానిని చేస్తుంటే, అప్పుడు ఆ పనిని ఆపటానికి నిషేధవాక్యం కావాలి.

పొగత్రాగటం హానికరం కాని, పొగత్రాగేవారు అధికం. వారిని పొగత్రాగే చర్యనుంచి ఆపటానికి **'ధూమపానం నిషేధం'**,వంటి నిషేధవాక్యాలు కావాలి. అంటే భ్రాంతిలో పడి చేసే పనులను ఆపటానికి కావాలి.

నిషేధవాక్యాలను వినటంవల్ల, ఆ పని హానికరం, మంచిది కాదు అని తెలుస్తుంది. నిషేధవాక్యం ఎప్పుడైతే జ్ఞానాన్ని ఇస్తుందో, అప్పుడే భ్రాంతిజ్ఞానం తొలగిపోతుంది. నిషేధవాక్యాన్ని అనిష్టబోధవాక్యం అనవచ్చు. ఒక చెడ్డపని అనిష్టంలోకి వస్తుందని తెలుసుకుంటే, దానిమీద భ్రాంతి తొలగి, దానిమీద ఇష్టం పోతుంది. భ్రాంతి పోతే భ్రాంతి ప్రవృత్తి నాశనం జరుగుతుంది. జ్ఞానంచేతనే అన్ని అనర్థాలకూ దూరమవుతాడు.

అందువల్ల ఏమీ కర్మ చేయనవసరం లేకుండానే **నిషేధవాక్యం ప్రమాణం.** ఒకవేళ పూర్వమీమాంసకులు కర్మ చేయకపోవటం కూడా ఒక విధమైన కర్మే అంటే, అప్పుడు విధివాక్యాలకూ, నిషేధవాక్యాలకూ భేదం ఏముంటుందంటారు శంకరాచార్యులవారు. అందువల్ల నిషేధవాక్యం ఒక ప్రమాణం. అలాగే వేదవాక్యం కూడా ప్రమాణం. పనిచేయమన్నా, చేయమనకపోయినా వేదవాక్యాలు ప్రమాణమే. ప్రమాణంగా ఉంటే అది అనువాదవాక్యం లేదా గుణవాక్యం కాకూడదు అంతే.

అగ్ని వేడిగా ఉంది అని చెపితే అది ప్రమాణం కాదు, మనకు ముందే తెలుసు. అగ్ని చల్లగా ఉంది అని చెపితే అది కూడా ప్రమాణం కాదు. ఎందుకంటే, అది అనుభవానికి భిన్నంగా ఉంది. అందువల్ల ఈ రెండు రకాలు కాని అర్థవాదవాక్యాలు ప్రమాణాలు.

**ప్రమాణ భాష్యం టూకీగా –**

1. అనువాదం, గుణవాదం కాని వేదాంతవాక్యాలన్నీ వేదప్రమాణవాక్యాలే.
2. వేదప్రమాణవాక్యాలు నాలుగు రకాలు. ఈ నాలుగూ పై లక్షణాలను కలిగి ఉన్నాయి.

ఎ) విధివాక్యాని, బి) నిషేధవాక్యాని, సి) బోధార్థవాక్యాని, డి) వేదాంతవాక్యాని

నాలుగు ప్రమాణవాక్యాల్లో కొన్ని సమాన లక్షణాలున్నాయి, కొన్ని భిన్న లక్షణాలున్నాయి.

**సమాన లక్షణం** – నాలుగూ ప్రమాణవాక్యాలు.

**భిన్న లక్షణాలు**

విధివాక్యాని - కొన్ని కర్మలను నిర్దేశిస్తుంది. దానివల్ల సుఖం కలుగుతుంది.
నిషేధవాక్యాని - కొన్ని కర్మలను నిషేధిస్తుంది. దానివల్ల దుఃఖం కలగకుండా రక్షిస్తుంది.
వేదాంతవాక్యాని - ఆత్మజ్ఞానం బోధిస్తుంది. దానివల్ల మోక్షం కలుగుతుంది.
బోధార్థవాక్యాని - కొన్ని విషయాల గురించి చెబుతుంది. దాన్ని పై మూడింటిలో దేనితోనైనా కలుపుకోవాలి.

**1. అనన్యశేషం - అన్యశేషం**

ఈ నాలుగు ప్రమాణవాక్యాలలో మొదటి మూడూ స్వతంత్ర ప్రమాణవాక్యాలు. అంటే విధివాక్యాలు, నిషేధవాక్యాలు, వేదాంతవాక్యాలు స్వతంత్రంగా పనిచేస్తాయి. వాటిని అనన్యశేషం అంటారు. బోధార్థవాక్యాలు ప్రమాణవాక్యాలే కాని, అవి స్వతంత్రంగా ఫలాన్ని ఇవ్వవు. వాటిని పై మూడింటిలో దేనికో దానికి కలపాలి. ఉదాహరణకు సృష్టిబోధార్థవాదం, అది తత్ పద విచారానికి తోడ్పడుతుంది.

**2. కార్యపరం - అకార్యపరం**

ఈ నాలుగు ప్రమాణవాక్యాలలో మొదటి వాక్యాలు మాత్రమే కార్యాన్ని సూచించే ప్రమాణవాక్యాలు. అంటే విధివాక్యాలు. వీటిని కార్యపరం వాక్యాలు అంటారు. తక్కిన మూడూ ఏ కార్యాన్నీ సూచించవు. ఇవి అంటే నిషేధవాక్యాలు, వేదాంతవాక్యాలు, బోధార్థవాక్యాలు - ఏ కార్యాన్నీ నిర్దేశించవు. అందువల్ల వీటిని అకార్యపరం అంటారు.

ఈ భాష్యం ఎందుకు వచ్చింది? శాస్త్రంలో ఏమీ కారణం లేకుండా, అసలు విషయం వదిలేసి, పక్కకు వెళ్ళకూడదు. అందువల్ల కారణం ఏమిటో కూడా తెలుసుకోవాలి.

రాబోయే బ్రాహ్మణములో ప్రాణ ఉపాసన చర్చ వస్తుంది. అందులో ప్రాణానికి ఉన్న కొన్ని గుణాలను ఒక కథద్వారా స్తుతించటం జరుగుతుంది. ఇటువంటి వాక్యాలను ఏ వాక్యం అంటారు?

**విధివాక్యం** - కాదు, ఎందుకంటే ఏమీ క్రియను నిర్దేశించటం లేదు.
**నిషేధవాక్యం** - కాదు, ఎందుకంటే ఏదీ చేయవద్దని చెప్పటం లేదు.
**వేదాంతవాక్యం** - కాదు, ఎందుకంటే తత్త్వమసి అని మహావాక్యం చెప్పటం లేదు.
**బోధార్థవాదవాక్యం** - అవును. హిరణ్యగర్భగుణాలు అనువాదం కాదు, గుణవాదం కాదు.

హిరణ్యగర్భ గురించి మనకు తెలియదు, చెప్పిన జ్ఞానాన్ని ఖండించనూ లేదు. ఉద్గీథ బ్రాహ్మణము బోదార్థవాక్యం అని చెప్పటానికి ఈ భాష్యం చెప్పారు శంకరాచార్యులవారు.

# 1.3 - ఉద్గీథ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో ప్రాణ ఉపాసన వస్తుంది. ప్రాణం అంటే సమష్టి ప్రాణం లేదా హిరణ్యగర్భ. ప్రాణానికి కొన్ని గుణాలను ఆపాదించి ఆ గుణాలమీద ఉపాసన చేయాలి. దీన్ని **గుణవిశిష్ట ప్రాణ ఉపాసన** అంటారు. ప్రాణంయొక్క గుణాలను వివరించటానికి కొన్ని కథలు చెప్పబడ్డాయి ఇక్కడ.

ఈ బ్రాహ్మణంలో చెప్పబడిన కథల్లోని గుణాలను సత్యంగా తీసుకోవాలా, కేవలం ఊహాగానంగా తోసివేయాలా అనే విషయం చెప్పటానికి ఆదిశంకరాచార్యులు తన భాష్యంలో వేదప్రమాణంమీద చర్చను జరిపారు.దాన్ని ఇంతకుముందు చూశాము.

ఇంతవరకూ మూడు భాష్యాలను చూశాము. మొదటి బ్రాహ్మణంలో సంబంధ భాష్యాన్ని, రెండో బ్రాహ్మణంలో ఘటభాష్యాన్నీ చూశాము. మూడవ బ్రాహ్మణానికి వేదప్రమాణభాష్యాన్ని చూశాము.

మంత్రం 1.3.1

**ద్వయా హ ప్రాజాపత్యా దేవాశ్చాసురాశ్చ ॥**
**తతః కానీయసా ఏవ దేవా జ్యాయసా అసురాః ॥**
**త ఏషు లోకేష్వస్పర్ధన్త ॥**
**తే హ దేవా ఊచుర్హన్తాసురాన్ యజ్ఞ ఉద్గీథేనాత్యయామేతి ॥**

మంత్రం 1.3.2

**తే హ వాచమూచుస్త్వం న ఉద్గాయేతి ॥**
**తథేతి తేభ్యో వాగుదగాయత్। యో వాచి భోగస్తం దేవేభ్య ఆగాయద్యత్కల్యాణం వదతి తదాత్మనే॥**
**తే విదురనేన వై న ఉద్గాత్రాఽఽత్యేష్యంతీతి తమభిద్రుత్య పాప్మనాఽవిధ్యన్ స యస్స పాప్మా యదేవేదమప్రతిరూపం వదతి స ఏవ స పాప్మా ॥**

మంత్రం 1.3.3

**అథ హ ప్రాణమూచుస్త్వం న ఉద్గాయేతి తథేతి తేభ్యః ప్రాణ ఉదగాయద్యః ప్రాణే భోగస్తం దేవేభ్య ఆగాయద్యత్కల్యాణం జిఘ్రతి తదాత్మనే । తే విదురనేన వై న ఉద్గాత్రాఽత్యేష్యన్తీతి తమభిద్రుత్య పాప్మనాఽవిధ్యన్ స యస్స పాప్మా యదేవేదమప్రతిరూపం జిఘ్రతి స ఏవ స పాప్మా ॥**

మంత్రం 1.3.4

**అథ హ చక్షురూచుస్త్వం న ఉద్గాయేతి తథేతి తేభ్యశ్చక్షురుదగాయత్। యశ్చక్షుషి భోగస్తం దేవేభ్య ఆగాయద్యత్కల్యాణం పశ్యతి తదాత్మనే । తే విదురనేన వై న ఉద్గాత్రాఽత్యేష్యన్తీతి తమభిద్రుత్య పాప్మనాఽవిధ్యన్ స యస్స పాప్మా యదేవేదమప్రతిరూపం పశ్యతి స ఏవ స పాప్మా ॥**

మంత్రం 1.3.5

**అథ హ శ్రోత్రమూచుస్త్వం న ఉద్గాయేతి తథేతి తేభ్యశ్శ్రోత్రముదగాయత్ । యచ్ఛ్రోత్రే భోగస్తం దేవేభ్య ఆగాయద్యత్కల్యాణగ్ం శృణోతి తదాత్మనే । తే విదురనేన వై న ఉద్గాత్రాఽత్యేష్యన్తీతి తమభిద్రుత్య పాప్మనాఽవిధ్యన్ స యస్స పాప్మా యదేవేదమప్రతిరూపగ్ం శృణోతి స ఏవ స పాప్మా ॥**

మంత్రం 1.3.6

**అథ హ మన ఊచుస్త్వం న ఉద్గాయేతి తథేతి తేభ్యో మన ఉదగాయత్ । యో మనసి భోగస్తం దేవేభ్య ఆగాయద్యత్కల్యాణం సంకల్పయతి తదాత్మనే । తే విదురనేన వై న ఉద్గాత్రాఽ త్యేష్యన్తీతి తమభిద్రుత్య పాప్మనాఽవిధ్యన్ స యస్స పాప్మా యదేవేదమప్రతిరూపగ్ం సంకల్పయతి స ఏవ స పాప్మా ॥ ఏవము ఖల్వేతా దేవతాః పాప్మభిరుపాసృజన్నేవమేనాః పాప్మనాఽవిధ్యన్ ॥**

మంత్రం 1.3.7

**అథ హేమమాసన్యం ప్రాణమూచుస్త్వం న ఉద్గాయేతి తథేతి తేభ్య ఏష ప్రాణ ఉదగాయత్తే విదురనేన వై న ఉద్గాత్రాఽత్యేష్యన్తీతి తమభిద్రుత్య పాప్మనాఽవివ్యత్సన్ స యథాఽశ్మానమృత్వా లోష్టో విధ్వగ్ంసేతైవగ్ం హైవ విధ్వగ్ంసమానా విష్వఞ్చో వినేశుః ॥**
**తతో దేవా అభవన్ పరాఽసురాః ॥**
**భవత్యాత్మనా పరాఽస్య ద్విషన్ భ్రాతృవ్యో భవతి య ఏవం వేద ॥**

దేవతలు, అసురులు మధ్య జరిగిన కథ ఇది. ఇద్దరూ ప్రజాపతి పిల్లలే. మామూలుగా దేవాసురులు వేరు వేరు లోకాల్లో ఉంటారు. కాని ఇది ఆధ్యాత్మికంగా (వ్యక్తిపరంగా) చెప్పబడ్డ కథ. అందుకని వారు మన ఇంద్రియాలు, ప్రాణం. ఈ ఇంద్రియాలు ప్రజాపతికి లేదా హిరణ్యగర్భకు చెందినవి. అది కూడా ఎలాంటి హిరణ్యగర్భ? పూర్వజన్మలో మామూలు జీవిగా ఉండి, తన ఉపాసన ఫలంవల్ల హిరణ్యగర్భగా మారినవ్యక్తి. దీన్నిబట్టి హిరణ్యగర్భ కూడా ఒక పదవి అని తెలుస్తున్నది. హిరణ్యగర్భగా ఉపాసన చేసినవ్యక్తి హిరణ్యగర్భగా అవుతాడు అని ఉపాసనల్లో చూస్తాము. హిరణ్యగర్భ అంటే హిరణ్యగర్భ పదవికి ఎదిగిన మామూలు జీవి.

ఒకే ఇంద్రియాన్ని అటు దేవతగానూ, ఇటు అసురునిగానూ ఎలా వర్ణిస్తారు? దాని స్వభావాన్నిబట్టి నిర్ణయిస్తారు. అలా అయితే ఏ స్వభావాన్ని దైవీస్వభావంగానూ, ఏ స్వభావాన్ని ఆసురీస్వభావంగానూ చూస్తారు? శాస్త్రజ్ఞానంవల్ల సంస్కరించబడ్డ శాస్త్రీయకర్మను లేదా జ్ఞానాన్ని దేవతలు అంటారు. అలాగే స్వాభావికంగా ఉన్న జ్ఞాన, కర్మలను అసురులు అంటారు.

కాబోయే ప్రజాపతిలో దేవాసురులు ఉన్నారు. మామూలుగా రెండు గుణాలూ ఉన్నా, ఏ గుణాలు అధికశాతంలో ఉంటే, ఆ గుణాలనుబట్టి దేవతగానో, అసురునిగానో ఆ వ్యక్తిని భావిస్తారు. అసురులు స్వార్థపరులుగా, హింసాత్మకంగా ప్రవర్తిస్తారు. వారి సంఖ్య అధికం. దేవతలు బలహీనులు, వారి సంఖ్య తక్కువ. అందువల్ల దేవతలు అసురులమీద గెలవాలనుకున్నారు. ఇంద్రియాలలో ఉన్న దేవతలు, ఇంద్రియాలను ఉపాసన చేయమన్నారు. వారు చేసిన ఉపాసన పేరు ఉద్గీథ ఉపాసన. ఉద్గీథ అంటే ఓంకారం, ప్రణవం. కానీ ఓంకారానికి, ఉద్గీథకు మధ్య చిన్న భేదం ఉంది. సామవేదంలో సామగానం చేసే ఓంకారాన్ని ఉద్గీథ అంటారు. (ఇంచుమించు ఇదే కథ ఛాందోగ్య ఉపనిషత్తులో కూడా వస్తుంది.)

ఏయే ఇంద్రియాలు ఉపాసన చేశాయి? 2వ మంత్రంలో వాక్కు; 3లో ప్రాణం (ఇక్కడ ఘ్రాణేంద్రియం); 4లో కన్ను; 5లో చెవి; 6లో మనస్సు చేశాయి. ఒక కర్మేంద్రియం, మూడు జ్ఞానేంద్రియాలు, ఒక మనస్సు.

అలా ఇంద్రియాలు ఉపాసన చేయటం మొదలుపెట్టగానే వాటిలో ఉన్న అసురులకు ఖంగారు పుట్టింది. దాంతో ఈ ఇంద్రియాలను ఉపాసన చేయనీయకుండా, అడ్డం పడ్డాయి. ఎలా అడ్డం పడ్డాయి?

**పాప్మనా౨ విధ్యన్** – చెడు ఆలోచనలు కలుగచేయటంద్వారా ఇంద్రియాలకు అడ్డం పడ్డాయి. చెడుపనులు, చెడు ఆలోచనలు రావటం మొదలు పెట్టాయి. మంచి విషయాలను చూసే కళ్ళు చెడ్డ విషయాలను చూస్తాయి; మంచి విషయాలను వినేచెవులు, పుకార్లను వింటాయి. పూజ చేస్తున్నా కూడా, హఠాత్తుగా దృష్టి మరలుతుంది. వేదాంతబోధకు వెళ్ళినప్పుడు, అక్కడ కుటుంబ విషయాలు చర్చిస్తే అది ఆసురీ ఆలోచన అవుతుంది. అదే కుటుంబంలో ఉండగా మంచి ఆలోచనే. అలాగే కర్మేంద్రియాలు కూడా చెడుపనులు చేస్తాయి. అలా ఈ ఇంద్రియాలు, ఈ మనస్సు వాటి ఉపాసన చేయలేకపోయేసరికి, అవన్నీ ప్రాణం దగ్గరికి వెళ్ళాయి. ప్రాణం అంటే ముఖ్య ప్రాణం లేదా ప్రాణతత్త్వం. దేవతలు ప్రాణాన్ని ఉద్గీథ ఉపాసన చేయమనే కోరారు. ప్రాణం ఉపాసన మొదలుపెట్టగానే, అసురులు వచ్చారు ప్రాణాన్ని ఆటంకపరచటానికి. కాని ఈ సారి వారు ప్రాణశక్తిని ఏమీ చేయలేకపోగా, వారే నాశనమయ్యారు.

ఉపనిషత్తు దీన్ని వర్ణించటానికి, ఒక ఉదాహరణ ఇస్తున్నది. అది ఒక బండరాయిమీద ఒక మట్టిముద్దను విసిరినట్టుగా ఉందిట. ఒక మట్టిముద్దను గాజుముక్కమీద విసిరితే, గాజు పగులుతుంది; కాని అదే మట్టిముద్దను ఒక బండరాయిమీద విసిరితే అది బండరాయిని పగులకొట్టలేకపోగా, అదే పగిలిపోతుంది. ఇక్కడ అసురులు మట్టిముద్దలాంటివారయితే, ప్రాణం బండరాయి వంటిది. ఉద్గీత ఉపాసన చేయటంవల్ల ప్రాణాన్ని అసురులు ఏమీ చేయలేకపోయారు.

అసురులు, వారి చెడు ఆలోచనలు ప్రాణాన్ని ఏమీ చేయలేకపోయాయి కాబట్టి ప్రాణం **శుద్ధం.** ప్రాణం ప్రతిఒక్కరిలోనూ శుద్ధంగానే ఉంటుంది. అది నేరస్థునిలోనైనా, సాధువులోనైనా కూడా. ఒక వ్యక్తిని నేరస్థుడు అని అన్నామంటే, అతని జ్ఞానేంద్రియాలో, కర్మేంద్రియాలో చెడుపని చేస్తున్నాయన్నమాట. ఒక వ్యక్తిని అతని పంచకర్మేంద్రియాలనుబట్టి, పంచజ్ఞానేంద్రియాలనుబట్టి, అంతఃకరణనుబట్టి మంచివాడో చెడ్డవాడో నిర్ణయిస్తారు. ప్రాణం మాత్రం శుద్ధమే. అందుకే ప్రాణ ఉపాసన చేస్తే, అతన్ని చెడు ఏమీ చేయలేదు.

**1. ప్రాణం గొప్పదనం – విశుద్ధత్వం**

మంత్రం 1.3.8

తే హోచుః క్వ ను సోఽభూద్యో న ఇత్థమసక్తేత్యయమాస్యేఽంతరితి సోఽయాస్య ఆఙ్గిరసోఽఙ్గానాగ్ం హి రసః ॥

మంత్రం 1.3.9

సా వా ఏషా దేవతా దూర్నామ దూరగ్ం హ్యస్యా మృత్యుర్దూరగ్ం హ వా అస్మాన్మృత్యుర్భవతి య ఏవం వేద ॥

మంత్రం 1.3.10

సా వా ఏషా దేవతైతాసాం దేవతానాం పాప్మానం మృత్యుమపహత్య యత్రాఽఽసాం దిశామన్తస్తద్గమయాఞ్చకార తదాసాం పాప్మనో విన్యదధాత్తస్మాన్న జనమియాన్నాన్తమియాన్నేత్పాప్మానం మృత్యుమన్వవాయానీతి ॥

మంత్రం 1.3.11

సా వా ఏషా దేవతైతాసాం దేవతానాం పాప్మానం మృత్యుమపహత్యాథైనా మృత్యుమత్యవహత్ ॥

మంత్రం 1.3.12

స వై వాచమేవ ప్రథమామత్యవహత్సా యదా మృత్యుమత్యముచ్యత సోఽగ్నిరభవత్సోఽయమగ్నిః పరేణ మృత్యుమతిక్రాన్తో దీప్యతే ॥

మంత్రం 1.3.13

అథ ప్రాణమత్యవహత్స యదా మృత్యుమత్యముచ్యత స వాయురభవత్సోఽయం వాయుః పరేణ మృత్యుమతిక్రాన్తః పవతే ॥

మంత్రం 1.3.14

అథ చక్షురత్యవహత్తద్యదా మృత్యుమత్యముచ్యత స ఆదిత్యోఽభవత్సోఽసావాదిత్యః పరేణ మృత్యుమతిక్రాన్తస్తపతి ॥

మంత్రం 1.3.15

అథ శ్రోత్రమత్యవహత్తద్యదా మృత్యుమత్యముచ్యత తా దిశోభవగ్ంస్తా ఇమా దిశః పరేణ మృత్యుమతిక్రాన్తాః ॥

## మంత్రం 1.3.16

**అథ మనోఽత్యవహత్తద్యదా మృత్యుమత్యముచ్యత స చంద్రమా అభవత్సోఽసౌ చన్ద్రః పరేణ మృత్యుమతిక్రాన్తో భాత్యేవగ్ం హ వా ఏనమేషా దేవతా మృత్యుమతివహతి య ఏవం వేద॥**

ఈ మంత్రాల్లో కూడా ప్రాణ విశుద్ధత్వమే చెప్పబడింది కాని, వేరే పద్ధతిలో చెప్పబడింది. ఒక విధంగా, అది ముందు మంత్రాల్లో చెప్పబడిన విశుద్ధత్వానికి వివరణ. ఈ విశుద్ధత్వాన్ని చూపించటానికి, ఉపనిషత్తు ప్రాణానికి ఒక ప్రత్యేకమైన బిరుదును ఇచ్చింది. **'దూర్నామత్వమ్'** దాని పేరు. **'దూర్,'** అంటే 'దూరం.'

ప్రాణంకు దూరంగా ఉంది అనే పేరు ఎందుకు వచ్చింది? అది అశుద్ధత్వానికి దూరంగా ఉంది కాబట్టి. ఈ సందర్భంలో అశుద్ధిని మృత్యువు అంది. ఆ విధంగా ప్రాణం చెడు ఆలోచనలనే అశుద్ధానికి దూరంగా ఉంది. చెడు ఆలోచనలను మృత్యువు అని ఎందుకు అన్నారంటే చెడు ఆలోచనలు మననే కాక, అందరినీ చంపుతాయి.

ఈ విషయం కూడా ఒక కథ రూపంలో చెప్పబడింది.

ప్రాణం శుద్ధం అని తెలిశాక, ఇంద్రియాలు లేదా కరణాలు, ప్రాణ ఉపాసన చేయటం మొదలుపెట్టాయి. ముందేమో ఉద్గీథ ఉపాసన చేయటానికి ప్రయత్నించాయి కాని, అసురులు పడనివ్వలేదు కదా, అందుకని ఇప్పుడు విశుద్ధ ప్రాణ ఉపాసన చేస్తున్నాయి.

ఇప్పుడు కూడా అసురులు దండెత్తటానికి వచ్చారు కాని, ప్రాణదేవత దయవల్ల, అసురులు ఓడిపోయి, పారిపోయారు. అసురులు అంటే చెడు ఆలోచనలు, చెడుపనులు అని అంతకుముందు చూశాము. అసురులు అంటే ఈ సందర్భంలో స్వార్థపూరిత ఆలోచనలు. దీన్నే వ్యష్టి అభిమానం అంటారు. ప్రపంచంలో ఏం జరిగినా ఫర్వాలేదు. నాకేమీ అవకుండా ఉంటే చాలు. నేనూ, నా కుటుంబం బాగుంటే చాలు– ఇటువంటి వ్యష్టి అభిమానాన్ని మృత్యువు లేదా పాపం లేదా చెడు ఆలోచన అంటారు.

ప్రాణ ఉపాసన చేయటంవల్ల ప్రాణదేవత ఒక్కొక్క ఇంద్రియంలోని చెడుని తొలగించింది. అన్ని ఇంద్రియాలూ శుద్ధమయ్యాయి. ఎప్పుడైతే ఇంద్రియాలు శుద్ధమయ్యాయో, అప్పుడే అవి ఇంద్రియ దేవతలు అయ్యాయి. అంటే వ్యష్టి అభిమానం ఉంటే, అవి ఇంద్రియాలు; వ్యష్టి అభిమానం పోయి సమష్టిపరంగా ఆలోచిస్తే, అవి దేవతలు. వ్యష్టి అభిమానాన్ని ఆధ్యాత్మం అనీ, సమష్టి అభిమానాన్ని అధిదైవం అనీ అంటారు. అధ్యాత్మ ఇంద్రియాలు ప్రాణ ఉపాసన చేసిన తర్వాత అధిదైవాలు అవుతాయి. ఉదాహరణకు చక్షురింద్రియం సూర్యదేవత. వాగింద్రియం అగ్నిదేవత అయ్యాయి. ప్రాణం వాటిలో ఉన్న చెడును కడిగివేసింది.

ఆ విధంగా వ్యష్టి అభిమానం పోవటంతో ఉపాసకుడు హిరణ్యగర్భ అవుతాడు. ఈ మాటను రెండు విధాలుగా అర్థం చేసుకోవచ్చు. వ్యావహారికంగా చూస్తే వ్యష్టి అభిమానం పోయి సమష్టి అభిమానం ఏర్పడుతుంది. ఇది జీవించి ఉండగా కలిగే ఫలం. రెండో ఫలం, మరణించాక హిరణ్యగర్భ పథం పొందుతాడు. ఇదే తేలిక భాషలో చెప్పాలంటే, ఒక వ్యక్తి ప్రాణోపాసన చేస్తే, అతనిలో స్వార్థం పోయి, సమష్టిపరంగా ఆలోచిస్తాడు. వ్యష్టి సమష్టి అవుతుంది, జీవుడు హిరణ్యగర్భ అవుతాడు.

ప్రాణం ఎప్పుడైతే స్వార్థాన్ని తొలగిస్తుందో, అప్పుడే దానికి 'దుర్' అనే బిరుదు వస్తుంది. ప్రాణం ఉపాసకుని లోని చెడు ఆలోచనలన్నింటినీ ఊరు పొలిమేరల్లోకి పారద్రోలుతుంది. అంటే చెడు ఆలోచనలను పారద్రోలుతుంది. ఎక్కడ వైదికులు ఉంటారో, అక్కడ చెడు ఆలోచనలు చేరలేవు. ఎక్కడ అవైదికం ఉంటుందో, అక్కడ చెడు ఆలోచనలు విజృంభిస్తాయి. అవైదికం అంటే వేదసంస్కృతిని పాటించకపోవటం. అందుకని అలాంటిచోట్లకి వెళ్ళకూడదు. అలాంటి చోట్ల, వ్యష్టి అభిమానం బలంగా ఉంటుంది; ప్రాణ ఉపాసన జరుగదు. మీరు అలాంటి చోట్లకి వెళితే, మిమ్మల్ని కూడా చెడు మార్గంలోకి లాగే ప్రమాదం ఉంది. అన్ని ఇంద్రియాలు, వైదికులు స్వార్థం నుంచి బయటపడాలని చూస్తారు.

**2. ప్రాణం గొప్పదనం – దూర్నామత్వం**

మంత్రం 1.3.17

**అథాఽఽత్మనేఽన్నాద్యమాగాయద్యద్ధి కించాన్నమద్యతేఽనేనైవ తదద్యత ఇహ ప్రతితిష్ఠతి ।**

మంత్రం 1.3.18

**తే దేవా అబ్రువన్నేతావద్వా ఇదగ్ం సర్వం యదన్నం తదాత్మన ఆగాసీరను నోఽస్మిన్నన్న ఆభజస్వేతి తే వై మాఽభిసంవిశతేతి తథేతి తగ్ం సమంతం పరిణ్యవిశన్త ॥**

**తస్మాద్యదనేనాన్నమత్తి తేనైతాస్తృప్యన్త్యేవగ్ం హ వా ఏనగ్ం స్వా అభిసంవిశన్తి భర్తా స్వానాగ్ం శ్రేష్ఠః పుర ఏతా భవత్యన్నాదోఽధిపతిర్య ఏవం వేద ॥**

**య ఉ హైవంవిదగ్ం స్వేషు ప్రతి ప్రతిర్బుభూషతి న హైవాలం భార్యేభ్యో భవత్యథ య ఏవైతమను భవతి యో వైతమను భార్యాన్ బుభూర్షతి స హైవాలం భార్యేభ్యో భవతి ॥**

ఈ రెండు మంత్రాల్లో ప్రాణంయొక్క ఇంకో విశిష్టగుణం గురించి వస్తోంది. **భర్తృత్వం** – ఈ గుణం వేరు. భర్తృత్వం అంటే అన్నింటినీ భరించేవాడు. అన్నింటికీ ఆధారం; అన్నిటినీ రక్షించేవాడు. ఇది కూడా కథరూపంలో చెప్పబడింది.

సమృద్ధిగా అన్నం దొరకటానికి ప్రాణం సామగానం చేసిందిట. అలాగే సమృద్ధిగా అన్నం లభించిందిట. అప్పుడేమయింది? ఇంద్రియాలకేమీ అన్నం మిగలలేదు. దాంతో అవన్నీ బెంగపెట్టుకుని, ప్రాణం దగ్గరకు వెళ్ళి, వరుసగా నిల్చుని మొరపెట్టుకున్నాయట. ప్రాణం 'నేను మీలా స్వార్థపరుణ్ణి కాను, నాదగ్గర బోలెడంత అన్నం ఉంది. మీక్కూడా ఇస్తాను. నా చుట్టూ కూర్చోండి,' అంది. అలాగే ఇంద్రియాలన్నీ చుట్టూ కూర్చుంటే ప్రాణం తీసుకువచ్చి ఆహారాన్ని ఇచ్చింది. ఇంద్రియాలకు వేటికవే వ్యక్తిత్వాలు ఉన్నాయి. ఏదైనా ఒకటి ఇంద్రియానికి ఇస్తే, అది ఆ ఇంద్రియానికే వెళుతుంది. కాని ప్రాణం అలాకాదు. ఈ రోజుకు కూడా చూడండి, ఏదైనా నైవేద్యం పెట్టాలంటే – ప్రాణాయ స్వాహా, అపానాయ స్వాహా, ఉదానాయ స్వాహా, సమానాయ స్వాహా, వ్యానాయ స్వాహా అంటాము. ప్రాణం ఆ ఆహారాన్ని తనకే ఉంచుకోకుండా, అంతా పంచుతుంది. సమాన ప్రాణం ఆహారాన్ని అన్ని అంగాలకూ సమానంగా పంచుతుంది.

అందువల్ల ఎవరైతే ఈ **భర్తృత్వ విశిష్ట ప్రాణ ఉపాసన** చేస్తారో, వారు అందరికీ అన్నదాతలు అవుతారు. తనకిచ్చిన దాన్ని అన్నింటికీ ఇస్తుంది కాబట్టి ప్రాణాన్ని భర్త అంటారు. అందులోనూ శ్రేష్ఠభర్త అంటారు. అలాంటి శ్రేష్ఠభర్తలు ఈ రోజుల్లో కూడా ఉన్నారు. సమాజానికి ఎంతో మేలు చేస్తుంటారు వారు.

**3. ప్రాణం గొప్పతనం – భర్తృత్వం**

మంత్రం 1.3.19

**సోఽ యాస్య ఆఙ్గిరసోఽ ఙ్గానాగ్ం హి రసః ప్రాణో వా అఙ్గానాగ్ం రసః ప్రాణో హి వా అఙ్గానాగ్ం రసస్తస్మాద్యస్మాత్కస్మాచ్చాంగాత్ప్రాణ ఉత్క్రామతి తదేవ తచ్ఛుష్యత్యేష హి వా అఙ్గానాగ్ం రసః ॥**

ఈ మంత్రంలో నాలుగవ గుణం వస్తుంది. అది **అంగిరసత్వం**. అంగిరసః అంటే అంగాలకు రసం. అంగాలన్నింటికీ మూలమైనది.

అన్వయ వ్యతిరేక తర్కంద్వారా ఈ విషయం నిరూపిస్తోంది ఉపనిషత్తు. ప్రాణం ఉంటే తక్కిన అంగాలు పనిచేయగలుగుతున్నాయి. ప్రాణం లేకపోతే, అంగాలు ఉన్నాకూడా వాటి జీవాన్ని కోల్పోతున్నాయి. అందుకే కొన్ని అంగాలను ప్రాణం పోయాక దానం చేస్తే, ప్రాణం పోయిన వెంటనే చేయాలి. మరీ ఆలస్యమయితే, అవి పనిచేయవు. ఇవన్నీ ప్రాణంవల్లనే పనిచేస్తున్నాయి. ఈ విషయం ఈ ఉపనిషత్తులో మళ్ళీ చివర్లోనూ, ఛాందోగ్య ఉపనిషత్తులోనూ వస్తుంది.

ఒకసారి అంగాలన్నీ ఎవరు గొప్పవారూ అని వాదించుకున్నాయి. కన్ను తనే గొప్పది అంది. కన్ను ఒక ఏడాది అజ్ఞాతవాసంలోకి వెళ్ళింది. తను లేకపోతే ఆ వ్యక్తి జీవించలేడని భావించింది. కాని ఆ వ్యక్తి గుడ్డివాడు ఎలా జీవిస్తాడో అలా జీవించాడు. దానితో కన్ను అహం పూర్తిగా తగ్గింది.

తర్వాత చెవివంతు వచ్చింది. చెవి పనిచేయకపోయినా, హాయిగా ఒక ఏడాదిపాటు చెవిటివాడిలాగా గడిపేశాడు. అలా ఏ ఇంద్రియం పనిచేయకపోయినా, జీవితం సాఫీగానే గడిచింది. ఆఖరికి మనసు పనిచేయకపోయినా, చిన్నపిల్లవాడిలాగా కాలం గడిపేశాడు. ప్రాణంవంతు వచ్చేసరికి, ప్రాణం వెళ్ళటానికి లేస్తేనే అన్ని అంగాలూ నిర్వీర్యం అయిపోతున్నాయి. అందువల్ల **ప్రాణాన్ని అంగానాం రసః** అన్నారు.

ఒక వ్యక్తిలో ఏదైనా అంగం పనిచేయటం లేదు అంటే, దాని అర్థం ఆ అంగంమీద ప్రాణంయొక్క కృప పోయినట్టు అని ఉపనిషత్తు చెబుతున్నది. ఎప్పుడైతే ప్రాణం కృప పోయిందో, అప్పుడే ఆ అంగం జీవచ్ఛవంగా, జడంగా, అచేతనంగా మారిపోతుంది. అలా ప్రాణం కృప చూపించటం, చూపించకపోవటం శుద్ధఫలంమీద ఆధారపడి ఉంటుందనుకోండి, అది వేరే విషయం. ఇక్కడ మనం గ్రహించాల్సింది ప్రాణం అన్ని అంగాలకు ఆధారం.

అంగిరసంతో పాటు ఇక్కడ ఇంకో పదం కూడా వాడబడింది. అది అయస్య అంగిరసః. అంటే ప్రాణం నోరులోను, ముక్కు రంధ్రాల్లోనూ ఉంది.

**5. ప్రాణం గొప్పదనం – అంగిరసత్వం**

మంత్రం 1.3.20

**ఏష ఉ ఏవ బృహస్పతిర్వాగ్వై బృహతీ తస్యా ఏష పతిస్తస్మాదు బృహస్పతిః ॥**

మంత్రం 1.3.21

**ఏష ఉ ఏవ బ్రహ్మణస్పతిర్వాగ్వై బ్రహ్మ తస్యా ఏష పతిస్తస్మాదు బ్రహ్మణస్పతిః ॥**

మంత్రం 1.3.22

**ఏష ఉ ఏవ సామ వాగ్వై సాఽమ ఏష సా చామశ్చేతి తత్సామ్నస్సామత్వమ్ ॥**

**యద్వేవ సమః ప్లుషిణా సమో మశకేన సమో నాగేన సమఏభిస్త్రిభిర్లోకైస్సమోఽనేన సర్వేణ తస్మాద్వేవ సామాశ్నుతే సామ్నస్సాయుజ్యగ్ం సలోకతాం య ఏవమేతత్సామ వేద ॥**

ఇంతకు ముందు మంత్రంలో, ప్రాణం అన్ని అంగాలకూ ఆధారం అని చూశాము. అన్ని అంగాలూ అంటే వ్యష్టిలోని అంగాలే కాదు, సమష్టిలోని అంగాలన్నీ. ప్రాణం అంటే హిరణ్యగర్భ. హిరణ్యగర్భ సమష్టిప్రపంచానికి ఆధారం.

ప్రపంచాన్ని అర్థప్రపంచం అంటారు. దాని సారం లేదా దానికి ఆధారం ప్రాణం. శబ్దప్రపంచానికి కూడా ఆధారం ప్రాణం. ఇది ఉపనిషత్తు శైలి. ఉపనిషత్తు మొత్తం ప్రపంచాన్ని రెండుగా విభజించింది. వస్తుప్రపంచం, పదప్రపంచం. అనంతమైన వస్తువులుంటే, అనంతమైన పదాలు కూడా ఉన్నాయి. కొత్త వస్తువు పుట్టుకొస్తే, దానికొక కొత్తపేరు పుట్టుకొస్తుంది.

ఒక్కోసారి పదం బదులు, ఆలోచన అంటుంది ఉపనిషత్తు. పదం అంటే ఆలోచన, వస్తువుకాక వేరే ఏమీ కాదు. ఆలోచన అంటే పదంకాక వేరే ఏమీ కాదు. ఆలోచన రూపుదాలిస్తే పదం అవుతుంది. నేను మాట్లాడితే ఆలోచనలు పదాలరూపంలో బయటకు వస్తాయి. ప్రపంచాన్ని శబ్దప్రపంచంగానూ, అర్థప్రపంచంగానూ నిర్వచిస్తే, ముందు భాగంలో ప్రాణాన్ని అర్థప్రపంచంయొక్క సారంగా చూశాము.

ఇప్పుడు, ఈ మంత్రాల్లో ప్రాణం శబ్దప్రపంచానికి కూడా సారం అని చూస్తాము. శబ్దప్రపంచం అంటే ప్రపంచంలో ఉన్న పదాలు. కాని సాధారణంగా మన సాంప్రదాయంలో శబ్దప్రపంచం మాట వస్తే, వేదాలను శబ్దప్రపంచంగా తీసుకుంటాము. వేదాల్లో జ్ఞానమంతా ఉంటుంది. అందువల్ల వేదాలు వాక్ ప్రపంచాన్ని సూచిస్తాయి.

అందువల్ల, ఈ మంత్రాల్లో ప్రాణం మూడు వేదాలసారం అని చూస్తాము. ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలసారం.

మంత్రం 20 ప్రాణాన్ని **బృహస్పతి** అంది. ఆదిశంకరాచార్యులవారు ఈ పదాన్ని విపులంగా చర్చించి, **'బృహత్'** అంటే ఋగ్వేదం అని నిరూపించారు. అందువల్ల బృహస్పతి అంటే ఋగ్వేదపతి. ప్రాణం ఋగ్వేదపతి.

మంత్రం 21 ప్రాణాన్ని **బ్రాహ్మణః పతిః** అంది. ఆదిశంకరాచార్యులు బ్రహ్మ అంటే యజుర్వేదమని, బ్రాహ్మణపతి అంటే యజుర్వేదపతి అనీ నిరూపించారు. ఆ విధంగా ప్రాణం **యజుర్వేదపతి** అంటుంది.

మంత్రం 22 ప్రాణాన్ని **సామ** అంది. ప్రాణాన్ని సామ అని ఎందుకంది? దానికి ఉపనిషత్తు రెండు కారణాలనిచ్చింది. ఒకటి ప్రతి ఒక్క వ్యక్తిలోనూ ప్రాణం ఒకటే. ప్రాణంలో ఉన్నతజీవి, అల్ప జీవి అని భేదం ఉండదు. జీవితం అందరికీ పవిత్రమైనదే. హెచ్చుతగ్గులు ప్రవర్తనలో వస్తాయి. హెచ్చు తగ్గులు బుద్ధిలో లేదా జ్ఞానంలో ఉన్న స్థాయీభేదాలవల్ల వస్తాయి. కాని ప్రాణం విషయానికి వచ్చేసరికి చిన్న చీమనుంచి ఆ బ్రహ్మ వరకూ అందరిలోనూ సమానమే. అందుకే **ప్రాణాన్ని సామవేదపతి** అన్నది.

ఇంకో కారణం, ప్రాణానికీ వాగింద్రియానికీ అనుబంధం ఉంది. కేవలం సామమంత్రం ఉంటే చాలదు. సామమంత్రాన్ని గానం చేయటానికి వాగింద్రియం కావాలి. వాగింద్రియం ఒక్కటే చాలదు. సామగానం చేయటానికి ప్రాణశక్తి కూడా బాగుండాలి. శ్వాసమీద అదుపు లేకపోతే సరిగ్గా పాడలేరు. మంత్రం పఠించటానికి వాక్కు కావాలి. గానం చేయటానికి ప్రాణశక్తి కావాలి. అందువల్ల సామమంత్రాన్ని గానం చేయటానికి రెండూ– వాక్కు, ప్రాణశక్తి– కావాలి. అందువల్ల సామ అంటే ప్రాణం, వాక్కు. సామగానం ప్రాణం, వాక్కులవల్ల జరిగితే, ఘనత రెండింటికీ దక్కాలి కదా!

సామలో రెండు భాగాలున్నాయని ఉపనిషత్తు చెబుతున్నది. అవి సా + అమ సా అంటే వాక్కు, అమ అంటే ప్రాణం. సామ అంటే వాక్కు + ప్రాణం.

### మంత్రం 1.3.23

**ఏష ఉ వా ఉద్గీథః ప్రాణో వా ఉత్ప్రాణేన హీదగ్ం సర్వముత్తబ్ధం వాగేవ గీథోచ్చ గీథా చేతి స ఉద్గీథః ॥**

### మంత్రం 1.3.24

**తద్ధాపి బ్రహ్మదత్తశ్చైకితానేయో రాజానం భక్షయన్నువాచాయం త్యస్య రాజా మూర్ధానం విపాతయతాద్యదితోఽ యాస్య ఆఙ్గిరసోఽ న్యేనోదగాయదితి వాచా చ హ్యేవ స ప్రాణేన చోదగాయదితి॥**

23, 24 మంత్రాల్లో ప్రాణం అంటే ఉద్గీథ తప్ప ఏమీ కాదు అంటోంది. ఉద్గీథ అంటే సామవేదాలలో గానం చేసే ఓంకారం అని చూశాము. దాన్ని హెచ్చుస్థాయిలో (ఉద్గానమ్) గానం చేస్తారు కాబట్టి ఉద్గీథ అయింది. అందువల్ల ఉద్గీథ అంటే ఓంకారం.

కాని ఇక్కడ ఉపనిషత్తు వాక్కుతో కూడిన ప్రాణం సామగానంలోని ఓంకారం అంటోంది. ఓంకారం ఉచ్చరించటానికి వాగింద్రియం కావాలి. ఓంకారం గొంతెత్తి గానం చేయటానికి ప్రాణశక్తి కావాలి. ఆ విధంగా ప్రాణం ఓంకారగానం అవుతుంది. వాక్కు ఓంకార శబ్దం అవుతుంది. ఓంకార శబ్దం, ఓంకార గానం రెండూ కలిపితే ఉద్గీథ అవుతుంది.

**వాక్సహిత ప్రాణ ఏవ ఉద్గీథః**

ఇది వివరించటానికి ఉపనిషత్తు ఉద్గీథను రెండుగా విభజిస్తున్నది. ఉత్ + గీథః. ఉత్ అంటే ప్రాణస్వరూపం, గీథ అంటే వాక్ స్వరూపం. **ప్రాణో వా ఉత్। వాగేవ గీథా।** అందువల్ల ఉద్గీథ అంటే వాక్ప్రాణస్వరూపం. అందువల్ల ప్రాణాన్ని ఉద్గీథ అంది.

ప్రాణం, వాక్కులు రెండూ కలిపి ఉద్గీథ అయితే, రెండింటినీ స్తుతించాలి కదా! ప్రాణానికి సగం ఘనత దక్కాలి కదా అంటే ప్రాణంమీదే వాక్కు ఆధారపడి ఉంది అంటాము. దీన్ని వివరించటానికి ఉపనిషత్తు ఇంకో కథను చెబుతున్నది.

ఒకసారి ఒక యజ్ఞం జరుగుతోంది. సామగానం చేసే వారందరూ అక్కడ చేరి చర్చించుకుంటున్నారు. వారి చర్చనీయాంశం యిది – సామగానం చేయటానికి ఏ శక్తి తోడ్పడుతుంది, వాక్కా, ప్రాణమా? దానిమీద భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి కాని, **బ్రహ్మదత్తః చైకితానేయః** అనే ఒక గొప్ప ఋషి, ప్రాణశక్తి, సామగానం వెనుకనున్న శక్తి అన్నారు. ఆ మాటకొస్తే ఏ పాటకన్నా ప్రాణశక్తే ముఖ్యం. 'ఒకవేళ నేను చెప్పింది తప్పయితే, నా తల పగులుతుంది,' అన్నారు ఆ ఋషి. 'ఒకవేళ నేను చెప్పింది నిజమయితే, నా తల నా భుజాలమీదే ఉండుగాక,' అన్నారు. బ్రహ్మదత్తుని తల పగలలేదు కాబట్టి, ప్రాణమే ఓంకారం అని నిరూపణ అయింది.

**6. ప్రాణం గొప్పదనం – ఉద్గీథ**

మంత్రం 1.3.25

**తస్య హైతస్య సామ్నో యస్స్వం వేద భవతి హాస్య స్వం తస్య వై స్వర ఏవ స్వం తస్మాదార్త్విజ్యం కరిష్యన్వాచిస్వరమిచ్ఛేత తయా వాచా స్వరసంపన్నయాఽఽర్త్విజ్యం కుర్యాత్తస్మాద్యజ్ఞే స్వరవంతం దిదృక్షంత ఏవ । అథో యస్య స్వం భవతి భవతి హాస్య స్వం య ఏవమేతత్సామ్నస్స్వం వేద ॥**

మంత్రం 1.3.26

**తస్య హైతస్య సామ్నో యస్సువర్ణం వేద భవతి హాస్య సువర్ణం తస్య వై స్వర ఏవ సువర్ణం భవతి హాస్య సువర్ణం య ఏవమేతత్సామ్నస్సువర్ణం వేద ॥**

మంత్రం 1.3.27

**తస్య హైతస్య సామ్నో యః ప్రతిష్ఠాం వేద ప్రతి హ తిష్ఠతి తస్య వై వాగేవ ప్రతిష్ఠా వాచి హి ఖల్వేష ఏతత్ప్రాణః ప్రతిష్ఠితో గీయతేఽన్న ఇత్యు హైక ఆహుః ॥**

ఈ మూడు మంత్రాల్లో, మూడు అంగ ఉపాసనలు చెప్పబడ్డాయి. ప్రధాన ఉపాసనను ముఖ్యవిధి అనీ, అంగ ఉపాసనలను గౌణవిధి అనీ అంటారు. ఇక్కడ ముఖ్య ఉపాసన **గుణ విశిష్ట ప్రాణ ఉపాసన.** ఇప్పుడు మూడు అంగ ఉపాసనలు చెప్పబడ్డాయి. ఏమిటవి? సామగానం చేసే వ్యక్తికి మూడు సంపదలు ఉండాలి. ఏమిటవి?

**ఎ) ధ్వని** – ముందుగా మంచి కంఠం ఉండాలి. మంచి కంఠం లేకపోతే గొంతెత్తి పాడలేడు. దీన్ని స్వరం అంటారు.

**బి) అక్షర స్ఫుటత్వం** – అక్షరాలు స్పష్టంగా పలకగలగాలి. దీన్నే సువర్ణం అంటారు.

**సి) అష్టస్థానాని** – గానానికి సంబంధించిన అంగాలన్నీ ఆరోగ్యంగా ఉండాలి. అంటే పళ్ళు, నాలుక, పెదవులు వగైరా. శబ్దశాస్త్రం ప్రకారం, ఉచ్ఛారణకు ఎనిమిది స్థానాలు ముఖ్యం. ఎనిమిది స్థానాలు ఆరోగ్యకరంగా ఉంటేనే అతను మంత్రాలను పఠించగలడు. దీన్ని వాక్కు అంటారు.

**స్వరం, సువర్ణం, వాక్కు** – ఈ మూడూ సామశక్తులు. దీని తర్వాత, ఉపనిషత్తు మరో అడుగు ముందుకు వెళ్ళి సామ అంటే ప్రాణం తప్ప మరేమీ కాదు అంది. ఇదంతా ముందు మంత్రంలో చూశాము. ఇప్పుడు ఈ రెండూ కలిసి, సామసంపద అంటే ప్రాణసంపద తప్ప ఏమీ కాదు అంటాము.

ముందు గానం చేసే వాని శక్తి గురించి మాట్లాడుతాము. తర్వాత ఆ శక్తి సామకు చెందింది అంటాము. సామ అంటే ప్రాణం అంటాము. ప్రాణానికి మూడు శక్తులు ఉన్నాయి అంటాము. అందువల్ల ఎవరైతే ఈ ఉపాసన చేస్తారో, అతనికి ఈ మూడు సంపదలూ కలుగుతాయి. అంటే అతనికి స్వరం, సువర్ణం, వాక్ గుణత్వం కలుగుతాయి. సువర్ణంకున్న రెండు అర్థాలనూ వాడుతుంది ఉపనిషత్తు. ఈ ఉపాసన చేసినతనికి అటు బంగారం, ఇటు అక్షరశుద్ధి – రెండూ కలుగుతాయంటుంది. అక్షరశుద్ధి ఉన్నవానికి బాగానే ఉంటుంది. పిలిచి పాడించి, అతనికి సమృద్ధిగా దక్షిణ ఇస్తారు, దానివల్ల అతను సమృద్ధిగా బంగారం (ధనం)లో మునిగి తేలుతాడు.

మంత్రం 1.3.28

**అథాతః పవమానానామేవాభ్యారోహస్స వై ఖలు ప్రస్తోతా సామ ప్రస్తౌతి స యత్ర ప్రస్తుయాత్తదేతాని జపేత్ । అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మాఽమృతం గమయేతి ॥**

**స యదాహాసతో మా సద్గమయేతి మృత్యుర్వా అసత్సదమృతం మృత్యోర్మాఽమృతం గమయాఽమృతం మా కుర్విత్యేవైతదాహ । తమసో మా జ్యోతిర్గమయేతి మృత్యుర్వై తమో జ్యోతిరమృతం మృత్యోర్మాఽమృతం గమయాఽమృతం మా కుర్విత్యేవైతదాహ । మృత్యోర్మాఽమృతం గమయేతి నాత్ర తిరోహితమివాస్తి ॥**

**అథ యానీతరాణి స్తోత్రాణి తేష్వాత్మనేఽన్నాద్యమాగాయేత్తస్మాదు తేషు వరం వృణీత యం కామం కామయేత తగ్ం స ఏష ఏవంవిదుద్గాతాఽఽత్మనే వా యజమానాయ వా యం కామం కామయతే తమాగాయతి ॥**

**తద్ధైతల్లోకజిదేవ న హైవాలోక్యతాయా ఆశాఽస్తి య ఏవమేతత్సామ వేద ॥**

ఈ చివరి భాగం, జపం భాగం. ఇంతవరకూ ప్రాణ ఉపాసన గురించి చూశాము. ఇప్పుడు జపం గురించి చూస్తాము. జపం అంటే ఒక నామాన్ని పదే పదే జపించటం. ఉపాసనలో రెండు రకాలు చూశాము. ఒకటి ముఖ్య ఉపాసన (ప్రాణ ఉపాసన), ఇంకోటి అంగ ఉపాసన అంటే **స్వర, సువర్ణ, వాక్ ఉపాసన.**

ఇప్పుడు ఈ ఉపాసనకు జపం జోడిస్తేనే, పూర్తి ఫలం కలుగుతుంది అంటున్నది ఉపనిషత్తు. జపానికి ఒక ప్రత్యేకమైన పేరు ఇచ్చింది. **అభ్యారోహః –** దాని అర్థం జపం. మనస్ఫూర్తిగా జపం చేస్తే జీవితంలో ఉన్నత స్థాయికీ, మరణించాక ఊర్ధ్వలోకాలకూ వెళతామని ఈ పదం వివరణ. ఈ జపం పై అంతస్తుకు తీసుకువెళ్ళే మేడమెట్లలాంటిది. చేయవలసిన జపం ఇది.

**అసతో మా సద్గమయ।**
**తమసో మా జ్యోతిర్గమయ।**
**మృత్యోర్మా అమృతం గమయ॥**

దీని అర్థం ఈ సందర్భానికి తగ్గట్టుగా తీసుకోవాలి. గుర్తుంచుకోండి, మనం ఇంకా వేదాంతానికి రాలేదు. ఇంకా కర్మకాండలోనూ, ఉపాసన కాండలోనూ, అపరావిద్యలోనూ ఉన్నాము. అందుకని ఇక్కడ ఏ అర్థం తీసుకోవాలో ఉపనిషత్తు చెబుతున్నది. అసతో మా సద్గమయ = మృత్యోర్మా అమృతంగమయ. మృత్యోర్మా అమృతం గమయ = తమసో మా జ్యోతిర్గమయ. అందువల్ల మూడు పాదాల అర్థమూ ఒకటే. అన్ని పాదాలూ మృత్యువు గురించి చెపితే మృత్యువు అంటే అర్థం ఏమిటి? ఇక్కడే ఆదిశంకరాచార్యులవారు మనను ఆదుకుంటున్నారు. మూడు పాదాల్లోనూ మృత్యువుకు మూడు అర్థాలున్నాయి అంటున్నారు.

1. **అసతో మా సద్గమయ** – దీని అర్థం కూడా మృత్యోర్మా అమృతం గమయ అన్నాము కదా! ఇక్కడ మృత్యువు అంటే తప్పు కర్మ. తప్పు ఉపాసన. అమృతం అంటే శాస్త్రీయకర్మ, శాస్త్రీయ ఉపాసన. అందువల్ల మొదటి పాదం అర్థం ఇది. ఓ దేవా, నన్ను తప్పు కర్మనుంచి మంచికర్మకు తీసుకువెళ్ళు. అలాగే నా మనస్సును తప్పు ఉపాసననుంచి సరియైన ఉపాసనకు తీసుకువెళ్ళు.

2. **మృత్యోర్మా అమృతం గమయ** – ఇక్కడ మృత్యువు అంటే శాస్త్రీయకర్మ, ఉపాసనల అజ్ఞానం. ఈ అజ్ఞానాన్ని మృత్యువు అంది ఇక్కడ. అమృతం అంటే శాస్త్రీయ కర్మ, ఉపాసనల జ్ఞానం. అందువల్ల ఈ పాదం అర్థం నన్ను శాస్త్రీయకర్మ, ఉపాసనల అజ్ఞానంనుంచి శాస్త్రీయ కర్మ, ఉపాసనల జ్ఞానానికి తీసుకువెళ్ళు.

3. **తమసో మా జ్యోతిర్గమయ** – ఇది పై రెండింటినీ కలుపుతుంది. అందువల్ల ఇక్కడ అమృతం అంటే పై రెండింటి ఫలం. ఆ ఫలం హిరణ్యగర్భపథం. నేను సరియైన కర్మ చేసి, సరియైన ఉపాసన చేస్తే, నాకు హిరణ్యగర్భఫలం లేదా బ్రహ్మలోకఫలం లేదా హిరణ్యగర్భస్థానం కలిగేలా చేయి.

ఈ ప్రార్థన ప్రాణాన్ని ఉద్దేశిస్తూ చేసేది. ఇక్కడ ప్రాణం అంటే హిరణ్యగర్భ. ప్రాణం ఉపాస్యదేవత. అందువల్ల హిరణ్యగర్భపథం పొందాలంటే మనం కర్మ, ఉపాసన, జపం చేస్తుండాలి. ఈ శ్లోకం అర్థం ఇది. ఇది హిరణ్యగర్భకు చేసే ప్రార్థన.

దీనికి ఫలశ్రుతి కూడా ఉంది. హిరణ్యగర్భ ఉపాసకుడు రెండు ఫలాలను పొందగలడు. అతను దేవునికి ప్రార్థనచేసి, తన కోరికలు తీర్చుకోవచ్చు లేదా ఇతరుల కోరికలు తీర్చవచ్చు. అందుకని ఏదైనా కోరికలు తీరాలనుకునేవారు ప్రాణ ఉపాసకుణ్ణి తమకోసం ప్రార్థించమని కోరవచ్చు.

ఈ విధంగా ఉపనిషత్తు మూడు సాధనల గురించి చెప్పింది. ఈ మూడు సాధనలే ఉన్నాయని కాదు దీని అర్థం. ఇవి ఉదాహరణకు కొన్ని మాత్రమే. ఇలాంటివి మరెన్నో ఉన్నాయి. వీటి గురించి చెప్పటంద్వారా ఈ ఉపాసనల గొప్పదనం గురించి చెప్పటమే కాక, హిరణ్యగర్భఫలంయొక్క పరిమితిని కూడా సూచిస్తోంది.

ఇది అధ్యారోప ప్రకరణం అని చూశాము. ఇందులో మూడు భాగాలు ఉన్నాయి. సాధనప్రపంచ అధ్యారోపం, సాధ్యప్రపంచ అధ్యారోపం, అవ్యాకృతప్రపంచ అధ్యారోపం. ఇంతవరకూ **సాధనప్రపంచ అధ్యారోపం** గురించి చూశాము.

# 1.4 - బ్రహ్మవిద్యా బ్రాహ్మణము

ఇప్పుడు **సాధ్యప్రపంచ అధ్యారోపం** చూస్తాము. సాధ్యం అంటే లక్ష్యం, ప్రయోజనం లేదా కర్మఫలం. ఇది అవ్యాకృతం కిందకి వస్తుంది. ఈ బ్రాహ్మణములో సాధ్యప్రపంచం, అవ్యాకృతప్రపంచం గురించి వస్తుంది. అన్ని కర్మలకూ ఉపాసనలకూ అనేకఫలాలను చెబుతుంది శాస్త్రం. అందులో కొన్ని ఇహలోకఫలాలు. కొన్ని పరలోకఫలాలు. ఉపనిషత్తు ఉన్న సాధ్యాలన్నింటి గురించీ చెప్పుకుంటూ పోలేదు. ఎందుకంటే అవి చాలా ఉన్నాయి. అందుకని అన్నిటికన్నా ఉత్తమమైన సాధ్యం గురించి చర్చిస్తున్నది.

ఆ ఫలం హిరణ్యగర్భపథం. హిరణ్యగర్భ లేదా విరాట్‌ల గొప్పదనం, పరిమితులను చర్చిస్తోంది. గొప్పదనం గురించి ఎందుకు చెబుతోందంటే, గొప్ప కర్మలు, గొప్ప ఉపాసనలు చేస్తే, దానికి గొప్ప ఫలాలు వస్తాయని చూపటానికి అత్యుత్తమ ఫలాన్ని చెబుతోంది. పరిమితుల గురించి ఎందుకు చెబుతోందంటే అది చెప్పకపోతే, సాధకుడు హిరణ్యగర్భ పదవితో తృప్తి చెంది, జ్ఞానకాండకు రావాలనుకోడు. హిరణ్యగర్భ గొప్పదనం ఏమిటంటే, **ఆయన జగత్‌కారణం.** అంతేకాదు ఆయనే కార్యమంతటా వ్యాపించి ఉన్నాడు. అంటే సృష్టికి ఆయనే నిమిత్తకారణం, ఉపాదానకారణం కూడా. పరిమితి ఏమిటంటే, **ఆయన కూడా ఉద్భవించాడు.**

**బ్రహ్మా దేవానాం ప్రథమః సంభభూవ** – ముండకం 1.1.1

ముందు ఈశ్వరుడు ఉన్నాడు. ఈశ్వరుడు అనాది. ఈశ్వరుని నిర్వచనం చైతన్యం+సమష్టి కారణప్రపంచం. ఈశ్వరునినుంచి హిరణ్యగర్భ ఉద్భవించాడు. హిరణ్యగర్భ అంటే చైతన్యం+సమష్టి సూక్ష్మప్రపంచం. ఈశ్వరుని పరంగా చూస్తే హిరణ్యగర్భ కార్యం, జగత్తుపరంగా చూస్తే హిరణ్యగర్భ కారణం.

**విశ్వస్య కర్తా భువనస్య గోప్తా** – ముండకం 1.1.1

ఆయనే సృష్టి కారణం. జగత్తును సృష్టించటమే కాక అందులోకి అనుప్రవేశం చేశాడు. అందువల్ల హిరణ్యగర్భను సర్వాత్మా అంటారు.

హిరణ్యగర్భ పదవి కూడా సంసారంలోకే వస్తుంది. ఇదీ దీని సారాంశం.

మంత్రం 1.4.1

**ఆత్మైవేదమగ్ర ఆసీత్పురుషవిధస్సోఽనువీక్ష్య నాన్యదాత్మనోఽపశ్యత్ ॥**
**సోఽహమస్మీత్యగ్రే వ్యాహరత్తతోఽహంనామాభవత్తస్మాదప్యేతర్హ్యామంత్రితోఽహమయమిత్యేవాగ్ర**
**ఉక్త్వాఽథాన్యన్నామ ప్రబ్రూతే యదస్య భవతి ॥**
**స యత్పూర్వోఽస్మాత్సర్వస్మాత్సర్వాన్పాప్మన ఔషత్తస్మాత్పురుషః ॥**
**ఓషతి హ వై స తం యోఽస్మాత్పూర్వో బుభూషతి య ఏవం వేద ॥**

మంత్రం 1.4.2

**సోఽ బిభేత్తస్మాదేకాకీ బిభేతి స హాయమీక్షాం చక్రే యన్మదన్యన్నాస్తి కస్మాన్ను బిభేమీతి ॥**
**తత ఏవాస్య భయం వీయాయ కస్మాద్ధ్యభేష్యద్ద్వితీయాద్వై భయం భవతి ॥**

హిరణ్యగర్భ వర్ణన సాధ్యప్రపంచంలోకి వస్తుందని చూశాము. ఎందుకంటే అశ్వ, అగ్ని, ప్రాణ ఉపాసన, జపాల ఫలం – హిరణ్యగర్భపథం అని కూడా చూశాము. హిరణ్యగర్భపథానికి కూడా గొప్పదనం, పరిమితులు ఉంటాయని కూడా చూశాము. ముందు పరిమితులు ఏమిటో చూద్దాము. హిరణ్యగర్భ కూడా సంసారదుఃఖంనుంచి తప్పించుకోలేదు అంటోంది ఉపనిషత్తు.

హిరణ్యగర్భకు కూడా సంసారసమస్య ఉందని నిరూపించటానికి ఉపనిషత్తు హిరణ్యగర్భకు కూడా భయం కలిగిందని చెబుతున్నది.

అరతిః – రెండవ కారణం అరతిః అంటే అసంతృప్తి. అరతి అంటే ఆనందం లేకపోవటం. ఆనందం లేకపోవటాన్ని రెండు మంత్రాల్లో చూపిస్తోంది. ఇదంతా సృష్టికి ప్రతీక.

హిరణ్యగర్భ ఉద్భవించినప్పుడు, ఆయన సమష్టి. ఒక్కడే ఉన్నాడు. రెండవవస్తువు లేదా వ్యక్తి ఇంకా పుట్టలేదు. హిరణ్యగర్భ 'ఏకాకి'గా ఉన్నాడు. తను ఒంటరిగా ఉండటంవల్ల భయపడ్డాడు. తన చుట్టూ చూసి, తను భయపడటంలో అర్థం లేదనుకున్నాడు.

మామూలుగా భయం ఎప్పుడు వస్తుంది? ఎవరో తనకు హాని చేస్తారనుకుంటే వస్తుంది. భయం ఉండాలంటే భయానికి ఆధారం ఉండాలి. ఆ ఆధారం తనకు భిన్నంగా ఉండాలి. తనకు భిన్నంగా ఏమీ లేనప్పుడు, దేన్ని చూసి భయపడాలి, ఎవర్ని చూసి భయపడాలి అనుకున్నాడు. తను తప్ప వేరే ఎవరూ లేరని తెలుసుకున్నాక, తన భయాన్ని అధిగమించాడు.

**ద్వితీయాద్వై భయం భవతి**

ఇది చాలా అద్భుతమైన వాక్యం. రెండోది ఉంటే, భయం వస్తుంది. అద్వైతానికి వస్తే తప్ప భయం పోదని చెప్పటానికి అద్వైతవాదులు తరచు ఈ వాక్యం చెబుతారు. అది ఎంతమేరకు వెళుతుందంటే, ఆఖరికి భగవంతుడు నీకు భిన్నంగా ఉన్నా కూడా – భగవంతుడు భయానికి కారణం అవుతాడు.

దేవుడు మొత్తం జగత్తుకు సృష్టి, స్థితి, లయ కారకుడు కదా! నేనెందుకు దేవుణ్ణి చూసి భయపడాలి అని వాదించవచ్చు మీరు. ఉపనిషత్తు చెబుతుంది, మామూలుగా మనం భగవంతుణ్ణి సృష్టికారకుడు, స్థితికారకుడుగానే చూస్తాము కాని, లయకారకుడిగా చూడము. ఆయన లయకారకుడిగా, మనకున్న వాటన్నింటినీ, మన శరీరంతో సహా, నాశనం చేస్తాడు. ఆయన కాలరూపం.

**ద్వితీయాద్వై భయం భవతి**

రెండవ వస్తువు నిజంగా ఉండనవసరం లేదు. ఉందన్న ఊహ ఉన్నా కూడా భయమే. హిరణ్యగర్భకు భయం ఎలా పోయింది? తను కాకుండా వేరే ఎవరూ లేరు అనే జ్ఞానంవల్ల పోయింది. అంటే అద్వైతజ్ఞానం లేకపోతే హిరణ్యగర్భ కూడా సంసారే. హిరణ్యగర్భ ఒంటరిగా ఉండటంవల్ల ఆయనకు భయంవేసినట్టుగా, చాలామంది ఒంటరితనం చూసి భయపడతారు. అదే భయం రెండో వస్తువును చూసి భయపడేలాగా చేసింది. ఇది ఒక భావన.

**అరతిః** – దీనికి ఇంకో అర్థం కూడా ఉంది. అరతి అంటే ఒంటరితనం. హిరణ్యగర్భ ఒక్కడూ అవటంతో ఒంటరితనం బాధించిందని ఉపనిషత్తు చెబుతున్నది. ఈ ఒంటరితనం మనుష్యులను కూడా బాధిస్తుందని చూశాము కదా! ఇదే సంసారం. వేదాంతం ఒక్కటే ఒంటరితనం ఆనందాన్ని ఇస్తుందని బోధిస్తుంది. ఇది హిరణ్యగర్భ పరిమితి.

ఇప్పుడు హిరణ్యగర్భస్తుతి చూద్దాము. ఉపనిషత్తు హిరణ్యగర్భస్తుతిని మూడు బిరుదులివ్వటంద్వారా చేస్తోంది.

1. **అహమ్** – అహం అంటే నేను. హిరణ్యగర్భ ఉద్భవించగానే, చుట్టూ పరికించి చూసి, తను తప్ప వేరే ఏమీ లేకపోవటం గమనించి 'అహం అస్మి', 'నేను ఉన్నాను' అన్నాడు. హిరణ్యగర్భ 'అహం' పదం పలికినప్పటినుంచి, ఆ పరంపర వచ్చిందని ఉపనిషత్తు చెబుతోంది. ఎవరినన్నా నీ పేరేమిటి అని అడిగితే, 'అహం'తో జవాబు మొదలవుతుంది.

ఏ విషయం చెప్పినా, ఏ భాషలో చెప్పినా, 'నేను' పదంతో మొదలవుతుంది సంభాషణ అంతా. 'అహం' అంటే హిరణ్యగర్భ. అహం అని చెప్పాక నా పేరు ఇది, నేను ఫలానా వారి అబ్బాయిని అంటూ వేరే పేరు చెబుతాము. ఆ విధంగా హిరణ్యగర్భ పేరు అందరికీ ఉంది.

2. **పురుషః** – పురుషః అంటే వేదాంతభాషలో ఆత్మ. దేనికైతే శరీరం ఉందో అది పురుషుడు. ఆత్మ శరీరంలో ఉంది. ఈ నిర్వచనం ప్రకారం పురుషుడు అంటే ఆత్మ. కాని ఈ సందర్భంలో ఉపనిషత్తు వేరే అర్థం ఇస్తోంది. ఇక్కడ పురుషః అంటే 'ఆత్మ' కాదు, హిరణ్యగర్భ లేదా విరాట్. ఎలా వచ్చిందీ నిర్వచనం?

**పూర్వమ్ ఓషతి**

ఔషధి అంటే వాచ్యార్థం నాశనం చేసేది. అందువల్ల హిరణ్యగర్భ అంటే దహించి వేసేవాడు. ఆ అర్థం ఎలా వచ్చిందో తెలుసుకునే ముందు హిరణ్యగర్భ కూడా తన ముందు జన్మలో ఒక మామూలు మనిషే అనే విషయం గుర్తు తెచ్చుకోవాలి. కాకపోతే, అతనికీ తక్కిన జీవులకీ మధ్య తేడా ఎక్కడుంది అంటే అతను చేసిన గొప్పకర్మలవల్ల, గొప్ప ఉపాసనలవల్ల మరణం తర్వాత హిరణ్యగర్భ పదవిని పొందాడు. అతను చేసిన గొప్ప కర్మలు, ఉపాసనలవల్ల అతని పాపాలన్నీ దహించబడ్డాయి.

ముందు అధ్యాయంలో పాపాలను స్వార్థంగా చూశాము. తన పుణ్యకర్మలవల్ల రాగద్వేషాలను నాశనం చేసుకున్నాడు. ఎప్పుడైతే పాపాలు తొలగిపోయాయో, అప్పుడే అతని పుణ్యం పెరిగి, పేరుకున్న పుణ్యంవల్ల హిరణ్యగర్భ పదవిని పొందాడు.

హిరణ్యగర్భ తన ప్రస్తుత హోదాని తన పాపాలను దహించటంవల్ల, 'ఓషతి'వల్ల పొందాడు. ఈ పదవి పొందటానికి కూడా బోలెడు పోటీ ఉంది. ఎంతో మంది ప్రయత్నం చేస్తే, ఒక్కడు ఆ పదవిని పొందుతాడు. అంటే హిరణ్యగర్భ పదవి అనే పరుగుపందెంలో, హిరణ్యగర్భ పదవి అనే బంగారు పతకాన్ని ఒక్కడే గెల్చుకున్నాడు. శంకరులు హిరణ్యగర్భ పదవిని పొందటం, పరుగుపందెంలో గెలవటంతో పోలుస్తారు.

**పూర్వమౌషదితి పురుషః**

పూర్వం తను చేసుకున్న పాపాలన్నీ నాశనం చేసుకోవటంవల్ల ఈ పదవిని పొందాడు. అతనే నంబర్ వన్ అని ఎలా చెప్పగలము? అతను ఆ పదవిలో ఉండటమే దానికి నిదర్శనం. అందుకే ఈ బ్రాహ్మణాన్ని – **ఆత్మైవేదమగ్ర ఆసీత్పురుషః** అని మొదలుపెట్టింది. ఆత్మ అంటే హిరణ్యగర్భ లేదా విరాట్.

**3. సృష్టి** – హిరణ్యగర్భ ఒంటరిగా ఉండటంవల్ల తన ఆనందంకోసం ఈ జగత్తునంతా సృష్టించాడు. మన జీవనపోరాటం హిరణ్యగర్భ చూసే వీడియో ఆట తప్ప ఏమీ కాదు. హిరణ్యగర్భ జగత్తును సృష్టించటమే కాకుండా, జగత్తు తానే అయ్యాడు. అందువల్ల ఆయన్ని విశ్వం లేదా సృష్టి అని కూడా అంటారు.

ఎవరైతే హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో, వారు హిరణ్యగర్భ అవుతారు.

**యథా యథా ఉపాస్తే, తదేవ భవతి**

ఇప్పుడు హిరణ్యగర్భ సృష్టినెలా చేశాడో చూస్తాము. సృష్టి నాలుగు విభాగాలుగా జరిగింది. మనుష్యసృష్టి, పశ్వాదిసృష్టి, దైవసృష్టి, అన్న అన్నాదసృష్టి. కాని ఇక్కడ ఉపనిషత్తు ఉద్దేశం సృష్టి గురించి చెప్పటం కాదు. హిరణ్యగర్భ మనుష్యులుగా మారాడని చెప్పటం. మనుష్యులే కాదు అంతా తానే అయ్యాడు.

హిరణ్యగర్భ చేసిన సృష్టి ఆయన గొప్పదనానికి నిదర్శనం అయితే, సృష్టి కారణం ఆయన సమస్యను చూపుతుంది. తను ఒంటరితనం భరించలేక, తోడుకోసం సృష్టి చేశాడు. తోడుకోసం తపన అలా మనకు పరంపరగా వస్తోంది. బ్రహ్మచారి తోడుకోసం పెళ్ళి చేసుకుంటున్నాడంటే అతన్నొక చిన్న సైజు హిరణ్యగర్భ అనవచ్చు.

మంత్రం 1.4.3

**స వై నైవ రేమే తస్మాదేకాకీ న రమతే స ద్వితీయమైచ్ఛత్ ॥**
**స హైతావానాస యథా స్త్రీపుమాగ్ంసౌ సమ్పరిష్వక్తౌ స ఇమమేవాఽఽత్మానం ద్వేధాఽపాతయత్॥**
**తతః పతిశ్చ పత్నీ చాభవతాం తస్మాదిదమర్ధబృగలమివ స్వ ఇతి హ స్మాఽఽహ యాజ్ఞవల్క్య స్తస్మాదయమాకాశః స్త్రియా పూర్యత ఏవ తాగ్ం సమభవత్తతో మనుష్యా అజాయన్త ॥**

తను అసంపూర్తిగా ఉన్నాననీ, తృప్తిగా లేననీ, తనకొక తోడు కావాలనీ సృష్టించాడు. అందువల్ల హిరణ్యగర్భే మనుష్య జంటగా ఉద్భవించాడు. ఎలా ఉద్భవించాడు? ఒకరినొకరు కౌగలించుకుని ఉన్నట్టుగా ఉద్భవించాడు. తన శరీరాన్ని రెండుగా పడేటట్టు చేశాడు. అందుకని వారు రెండుకాదు, ఒకటే. శంకరులు వారిని మనువు,

శతరూప అని అన్నారు. వీరు ఆదిమానవులు. అందుకే మనువునుంచి మనిషి పేరు వచ్చింది. వీరు ఒకటిగా వచ్చారని చెప్పటానికి ఉపనిషత్తు ఒక ఉదాహరణనిస్తోంది. వేరుశెనగ వంటి పప్పు ఏదైనా చూస్తే, అది చూడటానికి ఒకటే పప్పులాగా ఉంటుంది కాని దాన్ని సగం (పప్పు చెక్క) చేయవచ్చు. రెండు చెక్కలు కలిసి ఒక పప్పు అయింది.

మనువు, శతరూప రెండు చెక్కలుగా ఉన్న ఒక పప్పులా ఉన్నారు. వారు కలిసి ఉన్నారు. అదే సమయంలో విడిగానూ ఉన్నారు. తర్వాత హిరణ్యగర్భ వారిని స్త్రీ పురుషులుగా విడదీశాడు. ఈ ఉదాహరణ ఎందుకు? స్త్రీ పురుషులు ఒకరికొకరు సగభాగం అనీ, ఒకరు లేనిదే ఇంకొకరికి ఉనికి లేదనీ చెప్పటానికి. అందుకే ఇంగ్లీషులో భార్యాభర్తల్లో ఒకరిని రెండోవారికి 'బెటర్ హాఫ్' అంటారు. స్త్రీ పురుషులు చూడటానికి ఇద్దరు భిన్నవ్యక్తులుగా ఉన్నట్టు కనిపించినా, ఒకరు లేనిదే ఇంకొకరు అసంపూర్ణులు. అందుకే పెళ్ళికాని యువతీయువకులు వారి జీవితం అసంపూర్ణంగా ఉన్నట్టూ, శూన్యంగా ఉన్నట్టూ భావిస్తారు.

దీన్ని బట్టి స్త్రీపురుషుల్లో ఒకరు ఎక్కువా, ఒకరు తక్కువా కాదని తెలుస్తోంది. ఎవరి పాత్ర వారు పోషిస్తారు. దేనికదే ముఖ్యపాత్ర. ఒకటి లేనిదే ఇంకోటి అసంపూర్ణం. ఆ విధంగా మనువు, శతరూప పుట్టారు. వారినుంచి మనుష్య జాతి అంతా పుట్టింది. ఇది మనుష్యసృష్టి.

### మంత్రం 1.4.4

**సో హేయమీక్షాఞ్చక్రే కథం ను మాఽఽత్మన ఏవ జనయిత్వా సమ్భవతి హన్త తిరోఽసానీతి సా గౌరభవదృషభ ఇతరస్తాగ్ం సమేవాభవత్తతో గావోఽజాయన్త ॥**

**వడవేతరాఽభవదశ్వవృష ఇతరో గర్దభీతరా గర్దభ ఇతరస్తాగ్ం సమేవాభవత్తత ఏకశఫమజాయతాజేతరాఽభవద్బస్త ఇతరోఽవిరితరా మేష ఇతరస్తాగ్ం సమేవాభవత్తతోఽజావయోఽజాయన్తైవమేవ యదిదం కిఞ్చ మిథునమా పిపీలికాభ్యస్తత్సర్వమసృజత ॥**

ఇందులో పశుసృష్టి గురించి వస్తుంది. ఇది చెప్పటానికి ఉపనిషత్తు ఒక ఉత్సాహకరమైన కథ చెబుతున్నది. శతరూప మనువును చూసి, మనువును నా భర్తగా ఎలా భావించను అనుకుంది. తను హిరణ్యగర్భునుంచి పుట్టింది. హిరణ్యగర్భ మళ్ళీ మనువుగా వచ్చాడు. అంటే హిరణ్యగర్భ తనకు తండ్రితో సమానం. అటువంటప్పుడు తండ్రిని భర్తగా ఎలా భావించను? అది అనైతికం, అసంబద్ధం అనుకుంది.

అందువల్ల శతరూప ఆవుగా మారిపోయింది. సృష్టి జరగటానికి సృష్టింపబడ్డ కథ. దాన్ని అక్షరాలా తీసుకోకూడదు. మళ్ళీ మనువుకు ఒంటరితనం బాధేసి, తను ఎద్దుగా మారాడు. ఆమెతో కలవటంవల్ల గోసంతతి వచ్చింది. తరువాత ఆమె ఆడగుర్రం అయితే, అతను మగగుర్రం అయ్యాడు. ఆమె ఆడగాడిద అయితే, అతను మగగాడిద అయ్యాడు. దానివల్ల ఒకే గిట్టగల పశువులు జన్మించాయి. ఆమె ఆడమేక అయితే అతను మగమేక అయ్యాడు. ఆమె గొర్రె అయితే అతను పొట్టేలు అయ్యాడు. దానివల్ల మేకలు, గొర్రెలు పుట్టాయి. ఆ విధంగా ఈ జగత్తులో చీమలవరకు ఏయే ప్రాణుల జంటలు కలవో, వాటినన్నింటినీ సృష్టించాడు. దీనితో పశుసృష్టి అయింది.

మంత్రం 1.4.6

**అథేత్యభ్యమన్థత్స ముఖాచ్చ యోనేర్హస్తాభ్యాం చాగ్నిమసృజత తస్మాదేతదుభయమలోమకమన్తరతోఽలోమకా హి యోనిరన్తరతః ॥**
**తద్యదిదమాహురముం యజాముం యజేత్యేకైకం దేవమేతస్యైవ సా విసృష్టిరేష ఉ హ్యేవ సర్వే దేవాః ॥**
**అథ యత్కిఞ్చేదమార్ద్రం తద్రేతసోఽసృజత తదు సోమ ఏతావద్వా ఇదగ్ం సర్వమన్నం చైవాన్నాదశ్చ సోమ ఏవాన్నమగ్నిరన్నాదః ॥**
**సైషా బ్రహ్మణోఽతిసృష్టిః । యచ్ఛ్రేయసో దేవానసృజతాథ యన్మర్త్యస్సన్నమృతానసృజత తస్మాదతిసృష్టిరతిసృష్ట్యాగ్ం హాస్యైతస్యాం భవతి య ఏవం వేద ॥**

మంత్రం 5 తర్వాత చూద్దాము. మంత్రం 6లో దేవతా సృష్టి, అన్న-అన్నాదసృష్టి గురించి వస్తుంది. ఉపనిషత్తు ప్రకారం దేవతలందరిలో మొదటగా అగ్నిదేవుని సృష్టి జరిగింది. అగ్నిదేవత ఎలా పుట్టాడు? ఆ వర్ణన అనూహ్యంగా ఉంటుంది. అగ్నిదేవత నోటిలో ఉంటుంది. అరణిని మథిస్తే అగ్ని పుడుతుంది. అగ్నిదేవతను పుట్టించటానికి హిరణ్యగర్భ తన చేతులను అరణిగా వాడాడు. తన చేతులను నోట్లో పెట్టుకుని మథించటంవల్ల అగ్ని దేవత పుట్టింది. ఏమిటి దానికి నిదర్శనం? దానికి ఉపనిషత్తు తనదైన తర్కాన్ని ఉపయోగిస్తుంది. అగ్నిని పుట్టించటానికి నోరు, చేతులు వాడాడు కాబట్టి, వాటిల్లో రోమాలు లేవు. హిరణ్యగర్భకే కాదు. మనుష్యులెవరికీ కూడా చేతులమీద, నోటిమీద రోమాలు ఉండవు.

దాని తర్వాత సోమదేవతను సృష్టించాడు. తన రేతస్సునుంచి సోమదేవతను సృష్టించాడు. దాని తర్వాత తక్కిన దేవతలందరూ పుట్టారు. దీనితో దేవతాసృష్టి అయిపోయింది.

తర్వాత అగ్నిదేవత, సోమదేవతలే అన్నాదం, అన్నం అయ్యారని ఉపనిషత్తు చెబుతోంది. అగ్నితత్త్వం అన్నాదం, సోమతత్త్వం అన్నం. ఎలా చెప్పగలము? అగ్నే మనలో ఉన్న వైశ్వానర అగ్ని. ఈ వైశ్వానర అగ్ని మనం తిన్న ఆహారాన్ని రెండోసారి వండుతుంది. అందువల్ల అగ్ని అన్నాదం అయింది. అన్నాదం అంటే అన్నాన్ని తినేవాడు.

సోమదేవత అన్నం అయింది. అన్నం అంటే తినబడేది. అగ్ని తినేది (అన్నాదం), సోమదేవత తినబడేది (అన్నం). అన్నింటిలోకి ఉత్తమమైన సృష్టి దేవసృష్టి. అందువల్ల దాన్ని అతిసృష్టి (తనను మించిన సృష్టి) అన్నారు. దీనితో అన్న, అన్నాద సృష్టి అయింది. నాలుగు విధాల సృష్టి అయింది. అవి వరుసగా - మనుష్యసృష్టి, పశుసృష్టి, దేవతాసృష్టి, అన్న అన్నాదసృష్టి. ఇప్పుడు వెనక్కు ఐదవ మంత్రానికి వెళదాము.

మంత్రం 1.4.5

**సోఽవేదహం వావ సృష్టిరస్మ్యహగ్ం హీదగ్ం సర్వమసృక్షీతి తతస్సృష్టిరభవత్సృష్ట్యాగ్ం హాస్యైతస్యాం భవతి య ఏవం వేద ॥**

సృష్టి మొత్తం జరిగాక, హిరణ్యగర్భ నేనే మొత్తం జగత్తు రూపంలో ఉన్నాను. నేను మనుశతరూపలనయ్యాను, నేనే పశువులనయ్యాను, నేనే దేవతలనయ్యాను, నేనే అన్నం అన్నాదం అయ్యాను అనుకున్నాడు. **'అహమేవ సృష్టిః'** అనే జ్ఞానం పొందాడు హిరణ్యగర్భ. అందుకని, ఎవరైతే ఈ ఉపాసన చేస్తారో, అతను సృష్టికర్తతో మమేకం చెందుతాడు. అందువల్ల ప్రపంచంతో మమేకం చెందుతాడు. ఇది గొప్ప ఉపాసన. ఎందుకంటే దీనివల్ల నేను, నా వారు అనే సంకుచిత భావం తొలగి వసుధైక కుటుంబం అనుకుంటాడు. ఇక్కడితో సాధ్యప్రపంచం గురించిన వర్ణన ముగిసింది. తర్వాత వచ్చే మంత్రంలోకి వెళ్ళేముందు రెండు అంశాలు చూద్దాము.

**ద్వితీయాద్వై భయం భవతి** – మంత్రం 2

హిరణ్యగర్భ తను ఒంటరిగా ఉన్నానని భయపడ్డాడు. తర్వాత తనను తాను చూసుకుని, నాకంటే భిన్నంగా ఏదీ లేదు; నేను దేనివలన భయపడుతున్నాను అని విచారణ చేసి తెలుసుకున్నాడు. ఆ దర్శనంవల్ల ఆయన భయం పూర్తిగా పోయింది. నేను తప్ప రెండోది లేదు అనే ఈ జ్ఞానాన్ని రెండు రకాలుగా చూడవచ్చు.

1. నేను తప్ప అన్నది ఎవరు? హిరణ్యగర్భ
2. నేను తప్ప అన్నది ఎవరు? బ్రహ్మ

ఈ రెండోరకమైన జవాబును శంకరాచార్యులవారు తన భాష్యంలో విశ్లేషించారు. 'అహం బ్రహ్మ అస్మి,' అని బ్రహ్మ చెపితే, బ్రహ్మకు ఈ జ్ఞానం ఎక్కడనుంచి వచ్చింది? ఆయనకు నేర్పిన గురువెవరు? శాస్త్రం ఎక్కడిది? ఉపదేశం ఎప్పుడు జరిగింది? హిరణ్యగర్భకు గురువు ఎవరూ అవసరం లేదు అంటే నాక్కూడా అవసరం లేదు అనవచ్చు ఎవరైనా.

## హిరణ్యగర్భ ప్రత్యేక స్థానముమీద భాష్యం

జ్ఞానం పొందటానికి శాస్త్రం, గురువు ఉపదేశం ఉండాలనేది సామాన్యసూత్రం. ఇది మానవాళిలో అధికభాగానికి వర్తిస్తుంది. కాని కొన్ని అసాధారణ సందర్భాలు ఉండవచ్చు. కొంతమంది అసాధారణ వ్యక్తులకు శ్రవణ, మననాలు పూర్వజన్మలోనే జరిగి ఉండవచ్చు. ఈ జన్మలో పాపాలు తొలగగానే, జ్ఞానం కలగవచ్చు అంటారు శంకరాచార్యులు. దానికి ఆయన ఒక ఉదాహరణ కూడా ఇస్తారు.

**మన ఏవ కేవలం రూపజ్ఞాననిమిత్తం యోగినామ్**

రూపజ్ఞానం తీసుకుంటే యోగుల విషయంలో కేవలం మనస్సు మాత్రమే కారణమవుతుంది. రూపజ్ఞానం అంటే రంగులు లేదా రూపాల గురించిన జ్ఞానం. రాత్రి సంచరించే పక్షులకు రూపజ్ఞానం మనస్సు, కళ్ళతో కలుగుతుంది. అదే మామూలు మనుష్యులమైన మన దగ్గరకు వచ్చేసరికి మనకు మూడు అంశాలు కావాలి. మనస్సు, కళ్ళతోబాటు కాంతి కూడా కావాలి. అంటే ఈ భేదం ఉపాధి భేదంవల్ల వస్తుంది.

అందువల్ల శంకరాచార్యులవారు కొన్ని అసాధారణ పరిస్థితుల్లో, అసాధారణ ఉపాధి లేదా అసాధారణ స్వచ్ఛత ఉన్న వ్యక్తులకు జ్ఞానం కూడా అసాధారణంగానే కలుగవచ్చు అంటున్నారు. వామదేవుడు, తల్లిగర్భంలో ఉండగానే జ్ఞానం పొందారు. అందువల్ల అసాధారణ సందర్భాలతో మనను పోల్చుకోకూడదు.

**హిరణ్యగర్భ ఈశ్వరుడా, జీవుడా?**

ఆరవ మంత్రం చివర్లో శంకరులు ఈ ప్రశ్నను వేస్తారు. శాస్త్రంలో రెండు రకాలుగానూ సమర్థింపు ఉందంటారు.

ముండకం హిరణ్యగర్భను ఈశ్వరునిగానే వర్ణిస్తుంది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు బ్రహ్మయొక్క మూడు రూపాలే అని వస్తుంది.

ఇక్కడ, నాలుగవ బ్రాహ్మణములో ఉపాసన చేసి, హిరణ్యగర్భ పదవిని పొందిన ఉన్నత జీవుడని వస్తుంది.

అలా రెండు వాదనలూ ఉన్నాయి. కాని అధికశాతం హిరణ్యగర్భుణ్ణి ఈశ్వరునిగానే భావిస్తుంది శాస్త్రం.

మంత్రం 1.4.7

**తద్ధేదం తర్హ్యవ్యాకృతమాసీత్ ॥**

**తన్నామరూపాభ్యామేవ వ్యాక్రియతాసౌనామాఽయమిదగ్ంరూప ఇతి తదిదమప్యేతర్హి నామరూపాభ్యామేవ వ్యాక్రియతేఽసౌనామాఽయమిదగ్ంరూప ఇతి ॥ స ఏష ఇహ ప్రవిష్టః ॥**

**ఆ నఖాగ్రేభ్యో యథా క్షురః క్షురధానేఽవహితస్స్యాద్విశ్వమ్భరో వా విశ్వమ్భరకులాయే తం న పశ్యన్తి ॥**

**అకృత్స్నో హి స ప్రాణన్నేవ ప్రాణో నామ భవతి ॥**

**వదన్ వాక్ పశ్యంశ్చక్షుశ్శృణ్వన్ శ్రోత్రం మన్వానో మనస్తాన్యస్యైతాని కర్మనామాన్యేవ ॥**

**స యోఽత ఏకైకముపాస్తే న స వేదాకృత్స్నో హ్యేషోఽత ఏకైకేన భవతి ॥**

**ఆత్మేత్యేవోపాసీతాత్ర హ్యేతే సర్వ ఏకం భవన్తి ॥**

**తదేతత్పదనీయమస్య సర్వస్య యదయమాత్మాఽనేన హ్యేతత్సర్వం వేద ।**

**యథా హ వై పదేనానువిన్దేత్ ॥**

**ఏవం కీర్తిగ్ం శ్లోకం విన్దతే య ఏవం వేద ॥**

7–10 మంత్రాలు చాలా ముఖ్యమైన మంత్రాలు వేదాంతంమీద. వీటిమీద శంకరాచార్యుల భాష్యం అనంతంగా సాగుతుంది.

ముందు మంత్రంలో వ్యాకృతప్రపంచం గురించి చూశాము. ప్రపంచాన్ని రెండుగా విభజించవచ్చు. వ్యాకృత ప్రపంచం, అవ్యాకృతప్రపంచం. వ్యాకృతప్రపంచాన్ని మళ్ళీ రెండుగా విభజించవచ్చు. సాధనప్రపంచం, సాధ్యప్రపంచం. ఇంతవరకూ సాధన, సాధ్యవ్యాకృతప్రపంచం గురించి చూశాము.

ఇప్పుడు అవ్యాకృత ప్రపంచం గురించి చూస్తాము. ఇదే ప్రపంచాన్ని సృష్టికి ముందు అవ్యాకృత ప్రపంచం అంటుంది ఉపనిషత్తు. దీన్ని బట్టి ఒక విషయం స్పష్టమవుతోంది. ఏమిటది? సృష్టికి పూర్వం కూడా ప్రపంచం ఉంది. దాని పేరు **అవ్యాకృతమ్** లేదా **అవ్యక్తమ్.**

భగవంతుడు కొత్త ప్రపంచాన్ని సృష్టించడు. ప్రపంచం ముందే ఉంది, కాకపోతే అవ్యక్తరూపంలో ఉంది. ఒక చిన్న విత్తనంలో ఒక మహావృక్షం అవ్యక్తరూపంలో ఉన్నట్టుగా స్థూల, సూక్ష్మశరీరాలన్నీ అవ్యక్తరూపంలో ఇమిడి ఉన్నాయి. అంతేకాదు మన పుణ్యపాపాలు, మన సంచితకర్మలూ అన్నీ అవ్యక్తరూపంలో ఉన్నాయి.

అప్పుడేమయింది? సమష్టికర్మలు లేదా పుణ్యపాపాలు పండి, వ్యక్తమవాల్సిన సమయం వచ్చినప్పుడు సృష్టి జరిగింది. అందువల్ల, ఒక విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. అవ్యక్తస్థితిలో కర్మలుకూడా దాగి ఉంటాయి. కర్మలు లేకుండా అవ్యక్తం ఉండదు.

కర్మలు పండినప్పుడు ప్రపంచసృష్టి జరగాలి. ఎందుకంటే, కర్మఫలాలు అనుభవించాలంటే దానికొక భోగశరీరం ఉండాలి. భోగకరణాలు ఉండాలి. వాటిద్వారా పుణ్యపాపాలను సుఖదుఃఖరూపాల్లో అనుభవించాలి.

భోగశరీరం అనుభవించాలంటే దానికొక భోగ్యప్రపంచం కావాలి. శబ్దస్పర్శరూపరసగంధాత్మక భోగ్యప్రపంచం కావాలి. గాఢనిద్రలో ఎలాగైతే కష్టసుఖాలను అనుభవించలేమో, అవ్యక్తస్థితిలో కూడా కష్టసుఖాలను అనుభవించలేము. అందువల్ల అవ్యక్తస్థితినుంచి వ్యక్తస్థితికి రావాలి. ఈ మార్పును సృష్టి అంటారు.

మామూలుగా సృష్టి జరిగినప్పుడు, నామరూపప్రపంచం వచ్చిందంటారు. ఇక్కడ నామ, రూపాలకు మూడో పదం జోడవుతుంది. దాని పేరు **కర్మ.** కర్మఫలాన్ని క్షయం చేయటానికి నామరూపాలతో కలుస్తుంది కర్మ.

సృష్టి జరిగాక, వ్యవహారాలు మొదలవుతాయి. ఎటువంటి వ్యవహారాలు? **అసౌ నామ అయమ్.** ఇతని పేరు ఫలానా విష్ణుదత్తుడు, రాముడు, కృష్ణుడు. అలా ఏదైనా చెప్పవచ్చు.

నామం వచ్చాక, రూపం. అతను పొడుగు, పొట్టి, లావు, సన్నం మొదలైన శారీరక లక్షణాలు. కోపిష్టి, నిదానంవంటి మానసిక లక్షణాలు. డాక్టరు, ఇంజనీరు, టీచరువంటి బుద్ధిపదును సూచించే లక్షణాలు. ఇవన్నీ రూపం కిందకి వస్తాయి.

నామం, రూపం కాకుండా మూడో అంశం కర్మ. వర్ణాశ్రమ ధర్మాలకు తగ్గట్టుగా ఒక వ్యక్తి కర్మలు నిర్దేశింపబడి ఉంటాయి. బ్రాహ్మణుని కర్మలు కొన్ని అయితే, బ్రహ్మచారి కర్మలు కొన్ని. కాని ఇవన్నీ మనకు ఎలా తెలుస్తాయి అనే సందేహం రావచ్చు. ఇవన్నీ అవ్యక్తంలో ముందు ఉన్నాయి. అవే వ్యక్తమయ్యాయి. దానికి ఉదాహరణ బంగారు ఆభరణాలు. ఆభరణాలు రూపుదిద్దుకోకముందు, బంగారం రూపంలో అంటే అవ్యక్తరూపంలో ఉన్నాయి. అవి ముద్దబంగారంగా ఉంటే వాటివల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. వాటిని ఒక గాజుగానో, నగగానో చేస్తే వాటికి నామం, రూపం, కర్మ వచ్చాయి. గాజు అనే నామం, గుండ్రటిరూపం, చేతులకు వేసుకునే కర్మ వచ్చాయి.

అదే ఉదాహరణను కొనసాగిస్తే, ప్రపంచంలో అవ్యక్తవస్తువు వ్యక్తరూపంలోకి నామరూపాలద్వారా వస్తుంది. కుండ అనేది నామరూపవ్యాకరణం. ఇదేసూత్రాన్ని వ్యష్టినుంచి సమష్టికి వర్తింపజేయవచ్చు. సమష్టిలో కూడా నామరూపాలు ఉన్నాయి. ఈ అవ్యాకృతప్రపంచం బ్రహ్మమీద ఆరోపించబడింది. దీనితో అవ్యాకృత అధ్యారోప అంశం ముగిసింది. ఇక్కడ్నుంచి ఉపనిషత్తు అధ్యారోప అంశాన్ని కొంచెం పక్కకిపెట్టి, సృష్టి గురించి చెబుతోంది. సృష్టి జరిగాక ఏమవుతుంది, చర్చ వస్తోంది ఇక్కడ. అధ్యారోప అంశం మళ్ళీ తర్వాత వస్తుంది.

# అనుప్రవేశ శ్రుతి భాష్యం - 1

**స ఏష ఇహప్రవిష్టః.**

శ్రుతి పక్కకు వెళ్ళి చెప్పిన అంశం ఏమిటి? జగత్సృష్టి జరిగాక, పరమాత్మే స్వయంగా జగత్తులో ప్రవేశించాడు అంటున్నది ఉపనిషత్తు.

ఈ వాక్యంమీద శంకరులవారు చాలా లోతుగా విశ్లేషించారు. దీన్ని **ప్రవేశ శ్రుతి** లేదా అనుప్రవేశశ్రుతి అంటారు. దీన్ని తైత్తిరీయ ఉపనిషత్తులో, ఛాందోగ్య ఉపనిషత్తులో కూడా చూస్తాము. అది వచ్చిన చోటల్లా దానిమీద భాష్యం రాశారు శంకరులవారు. బృహదారణ్యకంలో మరింత వివరంగా రాశారు. దాని సారాంశం చూద్దాము.

ముందుగా ఇక్కడొక సాంకేతిక సమస్య వస్తుంది. **స ఏష ఇహప్రవిష్టః** అంటే అతను ప్రవేశించాడు. అతను ఎవరు? అతను సర్వనామము. సర్వనామము నిర్వచనం ఏమిటి? నామవాచకం బదులుగా వాడేది. సుబ్రహ్మణ్యం లక్ష్మణశాస్త్రిగారి అబ్బాయి – అతను ఇంజనీరు.

ఈ వాక్యంలో సుబ్రహ్మణ్యంను ముందు పరిచయం చేశాక అతను అన్నాం. అప్పుడు అతను అంటే సుబ్రహ్మణ్యం అని తెలుస్తుంది. ఇక్కడ శ్రుతి ముందు ఎవరి గురించి చెప్పిందో చూడాలి. అవ్యాకృతం, అవ్యక్తం, ప్రకృతి, మాయలాంటివి చర్చించింది.

**తద్ధేదం తర్హ్యవ్యాకృతమాసీత్**

ఈ మంత్రంలో ముందు ఈ జగత్తు అప్పుడు అవ్యాకృతంగా ఉంది అని వచ్చింది. అందువల్ల **'సః'** అంటే అవ్యాకృతం అవాలి. కాని శంకరులవారు **'సః'** అంటే పరమాత్మ అంటున్నారు. పరమాత్మ అంటే బ్రహ్మ. అవ్యాకృతాన్ని పరమాత్మ అని ఎలా అనగలరు? దానికి శంకరులవారు జవాబిస్తున్నారు.

ముందుగా అవ్యాకృతం అనేది బ్రహ్మకు భిన్నంగా లేదు. బ్రహ్మకు భిన్నంగా మాయకు ఉనికి లేదు. అందువల్ల అవ్యాకృతం అంటే బ్రహ్మ లేదా చైతన్యం కూడా వస్తుంది. అవ్యాకృతంకు మూడు సందర్భాలలో మూడు అర్థాలు ఉన్నాయి. మాయ, మాయాసహితబ్రహ్మ లేదా ఈశ్వరుడు, బ్రహ్మ.

ఈ సందర్భంలో అవ్యాకృతం అంటే బ్రహ్మ మాత్రమే. ఎందుకు? తర్వాత వచ్చే చర్చలో, ముఖ్యంగా జీవ ఈశ్వర ఐక్యంలో బ్రహ్మ పదమే సరిపోతుంది. అందువల్ల, **'సః'** పదం అవ్యాకృతాన్ని సూచించినా, దాని అర్థం బ్రహ్మ. ఇలా భిన్న సందర్భాలలో భిన్న అర్థాలు వాడితే మనను అయోమయంలో పడేయదా అంటే ప్రతిభాషలోనూ ఒక పదాన్ని అనేక అర్థాలతో వాడుతాము మనము.

శంకరులవారే దీనికొక ఉదాహరణనిస్తున్నారు. గ్రామం అనే పదానికి మూడు అర్థాలు ఉన్నాయి. గ్రామం అంటే ఒక ఊరు కావచ్చు, లేదా అందులో ఉండే ప్రజలు కావచ్చు లేదా రెండూ కావచ్చు.

1. గ్రామం శూన్యంగా ఉంది – ఊరు శూన్యంగా ఉంది.
2. గ్రామం వచ్చింది – ఊర్లో ఉండే మనుష్యులందరూ వచ్చారు.

3. ఆ గ్రామంలో ప్రవేశించరాదు – ఊరు, ఊర్లో ఉండే మనుష్యుల గురించి చెబుతోంది.

ఒక చిన్న పదమైన గ్రామానికి మూడు అర్థాలు ఉంటే భగవానునికి ఉండవా? అందువల్ల 'సః' అంటే బ్రహ్మ.

**ప్రవిష్టః** – ప్రవేశం చేశాడు. దీనికి అర్థం చెప్పే ముందు శంకరులవారు ఐదు వాదనలను ప్రవేశపెట్టి వాటిని ఖండించారు.

**వాదన 1 – గృహం నిర్మించాక దేవదత్తుడు అందులో ప్రవేశించాడు.** ఈ ఉదాహరణ పరమాత్మకు సరిపోదు. ఉదాహరణలో చూస్తే దేవదత్తుడు ఇంటిబయట ఉన్నాడు; ఇల్లు కట్టుకున్నాడు; ఇంట్లో ప్రవేశించాడు. అది ఫర్వాలేదు. ఎందుకంటే దేవదత్తుడు పరిమితమైన వ్యష్టిశరీరం ఉన్నవాడు. ఇల్లు పరిమితమైంది. అతను ఇంటిలో లేడు. ఇంటి బయటినుంచి లోపలికి వచ్చాడు.

పరమాత్మ సర్వగతుడు. సర్వవ్యాపి. అంతటా ఉన్న పరమాత్మ ఒకచోటినుంచి ఇంకోచోటికి ఎలా వెళతాడు?

**వాదన 2 – పరమాత్మ గృహం నిర్మించాక, జీవాత్మ ప్రవేశించాడు.** కాంట్రాక్టరు కట్టాక, యజమాని ఇంట్లో ప్రవేశించినట్టుగా కాంట్రాక్టరు వేరు, యజమాని వేరు; పరమాత్మ వేరు, జీవాత్మ వేరు.

**జవాబు** – ఉపనిషత్తు స్పష్టంగా పరమాత్మ సృష్టించి, పరమాత్మ అనుప్రవేశం చేశాడు అని చెబుతోంది. సృష్టించిన వ్యక్తి, ప్రవేశించిన వ్యక్తీ వేరు కాదు. ఒక్కరే! ఇక్కడ స్పష్టంగా లేకపోతే, తైత్తిరీయంలో ఉంది. **తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్**

ఈశ్వరుడే సృష్టించాడు. ఈశ్వరుడే ప్రవేశించాడు. ఈశ్వరుడు సృష్టించి జీవాత్మను పంపలేదు.

**వాదన 3 – ద్రవ్యగుణవత్** – ఒక గుణం ద్రవ్యంలో ప్రవేశించినట్టుగా, సృష్టి జరిగిన తర్వాత పరమాత్మ (చైతన్యం) కూడా జడప్రపంచంలో ప్రవేశించాడు. ఇది **నైయాయికుల** వాదన.

**జవాబు** – గుణం ఎప్పుడూ వస్తువుమీద ఆధారపడి ఉంటుంది. పరమాత్మ గుణంలాంటివాడైతే, పరమాత్మకూడా పరతంత్రుడు అవుతాడు. కాని పరమాత్మ స్వతంత్రుడు. అందుకని ఈ వాదన కుదరదు.

**వాదన 4 – ఫలే బీజవత్** – ఒక పండు పండినప్పుడు, అందులో ఒక భాగం గింజగా మారుతుంది. ఉదాహరణకు కొబ్బరిబోండాం తీసుకోండి. బాహ్యంగా అది ఒకటేలా ఉన్నా, లోపల మార్పులు జరుగుతూ ఉంటాయి. అదే విధంగా సర్వవ్యాపకమైన పరమాత్మలో నామరూపాలు వ్యక్తమవుతాయి. పరమాత్మ ఈ జగత్తులో ఉంటూనే మరో ధర్మంగా మార్పు చెంది జీవాత్మ అవుతాడు. అప్పుడు, శరీరంలో ఉన్న పరమాత్మ జీవాత్మగా మార్పుచెంది ఉండవచ్చు కదా!

**జవాబు** – ముందుగా మార్పును 'ప్రవేశం' అనలేము. పైగా పరమాత్మకు అవయవాలు లేవు. పెరగటం, క్షీణించటంవంటి ధర్మాలు పరమాత్మకు వర్తించవు.

**వాదన 5 – దర్పణే ప్రతిబింబవత్** – అద్దంలో ప్రతిబింబం ఏర్పడినట్టుగా, పరమాత్మప్రతిబింబం ఏర్పడి, ఆ ప్రతిబింబం ప్రవేశించింది అనవచ్చు కదా! సూర్యుడు ప్రతిబింబరూపంలో అద్దంలో ప్రవేశించినట్టుగా!

**జవాబు** – నా మొహం అద్దంలో చూసుకోవాలంటే, నేను కాక, అద్దం నాకు భిన్నంగా ఉండాలి. పరమాత్మ అద్వితీయం. పరమాత్మకు భిన్నంగా మరొకటి లేదు. అందువల్ల ప్రతిబింబం ఏర్పడే ఆస్కారమే లేదు.

కాని ఈ జవాబు మనలో ఒక సంశయాన్ని రేకెత్తించవచ్చు. ప్రతిబింబచైతన్యం గురించి మనమే చెబుతాము కదా! కాని వేదాంతం ప్రకారం మనస్సు మిథ్య, అందువల్ల మనసు ప్రతిబింబింప చేసే ప్రతిబింబం కూడా మిథ్యే!

దీనితో పరమాత్మ ప్రవేశం గురించిన వాదోపవాదాలు అయ్యాయి. పరమాత్మ ప్రవేశించలేదని అంటే, శ్రుతి తప్పు చెబుతున్నట్టా?శ్రుతి ఎన్నడూ తప్పు చెప్పదు. శంకరులవారు ఈ అనుప్రవేశశ్రుతిని అర్థవాదభాగం క్రింద తీసుకోవాలి అంటున్నారు. అర్థవాదం అంటే, ఈ భాగం మరో ముఖ్యమైన భాగాన్ని వివరిస్తుంది. దానికి విడిగా ప్రాముఖ్యత ఉండదు.

అది చెప్పే ఇంకో ముఖ్యమైన భాగం ఏమిటి? **జీవాత్మ, పరమాత్మల ఐక్యం**. జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని అర్థం చేసుకుంటే పరమాత్మ అనుప్రవేశం చేశాడు అంటే పరమాత్మ మనస్సు వెనుక సాక్షిలా అందుబాటులో ఉన్నాడు అని అర్థం.

అనుప్రవేశశ్రుతిని అర్థవాదం అని ఎందుకన్నారు? సృష్టి గురించి గాని, అనుప్రవేశం గురించి గాని తెలుసుకుంటే కలిగే ఫలమేమిటో శ్రుతి ఎక్కడా చెప్పదు. సృష్టి గురించి తెలుసుకుంటే మోక్షం కలుగుతుంది అని చెప్పదు. కాని బ్రహ్మ గురించి తెలుసుకుంటే మోక్షం కలుగుతుంది అంటున్నది. అంటే ఏమిటి? ఇది ప్రత్యక్షంగా ఫలాన్నివ్వదు. అందుకని అర్థవాదం అన్నారు.

ప్రత్యక్షఫలాన్నివ్వని భాగాన్ని విధివాక్యంతో కలపాలి. దీన్ని మీమాంససూత్రం అంటారు. విధివాక్యం ఏమిటి? పరమాత్మ గురించి తెలుసుకోవాలంటే, సృష్టిగురించి తెలుసుకోవాలి. సృష్టి గురించి తెలుసుకోవాలంటే మనస్సు గురించి తెలుసుకోవాలి. మనస్సు గురించి తెలుసుకోవాలంటే అనుప్రవేశం గురించి తెలుసుకోవాలి.

ఇప్పుడు పరమాత్మ, సాక్షిరూపంలో మనస్సు వెనుక అందుబాటులో ఉన్నాడు అని తెలిసింది. జీవాత్మరూపంలో పరమాత్మ ఉన్నాడు. ఎప్పుడైతే జీవాత్మ పరమాత్మ అని తెలుసుకుంటామో, అప్పుడు సృష్టి అంశాన్ని మర్చిపోవాలి. అందుకని, మనం గుర్తుంచుకోవాల్సింది ఏది ముందు పుట్టింది, లేదా పంచభూతాల్లో ఎన్ని భూతాలు పుట్టాయిలాంటివి కాదు.

**పరమాత్మా జీవాత్మరూపేణ వర్తతే**

అందువల్ల అనుప్రవేశ శ్రుతిద్వారా పరమాత్మ జీవాత్మరూపంలో ఉన్నాడు అని తెలుసుకుంటే చాలు.

పరమాత్మ ప్రవేశించాడు అంటే పరమాత్మ అందుబాటులో ఉన్నాడు అని అర్థం. రామచంద్రుడు ఆఫీసులోకి వచ్చాడు అంటే, మాట్లాడటానికి అందుబాటులో ఉన్నాడు అని అర్థం. ఎప్పుడు వచ్చాడు మనకు అనవసరం. అందుబాటులో ఉన్నది అవసరం.

పరమాత్మ విషయంలో కూడా ఎలా వచ్చాడు అనవసరం. అందుబాటులో ఉన్నాడు అవసరం. జీవాత్మే పరమాత్మ, **అహం బ్రహ్మ అస్మి.**

దీనితో అనుప్రవేశశ్రుతి భాష్యం 1– అయిపోయింది.

# అనుప్రవేశ శ్రుతి భాష్యం - 2

భగవానుడు ప్రవేశం చేశాడు అంటే నిజంగా ప్రవేశం చేయలేదు. సాక్షిరూపంలో మనస్సులో అందుబాటులో ఉన్నాడు, అది జీవ ఈశ్వరుల ఐక్యాన్ని సూచిస్తుంది అని శంకరులవారు నిరూపించారు. కాని తక్కిన దార్శనికులు దానికి అంగీకరించలేదు. వారు అనేక అభ్యంతరాలను లేవదీశారు. శంకరులవారు వాటన్నింటికీ జవాబు చెప్పారు. వాటిలో కొన్ని చూద్దాము.

**సగటు మానవుని వాదన**

**వాదన 1** – జీవాత్మ పరమాత్మతో ఎలా సమానం? జీవాత్మలు అనేకం. పరమాత్మ ఏకం. జీవాత్మ పరమాత్మ ఐక్యంచెప్పాలంటే అనేక పరమాత్మలు ఉన్నట్టు తీసుకోవాలి. కాని మనం పరమాత్మ ఒక్కటే అంటాము. ఇది సగటు మానవుని వాదన.

**జవాబు** – జీవాత్మలు అనేకం అని ఎవరు చెప్పారు? జీవాత్మలు అనేకం అని మీరు అనుకుంటున్నారు, ఎందుకంటే మనస్సులు అనేకం కాబట్టి. మనస్సుకున్న నానాత్వాన్ని సాక్షికి ఆపాదిస్తున్నారు. సాక్షి ఒక్కటే. సూర్యుడు ఒక్కటే. కాని అనేక ప్రాంతాల్లో కనిపించటంవల్ల అనేకంగా అనిపిస్తాడు. సూర్యునిచేత ప్రకాశింపబడే వస్తువులు అనేకం. కాని ప్రకాశింపచేసే సూర్యుడు ఒక్కటే. సాక్షిచైతన్యంచేత ప్రకాశింపబడే మనస్సులు అనేకం. కాని ప్రకాశింపజేసే సాక్షిచైతన్యం ఒక్కటే.

**వాదన 2** – జీవాత్మ దుఃఖభూయిష్టమైనది. రాగద్వేషాలు, సంసారం ప్రతిజీవాత్మలోనూ ఉంటాయి. ఇప్పుడు జీవాత్మ పరమాత్మ ఒక్కటే అంటే, జీవాత్మ సంసారి కాబట్టి పరమాత్మ మహాసంసారి అవాలి. వేదాంతం నేర్చుకున్నాక, సంసారి జీవుల సంఖ్యలో మరో సంఖ్యను అదనంగా చేరుస్తాము. పాపం దేవుడు కూడా సంసార బంధంనుంచి తప్పించుకోలేడు. కాని ఈశ్వరునికి దోషాలు లేవు అంటుంది. అదెలా సాధ్యం?

**జవాబు** – జీవాత్మ, పరమాత్మలు ఒక్కటే అంటే, ఆ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. జీవాత్మ సంసారి అనీ, పరమాత్మ అసంసారి అనీ మీరే అంటున్నారు. జీవాత్మ=పరమాత్మ వాక్యాన్ని రెండు రకాలుగా అర్థం చేసుకోవాలి.

మొదటి అర్థం మీరు తీసుకున్నదే. పరమాత్మను కూడా సంసారిని చేసేయటం. కాని ఇంకో అర్థం ఉంది. ఏమిటది? పరమాత్మ అసంసారి కాబట్టి, జీవాత్మలు కూడా అసంసారే! శాస్త్రం లక్ష్యమే మనుష్యులకు మోక్షాన్ని ప్రసాదించటం. అందువల్ల జీవాత్మను దుఃఖంనుంచి తొలగించటానికి పాటుపడుతుంది.

ఎలాగైతే పరమాత్మ అసంసారియో, ఎలాగైతే పరమాత్మకు సుఖదుఃఖాలు అంటవో, అలాగే జీవునికి కూడా సుఖదుఃఖాలు అంటవు. జీవాత్మకు దుఃఖం ఉంది అనుకోవటం మన పొరపాటు. అయోమయం, భ్రాంతి. శాస్త్రం నేర్చుకుంటే ఈ భ్రాంతిని తొలగిస్తుంది. దానికి శ్రుతిప్రమాణం కూడా చూపుతారు శంకరులవారు.

**వాదన 3** – శ్రుతి చెప్పవచ్చు, జీవాత్మకు దుఃఖం లేదని. కాని మన అనుభవం వేరేగా ఉంది. శ్రుతి చెప్పినంతమాత్రాన అంగీకరించాలని ఏమీ లేదు. మీమాంస సూత్రం ప్రకారం శ్రుతి చెప్పినదేదైనా ప్రత్యక్షప్రమాణానికి భిన్నంగా ఉంటే,

దాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరించకూడదు. దాన్ని మన ప్రత్యక్ష అనుభవాన్ని ఖండించకుండా ఉండేటట్టు అర్థం చేసుకోవాలి. అందువల్ల శ్రుతి జీవాత్మకు దుఃఖం లేదంటోంది. వేదాంతం వినటానికి బాగానే ఉంది. కాని వేదాంతం నేర్చుకునే విద్యార్థులకు కూడా దుఃఖం ఏమీ తొలగిపోలేదే. అందువల్ల జీవాత్మ, పరమాత్మ ఒక్కటే అనలేము.

**జవాబు** – దుఃఖం ఉన్నది ఎవరికి? ఆత్మకు కాదు, అనాత్మకు.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**
**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

ఇది ఆత్మనిర్వచనం. ఆత్మ విషయం (వస్తువు) కాదు. వస్తువు కానప్పుడు అది అనుభవంలోకి రాదు. ఆత్మ విషయం (ఆబ్జెక్ట్) కాదు, విషయీ (సబ్జెక్ట్). అందువల్ల ఆత్మకు దుఃఖం అంటదు.

ఇంతవరకూ సగటు మానవునితో వాద, ప్రతివాదాలు చూశాము.

## క్షణిక విజ్ఞానవాదుల వాదన

**వాదన 4** – ఆత్మ వస్తువు కాదు. అందుకని ఆత్మకు దుఃఖం అంటదు అన్నారు బాగానే ఉంది. కాని **ఆత్మ తనను తాను అనుభవించవచ్చు** కదా! ఆత్మ తనను తాను అనుభవిస్తోందంటే దానికున్న దుఃఖాన్ని కూడా అనుభవిస్తుంది కదా.ఆ విధంగా ఆత్మకు దుఃఖం ప్రత్యక్షవిషయం. ఆత్మకు దుఃఖం ఉంది కాబట్టి దాన్ని దుఃఖానికి అతీతమైన పరమాత్మతో సమానం చేయలేము.

**జవాబు – కర్తృకర్మ విరోధాత్** – ఆత్మ తనను తాను అనుభవిస్తోంది అనే వాక్యం సరియైనది కాదు. ఈ వాక్యంతో ఆత్మ అనుభవించే నేను, అనుభవించబడే వస్తువు – రెండూ అవుతోంది. ఒకే వస్తువు సబ్జెక్ట్‌గానూ, ఆబ్జెక్ట్ గానూ ఉండలేదు. కర్త, కర్మ ఒకరే అవలేరు. దాన్ని **కర్తృకర్మ విరోధం** అంటారు.

చూసేకన్నులు తనను తాను చూసుకోలేవు. తినేవ్యక్తి తనను తాను తినలేడు.

బోధ చేసే గురువు తనకు తాను బోధ చేసుకోలేడు.అందువల్ల నన్ను నేను అనుభవించలేను.

**వాదన 5** – పూర్వపక్షి వాదన కొనసాగుతోంది. సరే ఆత్మను కర్మగానూ, కర్తగానూ – రెండింటిగా చూడలేము అన్నారు బాగానే ఉంది. ఒకే ఆత్మలో ఒక భాగాన్ని కర్తగా, మరో భాగాన్ని కర్మగా తీసుకోవచ్చుకదా!

కన్ను దృష్ట్యా నేను ద్రష్టను. చెయ్యి దృష్ట్యా నేను దృశ్యాన్ని.

అలాగే నన్ను నేను చూసుకుంటున్నానా లేదా? ఆ విషయంగా ఆత్మ ఒక భాగం ఇంకోభాగాన్ని చూస్తోంది. అలా ఆత్మ ఒక భాగంలో దుఃఖం ఉండవచ్చుకదా!

**జవాబు** – నిరంశత్వాత్ – నిర్వికల్పత్వాత్ – మీ జవాబు ఒప్పుకోగలిగి ఉంటే బాగుండును కాని దురదృష్టవశాత్తూ అది సాధ్యం కాదు. ఎందుకంటే ఆత్మకు భాగాలు లేవు. ఆత్మ నిర్వికల్పం.అందువల్ల ఆత్మ ఒక భాగం దుఃఖాన్ని అనుభవిస్తుంది అనే వాదనను అంగీకరించలేము. దీనితో క్షణికవిజ్ఞానవాదన కూడా ఖండించబడింది.

## తర్కశాస్త్రజ్ఞుల వాదన

**వాదన 6** – శంకరులవారి వాదన తప్పు. ఏమిటది? ఆత్మకు దుఃఖం లేదు. జీవాత్మ పరమాత్మతో సమానం. ఇది తప్పు అని ఎవరంటున్నారు ? తర్కశాస్త్రజ్ఞులు. తర్కం ప్రకారం ఆత్మకు దుఃఖం ఉంది. దుఃఖం అంటే రాగద్వేషాలు, సుఖదుఃఖాలు మొదలైనవి.

**జవాబు** – తర్కశాస్త్రంలో అనేక లొసుగులు ఉంటాయి. దాన్ని ఎవరు స్వీకరిస్తారు అంటున్నారు శంకరులవారు. ఆ లొసుగులలో కొన్నింటిని ఎత్తి చూపుతున్నారు.

ఎ) ఆత్మ నిత్యం, ఆత్మలక్షణం దుఃఖం అంటున్నారు వారు. దుఃఖం అనిత్యం. అంటే ఆత్మ గుణి, దుఃఖం గుణం. గుణం, గుణి విడదీయరానివి అంటున్నారు.

**జవాబు** – అనిత్య దుఃఖం, నిత్య ఆత్మ – రెండు భిన్నమైనవి ఎలా కలిసి ఉండగలవు? ఆత్మ నిత్యమైతే, దుఃఖం కూడా నిత్యమవ్వాలి. కాని అనిత్యం అని మీరే అంటున్నారు. కాబట్టి అనిత్య దుఃఖం నిత్య ఆత్మతో కలిసి ఉండలేదు.

బి) తర్కశాస్త్రంలో ఆత్మను తర్కంద్వారా నిరూపిస్తారు. అనేక దశల్లో వాదించుకుంటూ వెళ్ళి, ఆత్మ దగ్గర జేరతారు. దాని సారాంశం ఆత్మ **అనుమేయం.** ఇది మొదటి వాక్యం. దానికి దుఃఖం ఉంది అంటారు. ఇది రెండో వాక్యం. దుఃఖం ప్రత్యక్షం.

**జవాబు** – ప్రత్యక్షగుణం (దుఃఖం) అనుమేయవస్తువు (ఆత్మ)కు ఎలా చెందుతుంది? ప్రత్యక్షగుణం మీ ఎదురుగుండా ఉంది. తర్కంద్వారా గ్రహించిన వస్తువు ప్రత్యక్షంగా తెలియటం లేదు. అందువల్ల కంటికి తెలియని వస్తువుకు కంటికి తెలిసే లక్షణం ఎలా ఉంటుంది? కాబట్టి ఇది సరికాదు.

సి) ఆత్మ జడమే. కాని సర్వవ్యాపకమైన ఆత్మ మనస్సుతో కలిసేసరికి దానికి ఎరుక వస్తుంది. ఆత్మ మనస్సుతో కలుస్తుంది. మనస్సు ఇంద్రియాలతో కలుస్తుంది. ఇంద్రియాలు వస్తువుతో కలుస్తాయి. అప్పుడు జ్ఞానం కలిగి సుఖదుఃఖాలు పోతాయి. జ్ఞానంకాని, దుఃఖం కాని పుడితే అవి దేనికన్నా సంబంధించినవై ఉండాలి. లక్షణం ఒక వస్తువుకు చెందుతుంది. ఆ వస్తువు ఆబ్జెక్ట్ కావచ్చు. ఇంద్రియాలు కావచ్చు, మనస్సు కావచ్చు. ఆత్మ కావచ్చు. తర్కశాస్త్రం ప్రకారం అలా పుట్టిన సుఖదుఃఖాలు ఆత్మకు చెందుతాయి. ఆత్మ జడం, మనస్సు కూడా జడమే. కాని రెండు జడ పదార్థాలైన ఆత్మ, మనస్సు కలిస్తే వాటి కలయికవల్ల చైతన్యం ఏర్పడుతుంది. ఆ చైతన్యం సుఖదుఃఖాలను అనుభవిస్తుంది అంటారు వారు.

**జవాబు – నిరయవత్వాత్** – సంయోగం తర్వాత వచ్చే లక్షణం శాశ్వతం కాదు.

ఆత్మ అసలు మనస్సుతో కలవలేదు. తర్కశాస్త్రమే ఒక సూత్రం చెబుతుంది. ఏమిటది? రూపాలు ఉన్న రెండు వస్తువులు మాత్రమే కలవగలవు. ఇది సూత్రం ఒకటి. తర్కశాస్త్రమే ఆత్మకు రూపం లేదు అంటుంది. ఇది సూత్రం రెండు. అంటే రూపం లేని ఆత్మ రూపం ఉన్న మనస్సుతో ఎలా కలుస్తుంది? మనస్సుతో కలిసి ఎలా సుఖదుఃఖాలను పుట్టిస్తుంది?

ఆ విధంగా తర్కశాస్త్ర వాదనతోనే తర్కశాస్త్రాన్ని ఖండించారు శంకరులవారు. దీనితో తర్కశాస్త్ర వాదోపవాదాలు ముగిశాయి.

## జైనవాదుల వాదన

**వాదన 7** – ఆత్మను నిర్వికారంగా, సర్వవ్యాపకంగా తీసుకుంటే కదా ఈ సమస్య. మా వాదనను తీసుకోండి. ఆత్మ సర్వవ్యాపకం కాదు. ఆత్మ అమృతం కాదు. ఇది జైనవాదులు అంటున్నారు. ఆత్మ సర్వవ్యాపకం అనేది శరీరంపరిధి మేరకే. ఆత్మపరిమాణం, శరీరపరిమాణం అంత ఉంటుంది. దీన్ని మధ్యమపరిమాణః అంటారు. అత్యంత చిన్న పరిమాణాన్ని అణువు అనీ, అత్యంత పెద్ద పరిమాణాన్ని విభువు అనీ అంటారు. ఈ రెండింటికీ మధ్యలో ఉన్న దాన్ని మధ్యమపరిమాణం అంటారు. ఆత్మ మధ్యమపరిమాణం గలది అంటారు జైనులు.

**జవాబు – యత్ సావయవం తత్ అనిత్యం ఘటవత్**

దేనికైతే రూపు ఉంటుందో, అది నాశనమవుతుంది.అది అనిత్యం అవుతుంది. నామం రూపం ఉన్న ప్రతిదానికీ ఒక ఆది, ఒక అంతం ఉంటుందని మన అనుభవం చెబుతుంది. కుండలాగా అవయవాలు ఉన్నది అనిత్యం అంటున్నారు శంకరులవారు.

ఆత్మ నిత్యం అని అద్వైతవాదులే కాదు, తక్కిన ఆస్తికవాదులైన సాంఖ్య, నైయాయికులులాంటి వారు కూడా ఒప్పుకుంటారు. అందువల్ల ఆత్మ నిత్యం అయితే అది నిరవయవం అవాలి. ఆత్మ సావయవం అయితే అనిత్యం అవాలి. అంటే నిత్యత్వం, సావయవత్వం కలిసి ఉండలేవు.

**వాదన 8** – కొన్ని అసాధారణ పరిస్థితుల్లో కలవవచ్చు. ఉదాహరణకు వజ్రం.

**జవాబు** – ఇది తప్పు. వజ్రాన్ని కోయటం కష్టమే కాని అది ఎప్పుడో ఏర్పడింది. జైనులు వజ్రం ఏర్పడటం కాని, నాశనం అవటం కాని చూసి ఉండకపోవటంవల్ల వజ్రం నిత్యం అనుకుంటున్నారు. అది సావయవం. దానికి నామం, రూపం ఉన్నాయి. అది నాశనమవటం మనం కళ్ళతో చూడలేనంత మాత్రాన అది నిత్యం అవదు అంటారు శంకరులవారు.

దానికి ఉదాహరణ సూర్యుడు. సూర్యుని పుట్టుకను కాని, నాశనాన్ని కాని శాస్త్రజ్ఞులు చూడలేదు కాని, వారు సూర్యుని నాశనం గురించి తర్కంద్వారా నిరూపించగలరు.

**సూర్య అనిత్యః సావయవత్వాత్ ఘటవత్**

ఈ సూత్రం ప్రకారం వజ్రంకూడా అనిత్యమే. అందువల్ల సావయవం అంటే ఆత్మ అనిత్యం అవుతుంది. ఈ విధంగా జైనవాదనను ఖండించారు.

దీనితో అనుప్రవేశశ్రుతి భాష్యం 2– అయిపోయింది.

మంత్రం 1.4.7

**ఆ నఖాగ్రేభ్యో యథా క్షురః క్షురధానేఽవహితస్స్యాద్విశ్వమ్భరో వా విశ్వమ్భరకులా యే తం న పశ్యన్తి ॥**
**అకృత్స్నో హి స ప్రాణన్నేవ ప్రాణో నామ భవతి ॥**
**వదన్ వాక్ పశ్యంశ్చక్షుశ్శృణ్వన్ శ్రోత్రం మన్వానో మనస్తాన్యస్యైతాని కర్మనామాన్యేవ ॥**
**స యోఽత ఏకైకముపాస్తే న స వేదాకృత్స్నో హ్యేషోఽత ఏకైకేన భవతి ॥**

బ్రహ్మ అనుప్రవేశం చేశాడు అంటే శరీరంలో ఎంతమేరకు ఉన్నాడనే సందేహం వస్తుంది వెంటనే. శరీరం మొత్తం, గోరువరకూ ఉన్నాడు. అంటే శరీరం అంతటా ఉన్నాడు. గోటిచివర, చైతన్యం లేదు. అందువల్ల అది శరీరం సరిహద్దులను సూచిస్తుంది. బ్రహ్మ శరీరం అంతటా ఉన్నాడు అని నిరూపించటానికి రెండు ఉదాహరణలనిస్తున్నది ఉపనిషత్తు.

మొదటి ఉదాహరణ క్షురం. క్షురం అంటే క్షురకత్తి. క్షురః అంటే మంగలి. కత్తి చేసే పనిని క్షౌరం అంటారు. క్షురదనం అంటే మంగలి పొది. వేదాంతసారాన్ని చెప్పటానికి మంగలిపొదిని ఉదాహరణగా తీసుకుంది ఉపనిషత్తు. క్షురకత్తి ఎలా మంగలి పొదిలో ఉందో, అలాగే ఆత్మ ఆత్మపొదిలో ఉంది. ఆత్మపొది మన శరీరం.

రెండవ ఉదాహరణ విశ్వంభరః – విశ్వంభరుడు అంటే ఇక్కడ అగ్ని. ఆత్మ అగ్నిలో ఉంది. అగ్ని, శాస్త్రం ప్రకారం అరణి చెక్కలో ఉంది. యజ్ఞాలలో అరణి చెక్కనుంచి నిప్పు రాజేస్తారు. అరణిమథనం చేస్తే అగ్నిపుడుతుంది కాబట్టి, అరణిలో అగ్ని అవ్యక్తస్థితిలో ఉంది. అరణి చెక్కలో అగ్ని ఉన్నట్టుగా, క్షురకత్తి మంగలిపొదిలో ఉన్నట్టుగా, పరమాత్మ, సాక్షిచైతన్యంగా జీవుని శరీరంలో ఉన్నాడు. ఈ రెండు ఉదాహరణల ప్రాముఖ్యత ఏమిటి?

శంకరులవారు ఈ రెండు ఉదాహరణల మధ్యనున్న సూక్ష్మభేదాన్ని సూచిస్తున్నారు. మంగలిపొదిలో క్షురకత్తి ఉంది అంటే, అది ఆ సంచి అంతటా లేదు. ఒక మూల మాత్రమే ఉంది. అదే, అగ్ని ఉదాహరణ తీసుకుంటే, అది అరణిచెక్క అంతటా ఉంది.

శరీరంలో ఆత్మ రెండు రూపాలలో ఉంది. విశేషవృత్తిగా, సామాన్యవృత్తిగా, జాగ్రద్, స్వప్నావస్థల్లో ఏదో ఒక అంగాన్ని వాడుతాము. ఇంద్రియాల్లో దేన్నో దాన్ని ఉపయోగిస్తూ చూస్తాము, వింటాము, మాట్లాడుతాము, తెలుసుకుంటాము. అప్పుడు చైతన్యం ఆయా ఇంద్రియాల్లో ఉన్నట్టుగా ఉంటుంది. ఉన్నట్టుగా ఉంటుంది అన్నది చాలా ముఖ్యం. తక్కిన అంగాల్లో లేదని కాదు.

అలాగే స్వప్నావస్థలో మనసులో చైతన్యం ఉన్నట్టుగా ఉంటుంది. వింటున్నప్పుడు చెవిలో ఉన్నట్టుగా ఉంది; స్వప్నం కంటున్నప్పుడు మనస్సులో ఉన్నట్టుగా ఉంది అంటే; తక్కిన భాగాల్లో లేదా అంటే అక్కడ కూడా ఉంది. కానీ వీటిల్లో స్పష్టంగా తెలుస్తుంది. అందుకని అప్పుడు చైతన్యాన్ని విశేషవృత్తి అంటారు. సుషుప్తిలో చెవి, కన్ను,

ముక్కు, నోరులాంటి ఇంద్రియాలు పనిచేయవు. అంటే అప్పుడు వాటిలో చైతన్యం లేదా? చైతన్యం లేకపోతే మరణంతో సమానం. అందువల్ల సుషుప్తిలో కూడా చైతన్యం ఉంది. అప్పుడు దాన్ని సామాన్యవృత్తి అంటారు.

సృష్టి అంశంనుంచి ఉపనిషత్తు సంసారం అంశంలోకి అడుగుపెడుతున్నది. పైన చర్చించిన అంశంనుంచి, పరమాత్మ సాక్షిగా మనలో ఉన్నాడని చూశాము. ఆ సాక్షి ఎవరు? నేనే! నేనే సాక్షిచైతన్యంయొక్క విశేష అంశంగా, సామాన్య అంశంగా ఉన్నాను. ఈ శరీరం నాకు భోగ ఆయతనం. నేనెవరు? పరమాత్మను.

నేనే పరమాత్మను అయినా, నేను సామాన్య అంశంగా, విశేష అంశంగా ఉన్నా, నేను పరమాత్మను అని ఎవరికీ తెలియదు. ఎవరికీ అంటే సంసారులు ఎవరికీ తెలియదు. సాక్షిచైతన్యం నేనే అంటే, నేను నాకు తెలియకుండా ఎలా ఉంటాను అని అడగవచ్చు మీరు.

తను సాక్షి అని అందరికీ తెలుసు కాని, సాక్షి అర్థం ఎవరికీ తెలియదు అంటున్నది ఉపనిషత్తు. అంటే తెలుసుకోవాల్సిన విధంగా తెలుసుకోవటం లేదు. ఆ విధంగా ఎవరికీ పూర్తిగా ఆత్మజ్ఞానమూ లేదు, పూర్తి ఆత్మ అజ్ఞానమూ లేదు.

'నేను' అని చెప్పేది ఆత్మజ్ఞానం, కాని ఆ జ్ఞానం అసంపూర్ణం. అది పొరపాటుగా తెలుసుకున్న జ్ఞానం. అసలు ఎందుకు ఈ అయోమయస్థితి ఏర్పడుతున్నది? భగవంతుడు మనను దీవించి, అందరినీ జీవన్ముక్తులను చేయవచ్చు కదా! జీవన్ముక్తులను చేస్తే పునరపి జననం, పునరపి మరణం ఉండదు కదా! ఇక్కడే సరిగ్గా అర్థం చేసుకోవాలి మనం. శరీరం, మనస్సు, ఇంద్రియాల మధ్యన సాక్షి ఉంది. వాటి దగ్గరగా సాక్షి ఉండటంవల్ల ఒక దాని లక్షణం ఇంకోదానికి ఆరోపించబడింది.

వేదాంతంలో వీటికి సాంకేతిక పదాలున్నాయి. శరీరం, మనస్సు, ఇంద్రియాలను కలిపి ఉపాధి అని, సాక్షిని ఉపహితం అనీ అంటారు. ఉప అంటే సమీపం. ఉపాధి అంటే ఇంకో వస్తువుకు దగ్గరగా ఉండి, దాని లక్షణాలను పొరపాటుగా ఆ వస్తువుమీద ఆపాదింపజేసేది. ఉపహితం అంటే, ఉపాధికి దగ్గరగా ఉండి, దాని లక్షణాలను అందుకునేది. ఉపాధి, ఉపహితాలను అర్థం చేసుకోవాలంటే మూడు నియమాలు సరిపోవాలి.

1. ఉపాధి, ఉపహితాలు రెండూ ఒకదానికొకటి చాలా దగ్గరగా ఉండాలి.
2. ఒకదాని లక్షణం ఇంకో దానిమీద పొరపాటుగా ఆరోపింపజేస్తుంది.
3. లక్షణాలు నిజంగా మారలేదు (అది చాలా ముఖ్యం).

దీనికి సాధారణంగా స్ఫటికం, మందారపువ్వు (జపాకుసుమం) ఉదాహరణ ఇస్తారు.

1. రెండింటినీ పక్కపక్కన పెడతారు. స్ఫటికం ఉపహితం, పువ్వు ఉపాధి.
2. మందారపువ్వుయొక్క ఎర్రరంగు, పొరపాటుగా స్ఫటికానికి ఆపాదించబడి, స్ఫటికం ఎర్రగా అనిపిస్తుంది. ఉపాధి రంగు ఉపహితంకు ఆపాదించబడింది.
3. స్ఫటికం నిజంగా ఎర్రగా మారలేదు. స్ఫటికాన్ని విడదీసి చూస్తే, ఆ విషయం అర్థమవుతుంది.

ఇప్పుడు ఈ అంశాలనే శరీరం, సాక్షిల పరంగా చూద్దాము.

1. శరీరం, మనస్సు, ఇంద్రియాలు ఉపాధి; సాక్షి ఉపహితం. రెండూ పక్కపక్కనే ఉంటాయి. అనుప్రవేశంవల్ల ఈ విషయం తెలుస్తున్నది.
2. పక్కపక్కన ఉండటంవల్ల శరీరలక్షణాలు, గుణాలు నిర్గుణసాక్షికి ఆపాదించబడ్డాయి. సాక్షి తనకు తానుగా ఏమీ చేయదు. కాని సాక్షిసమక్షంలో కళ్ళు ద్రష్ట అయ్యాయి. కాని మనమేం చేస్తున్నాము? కంటియొక్క ద్రష్టత్వాన్ని సాక్షికి అపాదించి, సాక్షిని పొరపాటుగా ద్రష్ట అంటున్నాము. అలాగే శ్రోత అంటున్నాము. అలాగే శరీరలక్షణాలను కూడా ఆపాదిస్తున్నాము. మాతా, పితా, పత్నీ, పుత్రీ మొదలైన నామాలు సాక్షికి ఆపాదిస్తున్నాము.

నిర్విశేషసాక్షిని సవిశేషసాక్షిగా చేస్తున్నాము. ఒక్కొక్క విశేషం సాక్షికి పరిమితులు విధిస్తుంది. దానివల్ల సాక్షి పరిమితమైన సాక్షి అయిపోయింది. సాక్షిని మేమేం పరిమితం చేయలేదే అనవచ్చు మీరు. కాని మీరు నేను పరిమితి ఉన్నవాణ్ణి అంటే, ఆ 'నేను' సాక్షి తప్ప ఎవరో కాదని గుర్తుంచుకోవాలి.

**అకృత్స్నో హి సః –** పరమాత్మను, అపరిచ్ఛిన్నుణ్ణి పరిమితం చేసి, 'అహం పరిచ్ఛిన్నః' అంటున్నాము.

**ప్రాణాన్నేవ ప్రాణో నామ భవతి –** ప్రాణం తన పని చేస్తున్నంతసేపూ ప్రాణం బ్రతికి ఉంది అనరు ఎవరూ. నేను బ్రతికి ఉన్నాను అంటారు. ప్రాణంయొక్క లక్షణాన్ని నాకు ఆపాదించుకుంటున్నాను. నాకు అంటే సాక్షికి. ప్రాణ ఉపాధిద్వారా ప్రాణః భవతి. అలాగే వాగింద్రియంద్వారా ఆత్మ వక్తగా కనిపిస్తుంది. కాని, ఆత్మ ఎన్నడూ మాట్లాడదు.

ఏది నిజం? వక్త, శ్రోత, ద్రష్టవంటి పేర్లన్నీ సాక్షివి కావు. అవి ఉపాధి చేసే పనులు. ఉపాధి పడుకుంటే, ఈ పనులు కూడా పడుకుంటాయి. వక్త, శ్రోత, ద్రష్టవంటి పేర్లు కూడా పోతాయి కాని మిగిలేది ఒక్క సాక్షి చైతన్యం మాత్రమే. అది తెలియక మనం సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము.

అవును నేను వక్త, శ్రోత, ద్రష్ట అని చెప్పుకుంటాను. నేను సాక్షిని పట్టించుకోను, నష్టమేమిటి అని అడగవచ్చు మీరు. మీరు అలా అనుకుని సంతోషంగా ఉంటానంటే, అలాగే సంతోషంగా ఉండండి, నాకేం అభ్యంతరం లేదు అంటుంది ఉపనిషత్తు. వేదాంతం ఎన్నడూ మీరు వేదాంతం నేర్చుకుతీరాలని ఎవరినీ బలవంతపెట్టదు. బాహాటంగా చెప్పకపోతేనేమో కొందరే లబ్ధి పొందుతున్నారు అంటారు. అలాగని వచ్చిచెపితే, మేము వేదాంతం నేర్చుకోకపోతే వచ్చే నష్టమేమిటి అంటారు.

సరే, మీ ఇష్టం, పొరపాటుగా కూడా వేదాంతానికి రాకండి. మరి అయితే నేనేం చేయాలి అనవచ్చు. కర్మకాండ ఉంది మీకోసం. మీకు ఇంకా ఐశ్వర్యం కావాలా, చదువులు కావాలా, మనవడు కావాలా – ఏం కావాలన్నా దానికి తగ్గ యజ్ఞమో, పూజో ఉంది. కాని ఎప్పుడూ ఏదో వెలితి అనిపిస్తుంది. ఏదో తక్కువైంది అనిపిస్తుంది అంటారా? దాన్నే సంసారం అంటారు.

ఈ సంసారానికి కారణం సాక్షిని సరిగ్గా తెలుసుకోకపోవటం. వేదాంతం నువ్వు సంసారివి, అకృత్స్నువి అనుకుంటున్నావు అంటున్నది. కృత్స్న అంటే పరిపూర్ణం. అకృత్స్న అంటే, పూర్ణం కానిది. పరిమితి ఉన్నది.

ఎప్పుడైతే మనకి ఒక లక్షణం ఆపాదించుకుంటున్నామో, అప్పుడు మనం తక్కిన లక్షణాలు కాదని చెప్పకనే చెప్పినట్టవుతుంది. ఉదాహరణకు నేను భారతీయుణ్ణి అని నేనంటే, నేను అమెరికా, రష్యాలాంటి దేశాలకు చెందను అని అర్థం. నేను మనిషిని అంటే నేను జంతువును కాను.

నేను అపూర్ణపురుషుణ్ణి అంటే పూర్ణపురుషుణ్ణి కాను. నాకు తృప్తి ఎన్నడూ ఉండదు. కోరికలు ఉంటూనే ఉంటాయి. ఆ కోరికలు తీర్చుకోవటానికి కష్టపడుతూనే ఉండాలి. కోరికలు అనంతం. ఒక కోరిక తీరగానే ఇంకో కోరిక పుట్టుకొస్తుంది. కొన్ని దేశాలు వెళితే చాలదు, ఇంకా చూడాల్సిన దేశాలు చాలా ఉన్నాయి అనుకుంటారు. ఆ విధంగా సాక్షి సోపాధికసాక్షి అయి, సంసారి జీవాత్మ అయింది.

ఎవరైతే తనను తాను అహం కర్త అస్మి, శ్రోత అస్మి, మంత అస్మి, విజ్ఞాతా అస్మి అనుకుంటాడో, అతను పరిచ్ఛిన్నజీవి అవుతాడు. పరిచ్ఛిన్నం ఉన్నచోట కోరిక ఉంటుంది. కోరిక వెన్నంటే కష్టం ఉంటుంది. కష్టం మనసు దిగులు చెందేలా చేస్తుంది. ఒత్తిడి ఎక్కువవుతుంది. వీటన్నింటికీ మూల కారణం కోరిక.

అందువల్లనే ఉపనిషత్తు, అలా కోరికల వెంట పరుగులు తీసేవాణ్ణి తిడుతున్నది. అతను వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోవటం లేదంటున్నది. తెలుసుకోవాల్సినది తెలుసుకోవటం లేదు. ఇంతవరకూ సంసారం గురించిన వర్ణన. ఎంత సాఫీగా సంసారవర్ణనలోకి వచ్చామో చూడండి.

ముందు బ్రహ్మ మాత్రమే ఉన్నాడు. బ్రహ్మనుంచి సృష్టి వచ్చింది. సృష్టి చేశాక, బ్రహ్మే జీవాత్మగా అనుప్రవేశం చేశాడు. కాని బ్రహ్మే అనుప్రవేశం చేసిన విషయం తెలియక జీవాత్మ తాను పరిచ్ఛిన్న సంసారిని అనుకుంటున్నాడు. ఉపాధి లక్షణాలను ఉపహితంకు అపాదించటం జరిగింది. అందువల్ల జీవాత్మ తాను అపూర్ణుడనుకుని, కొట్టుమిట్టాడుతున్నాడు. ఇది ఒక వ్యక్తియొక్క జీవితచరిత్ర. అయితే ఏమి చేయాలి?

పరిచ్ఛిన్నసాక్షిని అపరిచ్ఛిన్నసాక్షిగా మార్చటం ఎలా?

మంత్రం 1.4.7

**ఆత్మేత్యేవోపాసీతాత్ర హ్యేతే సర్వ ఏకం భవన్తి ॥**

## విద్యాసూత్ర భాష్య ఉపోద్ఘాతం

**ఆత్మేత్యేవోపాసీత** – ఈ మంత్రం చాలా ముఖ్యమైన మంత్రం. దీన్ని విద్యాసూత్రం అంటారు. ఇందులో మహావాక్యం వస్తుంది. ఇది ఈ ఉపనిషత్తులో రాబోయే తక్కిన మహావాక్యాలకు పునాదిలాంటిది. అందుకే దీన్ని ముఖ్యమహావాక్యం అంటారు. తక్కిన మహావాక్యాలు, ఈ మహావాక్యంమీద వ్యాఖ్యానం అవుతాయి.

పరిచ్ఛిన్నసాక్షిని అపరిచ్ఛిన్నసాక్షిగా మార్చటం ఎలా?

**జవాబు** – ముందు ఆ ప్రశ్నే తప్పు. సాక్షిని పరిచ్ఛిన్నం అని పొరపాటు పడుతున్నాము. అపరిచ్ఛిన్నసాక్షి పరిచ్ఛిన్నసాక్షిగా మారిందని పొరపాటు పడుతున్నాము. ఒకవేళ అపరిచ్ఛిన్నసాక్షి, పరిచ్ఛిన్నసాక్షిగా మారితే, కొన్ని సాధనలద్వారా మళ్ళీ పరిచ్ఛిన్నసాక్షిని, అపరిచ్ఛిన్నంగా చేసే ప్రయత్నం చేయవచ్చు.

కాని అసలు అపరిచ్ఛిన్నసాక్షి పరిచ్ఛిన్నం అవలేదు. పరిచ్ఛిన్నం అయితే కదా, అపరిచ్ఛిన్నం చేసేది? పరమాత్మ జీవాత్మగా ముందు ఉండి, మోక్షం పొందాక జీవాత్మ మళ్ళీ పరమాత్మగా మారుతాడు అంటారు కొందరు. ఈ పై రెండు వాదనలూ తప్పే.

సాక్షి పరిచ్ఛిన్నసాక్షి ఎన్నడూ కాదు. అది ఎప్పుడూ అపరిచ్ఛిన్నసాక్షే.

పరమాత్మనుంచి జీవాత్మ రాలేదు. పరమాత్మే అనుప్రవేశం చేశాడు.

మరి సాక్షి నాకు పరిచ్ఛిన్నంగా అనిపిస్తోంది కదా అంటే, అది నీ పొరపాటు. నువ్వు ఎన్నో ఊహించుకోవచ్చు. అవన్నీ నిజాలు లేదా సత్యాలు అవాలని ఎక్కడా లేదు. మనిషి అనుకున్నవన్నీ నిజాలు కావు. అలాగే, జీవాత్మ తాను పరిచ్ఛిన్నం అనుకుంటే, అది అయోమయంవల్ల ఏర్పడిన భావన మాత్రమే. అందువల్ల మనం చేయాల్సింది, ఆ అయోమయాన్ని పారద్రోలాలి. ఆలోచనలో మార్పు తెస్తే చాలు. మనస్సు బాహ్యంగా చూస్తే, చైతన్యం బహిర్ముఖంగా ఉన్నట్టు, మనస్సు స్వప్నాన్ని చూస్తుంటే చైతన్యం అంతర్ముఖంగా ఉన్నట్టు అనిపిస్తుంది. కాని నిజానికి బహిర్ముఖంగా, అంతర్ముఖంగా ఉన్నది మనస్సే కాని, చైతన్యం కాదు.

మన అజ్ఞానంవల్ల మనస్సుకు చెందిన దాన్ని చైతన్యానికి ఆపాదిస్తున్నాము. ఆలోచనలు వచ్చిపోవటం మనస్సువి. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూసేది చైతన్యం. నేను హైదరాబాద్‌లో ఉన్నాను అనుకుంటే, అది మనోబుద్ధి అహంకారాలకు, శరీరానికి చెందినది కాని సాక్షికి కాదు. సాక్షి ఒక ప్రాంతానికి పరిమితమవలేదు. జ్ఞానం పొందక ముందు కూడా సాక్షి అపరిచ్ఛిన్నమే. అందువల్ల నేను హైదరాబాద్ వాస్తవ్యుణ్ణి అనే పరిమితి భావన వదిలేయండి.

ఉదాహరణకు చూపు తీసుకోండి. అది కంటికి, మనస్సుకు చెందింది. కంటి వెనుక మనస్సు ఉంటేనే ఎదురుగుండా ఉన్న వస్తువును చూడగలుగుతాము. అందువల్ల ద్రష్ట అంటే కళ్ళు, మనస్సు. సుషుప్తిలో నేను ద్రష్టనా? సుషుప్తిలో కళ్ళు, మనస్సు – రెండూ పనిచేయటం లేదు అంటే నాలో ద్రష్టత్వం లేదు. కాని సాక్షి అప్పుడు కూడా ఉంది. నేను పడుకుని లేచాక హాయిగా పడుకున్నాను అంటాను. ఆ తెలిసేది సాక్షికి. అందువల్ల ఏం చేయాలి? నేను కన్నుకు భిన్నంగా ఉన్న సాక్షిని. కన్ను అంతటా వ్యాపించి, కన్నుకు ద్రష్టత్వాన్ని కలుగచేస్తాను, కాని నేను కన్నును కాదు.

**ఆత్మత్యేవోపాసీత** – ఇక్కడ ఆత్మ అంటే నిర్గుణ చైతన్యం లేదా నిర్విశేష చైతన్యం. ఆత్మ ఎక్కడ దొరుకుతుంది? శంకరాచార్యులు ఇక్కడ ఆత్మకు ఒక అందమైన నిర్వచనం ఇస్తున్నారు. **ఆప్నోతి ఇతి ఆత్మా**

ఆత్మ సర్వవ్యాపకం. అన్నింటిలోనూ ఉంటుంది, అంతటా ఉంటుంది, దానికి భిన్నంగా ఉంటుంది. కన్ను అంతటా వ్యాపించి ఉంటుంది. ఆత్మవల్లనే కన్నుకు ద్రష్టత్వం ఉంటుంది.

**శ్రోత్రస్య శ్రోతమ్** – కేన

అలాగే మీరు వింటుంటే మీరు చైతన్యం. కాని మీ వినికిడిశక్తి మీకు స్వాభావికం కాదు. ఎందుకంటే చెవులు వినకపోయినా కూడా, మీరు చైతన్యంగా ఉంటారు.

**ద్రష్టలోంచి ద్రష్టత్వం తీసేస్తే అది చైతన్యం;**
**శ్రోతలోంచి శ్రోతృత్వం తీసేస్తే అది చైతన్యం;**
**ప్రమాతలోంచి ప్రమాతృత్వం తీసేస్తే అది చైతన్యం.**

ఏ'త్వం' తీసుకున్నా అది ఒక అంగానికి చెందే ఒక ప్రత్యేక లక్షణం; ఆ విశేషలక్షణం తీసేస్తే, మిగిలే సామాన్యలక్షణం ఏదైతే ఉందో, ఆ సామాన్యలక్షణం మీరు. విశేషలక్షణం పనిచేస్తున్నా చేయకపోయినా, సామాన్యలక్షణం ఉంటూనే ఉంటుంది. అదే ఆత్మ. ఇదంతా కేనోపనిషత్తులో వివరంగా వస్తుంది.

ఇంకో అంశం కూడా గమనించాలి. మీరు శ్రోతగా ఉంటే వక్తగా ఉండలేరు. వక్తగా ఉంటే శ్రోతగా ఉండలేరు. కాని సాక్షి ఎప్పుడూ ఉంటుంది.

శ్రోత వస్తే వక్త పోతాడు; సాక్షి ఉంటుంది.
వక్త వస్తే, మంత పోతాడు; సాక్షి ఉంటుంది.
(సుషుప్తిలో) శ్రోత, వక్త, మంతా అంతా పోతారు; సాక్షి ఉంటుంది.
సాక్షి సత్యం; సాపేక్షిక సత్యం కాదు. ఈ విషయంనుంచి ఇంకో విషయాన్ని గ్రహించవచ్చు.
శ్రోత వస్తే, వక్త పోతాడు; ఇది నా స్వభావం కాదు.
వక్త వస్తే, మంత పోతాడు; ఇది నా స్వభావం కాదు.
(సుషుప్తిలో) శ్రోత, వక్త, మంతా అంతా పోతారు; ఇది నా స్వభావం కాదు.

ఒకటి వస్తే ఇంకోటి పోతుంటే, అది నా స్వరూపం కాదు. అందువల్ల ఆత్మ అంటే పరమాత్మ స్వరూపం. నేను పరమాత్మస్వరూపాన్ని. ఆ జ్ఞానం పొందాలి.

నిర్విశేష చైతన్యంలో అనేక విశేష చైతన్యాలు వచ్చి, పోతాయి. విశేష చైతన్యాలు – శ్రోత, మంత, ద్రష్టలు– ఒక ఫ్యాషన్ పెరేడ్‌లో అభ్యర్థులు వచ్చి పోయినట్టుగా, వచ్చిపోతుంటాయి. నేను వీటి వేషాలు తాత్కాలికంగా వేసుకుంటాను కాని నా అసలు స్వరూపం నిర్విశేషచైతన్యం. సుషుప్తిలో నేను నిర్విశేష చైతన్యంగా మిగులుతాను. అందువల్ల బ్రహ్మ అంటే 'ఆత్మనైన నేను!' ఏ బ్రహ్మ?

**తదేతం తర్హి అవ్యాకృతమ్ ఆసీత్**

సృష్టికి ముందు ఉన్న బ్రహ్మ. నామరూపాత్మకమైన జగత్తును సృష్టించిన బ్రహ్మ. నామరూపాలు వస్తాయి, పోతాయి. నాకు రాకపోకలు లేవు. నేను శాశ్వతమైన అధిష్ఠానాన్ని. దీన్ని విద్యాసూత్రం అంటారు.

విద్య మహావాక్యాన్ని సూచిస్తుంది. మహావాక్యం అంటే జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని సూచించే వాక్యం. ఐక్యం అంటే పోలికగా తీసుకోకూడదు. అభిన్నంగా అర్థం చేసుకోవాలి. జీవాత్మ, పరమాత్మ అనేవి రెండు భిన్నమైన వస్తువులు కావు, ఒకే నిర్గుణబ్రహ్మకు రెండు భిన్ననామాలు అని అర్థం చేసుకోవాలి.

ఇది చాలా ముఖ్యమైన మంత్రం కాబట్టి, దీనిమీద వచ్చే వాదోపవాదాలమీద శంకరులవారు భాష్యం రాశారు. దీన్ని విద్యాసూత్ర భాష్యం అంటారు. పూర్వమీమాంసకులతో పెద్ద చర్చ జరుగుతుంది ఇక్కడ. పూర్వమీమాంస అంటే వేదపూర్వభాగాన్ని విశ్లేషించటం. అది కర్మప్రధానంగా ఉంటుంది. పూర్వమీమాంస చేసేవారిని పూర్వమీమాంసకులు అనీ, పూర్వపక్షులు అనీ అంటారు. పక్షి అంటే నిజంగా పక్షి కాదు; పక్షం గురించి మాట్లాడేవారు అని అర్థం. మనం ఉత్తరమీమాంసకుల కిందకు వస్తాము. వేద అంతభాగాన్ని విశ్లేషిస్తాము. దీన్ని జ్ఞానకాండ అని కూడా అంటారు. మనను సిద్ధాంతులు అని కూడా అంటారు.

పూర్వమీమాంసకులకు కర్మ చేయటం చాలా ఇష్టం. కర్మల్లో మునిగి తేలుతుంటారు వారు. రోజంతా ఏదో ఒక కర్మ చేయాలి. కర్మకాండ భాగంలో రెండు రకాల వాక్యాలుంటాయి. విధివాక్యాలు, నిషేధవాక్యాలు. విధివాక్యాలు అంటే ఇవి చేయి, అవి చేయి అని నిర్దేశించేవి. స్వర్గలోకానికి వెళ్ళాలంటే జ్యోతిష్టోమయజ్ఞం చేయమంటుంది. నిషేధవాక్యాలు అంటే ఇవి చేయవద్దు, అవి చేయవద్దు అని నిర్దేశిస్తాయి. అసత్యం చెప్పకూడదు. అహింస చేయకూడదు అంటుంది.

కాని వేదాంతం కొచ్చేసరికి ఇలా విధివాక్యాలు ఉండవు. వాటిని ఉపదేశవాక్యాలు అంటారు. వేదాంతం జ్ఞానప్రధానం. మన మనస్సులో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానంతో నింపాలి. అంటే ఇక్కడ వృత్తిలో మార్పు రావాలి తప్ప, కర్మ చేసేందుకు ఏమీ ఉండదు. ఉదాహరణకు తాడుని చూసి పామని పొరబడితే, అక్కడ లైటు వేసి చూస్తే, పాము లేదు, తాడే ఉంది అని తెలుసుకుంటాము. పొరపాటుని తొలగించుకుంటాము. అంటే వృత్తి మార్పు జరుగుతుంది. ఇంక దానిలో కర్మకు చోటెక్కడ ఉంది?

కాని పూర్వపక్షులకు మోక్షానికి కూడా కర్మ చేయాలన్న భావన లోతుగా పాతుకుపోయింది. కేవలం వృత్తి మార్పు చాలు అంటే వారికి అది చాలదు. అవకాశం కుదిరినప్పుడల్లా కర్మ చేయమంది వేదాంతం అని చెప్పటానికి కాచుకు కూర్చుంటారు. వారిది జ్ఞానకర్మసముచ్చయవాదన, మనది కేవల జ్ఞానవాదన. ఈ రెండింటికీ పొత్తు కుదరదు అంటారు శంకరులవారు.

ఇక్కడ ఉపాసీత పదం వారికి దొరికింది. మామూలుగా ఉపాసీత అంటే ఉపాసన చేయి. వెంటనే ఆ పదాన్ని ఒడిసిపుచ్చుకున్నారు. అదుగో వేదాంతం ఉపాసన చేయి అంటున్నది (ఉపాసన కూడా కర్మకిందకే వస్తుంది), అందువల్ల ఉపాసన చేయాలి అంటారు వారు. కాని ఇక్కడ ఉపాసీత అంటే ఉపాసన కాదు; తెలుసుకో అని అర్థం అంటారు శంకరులవారు. టూకీగా ఈ విద్యాసూత్ర భాష్యం సారాంశం ఇది. ఇప్పుడు ఒక్కొక్క వాదనగా చూసుకువద్దాము.

# విద్యాసూత్ర భాష్యం

## ఆత్మేత్యేవోపాసీతాత్ర హ్యేతే సర్వ ఏకం భవన్తి ॥

బ్రహ్మను ఆత్మగా తెలుసుకో. ఆత్మ అంటే జగత్‌కారణమైన బ్రహ్మ అని చూశాము. ఆ బ్రహ్మ జగత్తుకు ముందు ఉన్నాడు. జగత్తును సృష్టించాడు; ఆ బ్రహ్మ జగత్తులో అనుప్రవేశం చేశాడు; శ్రోత, ద్రష్ట కాకుండా, ఇంద్రియాలకు భిన్నంగా ఉండి, ఇంద్రియమంతటా వ్యాపించి, ఇంద్రియానికున్న లక్షణానికి కారణమైన బ్రహ్మ. ఒక్కముక్కలో చెప్పాలంటే శ్రోత్రస్య శ్రోతం.

పూర్వపక్షులు కర్మను ప్రధానంగా తీసుకుంటారని చూశాము. వారు జ్ఞానాన్ని పూర్తిగా తీసివేయరు కాని, జ్ఞానం కర్మ చేయటానికి తొలిమెట్టు అనీ, కర్మ లేకుండా మోక్షం సాధ్యం కాదనీ అంటారు. వారు విధివాక్యాలకే ప్రాముఖ్యతనిస్తారు. అందువల్ల 'తత్త్వమసి', 'అహం బ్రహ్మాస్మి'వంటి మహావాక్యాలు ముఖ్యం కాదు వారికి. అందులో ఈ పని చేయమని ఏమీ ఆజ్ఞ లేదు కాబట్టి, వాటివల్ల లాభం లేదంటారు వారు. వీటిని సిద్ధబోధక వాక్యాలు అంటారు. వాటికి కర్మ తోడురాదు.

జ్ఞానకాండ వేరు, కర్మకాండ వేరు అంటాడు సిద్ధాంతి. వేదాంతంలో కర్మకు ఆస్కారం లేదు. జ్ఞానకాండ అంటే చేయడం కాదు, వృత్తిలో మార్పు రావటం. అందుకే పూజ్యస్వామీజీ ప్రాక్టికల్ వేదాంతం అనే పదం పరస్పర వ్యతిరేక పదం అంటారు. వేదాంతాన్ని అమలులో పెడుతున్నానంటే అందులో అర్థం లేదు. సాధన అంటే పని చేయటం. వేదాంతంలో పని చేయటానికి ఏమీ లేదు. ధర్మాన్ని పాటిస్తున్నాను అనవచ్చు కాని, వేదాంతాన్ని పాటిస్తున్నాను అనలేరు.

**పూర్వమీమాంస సిద్ధాంతం** – పూర్వమీమాంసకుల వాదన చూసేముందు, వారి సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలి. వారు వేదాన్ని నమ్ముతారు. యజ్ఞాలను నమ్ముతారు. కాని భగవంతుణ్ణి నమ్మరు. మనం వేదాలు అపౌరుషేయం అనీ, సాక్షాత్తూ భగవంతుడినుంచే అవి వచ్చాయనీ అంటాము. కాని వారు దేవుణ్ణి నమ్మరు కాబట్టి, వేదాలు దేవునినుంచి వచ్చాయనరు. కాని వేదాలు అనాదిగా ఉన్నాయంటారు. వేదాల్లో ఉన్న విధివాక్యాలకు విలువనిస్తారు.

మరి భగవంతుడు లేకపోతే, విధివాక్యాలను చెప్పేదెవరు? మన ప్రకారం ఈశ్వరుడు వేదాలద్వారా ఆజ్ఞాపిస్తున్నాడు. కాని ఈశ్వరుడే లేకపోతే ఆజ్ఞాపించేదెవరు? వేదాలే ఆజ్ఞాపిస్తాయి అంటారు వారు. చేతనవస్తువు ఆజ్ఞ ఇవ్వగలదు కాని, ఎక్కడైనా అచేతనవస్తువు ఆజ్ఞాపించగలదా? అచేతనమైన బల్ల ఆజ్ఞ ఇవ్వగలదా?

క్రియాపదాలకు ఆజ్ఞాపించే శక్తి ఉంది. పదాలు భావన కలుగచేస్తాయి. దాన్ని శబ్దభావన అంటారు వారు. శబ్దం అంటే పదం. ఒక పదం వినగానే, ఒకవ్యక్తిలో ఒక భావన కలుగుతుంది. ఉపాసీతవంటి పదాలు ఈ పనిని చేయి అని నిర్దేశిస్తాయి. అంటే ఒక కర్తవ్యబుద్ధిని కలుగజేస్తాయి. ఉదాహరణకు మీతో ఒక వ్యక్తి అక్కడ ఫ్యాను ఉంది అంటే మీరు ఏమీ చేయరు.కాని అదే వ్యక్తి ఫ్యాను వేయండి అని చెపితే, ఆ పదం ఒక ఆజ్ఞాపదంగా మారి, మిమ్మల్ని కర్తవ్యానికి పురిగొల్పుతుంది.

చిన్నపదాలు ఒక్కోసారి ఆజ్ఞాపూరిత పదాలు అవుతాయి. అది సహజంగా అవుతుంది. అందువల్ల ఒక పదం వినగానే ఒక పని చేయాలన్న ఉద్దేశం ఏర్పడుతుంది. దాన్ని ఆర్తిభావన లేదా అర్థభావన అంటారు పూర్వమీమాంసకులు. రెండు దశలు ఉన్నాయి.

1. శబ్దభావన – ఈ భావన శబ్దంలో/పదంలో ఉంటుంది.
2. అర్థభావన – ఈ భావన మనస్సులో ఏర్పడుతుంది.

రెండింటిలోనూ మళ్ళీ మూడేసి అంశాలు ఉంటాయి. మొదటిది అప్రస్తుతం. అందువల్ల అర్థభావనలోని మూడు అంశాలను చూద్దాము. అవి – ఏమిటి? ఏం చేయాలి? ఎలా చేయాలి? వీటిని అంశత్రయం అంటారు.

ఉదాహరణకు కర్మకాండలో జ్యోతిష్టోమయజ్ఞం చేస్తే స్వర్గలోకం పొందుతారు అని వస్తుంది.

ఎ) విషయం ఏమిటి? – జ్యోతిష్టోమయజ్ఞం చేస్తే స్వర్గలోకం పొందుతారు.
బి) ఏం చేయాలి? – ఆ యజ్ఞం చేయటానికి ఏం చేయాలి? ఏ ఆహుతులు ఎప్పుడు, ఎలా వేయాలి?
సి) ఎలా చేయాలి? – ఆ యజ్ఞాన్ని విధివిధానంగా చేయటం. అంటే ఆచరణలో పెట్టటం.

1. **పూర్వమీమాంసకుని వాదన** – ఈ సిద్ధాంతాన్ని మనసులో పెట్టుకుని, ఈ బృహదారణ్యకోపనిషత్తులోని వాక్యాన్ని కూడా విధివాక్యంగా వాదిస్తున్నాడు అతను. 'తవ్య,' ప్రత్యయం విధివాక్యాలు. ఉదాహరణకు శ్రోతవ్య, మంతవ్య, నిదిధ్యాసితవ్య, కర్తవ్య మొదలైనవి.

ఉపాసీతపదంలో తవ్య ప్రత్యయం ఉంది కాబట్టి ఇది ఒక విధివాక్యం. ఇక్కడ కూడా అర్థభావనలో మూడు అంశాలు ఏర్పడుతాయి.

ఎ) ఏ విషయం తెలుసుకోవాలి?
బి) ఏ సాధనద్వారా తెలుసుకోవాలి?
సి) ఎలా చేయాలి?

దానికి జవాబుగా ఫలానా ఆత్మను; ఫలానా పద్ధతిద్వారా తెలుసుకుని; ఫలానా పని చేయాలి అని అర్థం వస్తుంది. కాబట్టి ఖచ్చితంగా ఇది విధివాక్యం అంటారు పూర్వపక్షులు.

**శంకరులవారి జవాబు** – ఇందులో అర్థం లేదు. జ్యోతిష్టోమయజ్ఞంలో ఈ విషయాలు సరిపోతాయి. ఏ విషయం తెలుసుకోవాలి అని తెలుసుకున్నాక, ఈ రెండు అంశాలు ఉంటాయి – దాని గురించి వివరంగా తెలుసుకోవటం, ఆ యజ్ఞం చేయటం, కాని వేదాంతవిషయంలో అలా కాదు. ఒక అధ్యాయం చదివితే, దాంట్లో ఆత్మ గురించిన వివరణ వస్తుంది. ఆ వాక్యాలు ఆత్మను నిర్వచిస్తాయి. ఇక్కడ విధితో పనిలేదు. ఎందుకంటే ఆత్మ గురించి నాకు తెలిసింది. జ్యోతిష్టోమయజ్ఞం విషయంలో, అక్కడ యజ్ఞం గురించి తెలిశాక, యజ్ఞం చేస్తేనే స్వర్గానికి వెళతాము. ఆత్మజ్ఞానం విషయంలో ఆత్మ గురించి తెలియగానే, ఆత్మ అజ్ఞానం తొలగుతుంది. ఇంక తర్వాత చేసేది ఏమీ లేదు.

2. **పూర్వమీమాంసకుని వాదన** – ఆత్మజ్ఞానం పొందాక చేసేదేమీ లేదు అంటే సరే. కాని ఆత్మేత్యేవ ఉపాసీత అనే వాక్యం తీసుకోండి. ఆత్మ గురించి తెలుసుకోండి అంటున్నది ఈ ఉపనిషత్తు వాక్యం. అంటే ఇక్కడ రెండు దశలు ఉన్నాయి.

ఎ) ఆత్మ గురించి తెలుసుకోండి – ఇది విధివాక్యం.

బి) ఆత్మ గురించిన నిర్వచనం – ఇది ఆత్మవాదివాక్యం.

ఆత్మ గురించి తెలుసుకోండి అని చెప్పాక కదా ఆత్మ గురించి తెలుసుకునేది – ఎలా తెలుసుకోవాలి అంటే వేదాధ్యయనం చేసో వేదాంతబోధ జరిగే క్లాసులకు వెళ్ళో తెలుసుకోవాలి. విధివాక్యం ఆత్మవాది వాక్యాన్ని చదవమని చెబుతున్నది. అంటే తెలుసుకున్నాక చేసేదేం లేదు అన్నారు కాబట్టి, తెలుసుకునేందుకు చేయాలి అంటాడు పూర్వమీమాంసకుడు.

**శంకరులవారి జవాబు** – విధివాక్యం అంటే వేదవాక్యం. అంటే వేదాల్లో వచ్చే వాక్యం. ఆత్మవాదివాక్యం కూడా వేదాల్లో వచ్చేదే. రెండూ వేదవాక్యాలే. ఒక వేదవాక్యం ఇంకో వేదవాక్యాన్ని చదవమని నిర్దేశించదు. ఒకవేళ అలా ఉందనుకుంటే, అప్పుడు మొదటి వేదవాక్యాన్ని చదవటానికి ఇంకో వేదవాక్యం కావాలి. అలా ఒకదాని వెనుక ఒకటి ఉంటూ ఉండాలి. దాన్ని అనవస్థాదోషం అంటారు. అందువల్ల ఆత్మ గురించి తెలుసుకోండి అనే వాక్యాన్ని విధివాక్యంగా తీసుకోలేము.

3. **పూర్వమీమాంసకుని వాదన** – ఇక్కడ అతను కొంచెం తగ్గుతాడు. సరే విధివాక్యం ముందూ లేదు, వెనుకా లేదు. కాని ఉపాసీత అంటే పదే పదే గుర్తుంచుకోవటం. వేదాంతం అధ్యయనం చేసి జ్ఞానం పొందవచ్చు. కాని ఈ బోధను మనం గుర్తుంచుకోవాలి కదా! దాన్నిగుర్తుంచుకుంటేనే, సంసారానికి మూలకారణమైన అనాత్మ జ్ఞాపకాలను పారద్రోలగలము.

**శంకరులవారి జవాబు** – ఇది కూడా చెల్లదంటున్నారు శంకరులవారు దానికి అనేక కారణాలు చూపుతున్నారు.

ఎ) అనాత్మను గుర్తుంచుకోవటానికి మీరేం సాధనలు చేశారు? అనాత్మ జ్ఞానం పొందటానికి సమాధిలో కూర్చుని ధ్యానం చేశారా; లేదే! ఒక జ్ఞానం పొందితే, అది నిలిచి ఉంటుంది. అలాగే ఆత్మజ్ఞానం కూడా గుర్తు ఉంటుంది. దానికోసం ఏం ప్రయత్నం చేయనవసరం లేదు. ఆత్మ జ్ఞాపకమూ ఉంటుంది. అనాత్మ జ్ఞాపకమూ ఉంటుంది. ఆత్మ జ్ఞాపకం అనాత్మ జ్ఞాపకాన్ని త్రోసి పుచ్చుతుంది.

పైపెచ్చు ఆత్మజ్ఞానం అనాత్మ జ్ఞానం కన్నా శక్తివంతమైనది. అనాత్మ జ్ఞానం మిథ్యాజ్ఞానం. తప్పుడు జ్ఞానం; కాని ఆత్మజ్ఞానం సరియైన జ్ఞానం. అందువల్ల అది ఇంకా బాగా గుర్తుంటుంది.

బి) ఆత్మజ్ఞానం పొందటానికి సాధన చేస్తున్నరోజుల్లోనే అనాత్మ దోషాలను తెలుసుకోగలుగుతాడు. అందువల్ల సాధకుడిగా ఉండగానే అనాత్మనుంచి దృష్టి మరల్చి, ఆత్మవైపుకు తిరుగుతాడు. ఈ మార్పు సహజంగానే జరుగుతుంది. దీనికి ప్రయత్నం అవసరం లేదు.

ఈ కారణాలవల్ల దీనికి విధివాక్యమూ అవసరం లేదు.

4. **పూర్వమీమాంసకుని వాదన** – పోనీ దీన్ని యోగ అభ్యాస విధివాక్యంగా తీసుకోవచ్చు కదా! ఆత్మ గురించి తెలుసుకున్నాక, ధ్యానం చేయండి; ఇది విధివాక్యం. పుస్తకంలో తెలుసుకున్నది ప్రత్యక్షజ్ఞానం కాదు. అది సరిపోదు కూడా. అందువల్ల ధ్యానం చేయాలి. ఉపాసీత అంటే చిత్తవృత్తి నిరోధం కుర్యాత్. మనస్సును శూన్యం చేయటం నేర్చుకోండి. యోగాభ్యాసనలో మనస్సును శూన్యం చేయగలము. మనస్సును శూన్యం చేస్తే మీ స్వస్వరూపం సచ్చిదానందస్వరూపం లేదా ముక్తస్వరూపం అని తెలుస్తుంది. వృత్తి ఉంటే వృత్తిలో ఉంటారు. వృత్తి లేకపోతే, ఆత్మలో ఉంటారు. ఏ వృత్తీ లేకుండా ఆత్మలో రమించటమే మోక్షం. సమాధి స్థితిలో లేనప్పుడు, ప్రపంచంలో వ్యవహారం నడుపుతున్నప్పుడు, మనస్సులో వృత్తి ఉంటుంది. వృత్తి సారూప్యం భవతి. ఇది మోక్షం కాదు. జాగ్రద్, స్వప్నావస్థల్లో వృత్తి ఉంటూనే ఉంటుంది. వృత్తి ఉంటే లాభం లేదు. అందువల్ల జ్ఞానం పొందాక, యోగాభ్యాసంద్వారా వృత్తినిరోధం చేయాలి. మోక్షం పొందటానికి ఉపాసీత అర్థం ఇదీ.

**శంకరులవారి జవాబు** – శంకరులవారు బ్రహ్మసూత్ర భాష్యంలో యోగం అప్రమాణం అని నిరూపించారు. చిత్త ఏకాగ్రతను ఏర్పరచుకోవటానికి యోగాభ్యాసం పనికి వస్తుంది. ఇది వేదాంతం కాదనదు. కాని మనస్సును శూన్యం చేస్తే మోక్షం వస్తుంది అనే వాదనను వేదాంతం ఒప్పుకోదు. వేదాంతం ఆలోచనలను పారద్రోలమనదు. నిజానికి ఆలోచనలను తెచ్చుకోమంటుంది. వేదాంతవిచారణ చేయమంటుంది. అంటే వేదాంతంలో నేర్చుకున్న వాక్యాలను ధ్యానంలో తెచ్చుకుని వాటిమీద నిలబడమంటుంది.

గుర్తుంచుకోండి! వేదాంతం యోగాభ్యాసాన్ని తూలనాడటం లేదు. మనస్సు, శరీరాలను నియంత్రించుకోవటానికి అది చాలా తోడ్పడుతుంది. కాని దానివల్ల మోక్షం వస్తుందంటే ఒప్పుకోదు. అసలు వేదాంతాన్ని అర్థం చేసుకోవటానికి సూక్ష్మమైన మనస్సు ఉండాలి. మనస్సు ఉంటేనే అర్థం కానిది, మనస్సును లేకుండా చేస్తే ఏమర్థమవుతుంది? అందువల్ల మోక్షం మనస్సును శూన్యం చేస్తే రాదు. మోక్షం వేదాంతవిచారణ చేస్తే వస్తుంది.

5. **పూర్వమీమాంసకుని వాదన** – మీ ఉద్దేశం ప్రకారం అసలు విధివాక్యాలే లేకపోతే, వేదాంతంలో కర్మ ఉండనే ఉండదు. కర్మ లేకపోతే, కర్మఫలం ఉండదు. కర్మఫలం ఉండదంటే జ్ఞానం పొందాక ఏ పురుషార్థాన్నీ పొందలేము. అలాంటప్పుడు వేదాంతవాక్యాలు నిష్ప్రయోజనవాక్యాలు అవుతాయి. అలాంటి వాక్యాలను అర్థవాదవాక్యాలు అంటారు. వాటికి విడిగా ఉనికి ఉండదు. (మొదట్లో నాలుగు రకాల వేదవాక్యాల గురించి వివరణ ఉంది. వాటిని చూడగలరు). అంటే వారి ఉద్దేశ్యంలో కర్మ చేస్తేనే ప్రయోజనం ఉంటుంది కాని, జ్ఞానం పొందితే ఉండదు.

**శంకరులవారి జవాబు** – ఈ వాదనలో అర్థం లేదు. అది పొరపాటు. కర్మకాండలో విధివాక్యాలు విని, కర్మ చేస్తేనే ఫలం వస్తుంది, పురుషార్థం పొందుతాడు అంటే అక్కడ రెండు దశలు ఉన్నాయి.

ఎ) జ్ఞానం పొందటం
బి) కర్మ చేయటం

ఈ దశలు దాటాక ఫలం

ఎ) **జ్ఞానం పొందటం**–ఉదాహరణకు యోగాసనాలు వేస్తే ఆరోగ్యం బాగుంటుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది అని విన్నారనుకోండి. కర్మకాండలో ఇది మొదటి దశ. అక్కడితో ఆగితే ఫలితం ఉండదు.

బి) **కర్మ చేయటం** – కర్మ కూడా చేయాలి. ఆ ఆసనాలు వేస్తే ఆ చెప్పిన ఫలితం వస్తుంది. వేయకుండా ఆ పుస్తకాన్ని దిండుకింద పెట్టుకుని పడుకుంటే ఫలితం రాదు.

కాని జ్ఞానకాండ విషయంలో అలా కాదు.

జ్ఞానకాండలో జ్ఞానం పొందగానే ఫలితం వస్తుంది. అంటే జ్ఞానమే పురుషార్థాన్ని ఇస్తుంది. ఉదాహరణకు రజ్జుసర్పభ్రాంతి తీసుకోండి. అక్కడ తాడును చూసి పాము అనుకుంటున్నాను. అది నా అజ్ఞానంవల్ల ఏర్పడింది. తాడు అజ్ఞానంవల్ల పాము భ్రాంతి కలిగింది. నా భయంవల్ల బాధ కలిగింది. ఎప్పుడైతే ఎవరో లైటు వేసి అది పాము కాదు, తాడు అని చూపారో, అప్పుడే నా అజ్ఞానం పోయింది. అజ్ఞానం పోయిన వెంటనే దానివల్ల ఏర్పడిన భయం, భయాన్ని వెన్నంటి వచ్చిన బాధ కూడా పోయాయి.

అందువల్ల కర్మ చేయాల్సినవసరం లేకుండానే వేదాంతం ప్రయోజనాన్ని ఇవ్వగలదు. ఆత్మ అజ్ఞానంవల్ల కలిగిన బాధను ఆత్మజ్ఞానం తొలగిస్తుంది. అజ్ఞానంవల్ల ఏర్పడిన సంసారాన్ని, దుఃఖాన్ని పారద్రోలుతుంది. వేదాంతమే పురుషార్థాన్ని ఇస్తుంది కాబట్టి దానికి వేరే కర్మచేసే పనిలేదు. అందువల్ల వేదాంతజ్ఞానంలో విధివాక్యాలు అవసరం లేదు. అందువల్ల ఉపాసీత అనే పదం విధివాక్యం కాదు.

మామూలుగా జ్ఞానం పొందాక కర్మ చేయాలి, నిజమే! కాని వేదాంతజ్ఞానం ప్రత్యేకమైనది. దీనికి ఆ నియమం వర్తించదు. దీపం వెలిగించగానే, ఎలా చీకటిని పారద్రోలుతుందో, అలా జ్ఞానదీపం వెలగగానే, అజ్ఞాన చీకట్లు, తద్వారా ఏర్పడిన సంసారం తొలగిపోతాయి. అందువల్ల, ఈ వాక్యాలు అర్థవాదవాక్యాలు కావు. విధివాక్యాలూ కావు. విధివాక్యాలు లేకుండా కూడా వేదాంతం నిలబడుతుంది.

6. **పూర్వమీమాంసకుని వాదన** – మళ్ళీ ఉపాసీత పదాన్నే తీసుకున్నారు.

తవ్యకారం విధివాక్యాన్ని సూచిస్తుంది.
ఇతి మామూలుగా ఉపాసనకు వాడుతారు.

ఆత్మా ఇతి ఉపాసీత – ఆత్మను ఊహించుకుని ఉపాసన చేయి.

ఉదాహరణ – మానస బ్రహ్మ ఇతి ఉపాసీత – మనస్సును బ్రహ్మగా భావించి ఉపాసన చేయి.
ఆదిత్య బ్రహ్మ ఇతి ఉపాసీత – ఆదిత్యుని బ్రహ్మగా భావించి ఉపాసన చేయి.
సాలగ్రామ విష్ణు ఇతి ఉపాసీత – సాలగ్రామాన్ని విష్ణువుగా భావించి ఉపాసన చేయి.

ఈ ఉదాహరణలలో మనస్సు బ్రహ్మ కాదు, ఆదిత్యుడు బ్రహ్మ కాదు; సాలగ్రామం విష్ణువు కాదు. కాని వాటిని బ్రహ్మగానో, విష్ణువుగానో ఊహించుకుని ఉపాసన చేయమంటున్నది. ఇది జ్ఞానం కాదు; ఇది కర్మ.

అలాగే ఆత్మా ఇతి ఉపాస్తే అంటే ఆత్మను ఊహించుకుని ఉపాసన చేయి.

**శంకరులవారి జవాబు** – ఉపద – ఊహించుకోవటం కాదు. ఇక్కడ జ్ఞానం గానే తీసుకోవాలి. ఇక్కడ సందర్భం జ్ఞానం. దీని ముందు భాగం, వెనుక భాగం జ్ఞానం గురించే మాట్లాడుతున్నాయి. అనుప్రవేశశ్రుతి చెప్పబడింది దీని ముందు. అహం బ్రహ్మ అస్మి మహావాక్యం రాబోతుంది దీని తర్వాత. రెండుభాగాలు జ్ఞానం గురించి చెబుతున్నప్పుడు, మధ్యలో ఉపాసన గురించి రాదు. అందువల్ల ఇది జ్ఞానప్రకరణమే. సందర్భాన్నిబట్టి అర్థం చేసుకోవాలి.

సాధారణంగా ఉపద అంటే ఉపాసనే కాని, ఇక్కడ జ్ఞానం.

పూర్వమీమాంసకుడు వ్యాకరణసూత్రాల గురించి చెబుతున్నాడు కాని, అతని పూర్వమీమాంస శాస్త్రంలోనే వ్యాకరణసూత్రాలను పట్టించుకోని సందర్భాలు ఉన్నాయి. ఒక్కోచోట విధివాక్యం లేకపోయినా ఉందంటాడు. సందర్భం కర్మ గురించి చెబుతున్నది కాబట్టి, అది విధివాక్యమే అంటాడు.

అతను వ్యాకరణసూత్రాలను పట్టించుకోనప్పుడు, మనను ఆ విషయంలో తప్పు పట్టకూడదు. అబద్ధాలు ఆడే వ్యక్తి, ఎదుటి వాణ్ణి అబద్ధాలకోరని నిందించకూడదు.

అందువల్ల ఇది విధివాక్యం కాదు. విధివాక్యం కాదు కాబట్టి, ఏం తెలుసుకోవాలి. ఎలా తెలుసుకోవాలి, ఎలా చేయాలి అనే మూడు ప్రశ్నలు ఉదయించే ఆస్కారం లేదు. విధివాక్యంలో కుతూహలం కలుగుతుంది. కాని వేదాంతం నేను పరిపూర్ణుణ్ణి అని చెప్పాక, నాకేం కుతూహలం కలుగుతుంది? నేను పరిపూర్ణుణ్ణి. నేను సర్వవ్యాపకుణ్ణి అని తెలిస్తే నా కోరికలన్నీ సమసిపోతాయి. అలాంటప్పుడు నేనింకా ఏ కర్మ చేయాలి?

కోరికే లేనప్పుడు ఏం చేయాలి, ఎలా చేయాలివంటి ప్రశ్నకు చోటే లేదు.

ఉపద అంటే జ్ఞానం.

ఇతి – ఇతికి కూడా అదే జవాబు. నేను బ్రహ్మను అని కొత్తగా ఊహించుకోనవసరం లేదు; అది ఒక సత్యవాక్యం. ఇతి అంటే బ్రహ్మ ఆబ్జెక్టు కాదు. సబ్జెక్టు అయిన నేనే అని అర్థం చేసుకోవటం. ఇతి అర్థం బాహ్యవస్తువుగా కాదు. ఒక వస్తువును తెలుసుకుంటే అది ఆబ్జెక్ట్ అవుతుంది. తెలుసుకోబడే వస్తువు కాదు, తెలుసుకునే నేనే ఆత్మను అని అర్థం చేసుకోవాలని 'ఇతి' పదం సూచిస్తున్నది. ఆ విధంగా ఇతి కూడా సరిపోయింది. ఇతి – అంటే ఆత్మ ఆబ్జెక్ట్ కాదు, సబ్జెక్ట్.

అందువల్ల ఆత్మేత్యేవ ఉపాసీత అనేది ఒక మహావాక్యం. ఇది బృహదారణ్యకంలోని ఉపక్రమవాక్యం. ఉపక్రమ ఉపసంహారం రెండూ ఒకదాని గురించే చెప్పాలి. అంటే ఆ గ్రంథం ప్రారంభం, ముగింపు కూడా ఒకే అంశాన్ని గురించి చెప్పాలి. ఉపక్రమం అంటే మొట్టమొదటి శ్లోకమో, మంత్రమో కాదు.

భగవద్గీతలో 'ధర్మక్షేత్రే, కురుక్షేత్రే' మొట్టమొదటి శ్లోకం. కాని అసలు బోధ 2–11లో మొదలవుతుంది.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**

మీమాంస సూత్రం ప్రకారం ఉపక్రమ, ఉపసంహారాలు రెండూ బోధను సూత్రభూతవాక్యాల్లో సూచించాలి. ఈ ఉపనిషత్తు కూడా అలాగే చేస్తున్నది, దీంట్లో.

**ఆత్మేత్యేవోపాసీత అత్రహ్యేత సర్వ ఏకం భవంతి**

ఉపక్రమ సూత్రం. ఇది బృహదారణ్యకోపనిషత్తు సారాంశాన్ని చెబుతున్నది. ఉపసంహారం 4వ బ్రాహ్మణము చివర్లో వస్తుంది. 'నేతినేతి' వాక్యాలతో. అందువల్ల ఇది విద్యాసూత్రం అయింది.

ఇక్కడితో విద్యాసూత్రభాష్యం అయిపోయింది.

మంత్రం 1.4.7

**ఆత్మేత్యేవోపాసీతాత్ర హ్యేతే సర్వ ఏకం భవన్తి ॥**
**తదేతత్పదనీయమస్య సర్వస్య యదయమాత్మాऽనేన హ్యేతత్సర్వం వేద ।**
**యథా హ వై పదేనానువిన్దేత్ ॥**
**ఏవం కీర్తిగ్ం శ్లోకం విన్దతే య ఏవం వేద ॥**

**ఆత్మా ఇతి ఉపాసీత –** బ్రహ్మను ఆత్మగా తెలుసుకో. ఆత్మ అంటే మనలో ఉన్న చైతన్యం. ఎందుకు దీన్ని ఆత్మ అంటారు? ఈ చైతన్యంలో మన అంగాలన్నీ లయమవుతాయి. అంటే ఘటజ్ఞానం వంటి విశేషజ్ఞానం, సామాన్య చైతన్యంలోంచి వచ్చి, మళ్ళీ సామాన్యచైతన్యంలోనే లయమవుతుంది. మనస్సులో ఆలోచన పుట్టినప్పుడు, చైతన్యం విశేషజ్ఞానాన్ని పొందుతుంది. కుండ గురించిన ఆలోచన కుండ జ్ఞానాన్ని, చెట్టును గురించిన ఆలోచన చెట్టు జ్ఞానాన్ని ఇస్తాయి. ఆలోచన వస్తే, చైతన్యం విశేషచైతన్యం అవుతుంది. ఆలోచన లేకపోతే, సామాన్యచైతన్యంగా ఉంటుంది.

కుండ ఉంటే, కుండలో ఉండే ఆకాశం ఉంటుంది. కుండ లేకపోతే? కుండ ఆకాశం లేదు కాని, ఆకాశం ఉంది. అందుకే ఆత్మను **ఆప్నోతి సర్వం ఇతి ఆత్మా** అంటారు.

జ్ఞానఫలం కూడా వస్తుంది ఇందులో –

1. ఈ సృష్టిలో తెలుసుకోవల్సింది ఆత్మ గురించి మాత్రమే. అనాత్మకు తెలుసుకోవలసినంత ప్రాముఖ్యత లేదు. ఎందుకు ఆత్మ గురించే తెలుసుకోవాలి? ఎందుకంటే ఆత్మజ్ఞానంవల్లనే సర్వం తెలుసుకోగలము. ఆత్మజ్ఞానం మనల్ని సర్వజ్ఞులను చేస్తుంది. దానికి ఒక ఉదాహరణ ఇస్తున్నది ఉపనిషత్తు.
2. **యథా హ వై పదేనానువిందేత్ –** ఎలాగైతే కాలి గుర్తులను బట్టి (తప్పిపోయిన పశువును) వెతికి పట్టుకుంటారో, అలా ఆత్మను తెలుసుకోవాలి. అప్పుడు ఆత్మద్వారా తక్కినవన్నీ తెలుసుకోవచ్చు. ఈ విధంగా ఎవరు తెలుసుకుంటారో, వారు పేరును, కీర్తిని పొందుతారు. జ్ఞాని, తన మంచి లక్షణాలవల్ల పేరు ప్రఖ్యాతులు

పొందుతాడు. అందరితో సఖ్యతగా ఉంటాడు. అందరినీ ప్రేమిస్తాడు. కాబట్టి అందరూ అతన్ని ఇష్టపడతారు. ఇది ఒక అర్థం.

ఈ సందర్భంలో, ఇంకొక అర్థం ఉంది. జ్ఞాని కీర్తి పొందుతాడు. అంటే ఐక్యజ్ఞానం పొందుతాడు అని అర్థం. సర్వాత్మభావన వస్తుంది అతనికి. ఐక్యం అంటే ఏకం – జీవాత్మ పరమాత్మ ఐక్యం; జీవాత్మ జీవాత్మ ఐక్యం. జీవాత్మ జగత్ ఐక్యం. ఈ మూడూ ఒకటే. ఉన్నదంతా ఒకటే. ఈ ఐక్యభావనవల్ల ముక్తపురుషుడు అవుతాడు. ఇది ఇంకో ఫలం.

## మంత్రం 1.4.8

**తదేతత్ప్రేయః పుత్రాత్ప్రేయో విత్తాత్ప్రేయోఽన్యస్మాత్సర్వస్మాదన్తరతరం యదయమాత్మా ॥ స యోఽన్యమాత్మనః ప్రియం బ్రువాణం బ్రూయాత్ప్రియగ్ం రోత్స్యతీతీశ్వరో హ తథైవ స్యాత్ ॥ ఆత్మానమేవ ప్రియముపాసీత । స య ఆత్మానమేవ ప్రియముపాస్తే న హాస్య ప్రియం ప్రమాయుకం భవతి ॥**

ఇది కూడా చాలా ముఖ్యమైన మంత్రం. శంకరులవారు దీన్ని తరచు ఉటంకిస్తుంటారు. ఈ మంత్రం సారాంశం ఆత్మ అన్నింటికంటే ప్రియతమమైనది. ఆత్మ అంటే పరమాత్మకు భిన్నంగా లేని ఆత్మ. పుత్రునికంటే ప్రియమైనది. ధనముకంటే ప్రియమైనది. మిగతా అన్నిటికన్నా ప్రియమైనది.

ఆత్మ అన్నింటికంటే ఎలా ప్రియతమమైనది?

వేదాంతం ప్రకారం అందరూ సమానంగా ప్రేమించేవి రెండే విషయాలు. ఇవి తిరుగులేని నిజాలు. అవి – సుఖం, సుఖసాధనం. ఏ సూత్రానికన్నా మినహాయింపు ఉంటుందేమో కాని ఈ సూత్రానికి లేదు. సుఖం సాధ్యం అయితే, దాన్ని తెచ్చే వస్తువు సుఖసాధనం.

ప్రేమ సూత్రం 1 – ఒక వస్తువు వెంట ఎవరైనా ఎందుకు పడతారంటే అది సుఖాన్ని ఇస్తుంది కాబట్టి. అంటే వస్తువు సాధనం, సుఖం సాధ్యం.

ప్రేమ సూత్రం 2 – ఈ రెండింటిలో– వస్తువు, ఆనందంలో – సుఖమే ముఖ్యం. ఎందుకు?

ఎ) నాకు సుఖం ఎందుకు ఇష్టం అంటే అది నాకు ఆనందాన్ని ఇస్తుంది కాబట్టి. వస్తువుమీద ప్రేమ రెండవస్థాయి ప్రేమ, ఎందుకంటే అది షరతుకు లోనయింది. నాకు సుఖాన్ని ఇస్తుంది కాబట్టి సుఖసాధనాన్ని ప్రేమిస్తున్నాను. ఎప్పుడైతే అది సుఖాన్ని ఇవ్వటం మానేస్తుందో, అప్పుడే దానిమీద ప్రేమ పోతుంది నాకు.

బి) నాకు ఒక వస్తువువల్ల సుఖం పొందేశాక, ఇంక ఆ సాధనంతో నాకు పనిలేదు. అది ఎంతవరకు అవసరం? సుఖం తెచ్చిపెట్టేంతవరకే! ఒకసారి సుఖం వచ్చాక, ఇంక అవసరం లేదు. అంటే సాధ్యం పొందాక, సాధనంతో పని లేదు.

సి) సుఖ ఇచ్ఛ బేషరతు ప్రేమ; సుఖ సాధన ఇచ్ఛ షరతులతో కూడిన ప్రేమ. మొదటిది నిఖార్సైన ప్రేమ అయితే, సాధనమీద ప్రేమ కల్తీప్రేమ. అది నాకు సుఖాన్ని ఇస్తుంది కాబట్టి ప్రేమిస్తున్నాను కాని నిజంగా కాదు. ఒక వ్యక్తికి డబ్బు ఉంటే, అతన్ని నేను ప్రేమిస్తాను. ఎందుకు? అతని డబ్బు నాకు ఉపయోగపడుతుంది అన్న ఆశ! ఒకవేళ అతను డబ్బు ఇవ్వడు అని తెలిస్తే, అతనిమీద ప్రేమ మటుమాయమయిపోతుంది.

అందువల్ల సుఖ ఇచ్ఛ నిఖార్సైన ప్రేమ, సుఖసాధన ఇచ్ఛ కల్తీప్రేమ.

ప్రేమసూత్రం 3 – శాస్త్రంద్వారా ఆత్మే సుఖం అనీ, అనాత్మ అసుఖం అనీ తెలుస్తుంది.

ఇప్పుడు ఈ ప్రేమసూత్రాలు 2, 3లను ఆత్మకు అన్వయించి చూడాలి. సూత్రం 2 ప్రకారం సుఖ ఇచ్ఛ నిఖార్సైన ప్రేమ.

సూత్రం 3 ప్రకారం ఆత్మ సుఖం.

అంటే ఆత్మనే అందరూ ప్రేమిస్తారు. ఆత్మమీద ప్రేమ నిఖార్సైన ప్రేమ.

పిల్లలు, వస్తువులు, ఇల్లు అందరూ, అన్నీ అనాత్మనే. అందువల్ల వారిని ఒకవేళ ప్రేమించినా, సుఖసాధనం కింద మాత్రమే ప్రేమిస్తాము. అనాత్మను సుఖసాధనంగా ప్రేమిస్తే అది ఎటువంటి ప్రేమ? నిజాన్ని నిర్మొహమాటంగా చెప్పాలంటే, అది కల్తీప్రేమ. నిజమైన ప్రేమ కాదు.

కుటుంబాల్లో గొడవలు ఎందుకు వస్తాయి? కుటుంబసభ్యులను సుఖసాధనంగా ప్రేమించి, వారివల్ల సుఖం రాదని తెలియగానే వారిని ప్రేమించటం మానేస్తాము. వారినుంచి భౌతికంగా దూరం కావచ్చు లేదా ద్వేషం పెంచుకుని, మానసికంగా దూరం కావచ్చు. ఒకప్పుడు సుఖసాధనం అనుకున్నది దుఃఖసాధనంగా మారవచ్చు. ఒక కారు, చక్కగా నడుస్తున్నన్నాళ్ళూ సుఖసాధనం. ఎప్పుడైతే బండి పని అయిపోయిందో, అప్పుడే దాన్ని వచ్చిన ధరకి అమ్మివేస్తాము.

ఇదే సూత్రం ప్రపంచమంతటా నడుస్తున్నది. పొరపాటు వారిలో లేదు. వారు మారలేదు. మనమే వారినుంచి బేషరతుగా ప్రేమను ఆశించాము. అది సాధ్యం కాదు. ఎందుకంటే, మనం కూడా ఎదుటివారికి ప్రేమను బేషరతుగా అందించలేము. ఎదుటివారినే కాదు, మనం దేవుణ్ణి కూడా బేషరతుగా ఆరాధించలేము. మన కోరిక తీరకపోతేనో, మనకు అనుకోని మనస్థాపం కలిగితేనో, దైవపూజ కూడా మానేస్తాము.

దీన్నిబట్టి మనం గ్రహించాల్సిన విషయం – మనం మనను తప్ప ఎవరినీ ప్రేమించము, ప్రేమించలేము. తోటివాణ్ణి నీకన్నా ఎక్కువగా ప్రేమించులాంటి సూత్రాలు పనిచేయవు. దేవుణ్ణే నిస్వార్థంగా ప్రేమించము. ఇలాంటి వాదన వింటే మన నమ్మకాలను కూకటి వేళ్ళతో పెకళించి వేసినట్టవుతుంది. మనం పెద్ద అఘాతంలో కూరుకుపోయినట్టు ఉంటుంది. కాని ఇది నిజం. కాని జ్ఞాని అందరినీ బేషరతుగా ప్రేమిస్తాడంటుంది ఉపనిషత్తు. అదెలా సాధ్యం? అతనికి సర్వజనీన, నిఖార్సైన, ప్రాథమిక ప్రేమ ఉంటుంది అందరిమీదా! ఒకపక్క నువ్వు నిన్ను మాత్రమే ప్రేమిస్తావు అంటూ ఇంకోపక్క జ్ఞాని అందరినీ ప్రేమిస్తాడు అంటున్నది. అదెలా కుదురుతుంది?

కుదురుతుంది. జ్ఞాని ప్రేమ కూడా స్వార్థపూరితమైన ప్రేమే. కాకపోతే అతని ప్రేమ సార్వజనీనప్రేమ. ఎందుకంటే, అతనిలో సర్వాత్మభావన ఉంటుంది. నేనూ అంటే అందరూ.

అజ్ఞాని నేను అంటే నేనే!
జ్ఞాని నేను అంటే సర్వం!

అదీ భేదం!

ప్రేమ సూత్రం 4 – నేను దేన్నైనా ఎందుకు ప్రేమిస్తాను? ఏది నాకు దగ్గరగా, ఆత్మీయంగా ఉంటే దాన్ని ప్రేమిస్తాను. పిల్లలు దగ్గరగా, ఆత్మీయంగా అనిపిస్తారు కాబట్టి వారిని ప్రేమిస్తాను. దూరంగా ఉన్న దగ్గర చుట్టం కన్నా, దగ్గరగా ఉన్న పొరుగువాణ్ణి ఎక్కువగా ప్రేమిస్తాను. అతనికేదైనా కష్టం వస్తే సహాయపడతాను. అంటే ఏదైతే లేదా ఎవరైతే చాలా దగ్గరగా ఉంటారో, దాన్ని లేదా వారిని ప్రేమిస్తాను. వేదాంతం ప్రకారం ఆత్మనే ఎక్కువగా మనం ప్రేమిస్తాము. ఎందుకంటే అది నాకు అత్యంత దగ్గరగా ఉంది. తరువాత జ్ఞానం పొందాక ప్రపంచం దూరంగా లేదు అని అర్థం చేసుకున్నాక, అందరినీ ప్రేమిస్తాను. అంటే సర్వాత్మభావన కలుగుతుంది.

ఆత్మ ఆత్యంత సమీపమైనది. పంచకోశవిశ్లేషణ చేస్తే ఈ విషయం తెలుస్తుంది. పంచకోశాలు – అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం, బాహ్యకోశంనుంచి అంతర్గతకోశానికి ప్రయాణం చేస్తే అన్నమయకోశం అత్యంత బాహ్యమైనది. ఆనందమయకోశం అత్యంత సన్నిహితమైనది కాని, దానికన్నా సన్నిహితమైనది ఆత్మ. ఎందుకు? ఆ ఆత్మను నేనే కాబట్టి.

తక్కిన ప్రేమలు షరతులకు లోనవుతాయి కాబట్టి ఉపనిషత్తు సలహా ఇవ్వదలచుకుంది. తక్కినవన్నీ నశించేవి, అవి శాశ్వతం కాదు అని చెప్పాలి. కాని ఆ సలహా ప్రత్యక్షంగా ఇవ్వకుండా, ఉపనిషత్తు పరోక్షమార్గం ఎన్నుకుంది. ఒక జ్ఞాని, ఒక అజ్ఞానికి సలహా ఇచ్చినట్టుగా చెబుతున్నది.

అందువల్ల ఒక జ్ఞానికి, అజ్ఞానికి మధ్య సంభాషణను ఊహించుకోండి. జ్ఞానిని ఆత్మప్రియవాది అంటారు. అతని దృష్టిలో నిఖార్సైన ప్రేమ ఆత్మమీద ప్రేమ. అజ్ఞానిని అనాత్మప్రియవాది అంటారు. అతను తనను కాకుండా, తక్కిన వారినందరినీ ప్రేమిస్తానంటాడు. పిల్లలు, కుటుంబం, దేశం అన్నింటినీ ప్రేమిస్తానంటాడు. అటువంటి వ్యక్తిని అజ్ఞాని అంటున్నది ఉపనిషత్తు.

అనాత్మ ప్రియవాది. ఆత్మకన్నా తక్కినవన్నీ ప్రియం అని చెబుతాడు. అతనితో జ్ఞాని ప్రియవస్తువు నశించగలదు అంటాడు. అజ్ఞానికి ప్రియవస్తువు అనాత్మ. అవేవీ శాశ్వతం కాదు. వాటి ప్రేమ కల్తీప్రేమ అని చెబుతాడు. దేవుడు కూడా అనాత్మకిందే వస్తాడు. నీకు భిన్నంగా చూస్తే అనాత్మే అవుతాడు. ఈ విషయం అతను ధైర్యంగా చెబుతాడు. ఎందుకంటే అది సత్యం. అందువల్ల అతని మాట ఉపదేశం. సరియైన ఉపదేశం అవుతుంది.

మనమేం చేయాలి? అనాత్మనుంచి మన ప్రేమను మళ్ళించాలి. అది ఉన్నతమైన అనాత్మ అయిన దేవుడైనా సరే, మామూలు అనాత్మ అయిన పత్నీ, పుత్రులు అయినా సరే! మరి దేన్ని పట్టుకోవాలి?

**ఆత్మానమేవ ప్రియముపాసీత –** ఇక్కడ ఉపాసీత అంటే జ్ఞానం. ఆత్మ మాత్రమే ప్రియమైనది అనే జ్ఞానం పొందాలి. ఇలా చెపితే నాలో స్వార్థం నూరిపోయటం లేదా? అంటే తక్కిన వస్తువులను ప్రేమించవద్దు అనటం లేదా? అవును. ఉపనిషత్తు స్వార్థమే నేర్పిస్తున్నది. ఎలా? 'నేను' అంటే ఆ నేను ఎవరో తెలుసుకోవాలి. సర్వం ఆత్మ. ఈ విశ్వంలో ఉన్నదంతా నేనే! ఎవరి పేరైనా చెప్పండి, అందులో వారు కూడా వస్తారు. స్నేహితులు, కుటుంబ సభ్యులు, శత్రువులు, సమస్తం! శత్రువును కూడా ప్రేమిస్తాడు. అనాత్మగా కాదు, ఆత్మగా!

అందువల్ల జ్ఞానికి, అజ్ఞానికి మధ్య భేదం ఏమిటి?

అజ్ఞాని కుటుంబ సభ్యులను ప్రేమిస్తే, వారిని తనకు భిన్నంగా ప్రేమిస్తాడు.

జ్ఞాని కుటుంబసభ్యులను ప్రేమిస్తే వారిని తనుగా భావించి ప్రేమిస్తాడు. దేవుణ్ణిచకూడా తన ఆత్మగానే చూస్తాడు. జ్ఞాని కొందరిని ప్రేమించి, కొందరిని ద్వేషించడు. జ్ఞాని ప్రేమలో ఆత్మ, అనాత్మ రెండూ ఉంటాయి. అనాత్మ అంటే అతనికి భిన్నంగా ఉన్నవన్నీ! అందువల్ల అతనికి ఎవరినించైనా విడిపోతామనే బాధ లేదు.

ఫలశ్రుతి – జ్ఞాని శాశ్వతమైన ఆనందం; దుఃఖంలేని ఆనందం పొందుతాడు. అదే మోక్షం.

ఒకవేళ ఒక వ్యక్తి మంద అధికారి అయి, జ్ఞానమార్గానికి రాలేకపోతే, అతను ఈ ఉపాసన చేస్తే కొంత ఫలం పొందుతాడు. అతనికి ప్రియమైనవారు ఎక్కువకాలం జీవిస్తారు.

## మంత్రం 1.4.9

**తదాహుర్యద్బ్రహ్మవిద్యయా సర్వం భవిష్యన్తో మనుష్యా మన్యన్తే ॥**
**కిము తద్బ్రహ్మావేద్యస్మాత్తత్సర్వమభవదితి ॥**

ఇక్కడ ఉపనిషత్తు కొందరు సాధకులు ఒకచోట చేరినట్టుగా ఊహించుకుంటున్నది. బ్రాహ్మణులు అంటే బ్రహ్మ గురించి తెలుసుకోవాలనుకుంటున్నవారు.

**బ్రహ్మవిద్యయా సర్వం భవిష్యన్తో మనుష్యా మన్యన్తే**

బ్రహ్మజ్ఞానంవల్ల సర్వం కాగలను అని మనుష్యులు అనుకుంటున్నారు. అంటే సర్వాత్మభావన వస్తుంది.

బ్రహ్మగురించి తెలుసుకుంటే సర్వం తెలుస్తుంది. సర్వం తెలియటంవల్ల మనం సర్వం అవుతాము అనుకుంటున్నారు ఆ సాధకులు. దీని గురించి కొన్ని సందేహాలు కలుగుతాయి. బ్రహ్మ సర్వం ఎలా అయ్యాడు?

1. బ్రహ్మ, బ్రహ్మజ్ఞానం పొందకుండానే, సర్వం అయ్యాడా? అలా అయితే, మనం కూడా జ్ఞానం పొందకుండానే సర్వం అవవచ్చు కదా!
2. మనం బ్రహ్మ గురించి తెలుసుకుని, బ్రహ్మజ్ఞానం పొందినట్టుగా, బ్రహ్మ కూడా దేని గురించో తెలుసుకుని సర్వం అయ్యాడా? అలా అయితే, ఆ ఏదో, ఇంకోదాని గురించి తెలుసుకోవాలి. ఆ ఇంకోటి, ఇంకోదాని గురించి తెలుసుకోవాలి. దానికి అంతు ఉండదు. దీన్ని అనవస్థాదోషం అంటారు.

3. బ్రహ్మ తన గురించి తాను తెలుసుకుని, సర్వం అయ్యాడా? అలా అయితే కర్మ, కర్త ఒకటే అవుతాయి. తెలుసుకునే నేను కర్త (సబ్జెక్ట్); తెలుసుకోబడే వస్తువు కర్మ (ఆబ్జెక్ట్); శాస్త్రం ప్రకారం కర్త, కర్మ గురించి తెలుసుకోగలదు. కాని కర్త, కర్త గురించి తెలుసుకోలేదు. ఉదాహరణకు కన్ను అన్నిటినీ చూడగలదు. కాని తనను తాను చూసుకోలేదు. దీన్ని కర్తృకర్మ విరోధం అంటారు.

బ్రహ్మ తన గురించి తాను తెలుసుకుని, సర్వం అయ్యాడా? అప్పుడు ఇంకో సమస్య. తెలుసుకున్నాక అయ్యాడు అంటే ఆ ఫలం శాశ్వతం కాదు. ఒక కాలంలో వచ్చే ఫలం ఇంకో కాలంలో ఉండదు. అది నశిస్తుంది. దీన్ని నశ్వరదోషం అంటారు.

ఒక్కముక్కలో చెప్పాలంటే బ్రహ్మ సర్వం ఎలా అయ్యాడు? ఈ ప్రశ్నలు ఆ సాధకులకు కలిగాయి. వీటికి జవాబులు తరువాత వచ్చే మంత్రంలో చూస్తాము.

## మంత్రం 1.4.10

**బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్ । తదాత్మానమేవావేత్ । అహం బ్రహ్మాస్మీతి। తస్మాత్తత్సర్వమభవత్।। తద్యో యో దేవానాం ప్రత్యబుధ్యత స ఏవ తదభవత్తథర్షీణాం తథా మనుష్యాణామ్।। తద్ధైతత్పశ్యన్నృషిర్వామదేవః ప్రతిపేదేఽహం మనురభవగ్ం సూర్యశ్చేతి।। తదిదమప్యేతర్హి య ఏవం వేదాహం బ్రహ్మాస్మీతి స ఇదగ్ం సర్వం భవతి తస్య హ న దేవాశ్చనాభూత్యా ఈశతే ।। ఆత్మా హ్యేషాగ్ం స భవతి ।।**

**అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోసావన్యోఽహమస్మీతి న స వేద యథా పశురేవగ్ం స దేవానామ్ ।। యథా హ వై బహవః పశవో మనుష్యం భుంజ్యురేవమేకైకః పురుషో దేవాన్ భునక్తి ।। ఏకస్మిన్నేవ పశావాదీయమానేఽప్రియం భవతి కిము బహుషు తస్మాదేషాం తన్న ప్రియం యదేతన్మనుష్యా విద్యుః ।।**

ముందు మంత్రంలో ఉదయించిన ప్రశ్నలకు ఈ మంత్రంలో జవాబు వస్తుంది. ఇది చాలా, చాలా ముఖ్యమైన మంత్రం. ఇది బ్రహ్మ పదంతో మొదలవుతుంది. అహం బ్రహ్మాస్మి అనే మహావాక్యం ఈ మంత్రంలో వస్తుంది కాబట్టి ఇది చాలా ప్రముఖమైన మంత్రం.

| **మహావాక్యాలు** | **ఉపనిషత్తు** |
|---|---|
| **ప్రజ్ఞానం బ్రహ్మ** | **ఐతరేయోపనిషత్తు** |
| **అయమాత్మా బ్రహ్మ** | **మాండూక్యోపనిషత్తు** |
| **తత్త్వమసి** | **ఛాందోగ్యోపనిషత్తు** |
| **అహం బ్రహ్మాస్మి** | **బృహదారణ్యకోపనిషత్తు** |

ఈ మంత్రంలో **అహం బ్రహ్మాస్మి** అనే మహావాక్యాన్ని చూడబోతున్నాము.

ముందు మంత్రంలో కొందరు బ్రాహ్మణులు బ్రహ్మ గురించి చర్చించుకున్నారని చెప్పినప్పుడు అందులో మూడు ప్రశ్నలు చూశాము. అవి–

1. బ్రహ్మ, బ్రహ్మజ్ఞానం పొందకుండానే సర్వం అయ్యాడా?
2. బ్రహ్మ, దేనిగురించో తెలుసుకుని సర్వం అయ్యాడా?
3. బ్రహ్మ తన గురించి తాను తెలుసుకుని సర్వం అయ్యాడా?

ఉపనిషత్తు ఈ మూడింటిలోంచి, చివరది తీసుకుంది. ఏమిటది? బ్రహ్మ తన గురించి తాను తెలుసుకుని సర్వం అయ్యాడు. ఎలా? జీవాత్మ అజ్ఞాన అవస్థలో ఉన్నప్పుడూ, ఉన్నది బ్రహ్మ ఒకటే. జీవాత్మే బ్రహ్మ! అందువల్ల శిష్యుడూ బ్రహ్మే, గురువూ బ్రహ్మే!

జీవాత్మ బ్రహ్మ కాబట్టి, జీవాత్మ జ్ఞానం పొందింది అంటే, బ్రహ్మే అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందింది.

**బ్రహ్మ ఏవ అవిద్యయా సంసారీ**

**జ్ఞాన అవస్థాయాం తదైవ సర్వమ్ అభవత్**

అంటే అజ్ఞాన అవస్థలో ఉన్నదీ, జ్ఞానం పొందిందీ రెండూ బ్రహ్మే. ఈ విధంగా బ్రహ్మ జీవాత్మల ఐక్యం చూపిస్తుంది ఉపనిషత్తు. అజ్ఞాన అవస్థలో జీవాత్మ అంటే, జ్ఞాన అవస్థలో బ్రహ్మ అయింది. అందువల్ల అది అవస్థాభేదం మాత్రమే.

# అహం బ్రహ్మాస్మి మహావాక్య భాష్యం

**బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్। తదాత్మానమేవావేత్। అహం బ్రహ్మాస్మీతి। తస్మాత్తత్సర్వమభవత్ 1-4-10**

**సిద్ధాంతి వివరణ**

అగ్రే – అజ్ఞాన అవస్థలో
సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్ – ఛాందోగ్యోపనిషత్తు
ఆత్మా వా ఇదమేకమ్ ఏవాగ్ర ఆసీత్ – ఐతరేయోపనిషత్తు

ఈ రెండు చోట్ల అగ్రే అంటే సృష్టికి పూర్వం. కాని ఈ మంత్రంలో అగ్రే అంటే అజ్ఞాన అవస్థలో ఉన్నప్పుడు అని అర్థం.

బ్రహ్మైవ ఆసీత్ – బ్రహ్మ మాత్రమే ఉన్నాడు.

ఎలా ఉన్నాడు?

ఇదమ్ – జీవాత్మ చైతన్యంగా ఉన్నాడు.

అందువల్ల బ్రహ్మే జీవాత్మ రూపంలో ఉన్నాడు.

తదాత్మానమ్ ఆవేత్ – బ్రహ్మ తన గురించి తెలుసుకున్నాడు.

**ఏవ –** తనను తాను. అంటే శరీరవ్యతిరిక్త ఆత్మను. శుద్ధ ఆత్మ అన్నా, కేవల ఆత్మ అన్నా, లక్ష్యార్థ ఆత్మ అన్నా, సాక్షిచైతన్యం అన్నా ఒకటే. తాను కార్యకరణసంఘాతానికి విలక్షణంగా ఉన్న ఆత్మ అని తెలుసుకున్నాడు.

ఏం తెలుసుకున్నాడు?

**అహం బ్రహ్మ అస్మి ఇతి –** నేను బ్రహ్మను, అజ్ఞాన అవస్థలో ఉండి, సంసారి, జీవిగా కనబడుతున్న నేను, సాక్షాత్తూ బ్రహ్మే.

**తస్మాత్ –** అందువల్ల; అహం బ్రహ్మాస్మి జ్ఞానం పొందటంవల్ల ఏమయింది?

**సర్వమ్ అభవత్ –** ఆ బ్రహ్మ సర్వం తానే అయ్యాడు. లేదా, జీవాత్మరూపంలో ఉన్న ఆ బ్రహ్మ. బ్రహ్మజ్ఞానం పొందటంవల్ల సర్వాత్మభావనను పొందాడు.

అజ్ఞానంలో కూడా సర్వమూ బ్రహ్మే. కాని అజ్ఞానంవల్ల సర్వాత్మత్వం లేదా బ్రహ్మత్వం తెలియదు. అప్పుడు అసర్వత్వం, అబ్రహ్మత్వం చోటు చేసుకున్నాయి. జ్ఞానంవల్ల అసర్వత్వం పోయి సర్వత్వం వచ్చింది.

**బ్రహ్మవిద్యయా బ్రహ్మ సర్వమభవత్**

జీవాత్మ పదం వాడుతున్నాము కాని, జీవాత్మ అంటే వేరే ఎవరో కాదు, అక్షరాలా పరమాత్మ. ఇది అవస్థాభేదమే కాని వస్తుభేదం కాదు. ఆ విధంగా జీవాత్మ, పరమాత్మ ఐక్యం చెప్పబడింది ఈ మంత్రంలో.

**భర్తృప్రపంచం వాదన -1 –** జీవాత్మ వేరు, పరమాత్మ వేరు.

బ్రహ్మ వా ఆసీత్ – జీవాత్మ ఉన్నాడు. అతను అజ్ఞాని, సంసారి, బ్రహ్మకు భిన్నంగా ఉన్నాడు. కాకపోతే జ్ఞానం పొందాక బ్రహ్మ అవుతాడు కాబట్టి, ముందే బ్రహ్మపదం వాడింది ఉపనిషత్తు. కొంతమంది మెడిసిన్ చదవటానికి చేరుతూనే వారిపేరు పక్కన యం.బి.బి.యస్ రాసేసుకున్నట్టు అన్నమాట. బ్రహ్మకు భిన్నంగా ఉన్న ఈ జీవాత్మ అహం బ్రహ్మాస్మి జ్ఞానం పొందుతాడు. అప్పుడు బ్రహ్మ అయి, ఆ జ్ఞాన ఫలితంగా సర్వాత్మభావనను పొందుతాడు. భర్తృప్రపంచం తన వాదనను సమర్థించుకోవటానికి అనేక కారణాలు చూపిస్తాడు.

ఎ) వాక్యప్రమాణం – తస్మాత్ సర్వమ్ అభవత్ – జ్ఞానం పొందాక, సర్వం అయ్యాడు అంటున్నది ఉపనిషత్తు. తర్వాత బ్రహ్మ అయ్యాడు అంటే ఏమిటి అర్థం? దాని ముందు బ్రహ్మ కానట్టేగా!

బి) శాస్త్ర ప్రమాణం – వేదాలే జీవాత్మ, పరమాత్మల మధ్య భేదాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. బ్రహ్మను శుద్ధం, నిష్కళం, పూర్ణంలాంటి పదాలతో వర్ణిస్తుంది. జీవాత్మ ఏమో అశుద్ధం, అపూర్ణం. అశాశ్వతం అంటుంది. జీవాత్మ సంసారి అనీ, అతను చేసిన పుణ్యాపాపకర్మలవల్ల పుణ్యాపాపలోకాలకు వెళ్ళి పునరపి జననం, పునరపి మరణం పొందుతాడనీ అంటుంది.

పరమాత్మను భిన్నంగా చూపించటమే కాక, బ్రహ్మను వెతికి పట్టుకోవాలని చెబుతుంది శాస్త్రం. అంటే జీవాత్మ పరమాత్మకన్నా భిన్నంగా ఉన్నట్టేగా!

సి) తర్కప్రమాణం – తర్కశాస్త్రం ఆత్మలు రెండు రకాలు అంటుంది. జీవాత్మ, పరమాత్మ. తర్కశాస్త్రంలోకి తార్కికులు, నైయాయికులు, యోగశాస్త్రజ్ఞులు, సాంఖ్యులు, వైశేషికులు – అందరూ వస్తారు. పరమాత్మ కర్మ చేయడు. నిత్య ఆనందస్వరూపుడు. జీవాత్మ, పరమాత్మ ఒకటే అని మీరంటే ఆనందస్వరూపుడైన బ్రహ్మను, మీరు సంసారిని చేస్తున్నట్లేగా!

డి) అనుభవ ప్రమాణం – అనుభవం కూడా జీవ, ఈశ్వరుల మధ్య ఐక్యం కుదరదంటుంది. బ్రహ్మవిద్య పొందక ముందు జీవాత్మ, పరమాత్మ ఒకటే అనలేము. పరమాత్మ పూర్ణుడు. మనం అపూర్ణులం, పరమాత్మ ఆనందస్వరూపుడు. మనం అపూర్ణులం; ఏ విధంగా చూసినా పరమాత్మలక్షణాలు మనకి లేవు. అహం బ్రహ్మాస్మి వినటానికి బాగానే ఉంది కాని అందులో అణువంతైనా నిజం లేదు. నేను ఒక బల్లనే సరిగ్గా సృష్టించలేను. నేను జగత్కారణం బ్రహ్మను ఎలా అవుతాను?

**శంకరులవారి జవాబు –** మొదటి బ్రహ్మ–జీవాత్మ అయితే;

**తదాత్మానమ్ ఆవేత్ –** తనను తాను తెలుసుకుంది అంటే; దీని అర్థం ఏమవ్వాలి? జీవాత్మ తనను తాను తెలుసుకుంది. ఏమని తెలుసుకుంది? 'అహం బ్రహ్మ అస్మి' అనా? ముందు ఉన్నది జీవాత్మ. జీవాత్మ తనను తాను తెలుసుకుంది; దాని ఫలితంగా సర్వం తానే అయింది అని అర్థం. అంటే జీవాత్మ **'అహం జీవాత్మ అస్మి'** అని తెలుసుకున్నట్టు.

తొమ్మిదవ మంత్రంలో దీన్ని 'బ్రహ్మవిద్య' అని పరిచయం చేశారు. కాని మీవాదన ప్రకారం అది జీవవిద్య అవుతుంది కాని బ్రహ్మవిద్య అవదు.

**భర్తృప్రపంచం వాదన 2 –** అక్కడ (తొమ్మిదవ మంత్రంలో) కూడా బ్రహ్మవిద్యపదాన్ని జీవవిద్యగా తీసుకోవచ్చు.

**శంకరులవారి జవాబు –** బ్రహ్మవిద్య జీవవిద్య అయితే, ఇంక ఉపనిషత్తు బ్రహ్మవిద్య గురించి బోధించాల్సిన అవసరమే లేదు. జీవాత్మజ్ఞానం పొందితేనే సర్వాత్మభావన కలిగితే, ఇంక పరమాత్మజ్ఞానం ఎందుకు?

**భర్తృప్రపంచం వాదన 3 –** సరే, బ్రహ్మవిద్య ఉంది. కాని ఈ మంత్రంలో మొదటి పదంలో ఉన్న బ్రహ్మ అంటే జీవాత్మే. అందువల్ల జీవాత్మ సంసారి పరమాత్మ అయింది. జీవాత్మ తనను గురించి తాను తెలుసుకుని, అహం బ్రహ్మ అస్మి అయింది. అందువల్ల ఈ బ్రహ్మపదం పరమాత్మకే వర్తిస్తుంది. జీవాత్మ జ్ఞానం పొందాక బ్రహ్మ అయింది.

**శంకరులవారి జవాబు –** మీ వాదన ప్రకారం జీవాత్మ జ్ఞానం పొందాక పరమాత్మ అయింది. అందువల్ల 'అహం బ్రహ్మాస్మి,' అంటే మీ ఉద్దేశ్యం ప్రకారం 'అహం జీవాత్మా పరమాత్మా అస్మి' అయింది. అదెలా సాధ్యం? మీరే జీవాత్మ వేరు, పరమాత్మ వేరు అంటున్నారు. అప్పుడు అహం జీవాత్మ పరమాత్మ అస్మి అని ఎలా అనగలదు? అది భ్రాంతి జ్ఞానం అవుతుంది. జీవాత్మ ఏం తెలుసుకుంది? తనను తాను తెలుసుకుంది. అది అహం జీవాత్మ అస్మి తప్ప అహం జీవాత్మ పరమాత్మ అస్మి అవదు. అది రెండూ భిన్నం కాబట్టి.

**భర్తృప్రపంచం వాదన 4 –** ఈసారి అతని వాదనను కొంచెం మారుస్తాడు. సరే, అహం పరమాత్మ అస్మి జ్ఞానం సరియైనది కాదు, నిజమే, కాని ఉపాసన సౌలభ్యంకోసం ఆ ఆలోచనను పెట్టుకోవచ్చు కదా! దీన్ని సంపదుపాసన అంటారు. బ్రహ్మ గురించిన ఉపాసన. ఉపాసనలో ఊహించుకుంటాము. ఉదాహరణకు సాలగ్రామంమీద విష్ణువు ఉపాసన చేస్తాము. సాలగ్రామం జడం; విష్ణువు చేతనం. మన ప్రార్థనను జడమైన సాలగ్రామం అందుకోలేదు. విష్ణువే నన్ను దీవించగలడు. అయినా ఎందుకు సాలగ్రామానికి ఉపాసన చేస్తున్నాము? సాలగ్రామాన్ని విష్ణువుగా ఊహించుకుంటున్నాము కాబట్టి, అది పొరపాటు ఎలా అవుతుంది?

ఒక విషయం సరిగ్గా తెలియకపోతే అది భ్రాంతి లేదా పొరపాటు. కాని అదే విషయాన్ని కావాలని ఊహించుకుంటే, అది ఉపాసన అవుతుంది. ఉపాసనకొక సూత్రం ఉంది.

**యథా యథోపాసతే తదేవ భవతి**

ఎలా ఉపాసన చేస్తే, అదే అతను అవుతాడు. అందువల్ల జీవాత్మ పదే పదే తనను బ్రహ్మగా ఊహించుకుంటే, తను బ్రహ్మ అవుతుంది.

**శంకరులవారి జవాబు –** సగుణబ్రహ్మ విషయంలో ఉపాసన కుదురుతుంది కాని నిర్గుణబ్రహ్మజ్ఞాన విషయంలోకాదు. నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందితేనే మోక్షం వస్తుంది కాని కర్మ చేస్తేనో, ఉపాసన చేస్తేనో రాదు.

అసలు జీవాత్మ పరమాత్మకు భిన్నంగా లేదు. పరమాత్మే జీవాత్మగా ఉన్నాడు; జీవాత్మగా కనిపిస్తున్నా కూడా అతను పరమాత్మే. మనం అజ్ఞానంలో ఉన్నప్పుడూ పరమాత్మే; జ్ఞానం పొందాక కూడా పరమాత్మే. కాకపోతే మనం అజ్ఞానంచేత భేదం చూస్తున్నాము. ఆ వ్యత్యాసం మన వృత్తిలో అంటే ఆలోచనలో ఉంది. దీన్ని అధ్యాస అంటారు. నేను పరమాత్మను కాను, నేను సంసారిని అనే భావన ఈ అధ్యాసవల్ల ఏర్పడింది.

తప్పుడు ఊహను సరియైన జ్ఞానంతో పోగొట్టుకోవాలి. ఆ విధంగా ఉపనిషత్తు, జ్ఞానాన్ని బోధిస్తుంది. ఆ జ్ఞానంవల్ల అజ్ఞానం తొలగి, మనం బ్రహ్మ అవుతాము. బ్రహ్మ అవుతాము అంటే నిజంగా అని కాదు, నేను బ్రహ్మను కాను అనే అధ్యాస తొలగటమే బ్రహ్మ అవటం అంటే వృత్తిలో మార్పురావాలి. అప్పుడు నేను బ్రహ్మను అని అర్థం అవుతుంది.

**భర్తృప్రపంచం వాదన 5 –**ఈసారి అతను ఇంకా పెద్ద వాదనను బయలుదేరదీస్తాడు. సరే సృష్టికి పూర్వం బ్రహ్మ మాత్రమే ఉన్నాడు. ఒప్పుకుంటాను. బ్రహ్మే అజ్ఞాని; బ్రహ్మే సంసారి; బ్రహ్మే తనను తాను తెలుసుకున్నాడు అంటున్నారు. అంటే బ్రహ్మే అంతకు ముందు అజ్ఞానంలోఉన్నట్టు వస్తుంది. బ్రహ్మ అజ్ఞానెలా అవుతాడు?

ఇప్పుడు, ఒక వస్తువును గురించి ఒక వ్యక్తి తెలుసుకున్నాడు అంటే తెలుసుకునే వ్యక్తి జ్ఞాన ఆశ్రయం (సబ్జెక్ట్); తెలుసుకోబడే వస్తువు జ్ఞానవిషయం (ఆబ్జెక్ట్) అవుతుంది.

ఉదా – రాముడు మామిడిపండు గురించి తెలుసుకున్నాడు.

రాముడు (సబ్జెక్ట్) జ్ఞాన ఆశ్రయం; మామిడిపండు (ఆబ్జెక్ట్) జ్ఞానవిషయం.

రాముడు మామిడిపండు గురించి తెలుసుకున్నాడు అంటే తెలుసుకోకముందు, దాని గురించి అజ్ఞానంలో ఉన్నట్టే కదా! అంటే అజ్ఞానానికి కూడా ఈ రెండూ ఉన్నాయి. అజ్ఞాన ఆశ్రయం; అజ్ఞానవిషయం.

రామునికి (అంతకుముందు) మామిడిపండు గురించి తెలియదు.

రాముడు – అజ్ఞాన ఆశ్రయం; మామిడిపండు అజ్ఞానవిషయం.

ఇప్పుడు ఈ సూత్రాన్ని బ్రహ్మకు అన్వయించి చూద్దాము.

బ్రహ్మ తన గురించి తాను తెలుసుకున్నాడు.

ఇక్కడ బ్రహ్మే జ్ఞాన ఆశ్రయం, జ్ఞానవిషయం రెండూ. బ్రహ్మను ముందు జ్ఞానవిషయంగా చూస్తే, బ్రహ్మ అనే జ్ఞాన ఆశ్రయం, బ్రహ్మ అనే జ్ఞానవిషయం తెలుసుకున్నాడు. దీని అర్థం ఏమిటి?

బ్రహ్మకు (అంతకుముందు) తన గురించి తనకు తెలియదు.

బ్రహ్మ అజ్ఞాన ఆశ్రయం, అజ్ఞానవిషయం అయ్యాడు. బ్రహ్మ స్వయంప్రకాశకుడు అయినప్పుడు ఇటు ఆశ్రయంలో కాని, అటు విషయంలో కాని అజ్ఞానం ఎలా ఉంటుంది?

**శంకరులవారి జవాబు –** దీనికి జవాబు చెప్పటానికి శంకరులవారు తర్కం ఉపయోగించరు. శ్రుతి ప్రమాణం చూపిస్తారు. ఎదుటి వ్యక్తి వేదాన్ని నమ్మనప్పుడు తర్కం ఉపయోగించాలి కాని, శ్రుతిని నమ్మినప్పుడు అదే గొప్ప ఆయుధం. భర్తృప్రపంచం వేదాన్ని నమ్ముతాడు. అందువల్ల శంకరులవారి జవాబు శ్రుతినుంచి వస్తుంది.

ఎ) బ్రహ్మ అజ్ఞానవిషయం (ఆబ్జెక్ట్) ఎలా అయ్యాడు? ఆయనే స్వయంజ్యోతిస్వరూపం లేదా ప్రకాశస్వరూపం గదా! ఇది ప్రశ్న.

జవాబు – బ్రహ్మవిదాప్నోతి పరమ్– <u>తైత్తిరీయోపనిషత్తు</u>

బ్రహ్మవిద్య తెలుసుకోవాలి. తెలుసుకున్నవాడు మోక్షం పొందుతాడు అని శ్రుతి చెబుతున్నది. బ్రహ్మవిద్య తెలుసుకోమంటున్నది అంటే ఏమిటి అర్థం? అంతకుముందు బ్రహ్మజ్ఞానం లేనట్టేగా!

ఒక వ్యక్తిని నువ్వు ఇంగ్లీషు నేర్చుకో అని మనం చెపితే దాని అర్థం ఏమిటి? అతనికి ఇంగ్లీషు రాదు, మనం నేర్చుకోమని సలహా ఇస్తున్నాము. అలాగే శ్రుతి బ్రహ్మవిద్య నేర్చుకో అని చెపితే, మనకు బ్రహ్మవిద్య రాదనే అర్థం.అందువల్ల ఈ విషయంలో ప్రశ్నించాలంటే తనను కాదు, శ్రుతిని ప్రశ్నించమని శంకరులవారి జవాబు.

బి) బ్రహ్మ అజ్ఞాన ఆశ్రయం (సబ్జెక్ట్) ఎలా అయ్యాడు?

జవాబు – అజ్ఞానం చేతనవస్తువుకు మాత్రమే ఉంటుంది కాని జడవస్తువుకు కాదు. ఒక పాఠశాలలో బల్లలు ఉంటాయి. అవి కూర్చునేందుకు మాత్రమే కాని, అవి పాఠం నేర్చుకోలేవు. అందువల్ల అజ్ఞాన ఆశ్రయం చేతనవస్తువే అవాలి. శ్రుతి ప్రకారం చేతనవస్తువు ఒక్కటే ఉంది. అది ఆత్మ లేదా బ్రహ్మ.

**సాక్షి చేతన కేవలో నిర్గుణస్య**

అచేతనవస్తువులు అనేకం ఉన్నాయి కాని, చేతనవస్తువు ఒక్కటే. అజ్ఞానం చేతనవస్తువులోనే ఉండాలంటే, ఆ చేతనవస్తువు ఒక్క బ్రహ్మ మాత్రమే అయితే, బ్రహ్మే అజ్ఞాన ఆశ్రయం అవాలి. బ్రహ్మ తనను గురించిన అజ్ఞానంలో ఉన్నాడు. ఆ అజ్ఞాని బ్రహ్మను జీవాత్మ అంటారు. అజ్ఞాని జీవాత్మ, సంసారి జీవాత్మ, అజ్ఞానంవల్ల అబ్రహ్మత్వం ఆరోపించుకుని పరిమితి విధించుకుంది. ఇప్పుడు అదే బ్రహ్మ సాధన చేసి – అహం బ్రహ్మాస్మి అని తెలుసుకుంది.

**భర్తృప్రపంచం వాదన 6 –** బ్రహ్మ తన గురించి తానే తెలుసుకుంది అంటే అది కర్తృకర్మవిరోధం అవుతుంది. సబ్జెక్ట్, ఆబ్జెక్ట్ రెండూ ఒకటే ఉండకూడదు. చూసే వస్తువు వేరు, చూడబడే వస్తువు వేరు. కన్ను తనను తాను చూసుకోలేదు. ఇది వేదాంత సూత్రం. అలాంటప్పుడు బ్రహ్మ తనను తాను ఎలా తెలుసుకున్నాడు?

**శంకరులవారి జవాబు –** వేదాంతసూత్రం గుర్తున్నందుకు సంతోషం. అవును బ్రహ్మ తనను తాను తెలుసుకోలేదు. ఆమాటకొస్తే బ్రహ్మ తనను తాను తెలుసుకోడు. బ్రహ్మ తనను తాను తెలుసుకోనవసరం లేదు. తెలుసుకోలేదు, తెలుసుకోడు. ఎందుకు తెలుసుకోనవసరం లేదు? బ్రహ్మ దేని గురించైనా తెలుసుకున్నాడు అంటే అది బ్రహ్మకు భిన్నంగా ఉన్న వస్తువు అయిపోతుంది. అందువల్ల బ్రహ్మ తనను తాను తెలుసుకున్నాడు అంటే తెలుసుకున్నాడు పదం అర్థం ఇక్కడ మారుతుంది.

ఇక్కడ తెలుసుకోవటం అంటే తప్పుగా అనుకున్న భావనను తొలగించటం.

**అనాత్మ అధ్యారోప నివృత్తి ఏవ ఆత్మజ్ఞానం న తు విషయీకరణమ్**

శ్రుతి బ్రహ్మను కొత్తగా చెప్పటం లేదు. మనం విధించిన పరిమితులను తొలగిస్తుంది. అంతకుముందు ఇలా అనేవారము–

నేను లావుగా ఉన్నాను
నాకు చిరాకుగా ఉంది.

ఇప్పుడు జ్ఞానం పొందాక ఇలా చెబుతాము–

నా శరీరం లావుగా ఉంది
నా మనసుకు చిరాకుగా ఉంది.

బ్రహ్మజ్ఞానం మనం ఏర్పరచుకున్న అధ్యాసను తొలగిస్తుంది. నేతి, నేతిద్వారా ఎలా తొలగిస్తుందో ఈ బృహదారణ్యకోపనిషత్తులోనే ముందు, ముందు చూస్తాము.

ఈ విధంగా శ్రుతి, యుక్తి ప్రమాణాలద్వారా శంకరులవారు భర్తృప్రపంచం వాదనను ఖండించారు.
ఇక్కడితో అహం బ్రహ్మాస్మి మహావాక్య భాష్యం అయిపోయింది.

ఈ వాదన తర్వాత దీన్ని తొమ్మిదవ మంత్రంతో కలపవచ్చు. బ్రహ్మ ఏం తెలుసుకున్నాడు అని కొన్ని ప్రశ్నలు వచ్చాయి కదా, వాటికి జవాబుగా బ్రహ్మ తనను తాను తెలుసుకుని, సర్వం 'అయ్యాడు' అని వస్తుంది.

మంత్రం 1.4.10

**తద్యో యో దేవానాం ప్రత్యబుధ్యత స ఏవ తదభవత్తథర్షీణాం తథా మనుష్యాణామ్ ॥**
**తద్ధైతత్పశ్యన్నృషిర్వామదేవః ప్రతిపేదేఽహం మనురభవగ్ం సూర్యశ్చేతి ॥**
**తదిదమప్యేతర్హి య ఏవం వేదాహం బ్రహ్మాస్మీతి స ఇదగ్ం సర్వం భవతి తస్య హ న దేవా శ్చనాభూత్యా ఈశతే ॥ ఆత్మా హ్యేషాగ్ం స భవతి ॥**

ఈ భాగంలో జ్ఞానానికీ, కర్మకూ మధ్య భేదాన్ని చూపిస్తున్నది ఉపనిషత్తు.

| **కర్మకాండ** | **జ్ఞానకాండ** |
|---|---|
| చేసిన కర్మకు తగ్గ ఫలం లభిస్తుంది | జ్ఞానం పొందితే మోక్షం వస్తుంది |
| అనాత్మకు చెందినది, ఒక్కొక్కరిలో భిన్నంగా ఉంటుంది | ఆత్మకు చెందినది, అందరిలో ఒకటే |
| వర్ణాశ్రమభేదాలు పాటించాలి | వర్ణాశ్రమ భేదాలు లేవు. ఎవరైనా నేర్చుకోవచ్చు |
| అనాత్మ కర్తా, భోక్తా | ఆత్మ అకర్తా, అభోక్తా |

ఆత్మజ్ఞానం పొందటానికి వర్ణాశ్రమభేదాలు చూపించనక్కరలేదని సూచించటానికి మనుష్యులే కాదు, దేవతలు కూడా జ్ఞానం పొంది మోక్షం పొందవచ్చని చెబుతున్నది ఉపనిషత్తు. ఎలాగైతే భూలోకంలో అందరూ అన్ని కర్మలూ చేయలేరో అలాగే దేవతలకు కర్మచేసే అధికారం లేదు. కాని జ్ఞానం పొందవచ్చు. ఇంద్రుడు, అగ్ని, వాయువు ఆత్మజ్ఞానం పొందినట్టుగా కేనోపనిషత్తులో చూశాము.

**తద్యో యో దేవానాం ప్రత్యబుధ్యత స ఏవ తదభవత్తథర్షీణాం తథా మనుష్యాణామ్ –**

దేవతలలో గాని, మహర్షులలో గాని, మనుష్యులలో గాని ఎవరైతే ఆ బ్రహ్మను తెలుసుకున్నారో, వారు ఆ బ్రహ్మే అయ్యారు. 'అయ్యారు' అంటే సర్వాత్మభావన పొందారు.

ఏవ – జ్ఞానం పొందిన అతను మాత్రమే మోక్షం పొందగలడు.

దీన్నిబట్టి 'అహం బ్రహ్మాస్మి' ఉపనిషత్తు చేసిన బోధ. శంకరులవారి సిద్ధాంతం కాదు. ఏమిటి నిదర్శనం?

**అహం బ్రహ్మాస్మి ఇతి యో వేద స ఏవ తత్ (బ్రహ్మ) అభవత్** – ఎవరైతే ఈ జ్ఞానం పొందుతారో, వారే బ్రహ్మ అవుతారు అంటే కర్మ మోక్షాన్నివ్వలేదు. ఉపాసన మోక్షాన్నివ్వలేదు, భక్తి మోక్షాన్నివ్వలేదు అని అర్థం. భక్తి కూడా ఆర్తభక్తినుంచి, అర్థార్థిభక్తికి, దాన్నుంచి జిజ్ఞాసభక్తికి దాన్నించి జ్ఞానభక్తికి ప్రయాణం చేస్తేనే మోక్షం కలుగుతుంది.

**తథర్షీణామ్ –** ఋషుల విషయంలో కూడా అంతే. వారు కూడా ఆత్మజ్ఞానం పొందాలి. ఋషుల్లో కూడా ఎవరు జ్ఞానం పొందుతారో, వారు బ్రహ్మ అయి, సర్వం అవుతారు.

**తథా మనుష్యాణామ్** – మనుష్యుల్లో కూడా ఎవరు ఈ జ్ఞానం పొందితే, వారు మోక్షం పొందుతారు. ఆశ్రమభేదం లేదు; వయోభేదం లేదు; స్త్రీపురుషభేదం లేదు.

ఈ వాదనను బలపరచుకోవటానికి ఉపనిషత్తు ఒక మంత్రాన్ని ఉటంకిస్తున్నది. దీన్ని అర్థవాద మంత్రం అంటారు. అర్థవాదం అంటే అసలు భావాన్ని సమర్థించేది. వామదేవ ఋషి ఈ జ్ఞానం పొంది తను సర్వం అని తెలుసుకున్నాడు. అంటే ఈ జ్ఞానం పొందినవారు ఇంతకుముందు ఉన్నారు.

**తద్ధైతత్పశ్యన్నృషిర్వామదేవః ప్రతిపేదే –** పశ్యన్ అంటే తెలుసుకున్నాడు. ప్రతిపేదే అంటే ఈ విధంగా ప్రకటించాడు.

**అహం మనురభవగ్ం సూర్యశ్చేతి–** నేను మనువును, నేను సూర్యుణ్ణి కూడా అవుతున్నాను. ఒక్కముక్కలో చెప్పాలంటే అంతా నేనే. అంటే సర్వాత్మభావన వస్తుంది.

**తదిదమప్యేతర్హి య ఏవం వేదాహం బ్రహ్మాస్మీతి స ఇదగ్ం సర్వం భవతి –** వామదేవుడు ఒక్కడే కాదు. ఈ రోజుల్లో కూడా ఎవరు జ్ఞానం పొందినా, వారు మోక్షం పొందుతారు. అహం బ్రహ్మాస్మి అని ఎవరు తెలుసుకుంటే వారు పూర్ణత్వం పొందుతారు.

**తస్య హ న దేవా శ్చనాభూత్యా ఈశతే –** జ్ఞానిని మోక్షం పొందకుండా దేవతలు కూడా ఆపలేరు. అంటే మోక్షం ఖచ్చితంగా వస్తుంది. దేవతలు జ్ఞానమార్గానికి రాకుండా ఆపగలరు కాని, వచ్చి జ్ఞానం పొందాక ఏమీ చేయలేరు. ఎందువల్ల?

శంకరులవారు దీనికి రెండు జవాబులనిస్తున్నారు.

**1. పశ్యన్ ప్రతిపేదే –** జ్ఞానం పొందాక, మోక్షం పొందటానికి ఏవైనా కర్మ చేయాల్సి ఉంటే, దేవతలు మధ్యలో ఆటంకాలు కలిగించటానికి ఆస్కారం ఉంటుంది. కాని జ్ఞానమే మోక్షాన్నిస్తుంది. జ్ఞానం పొందాక మోక్షం వస్తుంది అని వివరణకోసం చెప్తాము కాని, జ్ఞానమే మోక్షం. వేదాంతం నువ్వు నిత్యముక్తుడివి అంటుంది. మోక్షం సాధ్యవస్తువు కాదు. అంటే ఎప్పుడో వచ్చేది కాదు. అది సిద్ధవస్తువు. నేను నిత్యముక్తుణ్ణి అని తెలుసుకోవటమే మోక్షం. కుటుంబసమస్యలు, చికాకులు ఉన్నా కూడా నేను బ్రహ్మను అని అర్థం చేసుకుని, ఆ బ్రహ్మ నేనే అని స్వీకరించటమే మోక్షం. అందువల్ల జ్ఞానం పొందటానికీ, మోక్షం పొందటానికీ మధ్య కాలయాపన లేదు. అలా ఉంటే అది కార్యకారణ సంబంధం అవుతుంది. జ్ఞానం పొందటమేమిటి, మోక్షం లభించటమే.

జ్ఞానానికి, మోక్షానికి మధ్య కాలయాపన లేదు అని ఎలా చెప్పగలరు? కొందరు సిద్ధాంతులు మరణం తర్వాతే మోక్షం పొందగలరు అంటారు. అలాంటప్పుడు జ్ఞానం ఏవ మోక్షం అని ఎలా చెప్పగలరు?

**తద్ధైతత్పశ్యన్నృషిర్వామదేవః ప్రతిపేదేఽహం మనురభవగ్ం సూర్యశ్చేతి**

పశ్యత్ అంటే మామూలుగా చూడటం. ఇక్కడ తెలుసుకోవటం. తానే బ్రహ్మ అని తెలుసుకుంటూనే ఋషి వామదేవునికి సర్వాత్మభావన కలిగింది. మోక్షం పొందాడు.

అన్నం తింటూ టీవీ చూశాము అంటే రెండు చర్యలు ఒకేసారి అవుతున్నాయి అని అర్థం. అదే అన్నం తిన్నాక టీవీ చూశాము అంటే ఒకదాని తర్వాత ఒకటి చేసినట్టు అర్థం. ఇక్కడ పశ్యాన్ ప్రతిపేదే అంటే బ్రహ్మను తెలుసుకుంటూనే సర్వాత్మ భావన పొందాడు. ఈ పదప్రయోగంవల్ల జ్ఞానానికీ, మోక్షానికీ మధ్య కాలయాపన లేదని తెలుస్తున్నది. అందువల్ల దేవతలు జ్ఞానికి అడ్డుపడలేరు.

**2. ఆత్మా హ్యేషాగ్ం స భవతి –** జ్ఞానం పొందాక, జ్ఞాని అందరి ఆత్మ అవుతాడు. అందరి ఆత్మ అంటే దేవతల ఆత్మ కూడా. అందువల్ల దేవతలు జ్ఞానికి ఇబ్బంది కలుగజేయాలంటే వారికి వారే ఇబ్బంది పెట్టుకోవాలి. అందువల్ల దేవతలు జ్ఞానికి అడ్డుపడలేరు.

మంత్రం 1.4.10

**అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోసావన్యోఽహమస్మీతి న స వేద యథా పశురేవగ్ం స దేవానామ్ ॥ యథా హ వై బహవః పశవో మనుష్యం భుఞ్జ్యురేవమేకైకః పురుషో దేవాన్ భునక్తి ॥ ఏకస్మిన్నేవ పశావాదీయమానేఽప్రియం భవతి కిము బహుషు తస్మాదేషాం తన్న ప్రియం యదేతన్మనుష్యావిద్యుః ॥**

ముందు మంత్రంలో జ్ఞాని స్తుతి జరిగింది. అతను ఏ దేవతకూ దాసోహం అవడు. దేవతలు కూడా అతనికి అడ్డుపడలేరు. ఇప్పుడు అజ్ఞాని గురించి చెబుతున్నది ఉపనిషత్తు. అజ్ఞాని ఎప్పటికీ సంసారిగా ఉంటూ, జననమరణవృత్తాల్లో పడి కొట్టుమిట్టాడుతూ ఉంటాడు. అంతేకాక ఒకవేళ అతను జ్ఞానం పొందాలనుకున్నా కూడా దేవతలు అతనికి ఆటంకం కలిగిస్తుంటారు.

## అవిద్యాసూత్ర భాష్యం

**అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద**

ఈ వాక్యాన్ని అవిద్యాసూత్రం అంటారు. సంసారి గురించి వర్ణించాల్సివచ్చినప్పుడు, శంకరులవారు ఈ వాక్యాన్ని ఉదహరిస్తూ ఉంటారు. 8, 9 మంత్రాలు విద్యాసూత్ర వివరణ అయితే, ఇక్కడనుంచి అవిద్యాసూత్రం వస్తుంది. సూత్రం అంటే చిన్న వాక్యం. ఏ సూత్రానికైనా వ్యాఖ్యానం ఉండాలి.

ఈ సూత్రం అర్థం యిది – ఎవరైతే తనకూ, దేవతలకూ మధ్య భేదభావాన్ని చూస్తారో, వారు అజ్ఞానులు.

అసౌ అంటే అసౌ దేవత అంటే తను పూజించే దేవత. అన్యః అంటే తనకు భిన్నంగా ఉంది; అన్యోహమస్మీతి– నేను ఆ దేవతకు భిన్నంగా ఉన్నాను; యః అన్యం దేవతాముపాస్తే – అలా భేదబుద్ధితో ఎవరైతే ఉపాసన చేస్తారో, సః న వేద – అతను మూఢుడు. అటువంటి వారికి ఉపనిషత్తు ఒక కొత్త బిరుదుని ఇస్తున్నది.

**సః దేవానాం పశుః –** భేదబుద్ధితో పూజచేసినవాడు దేవతలకు పశువు అంటున్నది. పశువు అంటే జంతువు. సః న వేద అని ముందు అన్నప్పుడు అతను మూడుఢు లేదా మూర్ఖుడు అని అర్థం.మూర్ఖుడు అని ఎలా చెప్పగలం? న వేద అంటే అతనికి తెలియదు. అంత అజ్ఞానంలో ఉన్న వ్యక్తిని మూర్ఖుడు అని అంటారు. ఇప్పుడు పశువు అని అనటంవల్ల అతనిలో దాసభావం ఉందని చెబుతున్నది ఉపనిషత్తు.

కర్మకాండకు అంకితమైన జీవుల గురించిన వర్ణన ఉంది ఈ మంత్రంలో. కర్మకాండలో ద్వైతబుద్ధి లేదా భేదభావన ఉంటుంది. జీవుడు వేరు, పరమాత్మ వేరు అనే భావనతో, స్వర్గం పొందటానికి పరమాత్మ అనుగ్రహంకోసం దాసభావనతో ప్రార్థన చేస్తారు. కాని వేదాంతం ప్రకారం కర్మకాండకే అంకితమైనవారు పశువులతో సమానం.

జీవులను పశువులతో పోల్చటం అమానుషం అనిపిస్తుంది కాబట్టి, అలా ఎందుకు చెప్పిందో ఉపనిషత్తే వివరిస్తున్నది.

**మనుష్యం భుంజ్యుః –** అనేక జంతువులు, మనుష్యులకు సేవ చేస్తాయి. వాటికోసం అవి ఏమీ చేసుకోవు. గాడిద. ఆవు, మేక, ఎద్దు– అలా అనేక పశువులు మనుష్యులకు తోడ్పడుతాయి.

అలా మనుష్యులు, దేవతలకు పశువులలాగా సేవలు చేస్తారు. ఇంద్రస్య స్వాహా, ప్రజాపతయే స్వాహా, వరుణస్య స్వాహా అంటూ అనేక ఆహుతులను వేస్తూ అనేక యజ్ఞాలను చేస్తూ ఉంటారు. అలా వారు దేవతలకు పశువులు అయ్యారు.

మామూలు గృహస్థులమైన మనం ఏం చేస్తాము? మనకున్న పనివారు మనను విడిచి వెళ్ళకూడదనుకుంటాము. వారికి ఇంతకన్నా మంచి ఉద్యోగం రాకూడదనుకుంటాము. వారికి ఆరోగ్యం బాగుండాలనుకుంటాము. ఎందుకు? వారిమీద ప్రేమకొద్దీ కాదు. మన స్వార్థంకోసం. వారు రాకపోతే మనకు కాళ్ళు, చేతులు ఆడవు. కాని వారితో ఈ విషయం చెప్పము. ఎందుకంటే మన స్వార్థం బయటపడిపోతుంది కాబట్టి.

ఇప్పుడు ఉపనిషత్తు, దేవతలకు కూడా మనుష్యులమీద ఇదే భావన ఉంటుందంటున్నది. మనుష్యులు నిరంతరం యజ్ఞయాగాదులు చేయకపోతే వారికి ఆహారం ఉండదు. అందువల్ల కర్మకాండ చేసే వ్యక్తికి వైరాగ్యం కలుగకూడదని కోరుకుంటారు వారు.

వైరాగ్యం వస్తే ఏమవుతుంది? గురువు దగ్గరకు వెళతాడు. గురువు 'నువ్వు అకర్తా' అంటాడు. అనగానే కర్మకాండ మటుమాయమైపోతుంది. అతను జ్ఞానకాండవైపుకు దృష్టి మరలుస్తాడు. అందువల్ల అతను జ్ఞానకాండవైపుకు తిరగకుండా ఉండటానికి, దేవతలు అనేక ఆటంకాలను కలుగచేస్తారు. ఆ ఆటంకాలు ఎటువంటివైనా అవవచ్చు. వేదాంతం క్లాసుకు వెళ్ళకుండా నడమునొప్పో, తలనొప్పో కలుగచేయవచ్చు.

**ఏకస్మిన్నేవ పశావాదాయమానేఽప్రియం భవతి –** ఒక్క పశువును ఎవరైనా దొంగిలించినా కూడా, మనిషికి చాలా బాధ కలుగుతుంది.

**కిము బహుషు–** అలాంటప్పుడు, మొత్తం పశువులన్నీ పోతే ఇంకచెప్పేదేముంది?

**తస్మాదేషాం తన్న ప్రియం యదేతన్మనుష్యావిద్యుః –** అందువల్ల, ఈ దేవతలకు మనుష్యులు ఆత్మతత్త్వం తెలుసుకోవటం ఇష్టం ఉండదు. ఒక్క వ్యక్తి మోక్షం పొందినా, ఒక్క వ్యక్తి పూజ చేయటం ఆపినా, ఒక్క వ్యక్తి వేదాంతం క్లాసుకి వెళ్ళినా దేవతలకు ఇష్టం ఉండదు. అది అప్రియం అవుతుంది వారికి. వారికి సేవ చేసే పశువులవంటి మనుష్యులు తగ్గిపోతారు. అందువల్ల వారు ఆటంకాలు కలుగజేస్తారు.

ఈ వాక్యం ఎవరు చెబుతున్నారు? స్వామీజీ చెప్పటం లేదు; శంకరులవారు చెప్పటం లేదు. సాక్షాత్తూ ఉపనిషత్తే చెబుతున్నది.

జ్ఞానం పొందాక జ్ఞానిని దేవతలు ఏమీ చేయలేరు అని, ఈ వాక్యం కర్మకాండ చేసేవారి విషయంలో చెప్పబడింది. అవి చూస్తున్నాము. దీన్నుంచి శంకరులవారు ఒక సిద్ధాంతాన్ని వివరిస్తున్నారు. కర్మకాండలో దేవతలకు అంతశక్తి ఉందని వింటే మనకు కర్మశాస్త్రంమీద నమ్మకం పోవచ్చు.

ఎందుకు? మనం ఎంత చేసినా, మనకు రావాల్సిన ఫలం రాకుండా దేవతలు అడ్డుపడతారంటే, మనం దేవతల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి ఉన్నట్టేగా? అలాంటప్పుడు కర్మ చేసి ఏమిటి ప్రయోజనం అనిపిస్తుంది. మనం బద్ధకానికి పెట్టింది పేరు. ఎలా పూజలు ఎగ్గొడదామా అని చూస్తాము. ఇలాంటి విషయం వింటే, అసలే పూజలు చేయము.

అందువల్ల శంకరులవారు, మన కర్మఫలం దేనివల్ల వస్తుంది అనే అంశాన్ని ఈ సందర్భంలో చర్చిస్తున్నారు. మన కర్మఫలానికి కారణం ఏమిటి?మనం చేసిన కర్మనా, దేవతలా, కాలమా, వస్తువా?

ఉదాహరణకు నేను చెన్నై వెళ్ళినప్పుడు నాకు జ్వరం వచ్చింది. దానికి కారణం ఏమిటి?

వస్తుస్వభావం – చెన్నై నీరు నాకు పడలేదా?
కాలం – ఇది వానాకాలం అవటంవల్లా?
ఈశ్వరుడు – ఈశ్వరుడు నాకు హాని చేస్తున్నాడా?
కర్మ – నేను చేసిన కర్మఫలమా?

మన చేతులలో ఏమీ లేదని వేదాంతం నేర్చుకునే వారు కూడా అంటూ ఉంటారు. అంటే తక్కిన మూడింటిలో ఏదైనా అవాలి. కాని అలా మన చేతిలో ఏమీ లేదంటే, కర్మకాండ మొత్తం వ్యర్థం అయిపోతుంది. అందువల్ల ఈ సిద్ధాంతం తప్పని చెబుతున్నారు శంకరులవారు. మన చేతిలో ఏమీ లేదనుకోవటం పొరపాటు.

కర్మఫలం అంటే పుణ్యం, పాపం చేకూరటం. అది సుఖం లేదా దుఃఖం రూపంలో వస్తుంది. పుణ్యపాపాలు సుఖదుఃఖాలను ప్రత్యక్షంగా ఇవ్వలేవు. వాటికి ఒక కారకం కావాలి. కాలం, వస్తువు, దేవతలు కారకాలు అవుతాయి. అంటే వాటిద్వారా ఫలం వస్తుంది.

పుత్రుడు సమస్యలను సృష్టిస్తున్నాడంటే అది పూర్వజన్మ పాపంవల్లే చేస్తున్నట్టు. ఒక గురువు చెప్పే బోధ వింటున్నారంటే కూడా దానికి పూర్వజన్మ పుణ్యం కారణం. అలా ఏ అనుభవం జరుగుతున్నా కూడా దానికి నాలుగు అంశాలు కారణం. వస్తుస్వభావం, కాలం, దేవతలు, కర్మ.

ఈ నాలుగింటిలో ఏది ప్రధానం, ఏవి కారకాలు అనే విషయం తెలుసుకోవాలి. కొంతమంది దేవతలమీద నింద వేసేస్తారు. దేవతలు ప్రధానం అనుకుంటారు. కాని శంకరులవారు కర్మప్రధానం అంటారు. దేవతలు మనకు సుఖదుఃఖాలను, మన కర్మను అనుసరించి, ఇచ్చేకారకాలు.

ఇందాక ఇచ్చిన ఉదాహరణను మళ్ళీ చూస్తే చెన్నై వెళ్ళినప్పుడు నాకు జ్వరం వచ్చింది.

వస్తుస్వభావం – చెన్నై నీరు అందరూ తాగుతున్నారు.
కాలం – వానాకాలం అందరికీ సమానమే.

ఈశ్వరుడు - ఎవరికీ కావాలని చెడు చేయడు. అలా చేస్తే అతను ఈశ్వరుడు అవడు.
కర్మ - నేను చేసిన కర్మఫలమే.

పై నాలుగు అంశాల్లో మొదటి మూడు అంశాలు అందరికీ వర్తిస్తాయి. అవి మార్పు చెందని అంశాలు. వీటిని సామాన్య అంశాలు అంటారు. నాలుగవ అంశమే వ్యక్తికీ, వ్యక్తికీ మారుతుంది. అందువల్ల కర్మకారణం కాని పై మూడూ కావు. అందువల్ల గ్రహాలు కాని, దేవతలు కాని మనకు హాని చేయరు. మనం చేసుకున్న కర్మే దానికి కారణం. చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా! తక్కిన అంశాలు ప్రభావం చూపవని కాదు. కాని అవి ప్రధానం కాదు.

మనం మంచికర్మలు చేయటంవల్ల మనకు రాసి ఉన్న చెడు ప్రారబ్ధకర్మను కొంతవరకన్నా తగ్గించుకోవచ్చు. ఇప్పటి మన జీవితం గతంలో మనం చేసిన కర్మల ఫలితం. అందువల్ల మన చేతిలో ఏమీ లేదనుకోకూడదు. వేదాంతంకొచ్చి, కర్మసిద్ధాంతం అలవడితే, అంతా మన చేతిలోనే ఉందని అర్థమవుతుంది. కర్మకాండను కొట్టివేయటం లేదు. కర్మకాండ మన భవిష్యత్తును మెరుగుపరచుకోవటానికి తోడ్పడుతుంది.

కర్మకు ప్రాధాన్యత ఇస్తేనే, నా జీవితానికి నేను బాధ్యత వహిస్తాను. గతంలో నేను చేసిన కర్మలవల్ల ఇప్పుడు అనుభవిస్తున్నాను; ఇప్పుడు చేసిన కర్మలవల్ల నా భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుంది అనే అంశాన్ని అర్థం చేసుకుంటే నా జీవితానికి నేను ఆధారం అని ఒప్పుకోగలుగుతాను. అలా ఒప్పుకోగలిగితేనే, వేదాంతం అర్థమయ్యాక ఈ జగత్తుకు నేను ఆధారం అని ఒప్పుకోగలుగుతాను.

నేను దాసుణ్ణి అనే భావనలోనే ఉంటే, ముందు ముందు నేను బ్రహ్మను అని చెప్పలేరు. దేవుడిమీద భారం వేసే మనస్తత్వమైతే అది దాససిద్ధాంతం అవుతుంది. అదే కర్మప్రధానం అయితే, అది స్వామి సిద్ధాంతం అవుతుంది. మీరు దాసునిగా అంటే దేవతలకు పశువుగా ఉంటారో, స్వామిగా ఉంటారో అది మీ చేతుల్లో ఉంది.

శంకరులవారి ఉద్దేశ్యంలో మోక్షం స్వామి భావన ఉన్నవారికే కలుగుతుంది. స్వామి ముక్తుడవగలడు కాని, దాసుడు ఎన్నటికీ ముక్తుడు కాలేడు.

అందువల్ల ఏం చేయాలి? శాస్త్రం కర్మప్రధానం. అందువల్ల కర్మను ప్రధానంగా తీసుకుని దేశ, కాల, వస్తువులను దృష్టిలో పెట్టుకుని నేను కర్మ చేయాలి. వాటి సహాయంతో నేను కర్మ చేయాలి.

శంకరులవారు స్వామిభృత్యు న్యాయం గురించి కూడా మాట్లాడుతారు. భృత్యుడు అంటే దాసుడు. కాని దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. శంకరులవారు స్వామిభృత్యు న్యాయాన్ని తాత్కాలిక గమ్యంగా తీసుకోవాలి కాని, శాశ్వత గమ్యంగా తీసుకోకూడదంటారు. అద్వైతం దాసభావనను తాత్కాలికంగా అంగీకరిస్తుంది. ఏ సందర్భంలో ఈ మాట వచ్చిందో కూడా గమనించాలి. ఈ మాట అంటే అతను యజమాని, నేను దాసుణ్ణి అనే మాట.

ఈ మాట కర్మయోగ సందర్భంలో వస్తుంది. ఇక్కడ దాసునిగా ఉండాలంటే, నిత్యనైమిత్తికకర్మలు చేయాలని అర్థం. దాసుడిగా ఉండమంటే, యజమాని మాట వినమని అర్థం. యజమాని, ఈ సందర్భంలో, ధర్మశాస్త్రం.

భగవానుని ఆజ్ఞ ధర్మశాస్త్రంద్వారా వస్తుంది. అందువల్ల దాసునిగా ఉండు అంటే ధర్మశాస్త్రంలో విధించిన కర్మలు చేసి, నీ జీవితాన్ని తీర్చిదిద్దుకో. దేవుని ఆజ్ఞ పాటించు అంటే దేవుడు ఇచ్చిన ధర్మశాస్త్రాన్ని పాటించు.

అర్జునా నువ్వు ధర్మశాస్త్రాన్ని పాటిస్తేనే నా సేవకుడివి, నిస్సహాయంగా నిలబడితే కాదు అంటాడు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మను శరణువేడటం అంటే ధర్మశాస్త్రాన్ని పాటించటం. ధర్మశాస్త్రాన్ని పాటించకుండా శరణువేడిన వారుపైకి రాలేరు.

అందువల్ల దేవతలు మనను నిర్దేశిస్తారు అన్నా కూడా కర్మ మనను నిర్దేశిస్తుందనీ, కర్మద్వారా దేవతలు మనను నిర్దేశిస్తారనీ అర్థం. ఈశ్వరుడు స్వతంత్రంగా మనను నిర్దేశించడు. ఈశ్వరుడు మన కర్మలద్వారా మనను నిర్దేశిస్తాడు.

ఈ చర్చ సారాంశం ఒక్కముక్కలో చెప్పాలంటే, కర్మకాండకు మాత్రమే అంకితమయి, కర్మకాండ ముఖ్యం అనుకునే వారు మూఢులు, వారు దేవతలకు పశువులు.

## మంత్రం 1.4.11

**బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీదేకమేవ తదేకగ్ం సన్న వ్యభవత్ । తచ్ఛ్రేయోరూపమత్యసృజత క్షత్రం యాన్యేతాని దేవత్రా క్షత్రాణీన్ద్రో వరుణస్సోమో రుద్రః పర్జన్యో యమో మృత్యురీశాన ఇతి ॥**

**తస్మాత్ క్షత్రాత్పరం నాస్తి తస్మాద్బ్రాహ్మణః క్షత్రియమధస్తాదుపాస్తే రాజసూయే క్షత్ర ఏవ తద్యశో దధాతి సైషా క్షత్రస్య యోనిర్యద్బ్రహ్మ ॥**

**తస్మాద్యద్యపి రాజా పరమతాం గచ్ఛతి బ్రహ్మైవాన్తత ఉపనిశ్రయతి స్వాం యోనిం య ఉ ఏనగ్ం హినస్తి స్వాగ్ం స యోనిమృచ్ఛతి స పాపీయాన్ భవతి యథా శ్రేయాగ్ంసగ్ం హిగ్ంసిత్వా ॥**

ఈ మంత్రం అవిద్యాసూత్రంమీద వ్యాఖ్యానం. అంటే దేవానం పశుఃమీద వ్యాఖ్యానం. అజ్ఞాని కర్మకాండకు అంకితమయిపోయి, దేవతలకు ఎలా సేవ చేస్తాడన్నది చర్చనీయాంశం. ఎప్పుడైతే కర్మకాండ గురించి వస్తుందో, అప్పుడు వర్ణాశ్రమధర్మం గురించి చర్చ వస్తుంది. ఎందుకంటే కర్మకాండ సారాంశం వర్ణాశ్రమధర్మం. ఉపనిషత్తు ఇక్కడ వర్ణసృష్టి గురించి చెప్పదలచుకుంది.

వర్ణసృష్టి అంటే నాలుగు వర్ణాల సృష్టి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల సృష్టి ఇది. ముందుగా దేవతలలో వర్ణాల సృష్టి గురించి వస్తుంది. దేవతలలో నాలుగు వర్ణాలు ఉన్నాయి. అవి దేవబ్రాహ్మణులు, దేవక్షత్రియులు, దేవవైశ్యులు, దేవశూద్రులు. 6వ మంత్రంలో అగ్నిదేవత సృష్టిని చూశాము. విరాట్ తన చేతిని తన నోటిలో పెట్టుకుని మథించటంవల్ల అగ్ని ఆవిర్భవించింది. అగ్ని నోటిలోనుంచి రావటంవల్ల అరచేతిమీద, నోటిలోనూ వెంట్రుకలు లేవని అంటారు.

6వ మంత్రంలో చెప్పిన అగ్ని దేవత గురించి, ఇక్కడ ఈ 11వ మంత్రంలో కొనసాగుతున్నది. అగ్నిదేవత బ్రాహ్మణుడు. అగ్నిదేవతను పురోహిత అంటారు. అందుకే ఋగ్వేదంలో మొట్టమొదటి మంత్రం అగ్ని గురించి వస్తుంది. ఈ అగ్నిదేవతను బ్రహ్మపదంతో సూచిస్తున్నది.

**బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీదేకమేవ –** అగ్నిదేవత దేవతలలో బ్రాహ్మణుడు.

**తదేకగ్ం సన్న వ్యభవత్ –** అయినా ఒంటరిగా ఉండటంవల్ల ఏమీ కర్మ చేయలేకపోయాడు. అందువల్ల అగ్నిదేవత, తనకు తోడ్పడటంకోసం, తక్కిన దేవతలను సృష్టించాడు.క్షత్రియులను ముందు సృష్టించాడు. ఎవరు వారు?

**ఇంద్రో వరుణస్సోమోరుద్రః పర్జన్యో యమో మృత్యురీశాన –** ఇంద్రుడు, వరుణుడు, సోముడు, రుద్రుడు, పర్జన్యుడు, యముడు, మృత్యువు, ఈశానుడు. వీరిని దేవక్షత్రియులంటారు. వారికి రాజ్యాధికారం ఇచ్చాడు. ఉదాహరణకు ఇంద్రుడు దేవతలకు అధిపతి. దేవక్షత్రియులను సృష్టించాక, దేవబ్రాహ్మణుడయిన అగ్ని వారికి రెండు శక్తులనిచ్చాడు. ఒకటి కీర్తి, రెండోది అధికారం. వారికి బ్రాహ్మణులను కూడా అదుపులో పెట్టే అధికారం ఉంది. కాని క్షత్రియునికి బ్రాహ్మణుణ్ణి అవమానించే హక్కు లేదు. ఎలాగైతే పెద్దవారిని అవమానించటం పాపమో అలాగే బ్రాహ్మణుణ్ణి అవమానించటం కూడా పాపమే. క్షత్రియుడు బ్రాహ్మణుడినుంచి పుట్టాడు. అందువల్ల క్షత్రియుడు కార్యం; బ్రాహ్మణుడు కారణం.

## మంత్రం 1.4.12

**స నైవ వ్యభవత్స విశమసృజత యాన్యేతాని దేవజాతాని గణశ ఆఖ్యాయన్తే వసవో రుద్రా ఆదిత్యా విశ్వే దేవా మరుత ఇతి ॥**

దేవక్షత్రియులు వచ్చాక కూడా దేవబ్రాహ్మణుడు కర్మ చేయలేకపోయాడు. ఇంకా సహాయం కావాల్సి వచ్చింది. ఒక యజ్ఞం చేయాలంటే బోలెడు సామాగ్రి కావాలి. ఘృతం కావాలి. క్షీరం కావాలి. ధాన్యం కావాలి. వీటిని ఉత్పత్తి చేసి రవాణా చేసేవారు కావాలి. అందువల్ల వైశ్యజాతి కావాలి. వైశ్యుల పని వ్యాపారంచేయటం.

**వసవో రుద్రా ఆదిత్యా విశ్వే దేవా మరుత –** వసువులు, రుద్రులు, ఆదిత్యులు, విశ్వే దేవతలు, మరుత్తులు, అంటూ గణములుగా చెప్పబడిన ఈ దేవతలు దేవవైశ్యులు. వైశ్యులు కలిసికట్టుగా పనిచేస్తారు.

వసువులు ఎనిమిది మంది. రుద్రులు పదకొండు. ఆదిత్యులు పన్నెండు. విశ్వేదేవతలు పది; మరుత్తులు ఏడుగురు. ఇక్కడ రుద్రుడు అంటే బ్రహ్మవిష్ణుమహేశ్వరులలోని మహేశ్వరుడు కాదు. ఈ రుద్రుడు దేవగణాలలో ఒకరు. ఈ విధంగా వైశ్యులు సృష్టించబడ్డారు.

## మంత్రం 1.4.13

**స నైవ వ్యభవత్స శౌద్రం వర్ణమసృజత పూషణమియం వై పూషేయగ్ం హీదగ్ం సర్వం పుష్యతి యదిదం కిఞ్చ ॥**

యజ్ఞాలు చేయటానికి కొన్ని పనులు చేయాల్సి ఉంటుంది. అందువల్ల దేవశూద్రులు అవసరం వచ్చారు.

**పూషణమ్ –** దేవశూద్రుని పేరు పూషణమ్. ఉపనిషత్తే ఆ పేరును పూష అని వర్ణిస్తుంది. మామూలుగా పూష అంటే సూర్యభగవానుడు కాని, ఇక్కడ దీని అర్థం వేరే ఉంది. ఉపనిషత్తే ఆ అర్థాన్నిస్తుంది. పూష అంటే పృథివి అంటే భూమిదేవత. అలా పృథివీదేవత దేవశూద్ర అయింది. ఉపనిషత్తే పృథివి ఎలా పూష అయిందో వివరిస్తున్నది.

**సర్వం పుష్యతి –** అన్ని ప్రాణులనూ పృథివీయే పోషించుచున్నది. ఆ విధంగా నాలుగు వర్ణాలు సృష్టించబడ్డాయి. అయినా ఇంకా పూర్తి కాలేదు. తర్వాత ఏమి సృష్టించాలి? తరువాత వచ్చే మంత్రంలో చూద్దాము.

## మంత్రం 1.4.14

**స నైవ వ్యభవత్తచ్ఛ్రేయోరూపమత్యసృజత ధర్మం తదేతత్ క్షత్రస్య క్షత్రం యద్ధర్మస్తస్మాద్ధర్మాత్పరం నాస్త్యథో అబలీయాన్ బలీయాగ్ంసమాశగ్ంసతే ధర్మేణ యథా రాజ్ఞైవం యో వై స ధర్మస్సత్యం వై తత్తస్మాత్సత్యం వదన్తమాహుర్ధర్మం వదతీతి ధర్మం వా వదన్తగ్ం సత్యం వదతీత్యేతద్ధ్యేవైతదుభయం భవతి ॥**

వర్ణాశ్రమ కర్మ అనుష్ఠానం చేయటానికి నాలుగు వర్ణాలు సృష్టించబడ్డాయి. ఆ విధంగా వారు దేవతలకు పశువులు అయ్యారు. దేవతలకే కాక, మనుష్యులకు కూడా నాలుగు వర్ణాలు ఏర్పడ్డాయి. అవి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణాలు. క్షత్రియులకు తక్కిన మూడు వర్ణాలను అదుపులో పెట్టే అధికారం ఉంది. ఎక్కడ అధికారం ఉంటుందో, అక్కడ దాన్ని దుర్వినియోగం చేసే అవకాశం కూడా ఉంటుంది. అందుకని క్షత్రియులను అదుపులో పెట్టేది ఒకటి కావాలి. అందువల్ల ధర్మం సృష్టించబడింది.

ధర్మం అంటే కేవలం ప్రకృతిసూత్రాలు కాదు. ధర్మదేవత సృష్టించబడింది. చేతన అధిష్ఠానదేవత ఆమె. ఈ ధర్మదేవత క్షత్రియుణ్ణి అదుపులో పెడుతుంది. ధర్మం క్షత్రియుణ్ణి అదుపులో పెట్టకపోతే, రాజులు ధర్మం తప్పే అవకాశం ఉంది. రాజులు ధర్మం తప్పితే ప్రజల సంగతి చెప్పేదేముంది?

ధర్మదేవత స్తుతి చూస్తాము ఇప్పుడు.

**1. ధర్మమే రక్షకవచం.** రాజులను కూడా అదుపులో పెడుతుంది. కాబట్టి, ధర్మం క్షత్రియులకన్నా బలమైనది. బలవంతుడికన్నా బలమైనదన్నమాట. అందువల్ల, ఒక మామూలు బలహీనమైన వ్యక్తి ఎవరైనా కూడా, ధర్మం సహాయంతో, క్షత్రియునిమీద విజయం సాధించగలడు. అందువల్ల ధర్మం ఒక రక్షణకవచం.

**2. ధర్మమే సత్యం –** ధర్మమే సత్యం; సత్యమే ధర్మం. సత్యం, ధర్మం రెండూ ఒకటే అని ఎలా చెప్పగలము?

**స ఏవానుష్ఠీయ మానో ధర్మనామా భవతి । శాస్త్రార్థత్వేన జ్ఞాయమానస్తు సత్యం భవతి**

శాస్త్రం చెప్పినదాన్ని పాటిస్తే అది ధర్మం. శాస్త్రం చెప్పినదాన్ని తెలుసుకుంటే అది సత్యం. ఒకటి ఆచరణ స్థాయిలో ఉంటే, ఇంకొకటి జ్ఞానస్థాయిలో ఉంది. అందుకే సత్యం వద, ధర్మం చర అంటారు. అందువల్ల ఎవరైనా ధర్మం మాట్లాడితే, సత్యం మాట్లాడినట్టు. సత్యం మాట్లాడితే ధర్మం మాట్లాడినట్లు చెప్పవచ్చు. ఆ విధంగా వర్ణం, ధర్మం సృష్టించబడ్డాయి.

### మంత్రం 1.4.15

**తదేతద్బ్రహ్మ క్షత్రం విట్ శూద్రస్తదగ్నినైవ దేవేషు బ్రహ్మాభవద్బ్రాహ్మణో మనుష్యేషు క్షత్రియేణ క్షత్రియో వైశ్యేన వైశ్యశ్శూద్రేణ శూద్రస్తస్మాదగ్నావేవ దేవేషు లోకమిచ్ఛంతే బ్రాహ్మణే మనుష్యేష్వేతాభ్యాగ్ం హి రూపాభ్యాం బ్రహ్మాఽభవత్ ॥**

**అథ యో హ వా అస్మాల్లోకాత్స్వం లోకమదృష్ట్వా ప్రైతి స ఏనమవిదితో న భునక్తి యథా వేదో వాఽననుక్తోఽన్యద్వా కర్మాకృతమ్ ॥**

**యదిహ వా అప్యనేవంవిన్మహత్పుణ్యం కర్మ కరోతి తద్ధాస్యాన్తతఃక్షీయత ఏవ ॥**

**ఆత్మానమేవ లోకముపాసీత స య ఆత్మానమేవ లోకముపాస్తే న హాస్య కర్మ క్షీయతే । అస్మాద్ధ్యేవాఽఽత్మనో యద్యత్కామయతే తత్తత్సృజతే ॥**

ఇందులో మనుష్యసృష్టిలోని వర్ణాశ్రమధర్మాలను చూస్తాము. ఇంతకుముందు చూసిన వర్ణాశ్రమధర్మాలు దేవతల స్థాయిలోనివి. ఇప్పుడు అదే బ్రహ్మ లేదా ప్రజాపతి మనుష్యులలో వర్ణాలను సృష్టించాడు. అగ్నిదేవతే స్వయంగా మనుష్యబ్రాహ్మణుడు అయింది. అందువల్ల అగ్నిని, బ్రాహ్మణుణ్ణి సమానంగా చూస్తారు. అందువల్లనే కఠోపనిషత్తులో నచికేతుణ్ణి అగ్నిగా వర్ణించారు. నాలుగు వర్ణాలకు, వాటికి సంబంధించిన అధిష్ఠానదేవతలు ఉన్నారు.

**తదేతద్బ్రహ్మ క్షత్రం విట్ శూద్రస్తదగ్నినైవ దేవేషు బ్రహ్మాభవద్బ్రాహ్మణో మనుష్యేషు క్షత్రియేణ క్షత్రియో వైశ్యేన వైశ్యశ్శూద్రేణ శూద్రస్తస్మాదగ్నావేవ దేవేషు లోకమిచ్ఛంతే బ్రాహ్మణే మనుష్యేష్వేతాభ్యాగ్ం హి రూపాభ్యాం బ్రహ్మాఽభవత్ ॥**

| **మనుష్యవర్ణం** | **అధిష్ఠానదేవత** |
|---|---|
| బ్రాహ్మణుడు | అగ్నిదేవత |
| క్షత్రియుడు | వరుణుడు మొదలగువారు |
| వైశ్యుడు | మరుద్గణాలు, రుద్రుడు మొదలగువారు |
| శూద్రులు | పృథివీదేవత |

దేవతల్లోనూ, మనుష్యుల్లోనూ కూడా బ్రాహ్మణులను అందరికన్నా ఉన్నతంగా చూస్తారు. బ్రాహ్మణుడంటే గుణబ్రాహ్మణుడు అని అర్థం. కర్మబ్రాహ్మణుడో, జాతిబ్రాహ్మణుడో కాదు.

బ్రాహ్మణుడు ఎందుకు గొప్పవాడో, ఉపనిషత్తే కారణం చెబుతున్నది. దేవతల్లో బ్రాహ్మణుడు అగ్ని. కర్మలు చేయాలన్నా, ఉన్నతలోకాలు చేరుకోవాలన్నా కూడా అగ్నిదేవతమీదే ఆధారపడాలి.

మనుష్యుల్లో బ్రాహ్మణుడు ఎందుకు ఎక్కువ? దీనికి కూడా కారణం ఇవ్వబడింది. అగ్నిమీద ఆధారపడకుండా, బ్రాహ్మణజాతి ఉన్నతలోకానికి చేరుకోవచ్చుట. దీనికి శంకరులవారు మనుస్మృతిని ఉటంకిస్తున్నారు.

దాని సారాంశం – బ్రాహ్మణుడు ఇతర కర్మలను చేసినా, చేయకపోయినా, జపమువల్ల మాత్రమే సిద్ధిని పొందుతాడు అనటంలో సందేహం లేదు. శంకరులవారు ఇంకో కారణం కూడా చెబుతున్నారు. బ్రాహ్మణుడు ముందు సృష్టించబడ్డాడు. అందువల్ల అతను ఉన్నతుడయ్యాడు.

**అథ యో హ వా అస్మాల్లోకాత్స్వం లోకమదృష్ట్వా ప్రైతి స ఏనమవిదితో న భునక్తి యథా వేదో వాఽననుక్తోఽన్యద్వా కర్మాకృతమ్ ॥**

ఈ భాగం చాలా ముఖ్యమైన భాగం. అంతకు ముందు భాగంలో అగ్నివల్ల ఉన్నతలోకాలకు వెళ్ళవచ్చు. జపంవల్ల బ్రాహ్మణుడు ఉన్నతలోకాలకు వెళ్ళవచ్చు అని చూశాము. అగ్ని, జపం మనను ఉన్నతలోకాలకు తీసుకువెళితే, మోక్షం కూడా ఇవ్వవచ్చు కదా అనిపించవచ్చు. కాని అది సాధ్యం కాదు. అగ్ని, జపాలు ఏదైనా ఇస్తాయి, మోక్షం తప్ప. ధర్మంద్వారా మోక్షం పొందలేమని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో 18వ అధ్యాయంలో చెప్పాడు.

అదే భావన కఠోపనిషత్తులో కూడా చూస్తాము. జ్ఞానంవల్లనే మోక్షం పొందగలము. అందుకే ఈ భాగం ముఖ్యమైన భాగం అని చెప్పటం జరిగింది.

**స్వం లోకమదృష్ట్వా ప్రైతి –** మామూలుగా లోకం అంటే స్వర్గలోకంలాంటి లోకాలు. కాని బృహదారణ్యకోపనిషత్తులో లోకానికి అర్థం తరచు ఆత్మ అని వస్తుంది. అందువల్ల ఇక్కడ స్వం లోకం అంటే మన ఆత్మస్వరూపం. ఆత్మజ్ఞానం పొందకుండా ఎవరైనా మరణిస్తే, అతను సంసారంనుంచి రక్షించబడడు. అంటే పునరపి జననం, పునరపి మరణం వృత్తిలో పడక తప్పదు.

ఈ విషయాన్ని ఉపనిషత్తు ఇంకో విధంగా చెబుతున్నది. మామూలుగా మనను సంసారంనుంచి ఎవరు రక్షిస్తారంటాము? భగవంతుడు కాని, జ్ఞానం కాని అంటాము. కాని ఇక్కడ ఆత్మ మాత్రమే రక్షిస్తుంది అంటున్నది ఉపనిషత్తు. వెంటనే మనకు ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఆత్మ రక్షించే మాట నిజమయితే, ఆత్మ అందరిలో ఉంటుంది కాబట్టి.ఆత్మ అందరినీ ఎందుకు రక్షించదు? ఎందుకంటే ఆత్మ గురించి తెలుసుకున్న వ్యక్తినే ఆత్మ రక్షిస్తుంది. ఆత్మ గురించి తెలియకపోతే ఆత్మ రక్షించదు.

**ఆత్మ ఏవ బంధ కారణమ్, ఆత్మ ఏవ మోక్షకారణమ్**

ఇటువంటి భావనే తైత్తిరీయ ఉపనిషత్తులో కూడా వస్తుంది.

**బ్రహ్మ ఏవ భయకారణమ్, బ్రహ్మ ఏవ అభయకారణమ్**

ఒకే బ్రహ్మ భయకారణం, అభయకారణం – రెండూ ఎలా అవుతాడు? అంటే బ్రహ్మ గురించి తెలుసుకుంటే అభయకారణం అవుతాడు. తెలుసుకోకపోతే భయకారణం అవుతాడు. ఉదాహరణకు తాడు–పాము తీసుకోండి. తాడును సరిగ్గా చూడకుండా, పాము అని పొరబడితే అది భయకారణం అవుతుంది. దాన్నే మళ్ళీ సరిగ్గా చూసి పాము కాదు, తాడు అని తెలుసుకుంటే అది అభయకారణం అవుతుంది. తెలియని బ్రహ్మ ద్వైతప్రపంచంగా కనబడతాడు. ద్వైతప్రపంచం భయాన్ని కలుగజేస్తుంది. బ్రహ్మను తెలుసుకుంటే అహం బ్రహ్మ అస్మి అని అర్థం చేసుకుంటే ఆత్మ మిమ్మల్ని రక్షిస్తుంది. సంసారంనుంచి ముక్తినిస్తుంది.

ఆత్మ గురించి తెలుసుకుంటే రక్షిస్తుంది. తెలియకపోతే రక్షించదు అని చెప్పటానికి ఉపనిషత్తే రెండు ఉదాహరణలనిస్తోంది. వేదాధ్యయనం పుణ్యాన్నిస్తుంది. ఎప్పుడు? వేదాన్ని అధ్యయనం చేస్తేనే. చెయ్యకపోతే అది రక్షించలేదు. అలాగే పుణ్యకర్మ ఒక వ్యక్తిని రక్షిస్తుంది అంటారు. ఎప్పుడు? అతను పుణ్యకర్మలను చేస్తేనే. అతను పుణ్యకర్మలను చేయకపోతే, అవి రక్షించలేవు. అలాగే తెలుసుకోని ఆత్మ అతన్ని రక్షించలేదు. ఆత్మ గురించి తెలుసుకుంటేనే అది రక్షిస్తుంది.

**యదిహ వా అప్యనేవంవిన్మహత్పుణ్యం కర్మ కరోతి తద్ధాస్యాన్తతఃక్షీయత ఏవ ॥**
**ఆత్మానమేవ లోకముపాసీత స య ఆత్మానమేవ లోకముపాస్తే న హాస్య కర్మ క్షీయతే ।**
**అస్మాద్ధ్యేవాఽఽత్మనో యద్యత్కామయతే తత్తత్సృజతే ॥**

ఒక వ్యక్తి ఆత్మ గురించి తెలుసుకోలేదు, కాని అతను చాలా పెద్దకర్మను చేశాడనుకుందాము. అతను చేసిన పుణ్యకర్మవల్ల పుణ్యం పొందుతాడు కదా. ధర్మోరక్షతి రక్షితః అంటారు కదా. అంటే ధర్మాన్ని రక్షించినవాణ్ణి ధర్మం రక్షిస్తుంది. అలాంటప్పుడు ఈ వ్యక్తికి ఆత్మ గురించి తెలియకపోయినా,ఆ పుణ్యకర్మవల్ల మోక్షం వస్తుందా? రాదని చెబుతున్నది ఉపనిషత్తు.

ఎంత పెద్దకర్మ చేసినా, అది మోక్షాన్నివ్వదు. మరి అయితే, ధర్మం రక్షిస్తుందని ఎలా చెప్పగలరు? దాన్ని ఆపేక్షిక రక్షణం అంటారు. అంటే అది శాశ్వతంగా రక్షించదు. ఆ వ్యక్తి ధర్మం పాటించినంతవరకూ రక్షిస్తుంది. తరువాత అతను మళ్ళీ సంసారంలో పడకతప్పదు. ఇదే సూత్రం తక్కిన లౌకిక వస్తువులన్నింటికీ వర్తిస్తుంది. ఐశ్వర్యం, ప్రజల అండదండలు, ఆస్తులు – ఇవన్నీ తాత్కాలిక రక్షణలు. శాశ్వతంగా రక్షించలేవు. జ్ఞానం ఒక్కటే శాశ్వతంగా రక్షించగలదు. జ్ఞానకవచమే అసలైన రక్షణకవచం. వేదాంతం ఒక్క జ్ఞానకవచాన్నే నమ్ముతుంది.

ఆలయాలు కట్టించటంవంటి గొప్ప పుణ్యకార్యాలు చేసినా కూడా, అది మోక్షాన్నివ్వదని వేదాంతం చెబుతున్నది. అహం బ్రహ్మ అస్మి జ్ఞానం ఒక్కటే మోక్షాన్నిస్తుంది. అశాశ్వతమైన కర్మలవల్ల పొందే కర్మఫలం అశాశ్వతంగానే ఉంటుంది. విద్యాసూత్రంలో చెప్పినట్టుగా ఆత్మజ్ఞానం పొందాలి. **ఆత్మేత్యేవోపాసీత**

కర్మఫలం అశాశ్వతం. జ్ఞానఫలం శాశ్వతం. అందువల్ల ఆత్మజ్ఞానం పొందాలి.

**ఆత్మానమేవ లోకముపాసీత స య ఆత్మానమేవ లోకముపాస్తే స హాస్య కర్మ క్షీయతే**

ఆత్మజ్ఞానం మాత్రమే పొందాలి. ఎవరైతే ఆత్మజ్ఞానం పొందుతారో, అతను పొందే జ్ఞానఫలం శాశ్వతం. ఇప్పుడు ఉపనిషత్తు జ్ఞానిని స్తుతిస్తుంది. జ్ఞాని సంకల్ప మాత్రంచేత ఏది కావాలనుకుంటే అది పొందగలడు. దీనిని అర్థవాదం అంటారు. దీనిని అక్షరాలా తీసుకోకూడదు. జ్ఞానికి పరిపూర్ణత్వం కలిగి, కోరికలన్నీ నశించిపోతాయి. అతనికి తన గురించి ఏమీ కోరిక ఉండదు. ఇది జ్ఞానమహిమ. ఈ భాగం కొంచెం అప్రస్తుతంలోకి వెళ్ళినా చాలా ముఖ్యమైన భాగం.

## మంత్రం 1.4.16

**అథో అయం వా ఆత్మా సర్వేషాం భూతానాం లోకస్స యజ్జుహోతి యద్యజతే తేన దేవానాం లోకోఽథ యదనుబ్రూతే తేన ఋషీణామథ యత్పితృభ్యో నిపృణాతి యత్ప్రజామిచ్ఛతే తేన పితౄణామథ యన్మనుష్యాన్వాసయతే యదేభ్యోఽశనం దదాతి తేన మనుష్యాణామథ యత్పశుభ్యస్తృణోదకం విన్దతి తేన పశూనాం యదస్య గృహేషు శ్వాపదా వయాగ్ంస్యా పిపీలికాభ్య ఉపజీవన్తి తేన తేషాం లోకః ॥ యథా హ వై స్వాయ లోకాయారిష్టిమిచ్ఛేదేవగ్ం హైవంవిదే సర్వాణి భూతాన్యరిష్టిమిచ్ఛన్తి తద్వా ఏతద్విదితం మీమాగ్ంసితమ్ ॥**

మళ్ళీ దేవానాం పశుః విషయంలోకి వస్తున్నాము. ఈ మంత్రంలో ఉపనిషత్తు మరో అడుగు ముందుకు వేసింది. అజ్ఞాని దేవతలకే పశువు కాదు, అందరికీ పశువు అంది. అంటే అతను ప్రపంచంలో అందరికీ సేవ చేయాలి అంటున్నది. అతను శాస్త్రం ప్రకారం, అందరికీ ఋణపడి ఉన్నాడు, వారికి సేవ చేయటంద్వారా ఆ ఋణం తీర్చుకోవాలి. అంటే వైదికకర్మలు చేస్తూనే ఉండాలి. జ్ఞానంవల్లనే ఈ శిక్షను తప్పించుకోగలడు. లేకపోతే మరణించేదాకా కర్మలు చేస్తూ ఉండాలి. కర్మల్లో కొంత ఆనందం పొందవచ్చేమో కాని, కర్మ చేయటం ప్రాథమిక విషయం అవుతుంది.

**సర్వేషాం భూతానాం లోకః –** ఇక్కడ అతని కర్మల పట్టిక ఇవ్వబడింది. వర్ణాశ్రమధర్మం గృహస్థును బంధిస్తుంది. లోక అంటే ఇక్కడ భోగ్యవస్తువు. అంటే పశువు. అజ్ఞానిజీవి అందరికీ భోగం లేదా ఆనందాన్నివ్వాలి. మామూలుగా మనం భోక్తలం. మొత్తం జగత్తు మన గురించి సృష్టింపబడిన భోగ్యపదార్థం అంటాము. కాని ఇక్కడ మొత్తం జగత్తు భోక్త, మనం భోగ్యపదార్థం అంటున్నది ఉపనిషత్తు. ఎందుకంటే మనం అన్ని జీవరాశులకీ భోగాన్నివ్వాలి.

**దేవఋణం –** యజ్ఞయాగాదులు చేసి, ఆహుతులు సమర్పించినప్పుడు దేవతలు భోక్తలు, మనం భోగ్యవస్తువు అవుతాము. ఆ విధంగా దేవతలకు పశువులమయ్యాము.

**ఋషిఋణం –** వేదాధ్యయనం చేస్తే ఋషిఋణం తీరుతుంది. కర్మలు చేయటంవల్ల ఋణం తీరుతుంది. కొత్తగా ఏమీ రాదు.

**పితృఋణం –** శ్రాద్ధకర్మలు చేయటం, పితృతర్పణాలు వదలటంద్వారా పితృఋణం తీరుతుంది.

**మనుష్యఋణం –** ఇంటికి వచ్చిన అతిథికి భోజనసదుపాయాలు, వసతిసౌకర్యాలు ఏర్పరచటంద్వారా మనుష్యఋణం తీరుతుంది. అతిథులకు మనం హోటల్‌లాంటి వారిమన్నమాట. వారు భోక్తలు, వారికి మనం భోగ్యపదార్థం అవుతాము.

**పశుఋణం –** పశువులకు నీటి సదుపాయం ఏర్పరచటంద్వారా పశుఋణం తీరుతుంది. చీమ కూడా భోక్తే. గృహస్థు చీమనుంచి, తక్కిన జంతువులన్నింటికీ భోగ్యవస్తువు అవుతాడు. వీటివల్ల, అతనికి కొంత లాభం కూడా కలుగుతుంది.

అందరికీ అతను సేవ చేస్తాడు కాబట్టి దేవతలు, ఋషులు, పితృదేవతలు, తోటి మానవులు, జంతువులు – అన్నీ అతని మంచి కోరతాయి. అతన్ని దీవిస్తాయి. మనం మన శరీర ఆరోగ్యాన్ని ఎందుకు కాపాడుకుంటాము? మన కాళ్ళు, చేతులూ మనకు సేవ చేస్తాయి కాబట్టి వాటిని రక్షించుకుంటాము. అలాగే మనలాంటి వ్యక్తులు మొత్తం జగత్తుకు కాళ్ళు, చేతులలాంటివారు. అందుకని జగత్తు మనను పరిరక్షించుకుంటుంది. దీన్ని పంచమహాయజ్ఞం అంటారు.

ఈ వివరాలన్నీ వేదమంత్రాల్లో, మీమాంసక సూత్రాల్లో అంతకుముందే వచ్చాయని ఉపనిషత్తు చెబుతున్నది. ఈ పంచమహాయజ్ఞాలు గృహస్థు చేసి తీరాలి. ఋణం తీర్చుకోవటం తప్పనిసరి పరిస్థితి. అందువల్ల పంచమహాయజ్ఞాలు నిత్య నైమిత్తిక కర్మల కిందకి వస్తాయి. ఈ కర్మలు చేయకపోతే ఆ గృహస్థుకు ప్రత్యవాయపాపం అంటుకుంటుంది. చేయాల్సిన కర్మ చేయకపోవటం కూడా పాపమే. అందువల్ల ప్రతిగృహస్థు కూడా తన శక్తిమేరకు పంచమహాయజ్ఞాలు చేయాలి.

## మంత్రం 1.4.17

**ఆత్మైవేదమగ్ర ఆసీదేక ఏవ సోఽకామయత జాయా మే స్యాదథ ప్రజాయేయాథ విత్తం మే స్యాదథ కర్మ కుర్వీయేత్యేతావాన్ వై కామః ॥**

**నేచ్ఛగ్గ్ంశ్చనాతో భూయో విన్దేత్తస్మాదప్యేతర్హ్యేకాకీ కామయతే జాయా మే స్యాదథ ప్రజాయేయాథ విత్తం మే స్యాదథ కర్మ కుర్వీయేతి స యావదప్యేతేషామేకైకం న ప్రాప్నోత్యకృత్స్న ఏవ తావన్మన్యతే॥**

**తస్యో కృత్స్నతా మన ఏవాస్యాఽఽత్మా వాగ్జాయా ప్రాణః ప్రజా చక్షుర్మానుషం విత్తం చక్షుషా హి తద్విన్దతే శ్రోత్రం దైవగ్ం శ్రోత్రేణ హి తచ్ఛృణోత్యాత్మైవాస్య కర్మాఽఽత్మనా హి కర్మ కరోతి స ఏష పాఙ్క్తో యజ్ఞః ॥**

**పాఙ్క్తః పశుః పాఙ్క్తః పురుషః పాఙ్క్తమిదగ్ం సర్వం యదిదం కిఞ్చ తదిదగ్ం సర్వమాప్నోతి య ఏవం వేద ॥**

**ఆత్మైవేదమగ్ర ఆసీదేక ఏవ సోఽకామయత జాయా మే స్యాదథ ప్రజాయేయాథ విత్తం మే స్యాదథ కర్మ కుర్వీయేత్యేతావాన్ వై కామః** – అజ్ఞాని జీవి కర్తగా మారి, తన కర్మలు చేయాలి అంటే దానికి ఆశ్రమధర్మం కూడా తోడ్పడాలి. ఇప్పుడు ఆశ్రమధర్మం చూద్దాము.

వేదపరిభాషలో కర్మ, ముఖ్యంగా వైదిక కర్మ లేదా యజ్ఞాన్ని పాంక్తం అంటారు. పాంక్తం అంటే ఐదు అంశాలతో కూడిన యజ్ఞం. ఆ ఐదు అంశాలు – పత్ని, యజమాని, పుత్రుడు, మనుష్యవిత్తం, దైవవిత్తం.

| | |
|---|---|
| పత్ని | – భార్య. భార్య ఉన్న గృహస్థు మాత్రమే యజ్ఞం చేయగలడు |
| యజమాని | – యజ్ఞకర్త |
| పుత్రుడు | – కొడుకు |
| మనుష్యవిత్తం | – శారీరక ఆరోగ్యం, దానమివ్వటానికి అవసరమైన ధనధాన్యాలు, పశుసంపద మొదలైనవి. |
| దైవవిత్తం | – ఉపాసన |

ఈ ఐదూ ఉంటేనే ఒక యజ్ఞం చేయగలుగుతారు. ఒక యజ్ఞానికి ఈ ఐదూ కావాలంటే, అవి ఒక్క గృహస్థాశ్రమంలోనే సాధ్యమవుతాయి. దైవవిత్తం తక్కిన ఆశ్రమాల్లో లభ్యమవవచ్చు. కాని తక్కినవి కుదరవు. వానప్రస్తంలో భార్య ఉంటుంది. కాని పుత్రులు తనతో ఉండరు. మనుష్యవిత్తం కూడా ఉండదు. భిక్షాటన చేసి జీవించాలి కాబట్టి, బ్రహ్మచారి, సన్న్యాసులకు అసలే కుదరదు.

ఆశ్రమధర్మాల పరిస్థితి ఇది అయితే వర్ణాల పరిస్థితి ఇంకోలా ఉంటుంది. క్షత్రియ, వైశ్య, శూద్రులు కొన్ని యజ్ఞాలు చేయలేరు. బ్రాహ్మణుడు మాత్రమే చేయగలడు. అది కూడా అతను గృహస్థు అయితేనే.

**ఆత్మైవేదమగ్ర ఆసీత్ –** ఇక్కడ ఉపనిషత్తు ఒక కథ చెబుతున్నది. ఆత్మజ్ఞానం సంసార బంధంనుంచి తొలగించి, మోక్షాన్నిచ్చేట్టయితే, ఎందుకు అందరూ ఆత్మజ్ఞానానికి వెళ్ళరు? దానికి జవాబు కామం. కామం అంటే కోరిక. మనుష్యులను కామం కట్టి పడేస్తున్నది. కామం మనిషిని బాహ్యంగా పరుగులు తీయిస్తుంది. కామం ఏర్పడగానే దాన్ని తీర్చుకోవటానికి అతను యజ్ఞయాగాదులు చేయాలి. ఒకప్పుడు ఒక అజ్ఞాని బ్రహ్మచారి ఉన్నాడుట. ఈ మంత్రంలో ఆత్మ అంటే అజ్ఞాని బ్రహ్మచారి. ఆత్మకు అనేక అర్థాలు ఉన్నాయి. ఆత్మ అంటే బ్రహ్మ. ఆత్మ అంటే నేను. ఈ ఉపనిషత్తులోనే మొదట్లో ఆత్మ అంటే ప్రజాపతి.

కాని ఇక్కడ ఆత్మ అంటే అజ్ఞాని బ్రహ్మచారి. బ్రహ్మచారి అని ఎలా చెప్పగలము? అతను నాకు భార్య కావాలి అని కోరుకున్నాడు. తరువాత పుత్రుడుగా నేను పుట్టాలనుకున్నాడు. తరువాత నాకు మనుష్యవిత్తం, దైవవిత్తం కావాలనుకున్నాడు. ఉపనిషత్తు, అతను ఇంత మాత్రమే కోరగలడు అంటున్నది. దీన్ని సాధన ఇచ్ఛ అంటారు. సాధన ఇచ్ఛలో సాధ్య ఇచ్ఛ కూడా వస్తుంది. ఈ సాధనవల్ల దేవలోకానికో, పితృలోకానికో వెళ్ళవచ్చు. ఈ లోకాలు సాధ్య ఇచ్ఛ కిందకి వస్తాయి.

అజ్ఞాని కోరికలు సాధన సాధ్య కోరికలుగా ఉంటాయి. బ్రహ్మచారి గృహస్థాశ్రమంలోకి ప్రవేశించినప్పుడు అతనికి సాధన సాధ్య కోరికలు ఉంటాయి. అదే బ్రహ్మచారి సన్యాసాశ్రమంలోకి అడుగుపెడితే, అతనికి సిద్ధకామం లేదా వైరాగ్యం ఉంటుంది. సన్యాసాశ్రమంలోకి అడుగుపెట్టేది మోక్షం పొందటానికి. గృహస్థు అయితే అతని కోరికలు సాధన, సాధ్య ఇచ్ఛల చుట్టూ తిరుగుతాయి. అతను కావాలనుకున్నా వేరే ఏమీ పొందలేడు.

**నేచ్ఛగ్ంశ్చనాతో భూయో విన్దేత్తస్మాదప్యేతర్హ్యేకాకీ కామయతే జాయా మే స్యాదథ ప్రజాయేయాథ విత్తం మే స్యాదథ కర్మ కుర్వీయేతి స యావదప్యేతేషామేకైకం న ప్రాప్నోత్యకృత్స్న ఏవ తావన్మన్యతే –** ఇది ఎప్పుడో అజ్ఞాని బ్రహ్మచారి కోరిన కోరిక. అది కూడా ఈ అజ్ఞాని బ్రహ్మచారి ప్రవృత్తి మార్గాన్ని ఎన్నుకోవటంవల్ల. ఇప్పటికీ బ్రహ్మచారులు ప్రవృత్తిమార్గాన్ని ఎన్నుకుంటూ, గృహస్థులుగా మారుతూ, సాధన సాధ్య ఇచ్ఛలతో తిరుగుతున్నారు. బ్రహ్మచారులు, అజ్ఞాని బ్రహ్మచారులు అవటంవల్ల, ఈ ఐదు అంశాలూ కావాలనుకుని పెళ్ళి చేసుకుంటున్నారు. చివరికి దేవతలకు పశువులుగా మారుతున్నారు.

**ఏషామేకైకం న ప్రాప్నోత్యకృత్స్న ఏవ తావన్మన్యతే –** తను కోరుకున్న వాటిలో ఏ ఒక్కటీ పొందలేకపోయినా, తాను అపూర్ణుడనుకుంటాడు. ఇక్కడ ఉపనిషత్తు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఏ ఒక్కటి పొందకపోయినా

అతడు పరిపూర్ణుడు కాడని ఉపనిషత్తు చెప్పటం లేదు. తావన్మన్యతే అంటున్నది. అతను పరిపూర్ణుడు కాడనుకుంటాడని చెబుతున్నది. అజ్ఞానంవల్ల అతను అలా భావిస్తున్నాడు. అతని సమస్య అజ్ఞానం. దీనివల్ల గృహస్థాశ్రమం, గృహస్థాశ్రమంవల్ల కర్మలు వచ్చాయి.

ఉపనిషత్తు ఒక ఉపాసనను ప్రవేశపెట్టటంద్వారా ఈ మంత్రాన్ని ముగిస్తున్నది.

**తస్యో కృత్స్నతా మన ఏవాస్యాఽఽత్మా వాగ్జాయా ప్రాణః ప్రజా చక్షుర్మానుషం విత్తం చక్షుషా హి తద్విన్దతే శ్రోత్రం దైవగ్ం శ్రోత్రేణ హి తచ్ఛృణోత్యాత్మైవాస్య కర్మాఽఽత్మనా హి కర్మ కరోతి స ఏష పాఙ్క్తో యజ్ఞః ॥ పాఙ్క్తః పశుః పాఙ్క్తః పురుషః పాఙ్క్తమిదగ్ం సర్వం యదిదం కిఞ్చ తదిదగ్ం సర్వమాప్నోతి య ఏవం వేద –**
ఒకవేళ ఈ బ్రహ్మచారికి ఎవరూ దొరకక, పెళ్ళి చేసుకోలేకపోతే ఏం చేయాలి? అటువంటి వారికి ఉపనిషత్తు ఒక మార్గం సూచిస్తున్నది. అంటే గృహస్థాశ్రమంలోకి ప్రవేశించలేని వ్యక్తికి ఈ ఉపాసన. ఈ ఉపాసనలో అతనిలోని అంగాలనే ఈ ఐదు అంశాలుగా ఊహించుకోవాలి. ఈ ఉపాసనను ఆధ్యాత్మ ఉపాసన అంటారు.

మనస్సు – మనస్సు యజమాని. అది ముఖ్యం, ప్రధానం, అదే అతని చర్యలన్నింటినీ నిశ్చయిస్తుంది.

వాక్కు – భార్య. వాక్కు, మనస్సు కోరినట్టుగా మాట్లాడుతుంది. భార్య భర్త అడుగుజాడల్లో నడవాలి. మనస్సు అనుకున్నదే, వాక్కు బయటకు చెబుతుంది.

ప్రాణం – పుత్రుడు. పుత్రుడు తల్లిదండ్రుల కోర్కెలను నెరవేరుస్తాడు. ప్రాణశక్తి మనస్సు, వాక్కుల కోరికలను నెరవేరుస్తుంది.

కన్ను – మనుష్యవిత్తం. దీనికి కారణం ఉపనిషత్తే చెబుతున్నది. లౌకిక ధనాన్ని సంపాదించటంలో కన్ను ముఖ్యపాత్ర వహిస్తుంది.

చెవి – దైవవిత్తం. ఆధ్యాత్మిక జ్ఞానం శ్రుతిద్వారా పొందుతాము. శ్రూయతే ఇతి శ్రుతి. శ్రుతిని చెవుల ద్వారా వింటాము. ఇప్పుడంటే పుస్తకాలు ఉన్నాయి కాని, ఉపనిషత్తులు ఆ కాలంలో గురుపరంపరగా విని నేర్చుకున్నదే కదా!

దీనితో పాంక్తం అయింది. కాని ఈ పాంక్తంలో కర్మ చేయాలి, అంటే యజ్ఞం చేయాలి. ఏమిటా యజ్ఞం?

శరీరాన్ని యజ్ఞంగా ఉపాసన చేయాలి. ఎందుకు యజ్ఞంగా చేయాలి? శరీరమే అన్ని కర్మలూ చేస్తుంది. దీన్ని పాంక్త ఉపాసన అంటారని చూశాము. తైత్తిరీయ ఉపాసనలో కూడా పాంక్తబ్రహ్మ ఉపాసన ఉంది.

పాంక్తబ్రహ్మ ఉపాసనను అహంగ్రహ ఉపాసన అని కూడా అంటారు. ఇందులో నేను పాంక్తం. అంటే ఆధ్యాత్మపాంక్తం. నేను అధిదైవపాంక్తం లేదా హిరణ్యగర్భపాంక్తానికి భిన్నంగా లేను. సమష్టి, వ్యష్టిమీద ఆరోపించబడింది. ఇక్కడ ఉపాసనకు బాహ్యంగా ప్రతీక ఏదీ లేదు. 'నేనే' ఉపాసనకు ప్రతీకను. ఎవరు అహంగ్రహ పాంక్త ఉపాసన చేస్తారో, వారు హిరణ్యగర్భ పథం పొందుతారు.

# బ్రాహ్మణము 4 - సారాంశము

రెండు అంశాలు ఉన్నాయి ఇందులో - సృష్టి ప్రకరణం, వేదాంతం.

ఎ) సృష్టి ప్రకరణం - మను, శతరూపలద్వారా మనుష్యసృష్టి, పశువుల సృష్టి జరిగింది. మనుష్యసృష్టి, పశుసృష్టిలతో పాటు దేవతాసృష్టి, అన్న-అన్నాద సృష్టి కూడా జరిగింది.

దేవతాసృష్టిలో వర్ణసృష్టి జరిగింది.

దాని తరువాత మనుష్యులలో వర్ణాశ్రమసృష్టి జరిగింది.

మనుష్యులను ముందు దేవతలకు పశువుగా వర్ణించి, మళ్ళీ అందరికీ పశువుగా వర్ణించింది ఉపనిషత్తు. అలా పంచమహాయజ్ఞాల వివరణ వచ్చింది.అందరికీ పశువుగా అవటంవల్ల జీవి భోగ్యం, ప్రపంచం భోక్త అయింది.

బి) వేదాంతం

అనుప్రవేశశ్రుతి
విద్యాసూత్రం
ఆత్మ అన్నిటికన్నా అత్యంత దగ్గరైనది
అహం బ్రహ్మ అస్మి మహావాక్యం
అవిద్యాసూత్రం

ఈ బ్రాహ్మణాన్ని పురుషవిధ బ్రాహ్మణము అని కూడా అంటారు. పురుషవిధః అని మొదలవటంవల్ల ఈ బ్రాహ్మణానికి ఆ పేరు కూడా చెప్పవచ్చు. ఇందులో వేదాంతభాగం చాలా ఉంది. మహావాక్యం ఉంది. అందువల్ల ఇది చాలా ముఖ్యమైన బ్రాహ్మణము.

## 1.5 - సప్తాన్న బ్రాహ్మణము

ఐదవ బ్రాహ్మణాన్ని సప్తాన్న బ్రాహ్మణము అంటారు. ఇందులో కూడా అవిద్యాసూత్రం కొనసాగుతుంది. అంటే సంసారం గురించిన విషయం కొనసాగుతుంది. ముందు బ్రాహ్మణంలో ప్రజాపతిని సృష్టికర్తగా చూశాము. ఇప్పుడు అదే సృష్టిని జీవుడు సృష్టించినట్టుగా చూస్తాము. అలాగే ముందు బ్రాహ్మణములో జీవుణ్ణి భోగ్యవస్తువుగా చూశాము. కాని ఈ బ్రాహ్మణములో జీవుణ్ణి భోక్తగా చూస్తాము. అలా, ఇక్కడ రెండు అంశాలను చూస్తాము. జీవుడు చేసిన సృష్టి, జగత్తు మొత్తాన్ని తను స్వయంగా అనుభవించటానికి సృష్టించాడు. జీవుడు సృష్టించిన ఈ భోగ్యప్రపంచం ఏడుగా విభజించబడింది.

దీన్ని సప్తాత్మక లేదా సప్తభోగ్యాత్మక ప్రపంచం అంటారు. అంటే ఏడు భోగ్యపదార్థాలు ఉన్నాయి. జీవుడే తన కర్మలద్వారా, ఉపాసనలద్వారా ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. మనం జ్ఞాని అయిన మరుక్షణం ఈ భోగ్యప్రపంచం మనకు అవసరం లేదు. ఈ ప్రపంచం సృష్టించబడింది అజ్ఞాని జీవులకు మాత్రమే.

సంస్కృతంలో భోగ్యవస్తువును అన్నం అంటారు. అన్నం అంటే ఒక అర్థం అన్నమే అంటే తినే వస్తువు. ఇంకో అర్థం అనుభవంలోకి వచ్చే వస్తువు.

**అనుభూయతే ఇతి అన్నమ్**

జీవుడే తన కర్మలు, ఉపాసనలద్వారా సప్తాన్నభోగ్యప్రపంచాన్ని సృష్టించాడు అని తెలుసుకోవటంవల్ల మన ఒక సందేహానికి జవాబు చెప్పకనే చెప్పినట్టయింది. భగవంతుడు ఈ సృష్టినెందుకు చేశాడు? ఈ ప్రశ్న అప్పుడప్పుడూ వేధిస్తూ ఉంటుంది. దీనికి జవాబు ఇప్పుడే చూశాము – భగవంతుడు తోచక సృష్టించలేదు. మనమే మన కర్మలద్వారా, ఉపాసనలద్వారా సృష్టించాము. ఒక వ్యక్తి జీవన్ముక్తుడయితే భగవంతుడు అతనికి భోగ్యప్రపంచం సృష్టించలేడు. అతను అకర్త, అభోక్తా అవుతాడు.

దేవుడు సృష్టించింది మన కర్మ క్షయం అవటానికి. మనమే సృష్టించాము అంటే అక్షరాలా సృష్టించామని కాదు. ఈ సృష్టికి మన కర్మలే పరోక్షకారణాలు.

ఈ ఖండం సారాంశం మొదటి మంత్రంలో సూక్ష్మంగా వచ్చేసింది. అందుకని దీన్ని సూత్రభూతమంత్రం అంటారు. ఉపనిషత్తే తరువాత వాటిని వివరిస్తుంది. ఇప్పుడు మొదటి మంత్రాన్ని చూద్దాము.

మంత్రం 1.5.1

**యత్సప్తాన్నాని మేధయా తపసాఽజనయత్పితా। ఏకమస్య సాధారణమ్। ద్వే దేవానభాజయత్। త్రీణ్యాత్మనేఽకురుత। పశుభ్య ఏకం ప్రాయచ్ఛత్। తస్మిన్ సర్వం ప్రతిష్ఠితం యచ్చ ప్రాణితి యచ్చ న। కస్మాత్తాని న క్షీయన్తేఽద్యమానాని సర్వదా। యో వైతామక్షితిం వేద। సోఽన్నమత్తి ప్రతీకేన। స దేవానపిగచ్ఛతి స ఊర్జముపజీవతి। ఇతి శ్లోకాః ॥**

జీవి ఏడు అన్నాలను సృష్టించటంవల్ల ఉపనిషత్తు, జీవిని పితా అంటున్నది. జగత్ పితా జీవః. జీవి అంటే అజిత జీవి అనే విషయం మర్చిపోకూడదు. ఈ మంత్రంలో మేధా అంటే ఉపాసన. తపస్సు అంటే కర్మ. ఉపాసన, కర్మలద్వారా జీవి ఏడు అన్నాలను సృష్టించాడు. ఏమిటవి?

1. సాధారణ అన్నం – అన్ని జీవరాశులూ అంటే మనుషులు, పక్షులు, వృక్షాలు రోజువారీ తీసుకునే అన్నం.

2, 3. దేవ అన్నం – దేవతలకు ఇచ్చే ఆహుతులు.

4. పశు అన్నం – పశువులు, మనుష్యులు కూడా, ముఖ్యంగా పుట్టినప్పుడు, తీసుకునే పాలు.

ఈ నాలుగూ ఇతరులకు ఇచ్చే అన్నాలు. తర్వాత వచ్చేవి వ్యష్టిశరీరంలోని అంగాలు. అవి –
5,6,7 మనః, వాక్, ప్రాణః – మనస్సు, వాక్కు, పంచప్రాణాలు. ఇవి తన స్వంత ఆనందంకొరకు ఉపయోగించేవి.

ఇంకో కోణంలోంచి చూస్తే పై నాలుగు అన్నాలనూ **సాధన అన్నాని** అనీ తక్కిన మూడు అన్నాలనూ **సాధ్య అన్నాని** అనీ అనవచ్చు. ఎందుకంటే మన మనస్సు, వాక్కు, ప్రాణం, మనం ఇతరులకు చేసిన దానంబట్టి ఉంటాయి. మనకు ఇప్పుడు మంచిమనస్సు లేదంటే మన పూర్వజన్మలో పై అన్నాలను దానం చేయలేదన్నమాట.

ఇక్కడ ఇంకో విషయం కూడా గమనించాలి. ఈ సప్తభోగ్యపదార్థప్రపంచం ఎలా నిరంతరంగా కొనసాగుతున్నది? అది ఎందుకు ఆగిపోవటం లేదు? దానికి కారణం జీవే అంటున్నది ఉపనిషత్తు. జీవుడు భోక్తగానే కాకుండా, కర్త కూడా అవుతున్నాడు. అందువల్ల ఈ ప్రపంచంలో ఉంటూనే వచ్చే జన్మకు కూడా ఏర్పాట్లు చేసుకుంటున్నాడు.

**భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ॥** – గీత

జీవులందరినీ కర్మ ఉత్పత్తి చేస్తుంది. మనం మన తర్వాత జన్మలోని తల్లిని, అక్కచెల్లెళ్ళను, భర్తను, పిల్లలను, ఇరుగుపొరుగును, గురువును కూడా ఈ జన్మలో చేసే ప్రస్తుత కర్మలద్వారా ఏర్పాటు చేసుకుంటున్నాము.

జీవుడు సృష్టి కారకుడే కాదు, సృష్టివృత్తంలా కొనసాగటానికి కూడా కారకుడవుతున్నాడు. ఈశ్వరుడు తన కోరికమేరకు ఈ జగత్తును సృష్టించటం లేదు. జీవుడు చేసుకున్న కర్మఫలంగా జగత్తును ఇస్తున్నాడు. అందువల్ల సృష్టి చేసినది ఈశ్వరుడే అయినా, వాటి వెనుకనున్న మూలకారణం జీవుడు చేస్తున్న కర్మ, ఉపాసనల ఫలం.

దీనిని ముగిస్తూ ఉపనిషత్తు ఇంకో అంశం కూడా చెబుతున్నది. ఎవరైతే హిరణ్యగర్భమీద లేదా విరాట్‌మీద సప్తాన్నరూప ఉపాసన చేస్తారో వారు హిరణ్యగర్భపథం పొందుతారు. ఈ ఖండం సారాంశం ఇది.

## మంత్రం 1.5.2

**యత్సప్తాన్నాని మేధయా తపసాఽజనయత్పితేతి మేధయా హి తపసాఽజనయత్పితా ॥**

**ఏకమస్య సాధారణమితీదమేవాస్య తత్సాధారణమన్నం యదిదమద్యతే। స య ఏతదుపాస్తే న స పాప్మనో వ్యావర్తతే మిశ్రగ్ం హ్యేతత్ ॥**

**ద్వే దేవానభాజయదితి హుతం చ ప్రహుతం చ తస్మాద్దేవేభ్యో జుహ్వతి చ ప్ర చ జుహ్వత్యథో ఆహుర్దర్శపూర్ణమాసావితి । తస్మాన్నేష్టియాజుకస్స్యాత్ ॥**

**పశుభ్య ఏకం ప్రాయచ్ఛదితి తత్పయః। పయో హ్యేవాగ్రే మనుష్యాశ్చ పశవశ్చోపజీవన్తి తస్మాత్కుమారం జాతం ఘృతం వైవాగ్రే ప్రతిలేహయన్తి స్తనం వాఽనుధాపయన్త్యథ వత్సం జాతమాహురతృణాద ఇతి ॥**

**తస్మిన్ సర్వం ప్రతిష్ఠితం యచ్చ ప్రాణితి యచ్చ నేతి పయసి హీదగ్ం సర్వం ప్రతిష్ఠితం యచ్చ ప్రాణితి యచ్చ న ॥**

**తద్యదిదమాహుస్సంవత్సరం పయసా జుహ్వదప పునర్మృత్యుం జయతీతి న తథా విద్యాద్యదహరేవ జుహోతి తదహఃపునర్మృత్యుమపజయత్యేవం విద్వాన్ సర్వగ్ం హి దేవేభ్యోఽన్నాద్యం ప్రయచ్ఛతి॥ కస్మాత్తాని న క్షీయన్తేఽద్యమానాని సర్వదేతి పురుషో వా అక్షితిస్స హీదమన్నం పునః పునర్జనయతే। యో వైతామక్షితిం వేదేతి పురుషో వా అక్షితిస్స హీదమన్నం ధియా ధియా జనయతే కర్మభిర్యద్ధైతన్న కుర్యాత్ క్షీయేత హ సోఽన్నమత్తి ప్రతీకేనేతి ముఖం ప్రతీకం ముఖేనేత్యేతత్ । స దేవానపిగచ్ఛతి స ఊర్జముపజీవతీతి ప్రశగ్ంసా ॥**

**యత్సప్తాన్నాని మేధయా తపసాఽజనయత్పితేతి మేధయా హి తపసాఽజనయత్పితా ॥ ఏకమస్య సాధారణమితీదమేవాస్య తత్సాధారణమన్నం యదిదమద్యతే। స య ఏతదుపాస్తే న స పాప్మనో వ్యావర్తతే మిశ్రగ్ం హ్యేతత్** – ఈ మంత్రంనుంచి వ్యాఖ్యానం మొదలవుతుంది. ఇక్కడ మొదటి అన్నం గురించి వస్తుంది. మొదటి అన్నాన్ని సాధారణ అన్నం అంటారని చూశాము. సప్తాన్నాలను జీవుడు తన కర్మ, ఉపాసనలద్వారా సృష్టించాడని కూడా చూశాము. ఈ అన్నాలతో పాటు ఉపనిషత్తు ఒక విలువ కూడా చెబుతున్నది.

విలువ – ఎవరికీ పెట్టకుండా, తను ఒక్కడే తినకూడదు.

ఈ అన్నం ప్రాణకోటి అన్నింటికీ అన్నం కాబట్టి, ఎవరికీ పెట్టకుండా, స్వార్థంగా, ఒంటరిగా తినకూడదు. అలా తింటే పాపం పోదు అని ఉపనిషత్తు చెబుతున్నది. గీత ఒక అడుగు ముందుకు వేసి, అలా తింటే పాపం కలుగుతుంది అంటుంది.

**ద్వే దేవానభాజయదితి హుతం చ ప్రహుతం చ తస్మాద్దేవేభ్యో జుహ్వతి చ ప్ర చ జుహ్వత్యథో ఆహుర్దర్శపూర్ణమాసావితి। తస్మాన్నేష్టియాజుకస్స్యాత్** – ఇప్పుడు 2,3 అన్నాల గురించి వస్తుంది. ఇవి ద్వే అన్నం. ఉపనిషత్తే రెండు అర్థాలు చెబుతున్నది. ఒక అర్థం వాటిని హుతము, ప్రహుతము అంటారు. అగ్నిలో ఆహుతులు వేశాక, బలిదానం చేస్తారు. హుతమంటే అగ్నిలో హోమం చేయటం. ప్రహుతమంటే బలిదానం. ఈ రెండూ స్మార్తకర్మలు. అంటే **స్మృతివిహితం కర్మ స్మార్తమ్ –** స్మృతి విధించిన కర్మలు.

ఉపనిషత్తే ఇంకో అర్థం చెబుతున్నది. వాటిని దర్శం, పూర్ణమాసం అంటారు. ఇవి అమావాస్య, పౌర్ణములకు సంబంధించినవి. వీటిని శ్రౌతకర్మలు అంటారు. ఈ రెండింటిలో వేటినన్నా చేయవచ్చు కాని శ్రౌతకర్మలు అంటే శ్రుతి విధించిన కర్మలు. శ్రుతి విధించిన కర్మలు, స్మృతి విధించిన కర్మలకన్నా శక్తివంతమైనవి. ఎలా చేసినా ఇవి సాధ్య అన్నాలు.

విలువ – ఈ కర్మలను కామ్యకర్మలుగా చేయకూడదు.

ఏదైనా కోరిక కోరి చేస్తే అది వ్యాపారం అవుతుంది. అందుకని ఈ కర్మలను దానంగా చేయండి అంటుంది ఉపనిషత్తు.

**పశుభ్య ఏకం ప్రాయచ్ఛదితి తత్పయః। పయో హ్యేవాగ్రే మనుష్యాశ్చ పశవశ్చోపజీవన్తి తస్మాత్కుమారం జాతం ఘృతం వైవాగ్రే ప్రతిలేహయన్తి స్తనం వాఽనుధాపయన్త్యథ వత్సం జాతమాహురతృణాద ఇతి ॥ తస్మిన్ సర్వం ప్రతిష్ఠితం యచ్చ ప్రాణితి యచ్చ నేతి పయసి హీదగ్ం సర్వం ప్రతిష్ఠితం యచ్చ ప్రాణితి యచ్చ న** – ఇప్పుడు 4వ అన్నం గురించి వస్తుంది. ఇది పశు అన్నం. ఇది పశువులన్నింటికీ అన్నం. పశువులలో మనష్యులు కూడా వస్తారు. ముఖ్యంగా వీరందరికీ, అప్పుడే పుట్టిన వారికి అన్నం పాలు. మనిషి ఘృతం అంటే నెయ్యి కూడా తీసుకుంటాడు. అది కూడా పాలకు చెందినదే.

**పయసి హీదగ్ం సర్వం ప్రతిష్ఠితమ్ –** ఉపనిషత్తు పాలను స్తుతిస్తున్నది. ప్రతి ఆహారానికీ మూలం పాలే. మొదట్లో అందరికీ ఆహారం పాలే. అంతేకాదు, నిత్యకర్మలైన అగ్నిహోత్ర కర్మలలో కూడా పాలు వాడతారు. తక్కిన కర్మల్లో నెయ్యి వాడతారు. అది మళ్ళీ పాలనుంచి వచ్చిందే. అంటే ప్రపంచం మొత్తం కర్మలమీద ఆధారపడి ఉంది. కర్మ చేయటానికి పాలు కావాలి.

**తద్యదిదమాహుస్సంవత్సరం పయసా జుహ్వదప పునర్మృత్యుం జయతీతి న తథా విద్యాద్యదహరేవ జుహోతి తదహఃపునర్మృత్యుమపజయత్యేవం విద్వాన్ సర్వగ్ం హి దేవేభ్యోఽన్నాద్యం ప్రయచ్ఛతి ॥**

విలువ – పాలతో అగ్నిహోత్ర కర్మ చేస్తే అమృతత్వాన్ని పొందుతారు.

పయసి సర్వం ప్రతిష్ఠితంమీద ఉపాసన చేసి అగ్నిహోత్రకర్మ చేస్తే అతనికి ఉన్నత ఫలం లభిస్తుంది. ప్రపంచం మొత్తానికి పాలు ఆధారం అని చూశాము కదా.

ఈ ధ్యానంతో కలిపి కర్మ చేస్తే, అతను మహాదానం చేసినట్లు లెక్క. దానివల్ల అతను అమృతత్వాన్ని పొందుతాడు. ఈ సందర్భంలో ఇంకో అభిప్రాయాన్ని కూడా చెబుతున్నది ఉపనిషత్తు. ప్రజాపతి సంవత్సరాన్ని సృష్టించాడు. అందుకని సంవత్సర ప్రజాపతిమీద ఉపాసనచేస్తూ సంవత్సరంపాటు అగ్నిహోత్రకర్మ చేస్తే మృత్యువును జయిస్తాడంటారు కొందరు. కాని దానిని ఆ విధంగా అర్థం చేసుకోకూడదు. ఏ రోజైతే హోమాన్ని చేస్తాడో, ఆ రోజే అతను అపమృత్యువును జయిస్తాడు.

**కస్మాత్తాని న క్షీయన్తేఽద్యమానాని సర్వదేతి పురుషో వా అక్షితిస్స హీదమన్నం పునః పునర్జనయతే। యో వైతామక్షితిం వేదేతి పురుషో వా అక్షితిస్స హీదమన్నం ధియా ధియా జనయతే కర్మభిర్యద్ధైతన్న కుర్యాత్ క్షీయేత హ సోఽన్నమత్తి ప్రతీకేనేతి ముఖం ప్రతీకం ముఖేనేత్యేతత్। స దేవానపిగచ్ఛతి స ఊర్జముపజీవతీతి ప్రశగ్ంసా ॥**

ఇప్పటివరకూ నాలుగు అన్నాల గురించి వచ్చాయి. ఇంకా మూడు ఉన్నాయి. వాటిని సాధ్య అన్నాలని అంటారని చూశాము. అవి మనస్సు, వాక్కు, ప్రాణం. వాటి గురించి ఉపనిషత్తు వివరంగా తర్వాత వచ్చే

మంత్రంలో చెబుతుంది. ఈ మూడింటిని అధ్యాత్మ, అధిభూత, అధిదైవ అన్నత్రయంగా వర్ణించేముందు ఈ ఖండాన్ని భోగ్యప్రపంచంమీద ఒక చిన్న చర్చతో ముగిస్తున్నది.

ఈ అన్నాలను నిరంతరం తింటున్నా కూడా అవి ఎందుకు తరిగిపోవడం లేదు? ఈ ప్రశ్నను ఉపనిషత్తే వేసి, దానికి జవాబు ఇస్తున్నది. ఎందుకంటే ఈ భోగ్యప్రపంచం నిరంతం కొనసాగటానికి జీవుడే కారణం. అతను కర్మ నిరంతరం చేస్తూనే ఉండటంవల్ల ప్రపంచం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది.

ఈశ్వరుడు మనని కష్టపెడుతున్నాడని అపోహపడతాము. ఈశ్వరుని చేతిలో ఏమీ లేదు. జీవులైన మనం చేసే కర్మలే దీనికి కారణం అని ఇక్కడ తెలుస్తోంది మనకు. ఆత్మజ్ఞానం పొంది జీవుడు అకర్త అయితే, అతను భోక్త అవడు. భోక్త అవకపోతే, అతనికి ప్రపంచంతో పనిలేదు. భోక్త అయితే సంసారంలో పడాలి. అజ్ఞాని జీవుడు కర్తృత్వభావనతో భోక్తై, ప్రపంచాన్ని అనుభవిస్తున్నాడు. ఈ కారణం చెప్పటంవల్ల వేదాంతం గొప్పదనం తెలుస్తుంది. వేదాంతం నేర్చుకుంటేనే కర్తృత్వం పోయి, భోగ్యప్రపంచం పోయి, మోక్షం పొందుతాడు.

దీనివల్ల సంసారమనే వృత్తాన్ని జీవుడు కొనసాగిస్తున్నాడని తెలుస్తున్నది. ఈ వృత్తానికి ముగింపు ఈశ్వరుడు పలుకలేదు. జీవే ముగింపు పలకాలి. మనం సైకిలు తొక్కుతూనే ఉన్నాము. మనం సైకిలు తొక్కుతూ, సైకిలు ఆగటం లేదంటే అర్థముందా? మనం సైకిలు తొక్కటం ఆపాలి. మనం కర్మలు చేయటం ఆపాలి. అంటే సైకిలు తొక్కటం ఆపాలి. (కర్మలు చేయటం ఆపాలి అనేది ఒక పెద్ద అంశం. టూకీగా నిష్కామకర్మ చేయాలి). సైకిలు తొక్కటం ఆపాక కూడా కాసేపు చక్రం తిరుగుతుంది. అలా మనం కర్మలు చేయటం ఆపాక కూడా, ప్రారబ్ధకర్మ కొనసాగుతుంది. దీన్ని జీవన్ముక్తి అంటారు.

అందువల్ల మోక్షం పొందాలంటే, జీవుడే ప్రయత్నించాలి. ఈశ్వరుడు సాక్షీభూతంగా చూస్తాడు. ఆయన సంసారకారణము కాదు. సంసార అనువృత్తి కారణం జీవుడే కాని, ఈశ్వరుడు కాదు. ఈ మంత్రంవల్ల మనం గ్రహించవలసిన సూక్ష్మం ఇది. అందువల్ల జీవుడికి అక్షితః అనే బిరుదు ఇచ్చింది. అక్షితః అంటే సంసారాన్ని అక్షయంగా కొనసాగించే వ్యక్తి.

## మంత్రం 1.5.3

**త్రీణ్యాత్మనేఽకురుతేతి మనో వాచం ప్రాణం తాన్యాత్మనేఽకురుతాన్యత్రమనా అభూవం నాదర్శ మన్యత్రమనా అభూవం నాశ్రౌషమితి మనసా హ్యేవ పశ్యతి మనసా శృణోతి ॥**
**కామస్సఙ్కల్పో విచికిత్సా శ్రద్ధాఽశ్రద్ధా ధృతిరధృతిర్హ్రీర్ధీర్భీరిత్యేతత్సర్వం మన ఏవ తస్మాదపి పృష్ఠత ఉపస్పృష్టో మనసా విజానాతి యః కశ్చ శబ్దో వాగేవ సా। ఏషా హ్యన్తమాయత్తైషా హి న ప్రాణోఽపానో వ్యాన ఉదానస్సమానోఽన ఇత్యేతత్సర్వం ప్రాణ ఏవైతన్మయో వా అయమాత్మా వాఙ్మయో మనోమయః ప్రాణమయః ॥**

**త్రీణ్యాత్మనే ఽకురుత** – ఈ పాదం మొదటి మంత్రంలోనిది.

దాన్ని మళ్ళీ చెబుతూ, దాని వివరణ ఇక్కడ ఇస్తున్నది. దీని అర్థం చివరి మూడింటిని అంటే మనస్సు, వాక్కు, ప్రాణం సాధ్య అన్నాలు లేదా ఆత్మ అన్నం అంటారు. ఇది తన స్వంతానికే కాని, తక్కినవారితో పంచుకునేది కాదు.

ఈ మంత్రంలో ఉపనిషత్తు మనస్సుయొక్క నిర్వచనంతో పాటు, దానికి ప్రమాణం కూడా ఇస్తున్నది. ఈ నిర్వచనం చాలా ముఖ్యమైనది.

**కామస్సఙ్కల్పో విచికిత్సా శ్రద్ధాఽశ్రద్ధా ధృతిరధృతిర్హ్రీర్ధీర్భీరిత్యేతత్సర్వం మన ఏవ** – మనస్సు అంటే అనేక వృత్తుల (ఆలోచనల) సముదాయం. అలాంటి వృత్తులను కొన్ని ఉదాహరణగా ఇచ్చింది ఉపనిషత్తు. అవి – కామం, సంకల్పం, విచికిత్స(సందేహం), శ్రద్ధ, అశ్రద్ధ, ధృతి, అధృతి, హ్రీ (వినయం), భయం.

**కామః సఙ్కల్పసన్దేహౌ శ్రద్ధాఽశ్రద్ధే ధృతీతరే**
**హ్రీర్ధీర్భీరిత్యేవమాదీన్ భాసయత్యేకధా చితిః** – దృక్ దృశ్య వివేకం 4
దృక్‌దృశ్య వివేకంలో ఈ పాదాలకు ఇదే మూలం. కాకపోతే అది పద్యరూపంలో ఉంది కాబట్టి, ఛందస్సుకు తగ్గట్టుగా మార్చటం జరిగింది.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి వృత్తులన్నీ కలిపితే మనస్సు అవుతుంది. న్యాయ వైశేషిక సిద్ధాంతాన్ని ఖండించేటప్పుడు శంకరాచార్యులు ఈ మంత్రాన్ని ఉటంకిస్తారు. న్యాయవైశేషికుల వాదన ప్రకారం, రాగద్వేషాలు, కామక్రోధాలు ఆత్మకు చెందినవంటారు. ఈ మంత్రంద్వారా ఉపనిషత్తు స్పష్టంగా చెబుతున్నది. ఈ రాగద్వేషాలు, కామక్రోధాలు అనాత్మకు, అంటే క్షేత్రానికి చెందుతాయి కాని, ఆత్మకు అంటే క్షేత్రజ్ఞునకు చెందవని – ఇదే మూలం గీతలో ఈ క్రింది శ్లోకాలకు –

**ఇచ్ఛా ద్వేషః సుఖంః దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః।**
**ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్ ॥** – గీత 13.6

ఇచ్ఛ, ద్వేషం, సుఖం, దుఃఖం, స్థూలశరీరం, చైతన్యం, ధృతి అనే వికారాలతో కూడింది 'క్షేత్రస్వరూపం'.

**అమానిత్వమదంభిత్వమ్ అహింసా క్షాంతిరార్జవమ్**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః** – గీత 13.7

అమానిత్వం, అదంభిత్వం,అహింస, క్షమాగుణం, సరళత్వం, ఆచార్యులను సేవించటం, శౌచం, అంతఃకరణ స్థిరత్వం, మనశ్శరీరేంద్రియాల నిగ్రహం.

**మనస్సు –** ఈ ఉపనిషత్తులో ఈ మంత్రం మనోలక్షణాన్ని తెలిపే మంత్రం. అందువల్ల చాలా ముఖ్యమైన మంత్రం. అంతేకాదు, మనస్సు ఉందని నిరూపించటానికి నిదర్శనం కూడా చూపిస్తున్నది ఉపనిషత్తు. మనస్సు కంటికి కనబడే ప్రత్యక్షవస్తువు కాదు కాబట్టి, అది ఉందని నిరూపించే నిదర్శనం కావాలి మనకు. ఏమిటది?

మన కళ్ళు, చెవులూ బాగా పనిచేస్తున్నా కూడా, వాటిని వినియోగిస్తున్నా కూడా మనకు జ్ఞానం రావటం లేదు. తార్కికంగా చూస్తే కంటితో చూడాలి; చెవితో వినాలి. వాటిద్వారా జ్ఞానం పొందాలి. కాని జ్ఞానం కలగటం లేదంటే, ఈ రెండింటి వెనుక ఏదో పని చేస్తున్నదని అర్థం.

ఏది ఉంటే కళ్ళు, చెవులు పనిచేస్తున్నాయో, ఏది లేకపోతే కళ్ళు, చెవులు పనిచేయటం లేదో, ఆ 'ఎక్స్' అంశం మనస్సు. కళ్ళప్పగించి ఒక వస్తువును చూస్తున్నట్టు కనబడుతున్నా, మనస్సు కళ్ళ వెనుక లేకపోతే, ఆ వస్తువు మన గ్రహణంలోకి రాదు. ఈ ప్రమాణాన్ని అర్థాపత్తి ప్రమాణం అంటారు.

శ్రుతి ఇంకో నిదర్శనం కూడా ఇస్తున్నది. ఎవరైనా మనకు వెనుకనుంచి ముట్టుకున్నారనుకోండి. చేయి వేసిన వ్యక్తి ఎవరో తెలియదు. ఇంద్రియం కేవలం స్పర్శను తెలియజేస్తుంది. అంతే. కాని మనం ఆ వ్యక్తి ఎక్కడ చేయి వేశాడో చెప్పగలం. అంటే వీపుమీదా, వెనుకనా, కాలిమీదా అనేది చెప్పగలగటం. అంటే ఇది మనస్సువల్లనే తెలుస్తున్నది. ఇది మనస్సుయొక్క లక్షణం. ఇటువంటి మనస్సు ఐదవ అన్నం.

వాక్కు – వాక్కు ఆరవ అన్నం. వాక్కు అన్నాన్ని నిర్వచించటం చాలా తేలిక. నోటినుంచే వెలువడే శబ్దాన్ని వాక్కు అంటారు. ఉపనిషత్తు వాక్కును స్తుతిస్తున్నది. వాక్కు అర్థాన్ని ప్రకాశింపజేస్తుంది కాని వాక్కు ఇతర వస్తువులచేత ప్రకాశింపబడదు.

ప్రాణం – ప్రాణం ఏడవ అన్నం. ప్రాణం అంటే పంచప్రాణాలు. ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదాన వాయువులతో కూడినది ప్రాణం. బయటకు వదిలే వాయువు ప్రాణవాయువు; లోపలకు పీల్చే వాయువు అపానవాయువు. ప్రాణ, అపానలను నియంత్రించేది వ్యానవాయువు; తిన్న అన్నాన్ని సమానంగా శరీరానికి పంచేది సమానవాయువు. మనిషి మరణించినప్పుడు సూక్ష్మశరీరాన్ని, కారణశరీరాన్ని ఊర్ధ్వలోకాలకు తీసుకువెళ్ళేది ఉదానవాయువు.

నిజానికి కార్యకరణసంఘాతమని పిలువబడే ఈ శరీరం వాక్కు, మనస్సు, ప్రాణాల సమ్మేళనమే. దీనితో సప్తాన్నాల నిర్వచనం ముగిసింది.

### మంత్రం 1.5.4

**త్రయో లోకా ఏత ఏవ వాగేవాయం లోకో మనోఽన్తరిక్షలోకః ప్రాణోఽసౌ లోకః ॥**

### మంత్రం 1.5.5

**త్రయో వేదా ఏత ఏవ వాగేవర్గ్వేదో మనో యజుర్వేదః ప్రాణస్సామవేదః ॥**

### మంత్రం 1.5.6

**దేవాః పితరో మనుష్యా ఏత ఏవ వాగేవ దేవా మనః పితరః ప్రాణో మనుష్యాః ॥**

### మంత్రం 1.5.7

**పితా మాతా ప్రజైత ఏవ మన ఏవ పితా వాఙ్మాతా ప్రాణః ప్రజా ॥**

మంత్రం 1.5.8

**విజ్ఞాతం విజిజ్ఞాస్యమవిజ్ఞాతమేత ఏవ యత్కిఇ్చ విజ్ఞాతం వాచస్తద్రూపం వాగ్ఘి విజ్ఞాతా వాగేనం తద్భూత్వాऽ వతి ॥**

మంత్రం 1.5.9

**యత్కిఇ్చ విజిజ్ఞాస్యం మనసస్తద్రూపం మనో హి విజిజ్ఞాస్యం మన ఏనం తద్భూత్వాऽ వతి॥**

మంత్రం 1.5.10

**యత్కిఇ్చావిజ్ఞాతం ప్రాణస్య తద్రూపం ప్రాణో హ్యవిజ్ఞాతః ప్రాణ ఏనం తద్భూత్వాऽ వతి॥**

ఇంతకు ముందు మంత్రంలో జీవిలోని మనస్సు, వాక్కు, ప్రాణాల గురించి చూశాము. ఈ మూడు అన్నాలు మూడు రకాలుగా విభజించబడ్డాయి. ఆధ్యాత్మిక అన్నత్రయం, అధిభూత అన్నత్రయం, అధిదైవ అన్నత్రయం. వ్యష్టిపరంగా, బాహ్యపరంగా, దైవపరంగా విభజించబడ్డాయి.

ఈ అన్నత్రయాన్ని ఉపనిషత్తు మూడుగా ఎందుకు విభజించిందంటే, జీవుడు ప్రపంచాన్ని మూడు స్థాయిలలో అనుభవిస్తాడు. భోక్తజీవి భోగ్య అన్నాన్ని వ్యష్టిపరంగా, ప్రపంచపరంగా, దేవతాపరంగా అనుభవిస్తాడు. దేవతలు కూడా అతనికి అన్నమే. ఎందుకంటే, వారు అతన్ని దీవిస్తారు.

ఇంతకుముందు బ్రాహ్మణములో ప్రపంచం భోక్త. జీవుడు భోగ్యప్రపంచం అని చూశాము. ఇక్కడ జీవుడు భోక్త, ప్రపంచం భోగ్య అన్నం అని చూస్తున్నాము. ఇక్కడ పరిస్థితి తారుమారయింది. ఇలా చెప్పటంలోని అంతరార్థం రెండు స్థాయిల్లో చూస్తాము. వ్యావహారిక దృష్ట్యా, పారమార్థిక దృష్ట్యా.

వ్యావహారిక దృష్టి – వ్యావహారిక దృష్ట్యా ప్రతిదీ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉంది. జీవ, జగత్తు, ఈశ్వరుడు అని ఈ త్రికోణంలో ప్రతిదీ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉంది. నేను ఎంత తీసుకుంటే, అంత ఇవ్వాలి. ఎంత ఉత్పత్తి చేస్తే అంత వాడాలి. ఎంత తింటే అంత పని చేయాలి. ఈ పరస్పర ఆధారపడటం అనేది– ధర్మశాస్త్రసూత్రం. కాని ఉపనిషత్తు ప్రాథమిక బోధ అది కాదు. ఎందుకంటే ఉపనిషత్తు ధర్మశాస్త్రం కాదు.

పారమార్థిక దృష్టి – ఉపనిషత్తు తత్త్వశాస్త్రం. అందువల్ల ఈ మంత్రంనుంచి చాలా ముఖ్యమైన సత్యం ఒకటి గ్రహించాలి. ఏమిటది? రెండు వస్తువులు పరస్పరం ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయంటే, దేనికీ విడిగా ఉనికి లేదన్నమాట. విడిగా ఉనికి లేనిదాన్ని మిథ్య అంటారు. ఎందుకు? ఒకదానితో ఒకదానికి అవినాభావ సంబంధం ఉందంటే, ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయన్నమాట. నేను నీమీద ఆధారపడ్డాను. నువ్వు నామీద ఆధారపడ్డావు. దేవతలు జీవులమీద ఆధారపడ్డారు. జీవులు దేవతలమీద ఆధారపడ్డారు. ఒకదానిమీద ఇంకోటి ఆధారపడ్డాయంటే అవి మిథ్య.

సత్యం నిర్వచనం – అది స్వతంత్రం. అందువల్ల పైన చెప్పినవన్నీ మిథ్య. దేవతలు, జీవులమీద ఆధారపడ్డారు, కాబట్టి వారు మిథ్య; జగత్తు జీవులమీద ఆధారపడింది కాబట్టి జగత్తు మిథ్య; జీవి–జగత్తు–ఈశ్వరుడు ఇవన్నీ

ఒకదానిమీద ఒకటి ఆధారపడ్డాయి కాబట్టి అన్నీ మిథ్య. దీన్ని అధ్యారోప ప్రకరణం అంటారు. ఇది ఉపనిషత్తు దర్శనం.

మరి అయితే సత్యం ఏమిటి? జీవ-జగత్తు-ఈశ్వరుడు ఏదీ సత్యం కాదు. ఈశ్వరుడు అంటే పాలించేవాడు. పాలించబడే వారు ఉన్నన్నాళ్ళే పాలకులు ఉంటారు. ప్రజలు లేకపోతే పాలకులు లేరు.

ఈశ్వర జీవ జగత్ అధిష్ఠాన భూత సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ ఏవ సత్యమ్

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

అధిభూతస్థాయి

| **మంత్రం** | **అంశం** | **వాక్కు** | **మనస్సు** | **ప్రాణం** |
|---|---|---|---|---|
| 4 | మూడులోకాలు | భూలోకం | భువర్లోకం | సువర్లోకం |
| 5 | మూడు వేదాలు | ఋగ్వేదం | యజుర్వేదం | సామవేదం |
| 6 | మూడు దేవతలు | దేవతలు | పితృదేవతలు | మనుష్యులు |
| 7 | --- | మాతా | పిత | ప్రజా |
| 8-10 | --- | విజ్ఞాతం<br>(తెలిసింది) | విజిజ్ఞాస్యం<br>(తెలియాలనుకునేది) | అవిజ్ఞాతం<br>(తెలియనది) |

నిజానికి మనం అనుభవించేవన్నీ వాక్కు, ప్రాణం, మనస్సు రూపంలో ఉన్నాయి. ఇవి భోగ్యప్రపంచానికి ప్రతీకలు. ఇది వేదం చేసిన ఊహాచిత్రం. దీని భావాన్ని అర్థం చేసుకోవాలి కాని అనవసరమైన వివరాలలోకి వెళ్ళకూడదు. దీని భావం ఒక్కటే. సృష్టి మొత్తం వాక్కు, మనస్సు, ప్రాణ రూపాలతో ఉంది; సృష్టి మొత్తం అన్నత్రయరూపంలో ఉంది. జగత్తు మొత్తం భోగ్యప్రపంచం.

ఇంకో నిజాన్ని గ్రహించాలి. నేను అంతకుముందు చెప్పిన నాలుగు అన్నాలను పంచిన తీరువల్ల ఈ మూడు అన్నాలను సృష్టించాను. అంటే ఈ అన్నాల సృష్టికి నేనే కారణం. పూర్వజన్మలో నేను అన్నాలు ఎలా పంచితే, ఇప్పుడు అలా ఫలితం పొందుతాను.

ఉపనిషత్తు ఇంకొక విషయం చెబుతున్నది. సప్తాన్నాలమీద ఎవరైతే ఉపాసన చేస్తారో వారిని ప్రపంచం రక్షిస్తుంది. దీవిస్తుంది. సహాయం చేస్తుంది. మాతాపితలు దీవిస్తే, పిల్లలు సహాయం చేస్తారు.

వాక్కు, మనస్సు, ప్రాణాలు- కరణాలు. కరణాలకు పనిచేసే శక్తి ఉంటుంది . ఈ కరణాలు వాటి శక్తి చూపాలంటే వాటికి ఒక స్థానం కావాలి. కరణాలు సూక్ష్మశరీరానికి చెందినవి. తత్త్వబోధలో ఈ విషయం వివరంగా వస్తుంది. సూక్ష్మశరీరం భోగసాధనాలను, భోగకరణాలను కలిగి ఉంటుంది. ఈ సూక్ష్మశరీరానికి స్థానం స్థూలశరీరం. అది కార్యం-కరణాలను ఒక పెట్టెలో పెట్టబడిన పరికరాలలాంటివి.

ఆ విధంగా సూక్ష్మశరీరం కారణం. స్థూలశరీరం కార్యం అయింది. సూక్ష్మశరీరం పరికరం, స్థూలశరీరం పెట్టె. ఈ పరిస్థితి ఆధ్యాత్మస్థాయిలో ఉంటుంది.

ఇప్పుడు సమష్టిస్థాయిలో వాక్కు, మనస్సు, ప్రాణాల గురించి ఉపనిషత్తు మాట్లాడేటప్పుడు వాటికి అక్కడ కూడా రెండు భాగాలు ఉండాలి. అంటే కారణం భాగం లేదా పరికరాల భాగం. కార్యం భాగం లేదా పెట్టె భాగం. ప్రజాపతికి కూడా కారణం, కార్యం ఉండాలి. పరికరాలు, పరికరాల పెట్టె. అది కూడా ఒక్కొక్క కరణానికీ– అంటే వాక్కుకి కారణం, కార్యం; మనస్సుకు కారణం, కార్యం; ప్రాణానికి కారణం, కార్యం. అదే ఇప్పుడు రాబోయే మూడు మంత్రాల్లో వస్తుంది.

మంత్రం 1.5.11

**తస్యై వాచః పృథివీ శరీరం జ్యోతీరూపమయమగ్నిస్తద్యావత్యేవ వాక్తావతీ పృథివీ తావానయమగ్నిః॥**

మంత్రం 1.5.12

**అథైతస్య మనసో ద్యౌశ్శరీరం జ్యోతీరూపమసావాదిత్యస్తద్యావదేవ మనస్తావతీ ద్యౌస్తావానసావాదిత్యస్తౌ మిథునగ్ం సమైతాం తతః ప్రాణో౾జాయత స ఇంద్రస్స ఏషో౾సపత్నో ద్వితీయో వై సపత్నో నాస్య సపత్నో భవతి య ఏవం వేద ॥**

మంత్రం 1.5.13

**అథైతస్య ప్రాణస్యా౾౾పశ్శరీరం జ్యోతీరూపమసౌ చన్ద్రస్తద్యావానేవ ప్రాణస్తావత్య ఆపస్తావానసౌ చన్ద్రస్త ఏతే సర్వ ఏవ సమాస్సర్వే౾నన్తాస్స యో హైతానన్తవత ఉపాస్తే౾న్తవన్తగ్ం స లోకం జయత్యథ యో హైతాననన్తానుపాస్తే౾నన్తగ్ం స లోకం జయతి ॥**

| **కారణం (పరికరం)** | **కార్యం (పెట్టె)** |
|---|---|
| వాక్కు | అగ్నిదేవత, పృథివీ |
| మనస్సు | ఆదిత్య దేవత, సువర్లోకం |
| ప్రాణం | చంద్ర దేవత, నీరు |

భూలోకం వాక్కు గోళకం; స్వర్గలోకం మనోగోళకం; జలం ప్రాణగోళకం. అలాగే వాక్కుకు అగ్నిదేవత ఇంద్రియం; మనస్సుకు ఆదిత్యదేవత ఇంద్రియం; ప్రాణానికి చంద్రదేవత ఇంద్రియం. ఈ గోళకాలూ, దేవతలూ కలిపి ప్రజాపతి, సమష్టిప్రపంచం అవుతారు. వీటన్నింటినీ జీవుడు సృష్టించాడు. ఇవన్నీ కలిపి ఒక భోగ్యప్రపంచం అవుతుంది. ఇది మన ముఖ్య అంశం – అధిదైవ అన్నత్రయం.

కాని కొన్ని తక్కిన అంశాలు కూడా చర్చించబడ్డాయి. వాటిని సూక్ష్మంగా చూద్దాము.

1. అధ్యాత్మం ఎక్కడ ఉంటే అక్కడ అధిదైవం వ్యాపించి ఉంటుందని ఉపనిషత్తు చెబుతున్నది అంటే వ్యష్టి వాగింద్రియానికి అధిష్ఠానదేవత అగ్నిదేవత. వ్యష్టి మనస్సు అనే ఇంద్రియానికి అధిష్ఠానదేవత సూర్యదేవత. వ్యష్టి ప్రాణ ఇంద్రియానికి అధిష్ఠానదేవత చంద్రదేవత. అలా అధిదైవం ఆధ్యాత్మికానికి, అధిభూతానికి కూడా అధిష్ఠానదేవత.

2. ఇంకో విషయం ఏమిటంటే వాగ్దేవత అగ్ని అనీ మనోదేవత సూర్యుడనీ చూశాము. అంతకు ముందు వాక్కు, మనస్సులను మాతాపితలుగా వర్ణించటం జరిగింది. మాతాపితలైన వాక్కుదేవత, మనోదేవతల కలయిక వర్ణించటం జరిగింది. మాతాపితలైన వాక్కుదేవత, మనోదేవతల కలయికతో ఇంద్రదేవత పుట్టాడు. అందువల్ల ఇంద్రదేవతను వాక్కు, మనస్సుల పుత్రుడుగా అంటే అగ్ని, సూర్యదేవతల పుత్రుడుగా అభివర్ణించటం జరిగింది. ఇంద్రుడు ఈ రెండు శక్తులకు పుట్టటంవల్ల, ఇంద్రశక్తికి తిరుగులేదు. అందువల్ల, అగ్ని సూర్యదేవతలకు పుట్టిన ఇంద్రుడికెలా ఎవరూ ఎదురు నిలవలేరో, అలాంటి ఇంద్రుణ్ణి ఎవరైతే ఉపాసన చేస్తారో, అతనికి కూడా ఎవరూ ఎదురు నిలవలేరు. అంటే అంత పరాక్రమవంతుడవుతాడు అంటున్నది ఉపనిషత్తు.
3. ఇంకో ముఖ్యమైన విషయం – వాక్కు, మనస్సు, ప్రాణాలు అంతటా ఉన్నాయి కాబట్టి అవి అనంతం. ఈ మూడూ అధ్యాత్మికంలో, అధిభౌతికంలో, అధిదైవంలో కూడా ఉన్నాయి కాబట్టి అపరిమితం, అనంతం. ఒకవేళ ఏదైనా విభజన అంటూ ఉంటే, అది ఔపాధిక విభజన మాత్రమే. విభజన లేని ఆకాశం ఎలా కుండలో ఉంటే ఘటాకాశంగా విభజింపబడినట్టు కనిపిస్తుందో, అలాగే ఈ మూడూ శరీరాల్లో విడిగా ఉన్నట్లు అనిపిస్తాయి. నిజానికి ఉన్నదొకటే సమష్టివాక్కు, సమష్టిబుద్ధి, సమష్టిప్రాణం.వ్యష్టిపరంగా చూస్తే ఆధ్యాత్మికంగా అనిపిస్తుంది; సమష్టిపరంగా చూస్తే అధిదైవంగా కనిపిస్తుంది.

ఎవరైతే వీటికి పరిమితులున్నాయనుకుంటారో, వారి శక్తి కూడా పరిమితంగానే ఉంటుంది. ఎవరైతే వీటిని అనంతంగా భావించి ఉపాసన చేస్తారో, వారి శక్తి కూడా అనంతంగానే ఉంటుంది. అనంత ఫలం దక్కుతుంది వారికి. ఋషులు త్రికాలజ్ఞులు, ఎదుటివారి మనస్సులను చదవగలరు అని వింటుంటాము. ఇప్పుడు విన్నదాన్నిబట్టి ఋషులు ఇటువంటి ఉపాసనలను చేసి ఉంటారని, అధ్యాత్మ అధిదైవభేదాలను ఛేదించి ఉంటారని మనం తార్కికంగా అర్థం చేసుకోవచ్చు. వారి తపస్సు, ఉపాసనలద్వారా ఆ భేదాన్ని ఛేదించగలిగినట్లు మనం కూడా అధ్యాత్మ అధిదైవభేదాన్ని ఛేదించగలిగితే, మనం కూడా ఎదుటివారి మనస్సులను చదవగలము.

అందువల్లనేనేమో, కొందరు చిరంజీవులుగా ఉంటారు. వారు చెప్పే కారణం ఏదైనా, ప్రాణం అనంతం అనీ, అధ్యాత్మ అధిదైవభేదాలను ఛేదించగలిగితే ప్రాణశక్తిని బాగా పెంపొందించుకోగలమనీ గ్రహించాము. అందువల్ల వారి జీవితకాలాన్ని ఎంతో పెంచుకోగలరు. వారిలాగా మీరూ చేస్తే, మీరు చిరంజీవులు కాగలరు. కాని గుర్తుంచుకోండి, ఇది సాపేక్షికం మాత్రమే. ఎప్పటికీ చిరంజీవులుగా ఉండలేరు.

ఆ విధంగా ఈ మూడు మంత్రాలు అధిదైవ అన్నత్రయం లేదా ప్రజాపతి గురించి వర్ణించాయి. తమాషా ఏమిటంటే ఇంతవరకూ వ్యష్టిశరీరం, సమష్టిప్రపంచంనుండి వచ్చిందని చెప్పాము. ఇప్పుడు వ్యష్టిశరీరం సమష్టిప్రపంచం ఏర్పడటానికి కారణం అంటున్నాము. ఏది నిజం? రెండూ నిజమే.

### మంత్రం 1.5.14

**స ఏష సంవత్సరః ప్రజాపతిషోడశకలస్తస్య రాత్రయ ఏవ పఞ్చదశ కలా ధ్రువైవాస్య షోడశీ కలా స రాత్రిభిరేవాऽऽ చ పూర్యతేऽప చ క్షీయతే సోऽమావాస్యాగ్ం రాత్రిమేతయా షోడశ్యా కలయా సర్వమిదం ప్రాణభృదనుప్రవిశ్య తతః ప్రాతర్జాయతే తస్మాదేతాగ్ం రాత్రిం ప్రాణభృతః ప్రాణం న విచ్ఛిన్ద్యాదపి కృకలాసస్యైతస్యా ఏవ దేవతాయా అపచిత్యై ॥**

ఈ మంత్రంలో ప్రసంగవశాత్తూ ప్రజాపతిదేవత గురించిన చర్చ వస్తుంది. అధిదైవ అన్నత్రయం గురించి చెప్పినప్పుడు, అందరు అధిష్ఠానదేవతలను కలిపి ప్రజాపతి అంటారని చూశాము. అధిదైవ అన్నత్రయం ప్రజాపతికి చెందుతుంది. అందువల్ల ప్రజాపతి మన కర్మఫలం అవుతాడు. ఆ ప్రజాపతిని ఈ మంత్రం సంవత్సర ద్వైతప్రజాపతిగా వర్ణిస్తుంది. ఎందుకు?

అంతకుముందు బ్రాహ్మణములో అజ్ఞానిజీవి గురించి వివరణ వచ్చింది కదా! అతనికి ఒంటరిగా అనిపించి, తనకు భార్య, పిల్లలు, ఐశ్వర్యం ఉంటే కర్మ చేసేవాణ్ణి కదా అని అనుకున్నాడు. భార్య దొరకకపోయేసరికి తన శరీరంలోని అంగాలనే వాటికి ఆపాదించుకున్నాడు. వాగింద్రియాన్ని భార్యగా, మనో ఇంద్రియాన్ని యజమానిగా; ప్రాణాన్ని ప్రజా లేదా పుత్రునిగా; చక్షురింద్రియాన్ని మనుష్యవిత్తంగా, శ్రోత్రేంద్రియాన్ని దైవవిత్తంగా భావించుకుని ఉపాసన చేశాడు. తరువాత శరీరాన్ని ఈ అంగాలనుంచి పుట్టిన కర్మగా భావించాడు. ఈ కర్మ, ఉపాసనల్లో ఐదు అంశాలు ఉన్నాయి కాబట్టి దాన్ని పాంక్త ఉపాసన అంటారు.

యజమాని, యజమాని పత్ని, పుత్రుడు, మనుష్యవిత్తం, దైవవిత్తం అనే ఐదు అంశాలు ఉండటంవల్ల కర్మపాంక్తం అయింది. ప్రజాపతి కర్మఫలం ఇస్తాడు. ఎందుకంటే జీవుడు తన కర్మలవల్ల ఈ కర్మఫలాన్ని ఉత్పత్తి చేస్తున్నాడు. అన్నత్రయం జీవుడు, అన్నత్రయం ప్రజాపతిని ఉత్పత్తి చేస్తున్నాడు. కర్మపాంక్తం అయినప్పుడు, కర్మఫలం కూడా పాంక్తం అవ్వాలి. ఎందుకంటే కారణం ఎలా ఉంటే కార్యం అలా ఉండాలి.

బంగారంనుంచి బంగారు ఆభరణాలు వస్తాయి. మట్టినుంచి కుండ వస్తుంది. మనిషికి మనుష్యులు పుడతారు.

**కారణగుణాః కార్యే అనువర్తన్తే**

పాంక్తం అయిన కారణంనుంచి వచ్చిన కర్మఫలం ఎవరు? ప్రజాపతి! ఆయనకు ఎన్ని అంశాలు ఉండాలి? ఈ సూత్రం ప్రకారం ఐదు అంశాలు ఉండాలి. కాని ఇప్పటిదాకా మూడే చూశాము. ఏమిటవి? అధిదైవ వాక్కు, అధిదైవ మనస్సు, అధిదైవప్రాణం.

ఈ మంత్రం ప్రజాపతికి మరో రెండు అంశాలను ప్రవేశపెడుతున్నది. అప్పుడు ప్రజాపతి కూడా పాంక్తం అవుతాడు. ప్రజాపతిని షోడశకళాపురుషునిగా అభివర్ణిస్తున్నది. షోడశ కళా అంటే పదహారు కళలు. ప్రజాపతికి పదహారు భాగాలు ఉన్నాయి. ఆ పదహారు భాగాల్లో పదిహేనురోజులు ఒక పక్షం కిందకి వస్తాయి. వాటిని శుక్లపక్షం, కృష్ణపక్షం అంటారని మనకు తెలుసు. కళలు అంటే అమావాస్యరోజునుంచి పౌర్ణమిదాకా చంద్రుడు నెలవంకరూపునుంచి కొంచెం కొంచెంగా ప్రకాశిస్తూ, పౌర్ణమిరాత్రి నిండుచంద్రునిలా ప్రకాశించటం, పౌర్ణమాస్య రోజున, అంటే పదిహేనవ రోజున, పదిహేనుకళలూ ఉంటాయి.

పదహారవ కళ అమావాస్యరోజు ఉంటుంది. నిజానికి పదహారవ కళ ఒక్క అమావాస్యరోజే ఉండదు. తక్కిన పదిహేనురోజులు కూడా ఉంటుంది. ఇది నిత్యమైన పదహారవ కళ. కాని తక్కిన రోజులు, తక్కిన కళలతో కలిసి కనిపిస్తుంది. అంటే ఉదాహరణకు అమావాస్య తరువాత వచ్చే మొదటిరోజు ప్రథమకళతో, ద్వితీయకళతో రెండవ రోజు కూడా ఉంటుంది. అంటే పదహారవ కళ పదిహేనురోజులూ ఉంటుంది.

పౌర్ణమిరోజున పదహారుకళలూ చూస్తాము కాబట్టి అది పూర్ణం అయింది. అదే అమావాస్య రాత్రికి వచ్చేసరికి పదిహేనుకళలూ తాత్కాలికంగా లయమవుతాయి. పదిహేనుకళలూ లయమయితే మిగిలేది ఏమిటి? పదహారవ కళ మాత్రమే. కాని దాన్ని మనం అనుభవించలేము. ఎందుకంటే అమావాస్యరాత్రి ఉన్న పదహారవ కళ అన్ని జీవరాశుల్లోనూ వాటి అన్నపానాలుగానూ, వాటి ప్రాణశక్తిగానూ వ్యాపించి ఉంటుంది.

అన్ని జీవరాశుల్లోనూ అన్నాపానాలుగా, ప్రాణశక్తిగా ఉన్న పదహారవ కళ నిత్యం అది ధృవతారలాగా ఎప్పుడూ ఉంటుంది. తక్కిన పదిహేనుకళలూ పెరుగుతూ, తరుగుతూ వస్తాయి. ఇది సంవత్సరప్రజాపతి వర్ణన.

దీన్నుంచి శంకరులవారు తక్కిన రెండు అంశాలను గ్రహించారు. నాలుగవ అంశం విత్తం అంటే మనుష్యవిత్తం, దైవవిత్తం. పెరిగి, తరిగే పదిహేనుకళలు, ప్రజాపతివిత్తం అన్నారు. దీన్నిబట్టి డబ్బు వస్తుంది, పోతుంది. అమావాస్య అంటే డబ్బు లేనట్టు, పౌర్ణమి అంటే డబ్బు ఉన్నట్టు. ప్రజాపతికి కూడా మంచిరోజులు, చెడ్డ రోజులు ఉన్నాయన్నమాట.

ఐదవ అంశం కర్మ. ఇక్కడ ప్రజాపతి చేసేకర్మ. ప్రజాపతి చేసే కర్మ ఏమిటి? అన్నం, ప్రాణశక్తి రూపంలో, రాత్రి, పగలు రూపంలో పనిచేస్తున్నాడు. ఆ విధంగా ప్రజాపతి, జగత్తు అభివృద్ధికి కారకుడవుతున్నాడు. అన్నపానీయాల రూపంలో అమావాస్య రాత్రుల్లోనూ, తక్కినరోజుల్లో పదిహేను తిథులుగానూ ప్రజాపతే జగత్తును నడిపిస్తున్నాడు. రెండు పక్షాలు కలిస్తే మాసం; మాసాలు కలిస్తే సంవత్సరం అవుతాయని మనకు తెలుసు. ఇదే కాలతత్త్వం. అంటే కాలతత్త్వం రూపంలో ప్రజాపతి పనిచేస్తున్నాడు. ఈ కాలంవల్లే అందరూ పొద్దున్న లేచి, పనులకు వెళుతున్నారు. ఇదంతా కాలంవల్ల జరిగితే కాలచక్రం ప్రజాపతివల్ల తిరుగుతున్నది. కాలచక్రాన్ని తిప్పటం ప్రజాపతి చేసే కర్మ.

విలువ– అమావాస్య రోజున అహింస పాటించటం ఇంకా ముఖ్యం.

ఈ విధంగా ప్రజాపతికూడా పాంక్తం అయ్యాడు. అధిదైవవాక్కు, అధిదైవ మనస్సు, అధిదైవప్రాణం. పెరిగే తరిగే కళలు విత్తం, కాలతత్త్వరూపంలో చేసే కర్మ.

పదహారవ కళను షోడశికళ లేదా ధృవకళ లేదా, శాశ్వతకళ అంటారు. ఇది అన్ని జీవరాశుల్లోనూ అమావాస్యరోజు ప్రాణశక్తి రూపంలో ఉంటుందని చూశాము కదా! అందుకని ఉపనిషత్తు ఒక విలువను బోధిస్తున్నది. అసలు మామూలుగానే మనం పాటించాల్సిన విలువల్లో అహింస ఒకటి. ఇప్పుడు అమావాస్య రోజు అహింస పాటించటం ఇంకా ముఖ్యం. ఎందుకు? షోడశికళగా ప్రజాపతే ఆరోజు అన్ని జీవరాశుల్లో ఉంటాడు. అందువల్ల ఆ రోజు ఏ ప్రాణినైనా చంపితే సాక్షాత్తూ ప్రజాపతికే హాని తలపెట్టినట్టు అవుతుంది. అందుకని ఎవరికీ, ఆఖరికి తొండకు కూడా, హాని కలిగించరాదు.

## మంత్రం 1.5.15

**యో వై స సంవత్సరః ప్రజాపతిష్షోడశకలోఽయమేవ స యోఽయమేవంవిత్పురుషస్తస్య విత్తమేవ పఞ్చదశ కలా ఆత్మైవాస్య షోడశీ కలా స విత్తేనైవా చ పూర్యతేఽప చ క్షీయతే తదేతన్నభ్యం**

**యదయమాత్మా ప్రధిర్విత్తం తస్మాద్యద్యపి సర్వజ్యానిం జీయత ఆత్మనా చేజ్జీవతి ప్రధినాఽగాదిత్యే వమాహుః ॥**

ముందు మంత్రంలో షోడశకళా ప్రజాపతి గురించిన వర్ణన వచ్చింది. కాని షోడశకళా ప్రజాపతి లేదా సమష్టి హిరణ్యగర్భ గురించి చెప్తే అది పరోక్ష జ్ఞానం అవుతుందనీ, అందువల్ల మందబుద్ధికి అది అర్థం కాదనీ ఉపనిషత్తు భావించింది.అందువల్ల, ప్రజాపతిని ప్రత్యక్షరూపంలో చూపించదలచుకుంది. అంటే తననే ప్రజాపతిగా ఊహించుకుని ఎవరైతే ధ్యానం చేస్తారో, వారు ప్రత్యక్ష ప్రజాపతి. అటువంటి ధ్యానాన్ని అహంగ్రహ ఉపాసన అంటారు.

శివలింగంమీద లేదా సాలిగ్రామంమీద భగవానుని ఆవాహన చేస్తే, భగవానుని బాహ్యంగా ఆవాహన చేస్తున్నాము. కాబట్టి దాన్ని ఇదంగ్రహ ఉపాసన అంటారు. అదే మనమీదే ఆవాహన చేస్తే అహంగ్రహ ఉపాసన అంటారు. 'అహం ప్రజాపతి అస్మి' అనుకుని చేస్తే, ఉపాసకుడే ప్రజాపతి అవుతాడు.

**యథా యథోపాసతే తదేవ భవతి**

దీన్ని **తత్క్రతు న్యాయం** అంటారు.

ఆ విధంగా అహంగ్రహ ఉపాసన ఫలం ఏమిటంటే, ఏ దేవునిమీద ఉపాసన చేస్తే, అతను ఆ దేవుడు అవుతాడు. ప్రజాపతిమీద చేస్తే ప్రజాపతి అవుతాడు. ఈ ఉపాసనద్వారా అధ్యాత్మ పరిచ్ఛేదం పోయి, అధిదైవవాక్కు, అధిదైవ మనస్సు, అధిదైవప్రాణం పొందుతాడు. అలా అహంగ్రహ ప్రజాపతి ఉపాసకుడు షోడశకళా ప్రజాపతి అవుతాడు. ఉపాసకునికి పదహారుకళలు ఏమిటి? పదిహేనుతిథులను పదిహేనుకళలు అని అంటారని చూశాము కదా. ఉపాసకుని విషయంలో అతని ఐశ్వర్యమే అతని పదిహేనుకళలు. చంద్రుడు పెరిగీ తరిగినట్టుగా, ఇతని ఐశ్వర్యం పెరిగి తరుగుతుంది. ప్రజాపతి విషయంలో అమావాస్యరోజు కనబడే ధృవుడు పదహారవ కళ. అహంగ్రహ ఉపాసకుని విషయంలో అతని శరీరమే అతని పదహారవ కళ.

డబ్బు సంపాదనలో పడి ఆరోగ్యం కోల్పోయాడు. ఆరోగ్యం తిరిగి తెచ్చుకోవటానికి మొత్తం ధనాన్ని వెచ్చించాడు.

ఇది ఒక సత్యం. అందువల్ల ఉపనిషత్తు ఏం చెబుతున్నదంటే, పదహారవ కళ అయిన శరీరం ఆరోగ్యంగా ఉంటే, తక్కిన పదిహేనుకళలైన విత్తం వచ్చి, పోయినా బాధ లేదు. మొత్తం ఆస్తి పోయినా కూడా శరీరదారుఢ్యం ఉంటే మళ్ళీ మొత్తం సంపాదించుకోవచ్చు.

ఈ విషయాన్ని వివరించటానికి చక్రం ఉదాహరణ తీసుకుంది ఉపనిషత్తు. చక్రం ఇరుసువల్ల చక్రంలోని ఆకులు తిరుగుతాయి. ఇరుసు బాగుండకపోతే ఆకులు తిరగలేవు. అదే విధంగా జీవిశరీరం బాగుంటేనే ఏదైనా అనుభవించగలడు. ఆరోగ్యం బాగుండకపోతే ఆఖరికి వేదాంతాన్ని కూడా జీర్ణించుకోలేడు.

### మంత్రం 1.5.16

**అథ త్రయో వావ లోకా మనుష్యలోకః పితృలోకో దేవలోక ఇతి సోఽయం మనుష్యలోకః పుత్రేణైవ జయ్యో నాన్యేన కర్మణా కర్మణా పితృలోకో విద్యయా దేవలోకో దేవలోకో వై లోకానాగ్ం శ్రేష్ఠస్తస్మాద్విద్యాం ప్రశగ్ంసన్తి ॥**

ముందు రెండు మంత్రాల్లో షోడశకళ, ప్రజాపతి గురించి చూశాము. పాంక్తకర్మ, పాంక్త ఉపాసనల ఫలం చూశాము. ఈ సందర్భంలో ఉపనిషత్తు కర్మఫలం గురించి చెబుతున్నది. ఏ కర్మచేస్తే ఏ ఫలం వస్తుందో వివరిస్తున్నది. ఇది చాలా ముఖ్యమైన మంత్రం, శంకరులవారు తరచు దీన్ని ఉటంకిస్తుంటారు.

ముందు ఈ మంత్రం అర్థం చూశాక, దాని ప్రాముఖ్యత చూద్దాము. సన్యాసం గురించి వచ్చినప్పుడల్లా దీని ప్రస్తావన వస్తుంది. ఈ ఉపనిషత్తులోనే తరువాత సన్యాసం గురించిన చర్చ వస్తుంది. అప్పుడు వివరంగా చూద్దాము.

ఈ మంత్రం మూడు సాధనలు, మూడు సాధ్యాల గురించి చెబుతుంది. పుత్రుడు, కర్మ, ఉపాసనలు మూడు సాధనలు. పుత్రుడు అంటే కొడుకు. కర్మ అంటే వైదికకర్మ. ఇక్కడ ఉపాసనను విద్యగా పేర్కొంది ఉపనిషత్తు. శాస్త్రంలో విద్యపదం ఉపాసనకూ, జ్ఞానానికీ కూడా వస్తుంది. నిజానికి అద్వైతానికీ, ద్వైతానికీ మధ్యనున్న పెద్దవాదనే ఈ 'విద్య' అనే పదం గురించి.

మనం విద్య అంటే  జ్ఞానం అని అర్థం తీసుకున్న అనేక చోట్లలో విశిష్టాద్వైతులు ఉపాసన అని అర్థం తీసుకుంటారు. నిజానికి, ఈ మంత్రంలో కూడా శంకరులవారు వాదనను ప్రవేశపెడతారు.

**బ్రహ్మవిదాప్నోతి పరమ్** – తైత్తిరీయం

ఈ మంత్రంలో బ్రహ్మవిద్య మోక్షాన్నిస్తుంది అంటుంది ఉపనిషత్తు. అద్వైతవేదాంతం బ్రహ్మజ్ఞానం మోక్షాన్నిస్తుంది అంటుంది విశిష్టాద్వైతం. ఉపాసన మోక్షాన్నిస్తుంది అంటుంది. పైగా వారు బ్రహ్మ అంటే విష్ణువు అనీ, అందువల్ల అది విష్ణువు ఉపాసన అనీ అంటారు. అందువల్ల విద్య పదం అర్థం మారుతూ ఉంటుంది. ఉపనిషత్తు ఎందుకలా ఒకే పదాన్ని భిన్న సందర్భాలలో భిన్న అర్థాలు వచ్చేలాగా ఉపయోగిస్తున్నది? దీని గురించిన చర్చ వివరంగా ఇంకో సందర్భంలో వస్తుంది.

ప్రస్తుతానికి విద్యకు రెండు అర్థాలున్నాయని గుర్తుంచుకుంటే చాలు. అవి ఉపాసన, జ్ఞానం. విద్యను మానసకర్మగా తీసుకుంటే అది ఉపాసన క్రిందికి వస్తుంది. అదే విద్యను జ్ఞానంగా తీసుకుంటే కర్మ అవదు. అందువల్ల మోక్షాన్ని ఉపాసనఫలంగా తీసుకుంటే, అది కర్మఫలం క్రిందికే వస్తుంది.

ఇక్కడ రెండు విషయాలు గుర్తుంచుకోవాలి.

1. ఇక్కడ విద్య అంటే ఉపాసన.
2. కేవల ఉపాసన గృహస్థులకు లేదు.

గృహస్థుకు కేవలకర్మ ఉంది లేదా కర్మ ఉపాసనల సముచ్చయం ఉంది. కాని కేవల ఉపాసన లేదు. గృహస్థు కర్మ చేసి తీరాలి. అందువల్ల అతను కేవల కర్మ చేయవచ్చు. లేదా కర్మతో కలిసి ఉపాసన చేయవచ్చు కాని, కర్మమాని కేవలం ఉపాసన చేయకూడదు.

ఇప్పుడు మూడు సాధనలకు వచ్చే మూడు ఫలాలను చూద్దాము. మూడు సాధనలు – పుత్రుడు, కేవలకర్మ, కర్మ+ఉపాసన. పుత్రుడు ఉన్న వ్యక్తి మరణం తర్వాత మనుష్యలోకాన్ని పొందుతాడు. మరణం తర్వాత అని ఎందుకన్నాము? అతను ఇప్పుడు మనుష్యలోకంలోనే ఉన్నాడు కదా!

**కర్మణా పితృలోకః –** కర్మ అంటే ఉపాసన కలపకుండా, కేవలం కర్మ చేయటం. దీని ఫలం పితృలోకం అంటే స్వర్గలోకం.

**విద్యయా దేవలోకః –** విద్య అంటే కర్మ+ఉపాసన. కర్మ ఉపాసన సముచ్చయం చేసినవారు బ్రహ్మలోకానికి వెళతారు.

ఈ మూడింటిలో బ్రహ్మలోకఫలం గొప్పది కాబట్టి, కర్మ ఉపాసన సముచ్చయకర్మ గొప్పది.

శంకరులు ఈ మంత్రాన్ని ఉటంకిస్తూ ఈ మూడు సాధనలూ ముముక్షువుకు సహాయపడవు అంటారు. అతను భూలోక, స్వర్గలోకాలు కోరడు. బ్రహ్మలోకం కూడా కోరడు. కాబట్టి అతనికి పత్నీ, పుత్రుడు, కర్మ, ఉపాసన లాభం లేదు. అయితే అతను ఏం చేయాలి? శంకరులవారు అతను సన్యాసి అవాలి అంటున్నారు. సన్యాసం గురించి గట్టిగా చెప్పేటప్పుడు ఈ మంత్రం గురించి చెబుతారు. ఉపనిషత్తు పుత్రునిద్వారా, కర్మద్వారా, ఉపాసన ద్వారా, కర్మ, ఉపాసనల సముచ్చయంద్వారా మోక్షాన్ని ప్రకటించలేదు. అందువల్ల మోక్షం కోరే తీవ్రముముక్షువు, ఈ మూడు వదిలేసి, జ్ఞానానికి వెళ్ళాలి.

## మంత్రం 1.5.17

**అథాతస్సంప్రత్తిర్యదా ప్రైష్యన్మన్యతేఽథ పుత్రమాహత్వం బ్రహ్మ త్వం యజ్ఞస్త్వం లోక ఇతి స పుత్రః ప్రత్యాహాహం బ్రహ్మాహం యజ్ఞోఽహం లోక ఇతి ॥**

**యద్వై కిఞ్చానూక్తం తస్య సర్వస్య బ్రహ్మేత్యేకతా। యే వై కే చ యజ్ఞాస్తేషాగ్ం సర్వేషాం యజ్ఞ ఇత్యేకతా యే వై కే చ లోకాస్తేషాగ్ం సర్వేషాం లోక ఇత్యేకతా ॥**

**ఏతావద్వా ఇదగ్ం సర్వమేతన్మా సర్వగ్ం సన్నయమితోఽభునజదితి తస్మాత్పుత్రమనుశిష్టం లోక్య మాహుస్తస్మాదేనమనుశాసతి స యదైవంవిదస్మాల్లోకాత్ప్రైత్యథైభిరేవ ప్రాణైస్సహ పుత్రమావిశతి ॥**

**స యద్యనేన కిఞ్చిదక్ష్ణయాఽకృతం భవతి తస్మాదేనగ్ం సర్వస్మాత్పుత్రో ముఞ్చతి తస్మాత్పుత్రో నామ స పుత్రేణైవాస్మింల్లోకే ప్రతితిష్ఠత్యథైనమేతే దైవాః ప్రాణా అమృతా ఆవిశన్తి ॥**

కర్మద్వారా పితృలోకానికి వెళతాడు. విద్యద్వారా (ఉపాసనద్వారా) దేవలోకానికి వెళతాడు అంటే తేలికగానే అర్థం చేసుకోవచ్చు. కాని పుత్రునివల్ల మనుష్యలోకం పొందుతాడని ఎలా చెప్పగలము? అందువల్ల ఈ అనుమానాన్ని, ఈ మంత్రంలో, ఉపనిషత్తే తీరుస్తున్నది. ఎలా?

ఒక ఉపాసకుని విషయం తీసుకోండి. అతను అతని జీవితకాలంలో అనేకకర్మలు, ఉపాసనలు చేసి ఉంటాడు. అన్ని కర్మలు, ఉపాసనలు చేసినా కూడా, కొన్ని కర్మలు వదిలేసి ఉండవచ్చు లేదా చేసిన వాటిల్లో పొరపాట్లు దొర్లి ఉండవచ్చు. చేయని కర్మలు, చేసిన తప్పులు అతను కావాల్సిన ఫలం పొందకుండా ఆటంకపడవచ్చు. అతను స్వర్గలోకానికో, బ్రహ్మలోకానికో పోలేకపోవచ్చు. అటువంటి సమస్య ఒకవేళ ఏర్పడితే, ఉపాసకుడు తను చేయాల్సిన కర్మనో, ప్రాయశ్చిత్తాన్నో చేయమని తన పుత్రునికి చెప్పవచ్చు అంటుంది వేదం.

తను మరణించేముందు, ఒక ప్రత్యేక యజ్ఞంద్వారా తన బాధ్యతను పుత్రునికి అప్పచెబుతాడు. తాను ఫలానా కర్మ చేయలేదనో లేదా ఫలానా ప్రాయశ్చిత్తకర్మను చేయమనో చెబుతాడు. అప్పుడు ఆ బాధ్యతను పుత్రుడు అందిపుచ్చుకుంటాడు. పుత్రుడు చేసే ఈ కర్మవల్ల తండ్రి ఉన్నతలోకాలకు వెళ్ళకుండా అడ్డుపడే ఆటంకాలను తొలగించినవాడవుతాడు. వేదమే, ఒక ప్రత్యేక సడలింపును సూచిస్తున్నది. సడలింపు అని ఎందుకన్నామంటే మామూలుగా నియమం ఏమిటంటే ఎవరు ఏ కర్మ చేస్తే, దాని ప్రతిఫలం వారే పొందుతారు. కాని ఇక్కడ శాస్త్రమే ఒకరు చేసిన కర్మకు ఇంకొకరు ఫలం పొందుతారని చెబుతున్నది.

ప్రతి ఉత్సర్గకు (నియమం) ఒక అపవాదం (సడలింపు) ఉంటుంది. ఈ సడలింపులను మనం చేయకూడదు. శాస్త్రమే చేస్తుంది.

మరణించే ముందు తండ్రి ఒక ప్రత్యేక కర్మద్వారా అప్పజెప్తాడని చూశాము కదా. దాన్ని సంప్రత్తికర్మ అంటారు. సంప్రత్తి అంటే సంప్రదానకర్మ. సంప్రదానం అంటే అప్పజెప్పటం. పుత్రుడు కూడా ఆ బాధ్యతలను స్వీకరించటానికి సిద్ధంగా ఉండాలి. అంటే అతను కూడా శాస్త్రాన్ని నమ్మాలి.

**త్వం బ్రహ్మ త్వం యజ్ఞస్త్వం లోక ఇతి** – తండ్రి పుత్రుణ్ణి తన సమీపానికి పిలిచి నువ్వు బ్రహ్మవు, నువ్వు యజ్ఞానివి, నువ్వు లోకానివి అని చెప్పాలి. 'నేను చేయకుండా మిగిలిన కర్మలు నువ్వు పూర్తి చేయి,' అని చెప్పాలి.

తండ్రి బద్ధకించి చేయకుండా లేదు. తను తన శాయశక్తులా చేశాక కూడా మిగిలాయని తను భావించిన కర్మలను లేదా చేయాల్సిన ప్రాయశ్చిత్తకర్మలను అప్పజెబుతాడు. పుత్రుడు అవి పూర్తి చేస్తాడు కాబట్టి, తను కోరినఫలాలకు అడ్డుపడే ఆటంకాలు తొలగుతాయి. పుత్రుడు రెండు రకాలుగా చేస్తాడు. తండ్రి చేయని కర్మలను చేస్తాడు; తండ్రి చేసిన కర్మలకు వచ్చే దోషాలకు ప్రాయశ్చిత్తకర్మలను చేస్తాడు.

**అస్మాల్లోకాత్ప్రైత్యథైభిరేవ ప్రాణైస్సహ పుత్రమావిశతి** – ఆ తండ్రి ఎప్పుడు ఈ లోకంనుంచి నిష్క్రమిస్తాడో, అప్పుడు ఈ వాక్కు-మనసు ప్రాణాలతో సహా పుత్రున్ని వ్యాపిస్తాడు.

**పూరణాత్ త్రాయతే ఇతి పుత్రః**

తండ్రి అసంపూర్తిగా వదిలేసిన కర్మలను పూరించటంద్వారా తండ్రిని రక్షిస్తాడు కాబట్టి అతన్ని పుత్రుడు అంటారు.

శంకరాచార్యులు ఇంకో విధంగా కూడా చెప్పారు. తండ్రి ఒకవేళ హిరణ్యగర్భ ఉపాసకుడు అయి ఉండి, తను ఏవైనా కర్మలు చేయకపోతేనే, పొరపాట్లు దొర్లితేనో, తండ్రి హిరణ్యగర్భపథాన్ని పొందలేడు. పుత్రుడు

వాటిని పూర్తి చేయటంద్వారా అతను హిరణ్యగర్భపథం పొందటానికి తోడ్పడుతాడు. హిరణ్యగర్భ అన్ని జీవాలలోనూ ఉంటాడు కాబట్టి, తండ్రి హిరణ్యగర్భరూపంలో మళ్ళీ మనుష్యలోకానికి వస్తాడు. పుత్రుడు ఉన్న అతను మనుష్యలోకం పొందుతాడు అంటే, పుత్రుడు తన తరఫున చేసిన మిగిలిన కర్మలను పూర్తి చేయటంవల్ల, హిరణ్యగర్భరూపంలో మనుష్యలోకాన్ని జయిస్తాడు.

మంత్రం 1.5.18

**పృథివ్యై చైనమగ్నేశ్చ దైవీ వాగావిశతి సా వై దైవీ వాగ్యయా యద్యదేవ వదతి తత్తద్భవతి॥**

మంత్రం 1.5.19

**దివశ్చైనమాదిత్యాచ్చ దైవం మన ఆవిశతి తద్వై దైవం మనో యేనాఽఽనన్దేవ భవత్యథో న శోచతి ॥**

మంత్రం 1.5.20

**అద్భ్యశ్చైనం చన్ద్రమసశ్చ దైవః ప్రాణ ఆవిశతి స వై దైవః ప్రాణో యస్సఞ్చరగ్ంశ్చాసఞ్చరగ్ంశ్చ న వ్యథతేఽథో న రిష్యతి । స ఏవంవిత్సర్వేషాం భూతానామాత్మా భవతి । యథైషా దేవతైవగ్ం స యథైతాం దేవతాగ్ం సర్వాణి భూతాన్యవన్త్యేవగ్ం హైవంవిదగ్ం సర్వాణి భూతాన్యవన్తి ॥**

**యదు కిఞ్చేమాః ప్రజాశ్శోచన్త్యమైవాఽఽసాం తద్భవతి పుణ్యమేవాముం గచ్ఛతి న హ వై దేవాన్ పాపం గచ్ఛతి ॥**

ఇక్కడ హిరణ్యగర్భ ఉపాసన లేదా పాంక్త ఉపాసన చేసిన తండ్రి విషయం చూస్తున్నాము. తండ్రి సంప్రత్తి కర్మద్వారా తన పుత్రునికి బాధ్యతను అప్పగిస్తే అతను తన బాధ్యతను నిర్వహించి తండ్రి హిరణ్యగర్భ అయ్యేలాగా చేస్తాడని చూశాము. ఇప్పుడు, తండ్రి హిరణ్యగర్భ అవటంవల్ల అతను పొందే లాభమేమిటో చూస్తాము.

ఇంతవరకూ, అంటే వ్యష్టిజీవిగా ఉన్నంతవరకూ తండ్రికి ఆధ్యాత్మ వాక్కు, మనస్సు, ప్రాణాలే ఉన్నాయి. అతను ఒక మామూలు మనిషి, ఒక చిన్న సాధన చేస్తున్న ఒక మామూలు తండ్రి. అతను ఉపాసన చేసి, పుత్రుడు సంప్రత్తికర్మ చేసి, అతను హిరణ్యగర్భగా అయ్యాక ఏమవుతుంది? అధ్యాత్మకరణాలన్నీ అధిదైవకరణాలవుతాయి. అధ్యాత్మిక వాక్కు, మనస్సు, ప్రాణాలు అధిదైవవాక్కు, మనస్సు ప్రాణాలు అవుతాయి. అవి వరుసగా, అగ్ని, ఆదిత్యుడు, చంద్రుడు.

మనిషి వాక్కు తప్పు ఫలం అవుతుంది కాని దేవత, ఆదిత్యదేవతలు దైవవాక్కు ఎప్పుడూ సత్యంగా ఉంటుంది. మనిషి మనస్సు ఆనందవిచారాల మధ్య ఊగిసలాడుతుంది. కాని, దైవమనస్సు ఎప్పుడూ ఆనందంగా ఉంటుంది; మనుష్యప్రాణం ఎప్పుడో పోతుంది కాని హిరణ్యగర్భ ప్రాణానికి మరణం లేదు. తండ్రి తరఫున పుత్రుడు చేసిన హిరణ్యగర్భ ఉపాసన ఫలం ఇది.

**స ఏవంవిత్సర్వేషాం భూతానామాత్మా భవతి । యథైషా దేవతైవగ్ం స యథైతాం దేవతాగ్ం సర్వాణి భూతాన్యవన్త్యేవగ్ం హైవంవిదగ్ం సర్వాణి భూతాన్యవన్తి ॥ యదు కిఞ్చేమాః ప్రజాశ్శోచన్త్యమైవాఽఽసాం తద్భవతి పుణ్యమేవాముం గచ్ఛతి న హ వై దేవాన్ పాపం గచ్ఛతి** – ఇప్పుడు హిరణ్యగర్భ స్తుతి. ఈ హిరణ్యగర్భుడు ఎలాగైతే సర్వాత్మరూపుడో, అదే విధంగా హిరణ్యగర్భ ఉపాసన చేసే సాధకుడు సకలప్రాణులకూ ఆత్మరూపుడవుతాడు. సకల ప్రాణులూ ఎలా హిరణ్యగర్భదేవతను కొలుస్తాయో, అదే విధంగా ఈ సాధకుణ్ణి కూడా సకల ప్రాణులూ కొలుస్తారు.

ఇక్కడ ఉపనిషత్తు ఒక విషయాన్ని విశదీకరిస్తోంది. హిరణ్యగర్భుడు సకలప్రాణులకూ అధిష్ఠానదేవత అయినప్పుడు, ఆయన అందరు జీవులలో ఉన్నప్పుడు, జీవుల దుఃఖం కూడా ఆయన భరించాలి కదా అనే సందేహం రావచ్చు. సమష్టిహిరణ్యగర్భ అనేక జీవుల దుఃఖాన్ని భరించాలంటే ఆయన మహాసంసారి అవుతాడు. కాని హిరణ్యగర్భకు పుణ్యం, పాపం, తద్వారా వచ్చే సుఖదుఃఖాలు అంటవు.

దీనికి కారణం – వ్యష్టి అభిమాన అభావాత్ – పరిచ్ఛిన్నమైన భావన ఉండదు. హిరణ్యగర్భుడు అసంగుడు. అందువల్ల జీవుడు పడే సుఖదుఃఖాలు ఆయనకు అంటవు. ఆయన ఆనందస్వరూపుడు.

హిరణ్యగర్భ ఉపాసన లేదా పాంక్త ఉపాసన చేసిన వ్యక్తి హిరణ్యగర్భ అవుతాడు.

## మంత్రం 1.5.21

**అథాతో వ్రతమీమాగ్ంసా ప్రజాపతిర్హ కర్మాణి ససృజే తాని సృష్టాన్యన్యోన్యేనాస్పర్ధన్త వదిష్యామ్యేవాహమితి వాగ్దధ్రే ద్రక్ష్యామ్యహమితి చక్షుశ్శ్రోష్యామ్యహమితి శ్రోత్రమేవమన్యాని కర్మాణి యథాకర్మ తాని మృత్యుశ్శ్రమో భూత్వోపయేమే తాన్యాప్నోత్తాన్యాప్త్వా మృత్యురవారున్ధ తస్మాచ్ఛ్రామ్యత్యేవ వాక్ఛ్రామ్యతి చక్షుశ్శ్రామ్యతి శ్రోత్రమథేమమేవ నాఽఽప్నోద్యోఽయం మధ్యమః ప్రాణస్తాని జ్ఞాతుం దధ్రిరే ॥**

**అయం వై నశ్శ్రేష్ఠో యస్సఞ్చరగ్గ్ంశ్చాసఞ్చరగ్గ్ంశ్చ న వ్యథతేఽథో న రిష్యతి హన్తాస్యైవ సర్వే రూపమసామేతి త ఏతస్యైవ సర్వే రూపమభవగ్గ్ంస్తస్మాదేత ఏతేనాఖ్యాయన్తే ప్రాణా ఇతి తేన హ వావ తత్కులమాచక్షతే యస్మిన్ కులే భవతి య ఏవం వేద య ఉ హైవంవిదా స్పర్ధతేఽనుశు ష్యత్యనుశుష్య హైవాన్తతో మ్రియత ఇత్యధ్యాత్మమ్ ॥**

ఇంతవరకూ సప్తాన్నం గురించి చూశాము. అందులో చివరి మూడూ, వాక్కు, మనస్సు, ప్రాణం. ఈ మూడు అన్నాలనూ సమష్టిస్థాయిలో హిరణ్యగర్భ అంటారు. ఎవరైతే పాంక్త ఉపాసన చేస్తారో అతను హిరణ్యగర్భ అవుతాడు.

ఇప్పుడు వాక్కు, మనస్సు, ప్రాణాలలో శ్రేష్ఠమైనది ఏదో చూస్తాము. ప్రాణం గొప్పదని ఉపనిషత్తు నిరూపిస్తుంది. ప్రాణం శ్రేష్ఠమైనది కాబట్టి ఎవరైతే ప్రాణ ఉపాసన చేస్తారో, వారు శ్రేష్ఠులవుతారు. ప్రాణంయొక్క శ్రేష్ఠత్వాన్ని రెండు స్థాయిల్లో చర్చిస్తున్నది ఉపనిషత్తు. ఆధ్యాత్మస్థాయిలో అధిదైవస్థాయిలో, రెండు స్థాయిల్లో ప్రాణ ఉపాసన ఫలం కూడా చూస్తాము. దీనిపరంగా ఒక వ్రతవిచారణ చూస్తాము.

ప్రజాపతి కర్మలను సృష్టించాడు. సృష్టించబడిన ఆ కర్మసాధనలు పరస్పరం పోటీపడ్డాయి. మాట్లాడుతూనే ఉంటాను అని వాగింద్రియం, చూస్తూనే ఉంటాను అని చక్షురింద్రియం, వింటూనే ఉంటాను అని శ్రోత్రేంద్రియం, అలా అన్ని ఇంద్రియాలూ వ్రతం పూనాయట. మృత్యువు శ్రమరూపాన్ని దాల్చి వాటిని పట్టుకుని, వాటిని వ్యాపించాడు. వాటిని వ్యాపించి వాటిని అడ్డుకొన్నాడు. దానివల్ల ఇంద్రియాలన్నీ అలసిపోయాయి కాని ప్రాణం అలసిపోలేదు.

ఈ ప్రాణం మనందరిలో శ్రేష్ఠమైనది. ఇది సంచరిస్తున్నా సంచరించకపోయినా నీరసించి పోవటం లేదు. మనం కూడా ప్రాణం రూపమే పొందుదాము అని ఇంద్రియాలు నిశ్చయించుకుని, దాని రూపాలుగా మారాయి. అందుకే ఇంద్రియాలను కూడా ప్రాణం అనే పిలుస్తారు.

ఇంద్రియాలను కూడా ప్రాణం అని పిలిస్తే ఇంద్రియాలకు, ప్రాణానికీ మధ్యతేడాను తెలుసుకునేదెలా? ఇంద్రియాలను అముఖ్యప్రాణం అనీ, పంచప్రాణాలను ముఖ్యప్రాణం అనీ అంటారు. ఆ విధంగా అన్ని ఇంద్రియాలలోనూ ప్రాణశక్తే ఉంది. అందువల్లనే మనం ఆహారం తీసుకోకపోతే ప్రాణశక్తి తగ్గి, తక్కిన ఇంద్రియాలు కూడా నీరసించిపోయి, సరిగ్గా పనిచేయలేవు.

సుషుప్తిలో ఈ ఇంద్రియాలన్నీ ప్రాణంలో లయమయి, అక్కడ అవ్యక్తరూపంలో ఉంటాయి. మళ్ళీ జాగ్రదావస్థలో ప్రాణశక్తినుంచే ఇంద్రియాలు వ్యక్తరూపంలోకి వస్తాయి. ఆ విధంగా ఇంద్రియాలు తాము ప్రాణ స్వరూపమవుదామని వ్రతం తీసుకున్నాయి. ఇది వ్రత మీమాంస.

ఎవరైతే ఈ ప్రాణ ఉపాసన చేస్తారో, అతని ప్రాణశక్తి బాగుంటుంది. అతను కూడా అలసిపోడు. అంతేకాదు ఎవరైతే అతనితో పోట్లాడుతాడో, ఆ పోట్లాడిన వ్యక్తి ఎండిపోయి, చివరకు మరణిస్తాడు. ఇంతవరకూ ఆధ్యాత్మస్థాయిలో ప్రాణ ఉపాసన.

తర్వాత వచ్చే మంత్రాల్లో అధిదైవ ప్రాణ ఉపాసనను చూస్తాము.

### మంత్రం 1.5.22

**అథాధిదైవతం జ్వలిష్యామ్యేవాహమిత్యగ్నిర్దధ్రే తప్స్యామ్యహమిత్యాదిత్యో భాస్యామ్యహమితి చన్ద్రమా ఏవమన్యా దేవతా యథాదైవతగ్ం స యథైషాం ప్రాణానాం మధ్యమః ప్రాణ ఏవమేతాసాం దేవతానాం వాయుర్మ్లోచన్తి హ్యన్యా దేవతా న వాయుస్సైషాఽనస్తమితా దేవతా యద్వాయుః ॥**

### మంత్రం 1.5.23

**అథైష శ్లోకో భవతి యతశ్చోదేతి సూర్యోఽస్తం యత్ర చ గచ్ఛతీతి ప్రాణాద్వా ఏష ఉదేతి ప్రాణేఽస్తమేతి తం దేవాశ్చక్రిరే ధర్మగ్ం స ఏవాద్య స ఉ శ్వ ఇతి యద్వా ఏతేఽముర్హ్యధ్రియన్త తదేవాప్యద్య కుర్వన్తి । తస్మాదేకమేవ వ్రతం చరేత్ప్రాణ్యాచ్చైవాపాన్యాచ్చ నేన్మా పాప్మా మృత్యురాప్నువదితి యద్యు చరేత్సమాపిపయిషేత్తేనో ఏతస్యై దేవతాయై సాయుజ్యగ్ం సలోకతాం జయతి ॥**

ఇప్పుడు అదే పద్ధతిలో అధిదైవ ప్రాణశ్రేష్ఠత్వం, అధిదైవ ప్రాణ ఉపాసన గురించి చూస్తాము. దానిలోని భాగంలో అధిదైవ వ్రతమీమాంస వస్తుంది. కాకపోతే అధ్యాత్మస్థాయిలో కరణాల గురించి వస్తే, ఇక్కడ దేవతల గురించి వస్తుంది. నేను మండుతూనే ఉంటాను అని అగ్ని, నేను తపిస్తూనే ఉంటాను అని ఆదిత్యుడు, నేను ప్రకాశిస్తూనే ఉంటాను అని చంద్రుడు, అలా అందరు దేవతలూ వ్రతం తీసుకున్నారు. అధ్యాత్మికంగా ప్రాణం అయితే, అధిదైవంగా వాయువు ఉంది. వాయుదేవతను ప్రాణవాయువు అని అంటారు. తక్కిన దేవతలు అలసిపోయినా, వాయువు అలసిపోవటం లేదు. సూర్యుడు అస్తమించినా, వాయువు అస్తమించదు. అందువల్ల దేవతలందరూ వాయుదేవతలో లయమవ్వాలని నిశ్చయించుకున్నారు. అందువల్ల వారందరినీ కూడా సమష్టిప్రాణం అని వ్యవహరిస్తారు. ప్రళయంలో సమష్టిప్రాణంలో అవ్యక్తరూపంలో ఉంటారు.

సుషుప్తిలో ఎలాగైతే ఇంద్రియాలు ప్రాణంలో లయమవుతాయో, అలాగే ప్రళయంలో అధిష్ఠానదేవతలు హిరణ్యగర్భలో లయమవుతారు.

ఈ విషయం గురించి ఒక మంత్రాన్ని ఉటంకిస్తున్నది ఉపనిషత్తు. దాని సారాంశం అందరు దేవతలూ సమష్టిప్రాణంనుంచి ఉద్భవించి, సమష్టిప్రాణంలో లయమవుతారు. అలా లయమవుతామని వ్రతం చేశారు. అందువల్ల వ్యష్టిపరంగా ఇంద్రియాలూ, సమష్టిపరంగా దేవతలూ అవ్యక్తరూపంలోనో, వ్యక్తరూపంలోనో ప్రాణంమీద ఆధారపడి ఉన్నాయి. సమష్టిప్రాణం అంటే హిరణ్యగర్భ. ఈ హిరణ్యగర్భ ఉపాసనను ఎవరుచేస్తారో, వారికి దీన్ని పూర్తి చేయాలనేకోరిక కూడా ఉండాలి. అటువంటి ఉపాసనను ఆధ్యాత్మిక ఉపాసనగా చేస్తే, వ్యష్టిపరంగా ప్రాణశక్తి సమృద్ధిగా ఉండి, ఎన్నడూ అలసిపోదు; అధిదైవ ఉపాసనగా చేస్తే బ్రహ్మలోకానికి వెళతాడు లేదా హిరణ్యగర్భపథం పొందుతాడు.

ఆ విధంగా సప్తాన్న బ్రాహ్మణంలో ఏడు అన్నాల గురించిన వివరణ, దానిలో ప్రాణంయొక్క శ్రేష్ఠత్వాన్ని చూశాము.

# 1.6 - ఉక్థ బ్రాహ్మణము

మొదటి అధ్యాయంయొక్క ముఖ్యాంశం అధ్యారోపం. ఈ అధ్యారోపాన్ని రెండుగా చూశాము. సాధన అధ్యారోపం, సాధ్య అధ్యారోపం. జీవిని కర్తగా, భోక్తగా ఎలా పొరపడుతున్నామో చూశాము. అంటే కర్తృత్వ అధ్యారోపం, భోక్తృత్వ అధ్యారోపం చూశాము. వీటన్నింటినీ తర్వాత తిరస్కరిస్తాము.

ఇప్పుడు, ఈ ఆరవ బ్రాహ్మణములో తక్కిన అధ్యారోపాలన్నింటినీ కలిపి టూకీగా చూస్తాము. ఈ బ్రాహ్మణాన్ని ఉక్థబ్రాహ్మణము అంటాము. ఉథ్‌పదం ఈ బ్రాహ్మణములో వస్తుంది. అన్ని సాధనలనూ, అన్ని సాధ్యాలనూ, అన్ని కర్మలనూ మూడు పదాల్లోకి కుచించవచ్చు అంటున్నది ఉపనిషత్తు. అవి నామం, రూపం, కర్మ.

అన్ని అధ్యారోపాలనూ నామరూపకర్మలుగా చెప్పవచ్చు. ప్రపంచం రెండు భాగాలుగా ఉంది. అవ్యక్తప్రపంచంగా, వ్యక్తప్రపంచంగా. అవ్యక్తప్రపంచాన్నీ ప్రకృతి అనీ, మాయ అనీ, అవ్యక్తం అనీ అంటారు. వ్యక్తప్రపంచం సాధ్య, సాధన ప్రపంచంగా ఉంది. అవ్యక్తస్థాయిలో సాధ్యసాధన విభేదం కనబడదు. అందువల్ల ప్రపంచాన్ని ఎలా చూసినా, అంటే వ్యక్తప్రపంచం–అవ్యక్తప్రపంచంగా చూసినా, సవికల్పప్రపంచం– నిర్వికల్పప్రపంచంగా చూసినా, కార్యప్రపంచం–కారణప్రపంచంగా చూసినా; జగత్తు–మాయగా చూసినా – దాన్ని మూడు పదాల్లో వ్యక్తీకరించవచ్చు. అవే నామం, రూపం, కర్మ.

ఎప్పుడైతే ఈ మూడింటినీ – నామరూపకర్మలను – కొట్టివేస్తామో, అప్పుడు మిగిలేది ఏమిటి? నామరహితమ్, రూపరహితమ్, కర్మరహితమ్ ఆత్మతత్త్వమ్ అహం. నేను నామరూపకర్మరహిత ఆత్మను. తర్వాత ఈ మూడింటినీ ఒక్క పదంలోకి తగ్గిస్తుంది ఉపనిషత్తు. అది పిండం. ఈ పిండం మన శరీరం. జగత్తు మొత్తం నామరూపకర్మ; నామరూపకర్మ అంటే పిండం. ఇది అధ్యారోపం. పిండం అంటే వ్యష్టి 'స్థూలశరీరం'.

మొత్తం ప్రపంచాన్ని ఉపనిషత్తు వ్యష్టిశరీరానికి తగ్గిస్తుంది ఉపనిషత్తు. ఎందుకంటే ఈ శరీరంనుంచే మనం ప్రపంచాన్ని చూడగలము. అనుభవించగలము. వ్యష్టినుంచే సమష్టిని ఆనందించగలము. శరీరం లేకపోతే జగత్ నామం కాని, జగత్‌రూపం కాని, జగత్ కర్మ కాని లేనే లేవు. ఆ విధంగా ఆరవ బ్రాహ్మణము అధ్యారోపం సూక్ష్మరూపం – ఈ నేపథ్యంతో మొదటి మంత్రంలోకి అడుగుపెడదాము.

### మంత్రం 1.6.1

**త్రయం వా ఇదం నామ రూపం కర్మ తేషాం నామ్నాం వాగిత్యేతదేషాముక్థమతో హి సర్వాణి నామాన్యుత్తిష్ఠన్తి । ఏతదేషాగ్ం సామైతద్ధి సర్వైర్నామభిస్సమమేతదేషాం బ్రహ్మైతద్ధి సర్వాణి నామాని బిభర్తి ॥**

**త్రయం వా ఇదమ్ –** మొత్తం ప్రపంచం – అవ్యక్తం, వ్యక్తం; వ్యక్తంలో సాధన–సాధ్యం – అంతా నామరూపకర్మ త్రయం. దీన్ని సంక్షేపవాక్యం అంటారు. సంక్షేపవాక్యం ఒక సూత్రం లాంటిది.

ఈ మూడింటిలో ముందు నామం గురించిన చర్చ వస్తుంది. ప్రపంచం అంతా నామమయం.

నిజానికి ఒక వస్తువు గురించి ఆలోచించాలంటే, దాని పేరుతోనే ఆలోచించగలము. వస్తువునూ, నామాన్నీ ఎన్నటికీ విడదీయలేము. ప్రపంచంలో అనంతమైన నామాలున్నాయి. మామూలుగా వాక్కు అంటే కర్మేంద్రియం కాని ఇక్కడ ప్రత్యేక అర్థం వస్తుంది. ఇక్కడ వాక్కు అంటే సామాన్యశబ్దం. అనేక పేర్లు మన వాక్కు చేసే శబ్దం తప్ప మరేం కావు.

వాక్కు ఉపాదానకారణం అవుతుంది. దాన్నించి అనేక నామాలు కార్యంగా వెలువడుతాయి. సామాన్యశబ్దాన్ని మారిస్తే విశేషశబ్దం అవుతుంది. ఉదాహరణకు రామ, కృష్ణ, దేవిలాంటి పేర్లు ఉచ్చరిస్తున్నప్పుడు, ఈ పేర్ల వెనుక ఉన్న సామాన్య అంశం శబ్దం. అందువల్ల దాన్ని సామాన్యశబ్దం అంటారు. దాన్ని వాక్కు పదంతో సూచిస్తున్నది ఉపనిషత్తు.

పదాలన్నీ నామాలు, నామాలన్నీ శబ్దాలు. శబ్దం ఉపాదానకారణం కాబట్టి, నామాలన్నీ కార్యాలు. అంటే సామాన్యశబ్దంనుంచి విశేషనామాలు పుట్టాయి కాబట్టి, వాక్కుకు, ఒక కొత్త బిరుదు వచ్చింది. అది ఉక్థము.

ఉక్థము అంటే ఉపాదానకారణం. ఆ విధంగా వాక్కు అనే సామాన్యశబ్దం, నామాలన్నింటికీ ఉక్థం అయింది. సామాన్యశబ్దంనుంచి విశేషనామాలు రావటంవల్ల సామాన్యశబ్దానికి ఇంకో పేరు కూడా ఉంది. అది సామ.

**సామాన్యరూపే సర్వత్ర వర్తతే**

సమత్వాత్సామ. సామాన్యశబ్దం రామ, కృష్ణ, దేవీలలో సమంగా ఉంది. అందువల్ల దీన్ని బ్రహ్మ అంటారు. బ్రహ్మ సర్వవ్యాపకం. వాక్కు సామాన్యశబ్దం. అందులోంచే నామాలు వస్తాయి కాబట్టి సృష్టికారణం; ఇది విశేషనామాలంతటా వ్యాపిస్తుంది కాబట్టి స్థితికారణం; నామాలన్నీ అందులో లయమవుతాయి కాబట్టి లయకారణం కూడా.

## మంత్రం 1.6.2

**అథ రూపాణాం చక్షురిత్యేతదేషాముక్థమతో హి సర్వాణి రూపాణ్యుత్తిష్ఠన్త్యేతదేషాగ్ం సామైతద్ధి సర్వై రూపైస్సమమేతదేషాం బ్రహ్మైతద్ధి సర్వాణి రూపాణి బిభర్తి ॥**

నామం విషయంలో చూసిన వివరణే ఇప్పుడు రూపం విషయంలో కూడా చూస్తాము. వాక్కును సామాన్యశబ్దం అంటారని చూశాము. ఈ వాక్కు లేకపోతే మన నిఘంటువులు, ప్రసంగాలు, పుస్తకాలు, మాటలు, మన వ్యవహారాలు అన్నీ మటుమాయమవుతాయి. పశుపక్ష్యాదులు సామాన్యశబ్దంద్వారానే ఒకదానితో ఒకటి ముచ్చటించుకుంటాయి. సామాన్యశబ్దం తీసేస్తే మూడు వంతులు ప్రపంచంలో ఉండదు.

అలాగే ఇప్పుడు రూపం. అనేక రూపాలన్నీ, చక్షువుమీద ఆధారపడి ఉన్నాయి. మామూలుగా చక్షువు అంటే చక్షురింద్రియం. కాని ఇంతకు ముందు వాక్కు అంటే సామాన్యశబ్దంగా ఎలా తీసుకున్నామో అలా చక్షువు అంటే సామాన్యరూపంగా తీసుకోవాలి.

సామాన్యరూపమే మొత్తం ప్రపంచంలోని అన్ని రూపాలకూ ఉపాదాన కారణం. ఈ సామాన్యరూపమే అన్ని విశేషరూపాలకూ సృష్టి, స్థితి, లయకారణం. అందువల్ల సామాన్యరూపాన్ని కూడా ఉక్థము అంటారు.

నిద్రలో విశేషశబ్దాలన్నీ సామాన్యశబ్దంలో లయమవుతాయి. అవి సామాన్యశబ్దంలో లయమవకపోతే, మళ్ళీ ఉద్భవించలేవు. సామాన్యశబ్దంలో లేవు అంటే అది అసత్కార్యవాదం అవుతుంది. అందువల్ల విశేషశబ్దాలు సామాన్యశబ్దంలో లయమయి, అవ్యక్తరూపంలో ఉంటాయి. అలాగే సామాన్యరూపంలో విశేషరూపాలన్నీ లయమవుతాయి. విశేష ఆభరణాలు సామాన్య బంగారంలో ఉంటాయి.

వారి విషయంలో చెప్పినట్టే, సామాన్యరూపాన్ని ఉక్థము అనీ, సామ అనీ, బ్రహ్మ అనీ అంటారు. సామాన్యం అంటే సాధారణం అనీ, విశేషం అంటే ఒక వస్తువుకు చెందినది అనీ అర్థం.

## మంత్రం 1.6.3

**అథ కర్మణామాత్మేత్యేతదేషాముక్థమతో హి సర్వాణి కర్మాణ్యుత్తిష్ఠన్త్యేతదేషాగ్ం సామైతద్ధి సర్వైః కర్మభిస్సమమేతదేషాం బ్రహ్మైతద్ధి సర్వాణి కర్మాణి బిభర్తి ॥**
**తదేతత్త్రయగ్ం సదేకమయమాత్మాత్మో ఏకస్సన్నేతత్త్రయం తదేతదమృతగ్ం సత్యేన చ్ఛన్నం ప్రాణో వా అమృతం నామరూపే సత్యం తాభ్యామయం ప్రాణశ్ఛన్నః ॥**

ఇప్పుడు కర్మ గురించి చూస్తాము. ప్రపంచమంతా నామరూపాలమయం. నామం లేకపోయినా రూపం ఉంటుంది. ఇప్పుడు మూడవ అంశం కర్మ. ప్రపంచం అంతా అనేక కర్మల సముదాయం. మనిషి, జంతువు, చెట్టు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు– దేన్నిచూచినా ఎప్పుడూ ఏదో ఒక పనిచేస్తూనే ఉంటుంది. మనుష్యులు కర్మ ప్రధానంగా ఉంటారు. అందువల్ల కర్మ లేకుండా, ప్రపంచాన్ని విడిగా చూడలేము.

నామానికి సామాన్యనామం, రూపానికి సామాన్యరూపం చూసినట్టే, ఇప్పుడు కర్మకు సామాన్యకర్మ ఉంది. అది ఆత్మ. ఇక్కడ ఆత్మ అంటే శరీరం. శరీరం ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ ఉంటుంది. అందువల్ల ఆత్మ లేదా శరీరం సామాన్యకర్మ.

ఇంతకుముందు చూసినట్టే ఇక్కడ కూడా వస్తుంది. శరీరం ఉక్థము. సామాన్యకర్మ విశేష కర్మలకు సృష్టి, స్థితి, లయకారణం. కర్మలన్నీ దీన్నుంచే ఉద్భవిస్తున్నాయి కాబట్టి, శరీరం వీటి సామ. ఎందుకంటే, ఇది కర్మలన్నింటికీ సమము. ఇది వీటికి బ్రహ్మ.

ఆ విధంగా ప్రపంచం మొత్తం నామరూపకర్మల సమ్మేళనం. అదే విధంగా మనిషి కూడా నామరూపకర్మల సమ్మేళనమే. మామూలుగా తక్కిన ఉపనిషత్తులు జగత్తును నామరూపాలుగా వ్యవహరిస్తాయి. బృహదారణ్యకోపనిషత్తు దానికి అదనంగా ఇంకోటి కలిపింది. అది కర్మ. ఉదాహరణకు కుండను తీసుకుంటే కుండకు ఒక పేరు ఉంది, ఒకరూపం ఉంది. దానివల్ల ఒక కర్మ కూడా ఉంది.దాని సామాన్యకర్మ నీరు నింపుకోవటం.

**తదేతత్త్రయగ్ం సదేకమయమాత్మా –** నామరూపకర్మలు మూడు అయినా, ఇవి ఒకే ఆత్మ. ఆత్మ అంటే ఇక్కడ శరీరం అని చూశాము. ఈ శరీరం దేహం, ఇంద్రియాలు, మనస్సుల సముదాయమైన పిండం. సమష్టిప్రపంచాన్ని బ్రహ్మాండం అంటే, వ్యష్టిశరీరాన్ని పిండాండం అంటారు.

నామరూపకర్మల సముదాయం ఈ శరీరం అని చూశాము. దేహేంద్రియ మనోబుద్ధుల సముదాయమైన ఈ శరీరంనుంచే నామరూపకర్మలు ఉద్భవిస్తాయి. శరీరంలో ప్రాణం లేకపోతే, వాటికి ఉనికి లేదు. అవి కూడా లయమయిపోతాయి. అందువల్ల అయమాత్మా ఏవ నామరూపకర్మ.

ఈ విషయం బాగా గుర్తుంచుకోవాలి. ఎందుకంటే, వేదాంతబోధలో ప్రపంచాన్ని మిథ్యగా కొట్టివేసే ప్రక్రియలో తరచు శరీరాన్ని మిథ్యగా కొట్టివేస్తుంది. ఉపనిషత్తు అనాత్మగా చూపించేది స్థూల,సూక్ష్మ,కారణశరీరాన్ని. దానిద్వారా స్థూల, సూక్ష్మ, కారణప్రపంచం కూడా అనాత్మగా అర్థమవుతుంది. వ్యష్టిలో పంచకోశవివేకంద్వారా సమష్టిప్రపంచాన్ని మిథ్యగా చూపిస్తుంది. ఎందుకు? వ్యష్టికి, సమష్టికి భేదం లేదు కాబట్టి. అందువల్ల, బయట ఏదైనా సమస్య ఉంటే, మీరు లోపల మారితే, బయట సమస్య పరిష్కారమవుతుంది.

వ్యష్టి, సమష్టిలు ఒకటే. అవి నామరూపకర్మలు. దీనివల్ల వైరాగ్యం పెంపొందించుకోవచ్చు అంటున్నారు భాష్యకారులు. ఎందుకంటే శరీరం అధ్యారోపం. శరీరం సాధన, సాధ్యప్రపంచానికి ప్రతీక. శరీరం కర్తృత్వ, భోక్తృత్వభావనలకు ప్రతీక. అందువల్ల మోక్షం పొందటానికి శరీర అభిమానాన్ని త్యజించాలి. ఇంట గెలిచి రచ్చగెలవమన్నారు. శరీరాన్ని అర్థం చేసుకుంటే, ప్రపంచాన్ని అర్థం చేసుకున్నట్టే.

ఇక్కడ ఉపనిషత్తు ఇంకో విషయాన్ని కూడా చెబుతున్నది. ఈ నామరూపశరీరానికి (కర్మ కూడా కలుపుకోవాలి). ఒక కొత్త పేరు ఇచ్చింది. అది సత్యం. నామరూపాత్మక శరీరం సత్యం. ఈ శరీరంలో ప్రాణం ఉంది. ఈ ప్రాణాన్ని ఉపనిషత్తు అమృతం అంటున్నది. ప్రాణం సూక్ష్మశరీరానికి ప్రతీక. శరీరం స్థూలశరీరానికి ప్రతీక. స్థూలశరీరాన్ని సత్యం అనీ, సూక్ష్మశరీరాన్ని, ప్రాణపరంగా, అమృతం అనీ అంటున్నది.

స్థూలశరీరాన్ని సత్యం అంటే వ్యవహారిక సత్యంగా తీసుకోవాలి. సూక్ష్మశరీరాన్ని అమృతం అని ఎందుకంటున్నదంటే, స్థూలశరీరం పడిపోయాక కూడా, సూక్ష్మశరీరం ఉంటుంది. అందువల్ల ఆత్మజ్ఞానానికి రాకుండా కూడా, సూక్ష్మశరీరాన్ని అర్థం చేసుకున్నా మనం అమృతం అని తెలుసుకోవచ్చు. (ఇక్కడ సాపేక్షిక అమృతం అని తీసుకోవాలి).

స్థూలశరీరం పడిపోయాక కూడా సూక్ష్మశరీరం ఉంటుంది. అంతేకాదు, ప్రళయంలో కూడా సూక్ష్మశరీరం అవ్యక్తరూపంలో ఉంటుంది. తర్వాత సృష్టిలో మళ్ళీ వస్తుంది. జ్ఞానం పొంది, మోక్షం పొందితేనే సూక్ష్మశరీరం కూడా పడిపోతుంది. లేదా అనంతంగా జన్మలు ఎత్తుతూనే ఉంటుంది.

**అమృతగ్ం సత్యేన ఛన్నం ప్రాణో వా అమృతం నామ రూపే సత్యం తాభ్యామయం ప్రాణశ్ఛన్నః –** నామరూపాలతో ప్రాణం కప్పివేయబడింది. అంటే స్థూలశరీరంచేత సూక్ష్మశరీరం కప్పివేయబడింది. అంటే స్థూలశరీర అభిమానంవల్ల నేను సూక్ష్మశరీరాన్ని అని అనుకోలేకపోతున్నాను. స్థూలశరీరంతో చూస్తే సూక్ష్మశరీరం అమృతం అని చూశాము.

స్థూలశరీరం అభిమానం పోగొట్టుకుని, నేను సూక్ష్మశరీరాన్ని అనుకున్నా మృత్యుభయం పోతుంది. సూక్ష్మశరీరం ప్రళయంలో కూడా ఉంటుందని చూశాము. స్థూలశరీర అభిమానం ఎంతగా మనను కప్పివేస్తోందంటే, మనం సూక్ష్మశరీరానికే రాలేకపోతున్నాము. ఇంక ఆత్మజ్ఞానానికి రావటానికి ఇంకెంత కష్టపడాలో! అందువల్ల మోక్షం పొందటానికి పెద్ద ఆటంకం స్థూలశరీరం. కనబడే నామరూపాల శరీరం పెద్ద ఆటంకం. అందువల్ల సూక్ష్మశరీరానికి రావాలన్నా, ఆత్మ జ్ఞానానికి రావాలన్నా స్థూలశరీర అభిమానం వదులుకోవాలి.

ఇక్కడితో అధ్యారోపం ముగిసింది. ఈ చివరి బ్రాహ్మణము అధ్యారోపాన్ని సూక్ష్మంగా చూపించింది. అపవాదం తర్వాత వచ్చే అధ్యాయంలో వస్తుంది.

ఇక్కడితో మొదటి అధ్యాయము అయిపోయింది.

# అధ్యాయము 1 - సారాంశము

అధ్యారోప - అపవాద ప్రక్రియద్వారా బ్రహ్మజ్ఞానం ఇస్తున్నది ఉపనిషత్తు. అధ్యారోపం అంటే జగత్తును స్వీకరించటం; అపవాదం అంటే జగత్తు మిథ్య, అది నిజంగా లేదని చెప్పటం.

అనాత్మప్రపంచం సత్ కాదు. సత్ అయితే దాన్ని లేదనలేము.

అనాత్మప్రపంచం అసత్ కాదు. అసత్ అయితే అసలు ఉనికి ఉండదు.

అందువల్ల ప్రపంచం సత్ అసత్ విలక్షణం - అంటే మిథ్య.

జగత్ మిథ్యా.

జగత్ మిథ్య అయితే దానికి అధిష్ఠానమైన సత్యం ఏమిటి? అహం సత్యం. ఈ వివరణ తర్వాత అధ్యాయంలో వస్తుంది. మొదటి అధ్యాయంలో అధ్యారోపం మాత్రమే చూస్తాము.

అధ్యారోపాన్ని 6 అంశాలుగా చూస్తాము

| | |
|---|---|
| ఎ. సాధనలు | - అన్నిరకాల కర్మలు, ఉపాసనలు |
| బి. సాధ్యం | - కర్మఫలం - ఇహలోక, పరలోక సుఖాలు |
| సి. సాధ్య-సాధనల సమ్మేళనం | - వ్యాకృత, అవ్యాకృతప్రపంచం |
| డి. కర్తృత్వం | - కర్తగా భావించటం |
| ఇ. భోక్తృత్వం | - భోక్తగా భావించటం |
| ఎఫ్. నామరూపకర్మ | - మొత్తం అనాత్మప్రపంచాన్ని ఈ మూడుగా చూడటం. |

ఈ అధ్యాయములో మొత్తం 6 బ్రాహ్మణములు ఉన్నాయి.ఏ అంశము ఏ బ్రాహ్మణములో చర్చించబడిందో చూద్దాము.

| | | |
|---|---|---|
| ఎ. సాధనలు - | అశ్వవిరాట్ ఉపాసన | - 1) అశ్వమేధ బ్రాహ్మణము |
| | అగ్నివిరాట్ ఉపాసన | - 2) అగ్ని బ్రాహ్మణము |
| | గుణ విశిష్ట హిరణ్యగర్భ ఉపాసన | - 3) ఉద్గీథ బ్రాహ్మణము |
| బి,సి,డి - | సాధ్య, సాధనల సమ్మేళనం, కర్తృత్వం | - 4) బ్రహ్మవిద్యా బ్రాహ్మణము |
| | సాధ్యం | - ప్రజాపతి సాధ్యం |
| | సాధ్య-సాధనల సమ్మేళనం | - అవ్యక్త ప్రపంచం, సృష్టికి ముందు సృష్టి ప్రక్రియ - మను, శతరూపల జంట, దేవ, మనుష్య చతుర్వర్ణసృష్టి. |
| | కర్తృత్వం | - జీవుడు పంచఋణాలు తీర్చుకోవాలి. తను కర్త అయి ప్రపంచానికి భోగ్య వస్తువు అవుతాడు |

| | |
|---|---|
| ఇ. భోక్తృత్వం | – 5.)సప్తాన్న బ్రాహ్మణము<br>– జీవుడు భోక్త అవుతాడు. అప్పుడు ప్రపంచం భోగ్యవస్తువు అవుతుంది. |
| ఎఫ్.నామరూప కర్మ | – 6.) ఉక్థ బ్రాహ్మణము<br>– ప్రపంచం మొత్తాన్ని నామరూపకర్మగా కుదిస్తే,<br>వ్యష్టిపరంగా నామరూపకర్మను శరీరంగా కుదించింది.<br>శరీరాన్ని అనాత్మగా అర్థం చేసుకోగలిగితే,<br>ప్రపంచాన్ని నామరూపంగా అర్థం చేసుకోవచ్చు. |

రెండు ముఖ్య అంశాలు

1. విద్యాసూత్రం – **ఆత్మేత్యేవోపాసీతాత్ర హ్యేతే సర్వ ఏకం భవన్తి ॥** – 1-4-7
2. అవిద్యాసూత్రం – **అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద యథా పశురేవగ్ం స దేవానామ్ ॥** – 1-4-10

**భాష్యాల వివరణలు – మొత్తం 7 భాష్యాలు ఉన్నాయి**

| **భాష్యము** | **బ్రాహ్మణము** | **అంశము** |
|---|---|---|
| 1. సంబంధ భాష్యం | 1 (ముందు) | కర్మకాండ, జ్ఞానకాండల విచారణ |
| 2. ఘట భాష్యం | 2 | కార్యకారణ వాదన |
| 3. వేదప్రమాణ భాష్యం | 3 (ముందు) | వేదాంతవాక్యాల విచారణ |
| 4. అనుప్రవేశ శ్రుతి భాష్యం | 4-7 | **స ఏష ఇహ ప్రవిష్టః**<br>పరమాత్మ జీవిలో ప్రవేశం చేసిన విధానం |
| 5. విద్యాసూత్ర భాష్యం | 4-7 | **ఆత్మేత్యేవోపాసీతాత్ర హ్యేతే సర్వ ఏకం భవన్తి**<br>బ్రహ్మజ్ఞానం గురించిన విచారణ |
| 6. మహావాక్య భాష్యం | 4-10 | **అహం బ్రహ్మాస్మి** వాక్యవిచారణ |
| 7. అవిద్యాసూత్ర భాష్యం | 4-10 | **అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద**<br>అజ్ఞాన సూత్రవిచారణ |

**ముఖ్యమైన మంత్రాలు**

| బ్రాహ్మణము | మంత్రము |
|---|---|
| 3.28 | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మాఽమృతం గమయ<br>ఇది జ్ఞానపరంగా కాదు, హిరణ్యగర్భ ఉపాసనపరంగా చెప్పబడింది. |
| 4.2 | ద్వితీయాద్వై భయం భవతి<br>రెండవదానివలన మాత్రమే భయం కలుగుతుంది.<br>దీన్ని బట్టి అద్వైతం శంకరులవారి సిద్ధాంతం కాదు. ఉపనిషత్తుల బోధ అని అర్థమవుతుంది. |
| 4.3 | స హైతావానాస యథా స్త్రీపుమాగ్ంసౌ సమ్పరిష్వక్తౌ స ఇమమేవాఽఽత్మానం ద్వేధాఽపాతయత్। - సృష్టి |
| 4.7 | స ఏష ఇహ ప్రవిష్టః - అనుప్రవేశశ్రుతి, ఆత్మేత్యేవోపాసీతాత్ర హ్యేతే సర్వ ఏకం భవన్తి - విద్యాసూత్రము |
| 4.8 | ఆత్మానమేవ ప్రియముపాసీత<br>ఆత్మనే ప్రియంగా ఉపాసించవలెను. |
| 4.10 | అహం బ్రహ్మాస్మి - మహావాక్యము<br>అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద - అవిద్యాసూత్రం |
| 5.16 | మనుష్యలోకః పుత్రేణైవ జయ్యో నాన్యేన కర్మణా కర్మణా పితృలోకో విద్యయా దేవలోకః<br>పుత్రునిద్వారా మనుష్యలోకం, కర్మద్వారా పితృలోకం, ఉపాసనద్వారా బ్రహ్మలోకం పొందుతారు.<br>సాధ్యసాధన విభజన చూస్తాము. |
| 6.1 | త్రయం వా ఇదం నామ రూపం కర్మ<br>ఈ ప్రపంచం నామం, రూపం, కర్మ అనే మూడింటి సమ్మేళనం. |